www.andhrajyothy.com

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI

శనివారం | 19-7-2025 | పేజీలు: 14 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 23 సంచిక (Issue) : 133 | శ్రీ విశ్వావసునామ సంవత్సరం, దక్షిణాయనం, గ్రీష్మరుతువు, ఆషాఢమాసం, బహుళపక్షం, తిథి: నవమి మ.2.42 తదుపరి దశమి, నక్షత్రం: భరణి రా.12.37 తదుపరి కృత్తిక, వర్జ్యం: ఉ.11.11-12.40, దుర్ముహూర్తం: ఉ.5.54-7.37, అమృతఘడియలు: రా.8.08-9.37, రాహుకాలం: ఉ. 9.00-10.30, సూర్యోదయం: 5.54, సూర్యాస్తమయం: 6.48 | గుంటూరు సిటీ

Guntur | Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

వణికిస్తున్న పార్కిన్సన్స్..!



రాష్ట్రంలో పెరుగుతున్న బాధితులు

మెదడుపై ప్రభావం చూపే రుగ్మత.. దీర్ఘకాలిక సమస్యగా పార్కిన్సన్స్

స్టేజ్-5లో మంచానికే పరిమితం.. ముదిరితే చేతులెత్తేస్తున్న వైద్యులు

ముందుజాగ్రత్త అవసరమంటున్న వైద్య నిపుణులు

10

సంపన్నులే లక్ష్యంగా కోట్లలో దోపిడీ



2

వ్యాపార రుణాలు, రియల్ ఎస్టేట్ పెట్టుబడుల పేరుతో భారీ మోసం

రూ.500 కోట్లు దోచుకున్న కేటుగాడు

రహస్య గదులతో మాయామహల్ నిర్మాణం

మంగళూరులో అరెస్టు చేసిన పోలీసులు

8 ఏళ్ల క్రితం కూలీ.. ఇప్పుడు కోటీశ్వరుడు



2

సిద్దూ మరణించారట..

కర్ణాటక సీఎంను 'చంపేసిన' మెటా.. అనువాదంలో తప్పు

ముఖ్యమంత్రి ఆగ్రహం.. క్షమాపణలు చెప్పిన సంస్థ

గుర్తింపు పొందని పార్టీల రాబడి 223% పెరుగుదల

టాప్ టెన్ పార్టీల ఆదాయమే రూ.1,581 కోట్లు

వీటిలో గుజరాత్‌లోని పార్టీల వాటా 1,158 కోట్లు

గుర్తింపు పొందని పార్టీలు దేశవ్యాప్తంగా 2,764

739 పార్టీల ఆడిట్ వివరాలే అందుబాటులో

ఈసీ వద్ద నమోదై గుర్తింపు పొందని పార్టీలు ఆంధ్రప్రదేశ్‌లో 129.. తెలంగాణలో 78

2022-23 ఆర్థిక సంవత్సరంపై ఏడీఆర్ నివేదిక

న్యూఢిల్లీ, జూలై 18 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల సంఘం వద్ద నమోదు చేసుకొని, గుర్తింపు పొందని రాజకీయ పార్టీల ఆదాయం 2022-23 ఆర్థిక సంవత్సరంలో 223 శాతం మేర పెరిగింది. గుర్తింపు పొందని పార్టీల్లో 73శాతం పార్టీలు తమ ఆర్థిక లావాదేవీలను బహిర్గతపర్చడంలో విఫలమయ్యాయి. ఈ మేరకు అసోసియేషన్ ఆఫ్ డెమొక్రటిక్ రిఫార్మ్స్ (ఏడీఆర్) ప్రకటించింది. ఏడీఆర్

మిగతా 2వ పేజీలో...

జగన్‌తో జాగ్రత్త!



ఆరితేరిన నేరగాడు

ఢిల్లీ స్థాయిలో ఈ విషయం ఎండగట్టండి

రాజకీయ ఎదురుదాడిలో వెనకబడుతున్నారు

రాష్ట్రానికి నిధుల సాధనకు కృషి చేయండి

ప్రాజెక్టులపై నిరంతర సంప్రదింపులతోనే ఫలితాలు

కేంద్రం నుంచి ఉపాధి నిధులు అలాగే తెచ్చాం

స్థానిక వివాదాల్లో ఎవ్వరూ జోక్యం చేసుకోవద్దు

టీడీపీ పార్లమెంటరీ పార్టీ సమావేశంలో ముఖ్యమంత్రి చంద్రబాబు దిశా నిర్దేశం

శుక్రవారం జోరు వానలో టీడీపీ పార్లమెంటరీ పార్టీ సమావేశానికి గొడుగు వేసుకొని వస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబు

"రెంటపాళ్ల పర్యటన జరిగిన రెండుమూడు రోజుల తర్వాత, జగన్ కారు కిందే సింగయ్య పడి మృతి చెందాడన్న వీడియో సామాజిక మాధ్యమాల్లో వస్తే గానీ తెలుసుకోలేని పరిస్థితిలో మనం ఉన్నాం. ఆనాడు సొంత బాబాయ్‌ని గొడ్డలితో నరికేసి, దాన్ని గుండెపోటుగా చిత్రీకరించడంలో జగన్ సక్సెస్ అయ్యారు. అప్పుడూ మనమే అధికారంలో ఉన్నాం. కానీ నిజాన్ని నిగ్గుతేల్చడంలో పూర్తిగా విఫలమయ్యాం. మామిడి, పొగాకు రైతుల పరామర్శ పేరుతో జగన్ ప్రజలను పక్కదారి పట్టిస్తున్నారు. మరోవైపు వైసీపీ నేతలు చేసే నేరాలు.. అరాచకాలను ఎప్పటికప్పుడు ప్రజల్లోకి తీసుకెళ్లడంలో మనం వెనుకబడుతున్నాం. ఇకపై అప్రమత్తంగా ఉండండి.

- టీడీపీ ఎంపీలతో సీఎం చంద్రబాబు

అమరావతి, జూలై 18 (ఆంధ్రజ్యోతి): "జగన్ ఆరితేరిన నేరగాడు. ఆయన నేర మనస్తత్వాన్ని అంచనా వేయడం చాలా కష్టం. నేరం చేసి దాన్ని ఎదుటి వారిపై నెట్టేయడం ఆయన నైజం. ఈ విషయాన్ని ఎప్పటికప్పుడు ప్రజలకు తెలియజేయకపోతే రాష్ట్రం చాలా నష్టపోతుంది. ఢిల్లీ స్థాయిలోనూ జగన్ నేర మనస్తత్వాన్ని ఎండగట్టాలి.' అని టీడీపీ ఎంపీలకు ముఖ్యమంత్రి చంద్రబాబు దిశానిర్దేశం చేశారు. తెలుగుదేశం పార్లమెంటరీ పార్టీ సమావేశం శుక్రవారం ఉండవల్లిలోని సీఎం నివాసంలో చంద్రబాబు అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ఇటీవలి కాలంలో జగన్ పరామర్శల పేరుతో చేస్తున్న అరాచకాలను సీఎం ప్రస్తావించారు. "క్రిమినల్స్ రాజకీయాల్లోకి

మిగతా 13వ పేజీలో...



అమరావతిలో గ్రీన్ హైడ్రోజన్ సదస్సును జ్యోతి వెలిగించి ప్రారంభిస్తున్న సీఎం చంద్రబాబు

గ్రీన్ హైడ్రోజన్ వ్యాలీగా రాష్ట్రం

తక్కువ వ్యయంతో ఉత్పత్తి చేస్తాం

గ్రీన్ హైడ్రోజన్.. గేమ్ చేంజర్

2030 నాటికి దేశ ఉత్పత్తి లక్ష్యంలో 20 శాతం రాష్ట్రం నుంచే ఉండాలి.. ఇక్కడున్న వనరులు ఎక్కడా లేవు

'అమరావతి గ్రీన్ హైడ్రోజన్' డిక్లరేషన్ ప్రకటించండి

గ్రీన్ హైడ్రోజన్ సమ్మిట్-2025లో సీఎం సూచనలు

గ్రీన్ హైడ్రోజన్, గ్రీన్ అమ్మోనియా ఉత్పత్తికి రూ.51 వేల కోట్ల ఒప్పందాలు

గుంటూరు/అమరావతి, జూలై 18(ఆంధ్రజ్యోతి): రాష్ట్రాన్ని 'గ్రీన్ హైడ్రోజన్ వ్యాలీ'గా అభివృద్ధి చేస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబు తెలిపారు. రాజధాని అమరావతిలోని ఎస్ఆర్ఎం యూనివర్సిటీలో శుక్రవారం నుంచి రెండు రోజులపాటు నిర్వహించే 'గ్రీన్ హైడ్రోజన్ సమ్మిట్-2025'ను సీఎం జ్యోతి వెలిగించి ప్రారంభించారు. అనంతరం వివిధ రంగాల నిపుణులను ఉద్దేశించి ప్రసంగించారు. హరిత ఉదజని(గ్రీన్ హైడ్రోజన్) రంగంలో పెట్టుబడులు పెట్టాలని పారిశ్రామికవేత్తలకు పిలుపునిచ్చారు. దీనికి అవసరమైన మౌలిక సదుపాయాలను కల్పిస్తామన్నారు. గ్రీన్ హైడ్రోజన్‌ను ఉత్పత్తి చేయాలంటే

మిగతా 14వ పేజీలో...

మిథున్‌కు నోటీసు.. నేడు సిట్ విచారణకు..

ఆపై అరెస్ట్!

మద్యం కేసులో కీలక పరిణామం

సుప్రీంలోనూ వైసీపీ ఎంపీకి చుక్కెదురు

విచారణకు రావాలంటూ 'సిట్' పిలుపు

నేడు హాజరు కానున్న ఏ4 మిథున్ రెడ్డి

విచారణ అనంతరం అరెస్టు చేసే అవకాశం

మద్యం స్కామ్‌లో ఆయనే మాస్టర్ మైండ్

'అంతిమ లబ్ధిదారు' తర్వాతి స్థానం ఆయనదే

సిట్ దర్యాప్తులో బయటపడ్డ కీలక వివరాలు

300 పేజీలతో ప్రాథమిక చార్జిషీటు సిద్ధం

నాటి మంత్రి నారాయణస్వామికీ సిట్ పిలుపు





ముందస్తు బెయిల్‌కు సుప్రీం నో

హైకోర్టు తీర్పులో జోక్యానికి నిరాకరణ

లొంగిపోవడానికి వారం గడువిచ్చేందుకూ కోర్టు విముఖత

అమరావతి, జూలై 18 (ఆంధ్రజ్యోతి): మద్యం కుంభకోణంలో వైసీపీ ఎంపీ, మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి కుమారుడు మిథున్ రెడ్డి అరెస్టుకు రంగం సిద్ధమైంది! అరెస్టు నుంచి తప్పించుకునేందుకు విజయవాడ ఏసీబీ కోర్టు నుంచి సుప్రీంకోర్టు దాకా ఆయన చేసిన ప్రయత్నాలేవీ ఫలించలేదు. పైగా... ఆయనను కస్టడీకి తీసుకోవాల్సిన అవసరముందని, మద్యం కుట్రలో ఆయన పాత్రపై ఆధారాలూ ఉన్నాయని హైకోర్టు స్పష్టం చేసింది. ఈ నేపథ్యంలో...

మిగతా 14వ పేజీలో...



అబూజ్‌మడ్‌లో ఎన్‌కౌంటర్

ఆరుగురు నక్సల్స్ మృతి

మృతుల సంఖ్య మరింత పెరిగే చాన్స్!

వారోత్సవాల సమయంలో.. మావోయిస్టులకు ఎదురు దెబ్బ

3

2 నుంచి మున్సిపల్ కార్మికుల సమ్మె

డైరెక్టర్‌కు నోటీసులు అందజేత

12

నేడూ రేపూ భారీ వర్షాలు

10

కోస్తాపైకి తేమగాలులు

చురుగ్గా మారిన రుతుపవనాలు

డిగ్రీ పట్టాల పాట్లు!

సర్టిఫికెట్ల కోసం వందల మంది ఎదురుచూపులు

అఫిలియేషన్, పరీక్ష ఫీజులు కట్టని కొన్ని కాలేజీలు

ధ్రువపత్రాల జారీని ఆపేస్తున్న ఏయూ, ఏఎన్‌యూ

కోర్టు ఆదేశించినా పట్టించుకోని వర్సిటీ అధికారులు

ఐసెట్ కౌన్సిలింగ్‌కు దూరమైన విద్యార్థులు

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

రాష్ట్రంలోని యూనివర్సిటీలు, కాలేజీల మధ్య సమన్వయం కొరవడటం డిగ్రీ విద్యార్థుల పాలిట శాపంగా మారుతోంది. కోర్సు పూర్తిచేసి నెలలు గడుస్తున్నా కొందరి చేతికి పట్టా మాత్రం అందడం లేదు. 2024-25 విద్యా సంవత్సరంలో చివరి సంవత్సరం పరీక్షలు రాసిన వందలాది మంది విద్యార్థులు సర్టిఫికెట్ల కోసం ఎదురుచూడాల్సి వస్తోంది. ఒకవైపు పీజీ కోర్సుల్లో చేరడానికి గడువు పూర్తవుతోంది. అయినా ధ్రువపత్రాలు జారీ కాకపోవడంతో వారిలో ఆందోళన వ్యక్తమవుతోంది. నాగార్జున, ఆంధ్రా యూనివర్సిటీల పరిధిలోని కాలేజీల్లో ఈ సమస్య తీవ్రంగా ఉంది. కాలేజీల యాజమాన్యాలు పరీక్ష ఫీజులు, అఫిలియేషన్ల ఫీజులు

మిగతా 12వ పేజీలో...



తాడేపల్లిలోని వాణిజ్య పన్నుల శాఖ కార్యాలయంలో జేసీ, డీసీలతో ఏర్పాటు చేసిన రెవెన్యూ వర్క్‌షాపులో మాట్లాడుతున్న ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్

టెక్నాలజీతో పన్ను ఆదాయం పెంచండి

ఎగ్గొట్టేవారిపై కఠిన చర్యలు

పన్నుల వసూళ్లలో ఏపీ వెనుకబాటు

అక్రమంగా సరుకు అంతర్రాష్ట్ర రవాణా

కళ్లు మూసుకుని నిద్రపోతుంటే ఎలా?

క్షేత్రస్థాయి నుంచి చిత్తశుద్ధితో పనిచేయాలి

వాణిజ్య పన్నుల శాఖ అధికారుల వర్క్‌షాపులో మంత్రి పయ్యావుల

14

దేవుడికి ఆధార్ కష్టాలు!



ఆలయ భూములకు ఈ-కేవైసీ సమస్య

వెబ్‌ల్యాండ్‌లో అనుసంధానానికి మొబైల్ నంబరు కూడా తప్పనిసరి

గతంలో పూజారుల ఆధార్‌తో సీడింగ్

వారికి నిలిచిన ప్రభుత్వ ప్రయోజనాలు

తమ ఆధార్‌ను తొలగించాలని వినతులు

ఇప్పుడు భూములకు ఆధార్ సీడింగ్‌పై రెవెన్యూ, దేవదాయ శాఖల తర్జనభర్జన

గుడులకూ ఆధార్ ఇవ్వాలన్న సూచనలు

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

రాష్ట్రంలో భూమి ఉన్న ప్రతి రైతుకూ ఆధార్ నంబరు ఉంది. వెబ్‌ల్యాండ్‌లో ఆ భూమిని ఆధార్‌తో అనుసంధానం (సీడింగ్) చేయడంతో వారికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు, రాయితీలు దక్కుతున్నాయి. మరి దేవుడి భూములను సీడింగ్ చేయడమెలా? రాష్ట్రవ్యాప్తంగా వివిధ దేవుళ్ల పేరిట ఉన్న లక్షలాది ఎకరాల భూములను వెబ్‌ల్యాండ్, పీఎం కిసాన్ పోర్టల్, అన్నదాత సుఖీభవలో చేర్చాలంటే ఆధార్ తప్పనిసరిగా మారింది. మరి దేవుడు దిగొచ్చి ఆధార్ తీసుకుంటాడా? తన పేరిట ఉన్న భూములను వెబ్‌ల్యాండ్‌తో అనుసంధానం చేసుకుంటాడా? భూముల ఈ-కేవైసీలో వచ్చిన ఈ సరికొత్త సమస్యకు పరిష్కారం ఏమిటో రెవెన్యూ శాఖకు అంతుపట్టడం లేదు. ప్రతి గుడి పేరిట ఆధార్ నంబరు ఇస్తే తప్ప సమస్య పరిష్కారమయ్యేలా లేదని రెవెన్యూ వర్గాలు వ్యాఖ్యానిస్తున్నాయి. రాష్ట్రంలోని ప్రభుత్వ, ప్రైవేటు భూముల డేటా అంతా వెబ్‌ల్యాండ్‌లో నిక్షిప్తమై ఉంది. రెవెన్యూ అధికారుల వద్ద ఉన్న భూముల

మిగతా 12వ పేజీలో...

నగదు దొరికితే దోషినా?

ఆ డబ్బు ఎవరు, ఎప్పుడు, ఎలా పెట్టారో తేల్చలేదు

అంతర్గత విచారణ మొత్తం లోపాలమయం

వాదన చెప్పుకొనేందుకూ సమయం ఇవ్వలేదు

హైకోర్టు జడ్జిపై విచారణకు ఆదేశించే అధికారం సీజేఐకి లేదు: సుప్రీంలో జస్టిస్ వర్మ పిటిషన్

2



రాజీనామా లేఖపై సంతకం చేస్తున్న అశోక్‌గజపతిరాజు

'రాజు' వెడలె

కోట దాటి నాడు ప్రజా జీవితంలోకి..

40 ఏళ్లపాటు టీడీపీకి, ఏపీకి నిస్వార్థ సేవ

గోవా గవర్నర్‌గా బాధ్యతల కారణంగా పార్టీ సభ్యత్వానికి అశోక్‌గజపతి రాజీనామా

12

ప్రత్యక్ష రాజకీయాలకు శాశ్వతంగా సెలవు

మచ్చలేని నాయకుడిగా అరుదైన గుర్తింపు

ఇప్పటికి 5 లక్షల బంగారు కుటుంబాలు

వీటికి 47 వేల మంది మార్గదర్శుల దన్ను

ఆగస్టు 15 కల్లా 15 లక్షల కుటుంబాల దత్తత నా సంకల్పం: సీఎం చంద్రబాబు

పీ-4 మార్గదర్శులకు విందు

13

మద్యం కుంభకోణంలో బఘేల్ కుమారుడి అరెస్టు


చైతన్య బఘేల్

న్యూఢిల్లీ, జూలై 18: మద్యం కుంభకోణంలో ఛత్తీస్‌గఢ్ మాజీ ముఖ్యమంత్రి, సీనియర్ కాంగ్రెస్ నాయకుడు భూపేష్ బఘేల్ కుమారుడు చైతన్య బఘేల్‌ను ఈడీ శుక్రవారం అరెస్టు చేసింది. ఆయనను ఈడీ కేసుల ప్రత్యేక న్యాయస్థానంలో హాజరుపరచగా న్యాయాధికారి అయిదు రోజుల రిమాండ్ విధించారు. ఛత్తీస్‌గఢ్‌లోని దుర్గ్‌లో ఉన్న నివాసంలో ఉండగా ఈడీ అధికారులు అరెస్టు చేశారు. 2019-2022 మధ్య కాలంలో భూపేష్ బఘేల్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు రూ.2,160 కోట్ల మేర మద్యం కుంభకోణం జరిగిందంటూ ఈడీ కేసు నమోదు చేసింది. చైతన్య బఘేల్ ఆధ్వర్యంలో సమాంతర వ్యవస్థ నడిచిందని, అక్రమ మార్గాల్లో సొమ్ము ఆయనకు చేరిందని ఆరోపించింది. ఈ సందర్భంగా భూపేష్ బఘేల్ మీడియాతో మాట్లాడుతూ పుట్టిన రోజునాడు కుమారుడిని అరెస్టు చేయడంపై అసంతృప్తి వ్యక్తం చేశారు. అదానీకి కేటాయించిన బొగ్గు బ్లాకుల ప్రాంతంలో వేలాది చెట్లను నరికివేశారని, దీనిపై శుక్రవారం అసెంబ్లీలో ప్రశ్నిస్తామని తెలిసే మోదీ-అమిత్ షాలు కేంద్ర దర్యాప్తు సంస్థలను పంపించారని ఆరోపించారు.

ఇండియా కూటమికి ఆప్ గుడ్ బై!

న్యూఢిల్లీ, జూలై 18: విపక్ష ఇండియా కూటమిలో కేజ్రీవాల్ సారథ్యంలోని ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్) భాగం కాదని ఆ పార్టీ రాజ్యసభ ఎంపీ సంజయ్ సింగ్ శుక్రవారం స్పష్టం చేశారు. సోమవారం నుంచి పార్లమెంట్ వర్షాకాల సమావేశాలు జరగనున్న నేపథ్యంలో ఇండియా కూటమి పార్టీల నేతలు శనివారం సాయంత్రం ఆన్‌లైన్ సమావేశం నిర్వహించనున్నారు. ఈ తరుణంలో సంజయ్ సింగ్ మాట్లాడుతూ.. "ఇండియా కూటమితో మా పొత్తు 2024 లోక్‌సభ ఎన్నికల కోసమే. ఢిల్లీ, హరియాణా అసెంబ్లీ ఎన్నికల్లో సొంతంగానే పోటీ చేశాం. బిహార్‌లోనూ ఒంటరిగానే పోటీ చేయబోతున్నాం. పంజాబ్, గుజరాత్‌లో ఉప ఎన్నికల్లోనూ ఒంటరిగానే పోటీ చేశాం. ఇండియా కూటమిలో ఆప్ భాగం కాదు" అని పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీపైనా సంజయ్ సింగ్ విమర్శలు ఎక్కుపెట్టారు. ప్రతిపక్ష కూటమికి నాయకత్వం వహించడంలో ఆ పార్టీ పాత్రను ఆయన ప్రశ్నించారు.

మా బావను పదేళ్లుగా వేధిస్తున్నారు: రాహుల్

న్యూఢిల్లీ, జూలై 18: గత పదేళ్లుగా కేంద్ర ప్రభుత్వం తన బావను వేధిస్తోందని శుక్రవారం రాహుల్ గాంధీ ఆరోపించారు. హర్యానాలోని షికోపూర్‌లో జరిగిన భూఒప్పందంలో అక్రమాలకు సంబంధించిన మనీలాండరింగ్ కేసులో రాబర్ట్‌వాద్రాపై ఈడీ చార్జిషీట్ దాఖలు చేసింది. "దురుద్దేశంతో, రాజకీయ కక్షతో పెట్టిన ఈ కేసును ఎదుర్కొనే ధైర్యం రాబర్ట్ వాద్రా, ప్రియాంకల కుటుంబానికి ఉందని నాకు తెలుసు. నేనూ వారికి అండగా నిలుస్తాను. అంతిమంగా సత్యమే గెలుస్తుంది" అని ఎక్స్ వేదికగా పేర్కొన్నారు.

ఢిల్లీ, బెంగళూరులో బడులకు బాంబు బెదిరింపులు

న్యూఢిల్లీ, బెంగళూరు, జూలై 18: దేశ రాజధాని ఢిల్లీ, కర్ణాటక రాజధాని బెంగళూరులో పాఠశాలలకు శుక్రవారం బాంబు బెదిరింపులు వచ్చాయి. దీంతో తల్లిదండ్రులు, విద్యార్థుల్లో ఆందోళన నెలకొంది. ఢిల్లీలో ఈ వారంలో ఇప్పటికే నాలుగుసార్లు పాఠశాలలకు బాంబు బెదిరింపులు వచ్చాయి. బెంగళూరులోని 50 బడులకు శుక్రవారం ఇదేవిధమైన బాంబు బెదిరింపులు వచ్చాయి. బాంబు బెదిరింపులు వచ్చిన పాఠశాలల్లో తనిఖీలు చేపట్టి, అవన్నీ ఉత్తుత్తివేనని తేలిందని పోలీసులు తెలిపారు.

విమాన ప్రమాద బాధితుల కోసం 500 కోట్లతో టాటా చారిటబుల్ ట్రస్టు

న్యూఢిల్లీ, జూలై 18: ఎయిరిండియా విమాన ప్రమాద బాధితుల కోసం 500 కోట్ల రూపాయలతో ఓ చారిటబుల్ ట్రస్టును ఏర్పాటు చేస్తున్నట్లు టాటా గ్రూపు ప్రకటించింది. ముంబైలో నమోదైన ఆ ట్రస్టుకు టాటా సన్స్, టాటా ట్రస్టుల ద్వారా 250 కోట్ల చొప్పున కేటాయించనున్నట్లు తెలిపింది. మృతుల కుటుంబాలకు, గాయపడిన వారికి, ప్రమాదంలో ప్రత్యక్షంగా, పరోక్షంగా ప్రభావితమైన వారికి ట్రస్టు తక్షణ సహాయం చేస్తుందని టాటా సన్స్ సంస్థ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపింది.

నగదు దొరికినంత మాత్రాన దోషినా!?





ఆ డబ్బు ఎవరు ఎప్పుడు ఎలా పెట్టారో తేల్చలేదు.. ఆ నగదుకు యజమాని ఎవరో గుర్తించలేదు

- అగ్నిప్రమాదానికి కారణాలనూ తేల్చలేదు
- అంతర్గత విచారణంతా లోపాలమయం
- హైకోర్టు జడ్జిపై విచారణకు ఆదేశించే అధికారం సీజేఐకి లేదు
- సుప్రీం కోర్టులో జస్టిస్ వర్మ పిటిషన్

న్యూఢిల్లీ, జూలై 18: పార్లమెంటు వర్షాకాల సమావేశాల్లో అభిశంసన తీర్మానం ప్రవేశపెట్టనున్న నేపథ్యంలో ఢిల్లీ హైకోర్టు మాజీ జడ్జి జస్టిస్ యశ్వంత్ వర్మ సుప్రీం కోర్టును ఆశ్రయించారు. తన అధికారిక నివాసంలో పెద్దఎత్తున దొరికిన నగదుకు భారత ప్రధాన న్యాయమూర్తి నియమించిన ముగ్గురు సభ్యుల విచారణ కమిటీ (పంజాబ్, హరియాణా చీఫ్ జస్టిస్ షీల్ నాగ్; హిమాచల్ ప్రదేశ్ చీఫ్ జస్టిస్ జీఎస్ సంధావాలియా, కర్ణాటక హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ అను శివరామన్) తనను దోషిగా నిర్ధారించడానికి చేపట్టిన ప్రక్రియ చట్టబద్ధతను ఆయన ప్రశ్నించారు. ఎక్కడా మచ్చ లేకుండా 11 ఏళ్ల న్యాయమూర్తిగా పని చేశానని, విచారణ కమిటీ చేపట్టిన ప్రక్రియే లోపాలమయమని, తన వాదన వినిపించుకోవడానికి తనకు తగినంత సమయం ఇవ్వలేదని సుప్రీం కోర్టులో దాఖలు చేసిన రిట్ పిటిషన్లో ఆయన పేర్కొన్నారు. జస్టిస్ వర్మ అధికారిక నివాసంలో మార్చి 14వ తేదీ రాత్రి అగ్ని ప్రమాదం జరగడం.. సగం కాలిన నోట్లు దొరకడం తెలిసిందే. దీనిపై ఢిల్లీ పోలీసు కమిషనర్ సంజయ్ అరోరా కేంద్ర హోం శాఖకు, ఢిల్లీ హైకోర్టు చీఫ్ జస్టిస్‌కు నివేదించారు. ఈ నేపథ్యంలోనే, సుప్రీం కోర్టు అప్పటి చీఫ్ జస్టిస్ సంజయ్ ఖన్నా ముగ్గురు సభ్యులతో విచారణ కమిటీని నియమించారు. నాలుగైదు గోనె సంచుల్లో సగం కాలిన రూ.500 నోట్లు దొరికాయని ఢిల్లీ పోలీసు కమిషనర్ నివేదించిన విషయాన్ని తన నివేదికలో కమిటీ ప్రస్తావించింది. జస్టిస్ వర్మ అధికారిక నివాసంలోని స్టోర్ రూమ్‌లో నగదు దొరికిన విషయం నిజమేనని భౌతిక, ఎలక్ట్రానిక్ ఆధారాలు, నిపుణులు అందించిన సాక్ష్యాధారాలను బట్టి తేల్చినట్లు సుప్రీం కోర్టు చీఫ్ జస్టిస్‌కు నివేదించింది. సరిగ్గా, ఈ అంశంపైనే జస్టిస్ వర్మ సుప్రీం కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. "నా అధికారిక నివాసం స్టోర్ రూమ్‌లో నగదు దొరికినంత మాత్రాన నా దోషిత్వం నిరూపించినట్లు కాదు. ఆ నగదుకు యజమాని ఎవరనే విషయాన్ని కమిటీ గుర్తించలేదు. నిర్దిష్ట సాక్ష్యాధారాలతో కమిటీ ఆ ప్రాంగణంలోకి ప్రవేశించలేదు. ఏవో కొన్ని ఊహాగానాల ఆధారంగా వచ్చారు. నా దృష్టిలో అవి చెల్లవు. ముందే ఒక నిర్ణయానికి వచ్చేసి.. దాని ఆధారంగా కమిటీ విచారణ ప్రక్రియను హడావుడిగా చేసేసింది. నాకు తగినంత సమయం ఇవ్వలేదు. ఔట్‌హౌస్‌లో నగదు దొరికిందనే అంశంతో నాకు ఎటువంటి విభేదం లేదు. నగదు దొరికినంత మాత్రానే నేను తప్పు చేశానని చెప్పలేరు. ఆ నగదుకు యజమాని ఎవరు!? అది ఎవరి నియంత్రణలో ఉందనే అంశంపై నిర్దిష్ట ఆధారాల్లేకుండా నాకు సంబంధం అంటగట్టలేరు. నగదును ఔట్ హౌస్‌లో ఎవరు, ఎప్పుడు, ఎలా పెట్టారు!? ఎంత నగదు ఉంచారు? ఆ నగదు అసలుదా కాదా!? అగ్ని ప్రమాదానికి కారణం ఏమిటి? కాలిన నగదు అవశేషాల తొలగింపులో పిటిషనర్‌కు ఏమైనా సంబంధం ఉందా!? అనే అంశాలకు విచారణ కమిటీ జవాబు చెప్పాల్సి ఉంది" అని ఆయన తన పిటిషన్లో పేర్కొన్నారు. కమిటీ నివేదికలో ఈ ప్రశ్నలకు జవాబులు చెప్పలేదని, అందువల్ల, తనను దోషిగా తేల్చలేరని అభ్యంతరం వ్యక్తం చేశారు. నగదు దొరికినంత మాత్రాన తుది నిర్ణయానికి రాలేరని పేర్కొన్నారు. అగ్ని ప్రమాదం ఉద్దేశపూర్వకమా లేక ప్రమాదవశాత్తు జరిగిందా!? అన్న అంశమూ కీలకమన్నారు. తాను కోరినా సీసీటీవీ ఫుటేజీ వంటి ఆధారాలను సేకరించడంలో కమిటీ విఫలమైందని, వ్యక్తిగత విచారణకు నిరాకరించిందని, తనపై నిర్దిష్టంగా ఎటువంటి కేసు పెట్టలేకపోయిందని, పైగా, తనకు తెలియకుండానే నిరూపించుకునే భారాన్ని తిరిగి తనపై మోపిందని ఆరోపించారు. అంతేనా, అంతర్గత విచారణకు ఎటువంటి చట్టబద్ధత లేదని స్పష్టం చేశారు. విచారణ కమిటీని నియమించడం అధికార దుర్వినియోగమని ఆరోపించారు. హైకోర్టు న్యాయమూర్తులపై క్రమశిక్షణ చర్యలు తీసుకునే అధికారాన్ని రాజ్యాంగం సుప్రీం కోర్టు చీఫ్ జస్టిస్‌కు ఇవ్వలేదని, అంతర్గత విచారణకు ఆయన ఆదేశించజాలరని పేర్కొన్నారు. హైకోర్టు న్యాయమూర్తిగా తనను తొలగించాలంటూ సిఫారసు చేయజాలరని తెలిపారు. విచారణకు ముందే ఫొటోలు, వీడియోలు, డాక్యుమెంట్లను బహిర్గతపరిచారని, తద్వారా తన గౌరవానికి తీవ్ర నష్టం వాటిల్లిందని తెలిపారు.

ప్రభుత్వానికి సంబంధం లేదు: కేంద్ర న్యాయ మంత్రి


జస్టిస్ వర్మపై పార్లమెంటులో అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టాలనే అంశం పూర్తిగా ఎంపీలకు సంబంధించిన అంశమని, ఇందులో ప్రభుత్వానికి ఎటువంటి సంబంధం లేదని కేంద్ర న్యాయ శాఖ మంత్రి అర్జున్ రామ్ మేఘ్వాల్ వ్యాఖ్యానించారు. అంతర్గత కమిటీ తన నివేదికను సమర్పించిందని, దానితో విభేదిస్తే జస్టిస్ వర్మ సుప్రీం కోర్టును ఆశ్రయించవచ్చని తెలిపారు. లోక్‌సభలో వంద మంది; రాజ్యసభలో 50 మంది సభ్యుల మద్దతు ఉంటే న్యాయమూర్తులపై అభిశంసన తీర్మానాన్ని ఆమోదించవచ్చని తెలిపారు. కాగా, జస్టిస్ వర్మకు వ్యతిరేకంగా పెట్టే అవిశ్వాస తీర్మానానికి కాంగ్రెస్ మద్దతు ఇస్తుందని, తీర్మానంపై కాంగ్రెస్ ఎంపీలు కూడా సంతకాలు చేస్తారని ఆ పార్టీ సీనియర్ నేత జైరాం రమేశ్ తెలిపారు. ఆయనను తొలగించాలంటూ రాష్ట్రపతికి, ప్రధాన మంత్రికి అప్పటి సీజేఐ సంజీవ్ ఖన్నా లేఖ రాయడం ద్వారా తమకు ఇష్టం లేకపోయినా తీర్మానాన్ని ఆమోదించక తప్పడం లేదని వ్యాఖ్యానించారు.

భర్తతో శృంగారానికి నిరాకరించడం క్రూరత్వమే..

- ఆ కారణంతో విడాకులివ్వొచ్చు: బాంబే హైకోర్టు

ముంబై, జూలై 18: భర్తతో శృంగారానికి నిరాకరించడం, వివాహేతర సంబంధాలున్నాయని అతడిని అనుమానించడం క్రూరత్వం కిందకే వస్తుందని బాంబే హైకోర్టు వెల్లడించింది. ఈ కారణం కింద విడాకులు ఇవ్వొచ్చని స్పష్టం చేసింది. ఫ్యామిలీ కోర్టు మంజూరు చేసిన విడాకులను సవాల్ చేస్తూ ఓ మహిళ వేసిన పిటిషన్‌ను హైకోర్టు ధర్మాసనం తోసిపుచ్చింది. 2013లో సదరు జంటకు వివాహం కాగా.. మరుసటి ఏడాది నుంచే భర్తతో ఆమె విడిగా ఉంటోంది. దీంతో 2015లో ఆమె భర్త క్రూరత్వం కింద విడాకులు కోరుతూ ఫ్యామిలీ కోర్టును ఆశ్రయించగా.. అతడికి అనుకూలంగా తీర్పునిచ్చింది. తాజాగా హైకోర్టులో విచారణ సందర్భంగా.. తనతో శృంగారానికి నిరాకరించడంతో పాటు వివాహేతర సంబంధాలున్నాయని భార్య పదే పదే అనుమానించేదని సదరు భర్త పేర్కొన్నాడు. తనను విడిచి పుట్టింటికి వదిలి వెళ్లినప్పట్నుంచి అసలు పట్టించుకోలేదని కోర్టు దృష్టికి తెచ్చాడు. ఈ వాదనలను పరిగణనలోకి తీసుకున్న కోర్టు.. ఆ జంట మధ్య వివాహ బంధం పూర్తిగా విచ్ఛిన్నమైందంటూ మహిళ పిటిషన్‌ను కొట్టివేసింది.

లోకం తీరు



లాలు కేసు విచారణపై 'స్టే'కు సుప్రీం నిరాకరణ

న్యూఢిల్లీ, జూలై 18: తనపై ట్రయల్ కోర్టులో జరుగుతున్న విచారణపై స్టే ఇవ్వాలని కోరుతూ ఆర్జేడీ అధినేత లాలు ప్రసాద్ చేసిన వినతిని శుక్రవారం సుప్రీంకోర్టు తిరస్కరించింది. అయితే అనారోగ్య కారణాల దృష్ట్యా ఆయన కోర్టుకు హాజరుకాకుండా మినహాయింపు ఇచ్చింది. లాలూ ప్రసాద్ రైల్వే మంత్రిగా ఉన్నప్పుడు పట్నాలో విలువైన భూములు తీసుకొని అందుకు ప్రతిగా వాటి సొంతదార్లకు రైల్వేలో గ్రూప్ డి ఉద్యోగాలు ఇచ్చారంటూ సీబీఐ కేసు నమోదు చేసింది. ఈ కేసుపై ట్రయల్ కోర్టులో జరుగుతున్న విచారణపై స్టే ఇవ్వాలని కోరుతూ సుప్రీంకోర్టులో అప్పీలు చేశారు. మరోవైపు ఆ కేసును కొట్టివేయాలని కోరుతూ ఢిల్లీ హైకోర్టులో క్వాష్ పిటిషన్ కూడా దాఖలు చేశారు. కాగా, ఈ క్వాష్ పిటిషన్‌పై త్వరగా విచారణ జరపాలని ఢిల్లీ హైకోర్టును సుప్రీంకోర్టు ఆదేశించింది. తదుపరి విచారణను ఆగస్టు 12కు వాయిదా వేసింది.

వృద్ధ ఖైదీల విడుదలకు ఉమ్మడి విధానం ఉండాలి: సుప్రీం

న్యూఢిల్లీ, జూలై 18: వృద్ధ ఖైదీల విడుదలకు అన్ని రాష్ట్రాలు ఉమ్మడిగా నిబంధనలు రూపొందించాల్సిన అవసరం ఉందని సుప్రీంకోర్టు అభిప్రాయపడింది. ప్రస్తుతం కారాగార నిబంధనలు రాష్ట్రాలవారీగా ఉన్నాయని తెలిపింది. అందువల్ల 70 ఏళ్లు దాటినవారు, నయంకాని రోగాలతో బాధపడుతూ అంత్యదశలో ఉన్న ఖైదీలను విడుదల చేసేందుకు ఏకరూప విధానాలను రూపొందించాల్సిన అవసరం ఉందని పేర్కొంది. వృద్ధ ఖైదీల విడుదల విషయమై జాతీయ న్యాయ సేవా సంస్థ (నల్సా) దాఖలు చేసిన వ్యాజ్యంపై శుక్రవారం విచారణ జరిపిన జస్టిస్ విక్రంనాథ్, జస్టిస్ సందీప్ మెహతాల ధర్మాసనం ఈ అభిప్రాయాన్ని వ్యక్తం చేసింది.

సిద్దరామయ్య మరణించారట!



- అనువాదంలో మెటా పొరబాటు
- కర్ణాటక సీఎం ఆగ్రహం
- క్షమాపణలు చెప్పిన సంస్థ

బెంగళూరు, జూలై 18(ఆంధ్రజ్యోతి): కర్ణాటక ముఖ్యమంత్రి సిద్దరామయ్య మరణించారట. ఓ సంతాప సందేశాన్ని తప్పుగా అనువదించడం ద్వారా 'మెటా' సంస్థ సృష్టించిన కలకలమిది. సోషల్ మీడియా వేదికగా మెటా చేసిన తప్పును చూసి నెటిజన్లు ఒక్కసారిగా ఖంగుతిన్నారు. ఆ సంస్థపై సిద్దరామయ్య ఆగ్రహం వ్యక్తం చేశారు. అసలేం జరిగిందంటే.. ఇటీవల సీనియర్ నటి బి.సరోజాదేవి కన్నుమూసిన సందర్భంగా సంతాపం తెలుపుతూ సీఎం కార్యాలయం ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్‌లో ఓ సందేశం పెట్టింది. అయితే కన్నడ భాషలో ఉన్న ఆ సందేశాన్ని మెటా ఆటోమేటిక్ ట్రాన్స్‌లేషన్ టూల్ ఇంగ్లిష్‌లోకి "చీఫ్ మినిస్టర్ సిద్దరామయ్య నిన్న కన్నుమూశారు. సరోజాదేవి పార్థివదేహానికి నివాళులు అర్పించారు" అంటూ తప్పుగా అనువదించింది. దీన్ని గమనించిన సిద్దరామయ్య అభిమానులు తీవ్రస్థాయిలో మండిపడ్డారు. దీనిపై సిద్దరామయ్య స్పందిస్తూ.. బాధ్యతాయుతంగా వ్యవహరించాలని, కచ్చితంగా అనువదించే వరకు కన్నడ ఆటో ట్రాన్స్‌లేషన్‌ను నిలిపివేయాలని మెటాపై మండిపడ్డారు. మెటా చేసిన పొరపాటుతో ప్రజలకు తప్పుడు సందేశం వెళ్లిందన్నారు. కన్నడ విశిష్టతకు భంగం కలిగేలా అనువదించడం సరికాదన్నారు. ఏదైనా అధికారిక సమాచారం విషయంలో ఇలాంటి అనువాదం చాలా ప్రమాదకమన్నారు. వెంటనే చర్యలు తీసుకోవాలని మెటా సంస్థకు అధికారికంగా తన మీడియా సలహాదారు లేఖ రాశారని ఎక్స్‌లో తెలిపారు. ఆ లేఖను కూడా పోస్టు చేశారు. కన్నడ భాషా నిపుణుల చేత తర్జుమా చేయించాలని ఆ లేఖలో సూచించారు. తరచుగా తప్పులు దొర్లే ఇలాంటి తర్జుమాల విషయంలో జాగ్రత్తగా ఉండాలని ప్రజలను హెచ్చరించారు. తన తప్పు తెలుసుకున్న మెటా సంస్థ క్షమాపణలు కోరింది. పొరపాట్లను పునరావృతం కానివ్వబోమని హామీ ఇచ్చింది. ఆ సంస్థ అధికార ప్రతినిధి పీటీఐతో మాట్లాడుతూ, అనువాదంలో తప్పును సరిచేశామని, జరిగినదానికి క్షమాపణ చెబుతున్నామని అన్నారు.

సంపన్నులే లక్ష్యంగా కోట్లలో దోపిడీ

వ్యాపార రుణాలు, రియల్ ఎస్టేట్ పెట్టుబడుల పేరుతో భారీ మోసం


సల్దానా నివాసంలో మద్యం సీసాలు

- రూ.500 కోట్లు దోచుకున్న కేటుగాడు
- సంపన్న వ్యాపార వర్గాలే లక్ష్యంగా వల
- మంగళూరులో అరెస్టు చేసిన పోలీసులు
- 8 ఏళ్ల క్రితం కూలీ.. మోసాలతో కోట్లకు పడగలు

బెంగళూరు, జూలై 18(ఆంధ్రజ్యోతి): సంపన్న వ్యాపార వర్గాలే లక్ష్యంగా రూ.కోట్లలో మోసాలకు పాల్పడుతున్న రొనాల్డ్ సల్దానా(45) అనే వ్యక్తిని మంగళూరు నగర పోలీసులు అరెస్టు చేశారు. వ్యాపారులకు రూ.600 కోట్ల వరకు అప్పులు ఇప్పించగల సత్తా ఉందని.. ప్రభుత్వంలోనూ మంచి పలుకుబడి ఉందని నమ్మించి ప్రాసెసింగ్ ఫీజులు, లీగల్ క్లియరెన్సుల పేరిట ఒక్కొక్కరి నుంచి రూ.50 లక్షల నుంచి రూ.4 కోట్ల వరకు గుంజినట్టు పోలీసులు గుర్తించారు. దీంతోపాటు రియల్ ఎస్టేట్‌లో పెట్టుబడుల పేరిట కూడా మరికొందరిని మోసం చేసినట్టు తెలుసుకున్నారు. ఇలా.. రూ.500 కోట్లకు పైగా మోసాలకు పాల్పడినట్టు పోలీసులు గుర్తించారు. మోసపూరితంగా పోగేసుకున్న సొమ్ముతో రొనాల్డ్ మాయామహల్ వంటి ఇంటిని నిర్మించుకున్నాడు. ఈ మోసాలపై ఫిర్యాదులు అందుకున్న మంగళూరు పోలీస్ కమిషనర్ సుధీర్ కుమార్ రెడ్డి తన బృందంతో.. స్వయంగా రంగంలోకి దిగి గురువారం అర్ధరాత్రి మాయామహల్‌పై ఆకస్మికంగా దాడులు చేసి.. అతనిని అరెస్టు చేశారు. 2016 వరకు కూలి పనులు చేసుకుని పొట్ట పోసుకున్న సల్దానా.. ఆ తర్వాత ఎనిమిదేళ్ల కాలంలో అత్యంత సంపన్నుడిగా ఎదిగాడు. తనను తాను పారిశ్రామికవేత్తగా పరిచయం చేసుకుని, డబ్బున్నవారిపై వల విసిరేవాడు. వందలాది ఎకరాల భూములు, అదేస్థాయి రుణాలు కావాలంటే తనను సంప్రదించాలని చెప్పి నమ్మించేవాడు. తొలుత మంగళూరులోని జప్పినమగరు ప్రాంతంలోని తన ఇంటికి పిలిపించుకునేవాడు. అతడి నివాసం, విదేశీ బ్రాండ్ల మద్యం, విదేశీ యువతుల సేవలను చూసి బాగా పలుకుబడి ఉందని వచ్చినవారు నమ్మేవారు. ఇదే అదనుగా ఒక్కొక్కరికి రూ.50 కోట్ల నుంచి రూ.100 కోట్ల రుణం ఇప్పించేందుకు రూ.కోట్లలో ఫీజులు తీసుకున్నాడు. ఆ తర్వాత మొబైల్ స్విచ్ ఆఫ్ చేసుకోవడం, పని కాలేదని, త్వరలో అవుతుందని వాయిదాలు వేయడం చేసేవాడు. ఇతని వ్యవహారాలపై పోలీసులకు ఫిర్యాదులు అందడంతో పలుమార్లు దాడులు నిర్వహించారు. పోలీసుల రాకను ఇంటి సమీపంలోని అత్యాధునిక సీసీ కెమెరాల ద్వారా పసిగట్టి, రహస్య గదిలోకి వెళ్లి దాక్కునేవాడు. ఇలా పలుమార్లు తప్పించుకున్నాడు.

అంతా రహస్యమే!

మోసాలకు పాల్పడగా వచ్చిన సొమ్ముతో విలాసవంతమైన సౌకర్యాలతో మాయామహల్‌ను నిర్మించుకున్నాడని, దీనిలో రహస్య గదులతో పాటు బాధితులు ఎవరైనా వచ్చి ఆందోళనకు దిగితే.. పారిపోయేందుకు రహస్య మార్గాలను కూడా ఏర్పాటు చేసుకున్నాడని పోలీసు కమిషనర్ వివరించారు. కేవలం మూడు నెలలకాలంలో రొనాల్డ్ బ్యాంకు ఖాతాలో రూ.40 కోట్లు వచ్చి చేరాయని తెలిపారు.

గడువులోపే భారత అమ్ముల పొదిలోకి ఏకే-203 తుపాకులు

లఖ్‌నవూ, జూలై 18: భారత్-రష్యా భాగస్వామ్యంతో.. మేకిన్ ఇండియాలో భాగంగా 'షేర్' పేరుతో కలాష్నికోవ్ సిరీస్‌లో.. ఏకే-203 తుపాకుల తయారీ వేగం పుంజుకుంది. ఉత్తరప్రదేశ్‌లోని అమేఠీలో ఉన్న ఇండో-రష్యన్ రైఫిల్స్ ప్రైవేట్ లిమిటెడ్(ఐఆర్ఆర్‌పీఎల్) యూనిట్ ఈ తుపాకుల తయారీలో వేగాన్ని పెంచింది. ఏటా 1.5 లక్షల ఉత్పాదక సామర్థ్యంతో.. రూ.5,200 కోట్ల కాంట్రాక్టులో భాగంగా.. భారత సైన్యానికి 2032 అక్టోబరు నాటికి 6,01,427 ఏకే-203 తుపాకులు అందేలా ఐఆర్ఆర్‌పీఎల్‌తో ఒప్పందం ఉంది. అయితే.. ఇప్పటికే 48 వేల రైఫిళ్లను భారత సైన్యానికి అప్పగించామని ఐఆర్ఆర్‌పీఎల్ సీఈవో-ఎండీ మేజర్ జనరల్ ఎస్‌కే శర్మ వెల్లడించారు. 6 లక్షల తుపాకులను అందజేయాలనే ఒప్పందాన్ని నిర్ణీత గడువు కంటే.. 22 నెలల ముందే.. అంటే 2030 డిసెంబరు నాటికి పూర్తి చేస్తామని ఆయన వివరించారు. ఏకే-203 తుపాకులు నిమిషానికి 700 తూటాలను పేల్చగలవు. ప్రస్తుతం అందుబాటులో ఉన్న ఏకే-47, ఏకే-57తో పోలిస్తే.. షేర్ తుపాకులు అత్యాధునికమైనవి. భారత సైన్యం మూడు దశాబ్దాలుగా ఇన్సాస్ రైఫిళ్లను వాడుతుండగా.. వాటి స్థానంలో ఏకే-203 తుపాకులను ప్రవేశపెట్టనున్నారు.

గుర్తింపు పొందని పార్టీల రాబడి 223% పెరుగుదల



(మొదటి పేజీ తరువాయి)

నివేదిక ప్రకారం.. 22 రాష్ట్రాల్లోని 2,764 గుర్తింపు పొందని పార్టీల్లో 739(26.74%) పార్టీల వార్షిక ఆడిట్, కాంట్రిబ్యూషన్ రిపోర్టులను సంబంధిత రాష్ట్రాల సీఈవోల వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉన్నాయి. 739 పార్టీల్లోంచి అత్యధికంగా గుజరాత్‌లో 30.53%, ఢిల్లీలో 21.67% పార్టీలున్నాయి. 739 పార్టీల్లో తొలి పది పార్టీల ఆదాయం రూ.1581.75 కోట్లు ఉండగా.. వీటిలో గుజరాత్‌కు చెందిన పార్టీల వాటే రూ.73.22శాతం! అంటే.. 1581.75 కోట్లలో గుజరాత్ పార్టీల వాటా 1158.15 కోట్లు!! వీటిలో భారతీయ నేషనల్ జనతాదళ్ పేరుతో ఉన్న పార్టీ రూ.576.45 కోట్ల ఆదాయాన్ని ప్రకటించిందని, ఆ రాష్ట్రానికే న్యూ ఇండియా యునైటెడ్ పార్టీ రూ.407.45 కోట్ల మేర విరాళాలొచ్చాయని పేర్కొన్నట్లు నివేదిక పేర్కొంది. 2019-24 వరకు రూ.957.44 కోట్ల మేర ఆదాయం వచ్చినట్లు భారతీయ నేషనల్ జనతాదళ్ ప్రకటించినట్లు నివేదిక వెల్లడించింది. గుర్తింపు పొందని పార్టీల్లో దాదాపు అన్నీ విరాళాల మీదే ఆధారపడుతున్నట్లు తేలిందని వివరించింది. రూ.20వేల కంటే ఎక్కువ విరాళాలు ఇచ్చిన దాతల నుంచి జాతీయ పార్టీలకు 33% నిధులే సమకూరాయని.. గుర్తింపు పొందని పార్టీల్లో ఓ పది పార్టీలకు 93శాతం మేర విరాళాలొచ్చాయని ఏడీఆర్ వెల్లడించడం విశేషం. గుర్తింపు పొందని పార్టీల్లో అత్యధికంగా యూపీలో 744 ఉన్నాయని నివేదిక పేర్కొంది. తెలంగాణలో కూడా 78 గుర్తింపు పొందని నమోదైన పార్టీలు ఉన్నాయని వాటిలో 46 పార్టీల ఆదాయ వివరాలు సీఈవోల వద్ద లేవని తెలిపింది. ఆదాయపు పన్ను చట్టం, 1961లోని సెక్షన్ 13ఏ కింద పన్ను మినహాయింపులను ఉపయోగించుకునే ఏకైక లక్ష్యంతోనే గుర్తింపు పొందని పార్టీల్లో చాలావరకు అవతరించాయని, ఇవేవీ కూడా ఎన్నికల కార్యకలాపాలు జరిపిన దాఖలాలు లేవని ఏడీఆర్ నివేదిక పేర్కొంది. రాజకీయ పార్టీలను ఆదాయపన్ను చట్టం నుంచి మినహాయించిన ఎన్నికల సంఘం రు. 20వేలకు మించి విరాళాలు సేకరిస్తే తమ ఆడిట్ నివేదికలను సమర్పించాలనే నిబంధనలు విధించిందని, అయితే చాలా పార్టీలు తమ విరాళాల వివరాలు వెల్లడించలేదని నివేదిక స్పష్టం చేసింది. కాగా ఐదేళ్లకుపైగా నిష్క్రియాత్మకంగా ఉన్న పార్టీలను ఎన్నికల సంఘం నుంచి తొలగించాలని ఏడీఆర్ సిఫారసు చేసింది.

విషం కలిపిన నీళ్లు తాగి నలుగురు రష్యా సైనికుల మృతి

- ఇంకొందరి పరిస్థితి విషమం
- ఘటన వెనుక ఉక్రెయిన్ హస్తం

న్యూఢిల్లీ, జూలై 18: తూర్పు ఉక్రెయిన్‌లోని రష్యా ఆక్రమిత డోనెట్స్క్ ప్రాంతంలోని పాంటెలిమోనివ్కాలో విషం కలిపిన బాటిళ్లలోని నీళ్లు తాగి.. ఆ దేశంతో యుద్ధంలో ఉన్న రష్యాకు చెందిన సైనికుల్లో కనీసం నలుగురు ప్రాణాలు కోల్పోయినట్లు తెలుస్తోంది. ఈ మేరకు రష్యా టెలిగ్రాం మిలటరీ చానళ్లలో ప్రసారమవుతున్న దృశ్యాలు ఆందోళన కలిగించే విధంగా ఉన్నాయి. సైనికుల్లో కొందరు మూర్ఛపోయినట్లు, ఇంకొందరు ఊపిరి తీసుకునేందుకు తీవ్ర ఇబ్బంది పడుతున్నట్లు ఆ దృశ్యాల్లో కనిపించింది. 'మా నీరు' (అవర్ వాటర్) అనే లేబుల్‌తో ఉన్న ఈ నీళ్ల బాటిళ్లను రష్యా అధీనంలోని క్రిమియా నుంచి మానవతా దృక్పథంతో సరఫరా చేసే ఆహారపదార్థాల్లో భాగంగా అక్కడ పంపిణీ చేసినట్లు తెలుస్తోంది. ఈ నీళ్లు తాగినవారిలో కొందరు సైనికుల పరిస్థితి విషమంగా ఉన్నట్లు సమాచారం. కాగా ఈ ఘటన వెనుక ఉక్రెయిన్ హస్తం ఉందని రష్యా సైన్యం ఆరోపించింది. అయితే ఈ విషయంలో ఎలాంటి ఆధారాలను సైన్యం బయటపెట్టలేదు.

అబూజ్‌మడ్‌లో.. ఆరుగురు నక్సల్స్ కాల్చివేత

- ఏకే-47, ఎస్ఎల్ఆర్ తుపాకీ స్వాధీనం
- మృతుల సంఖ్య మరింత పెరిగే చాన్స్!
- ఏడాదిలో 357 మంది మృతి.. వీరిలో 126 మంది మహిళలు

చర్ల/చింతూరు, జూలై 18 (ఆంధ్రజ్యోతి): అమరవీరుల వారోత్సవాల నేపథ్యంలో మావోయిస్టు పార్టీకి గట్టి ఎదురు దెబ్బతగిలింది. ఛత్తీస్‌గఢ్‌లోని నారాయణపూర్ జిల్లా అబూజ్‌మడ్ అడవుల్లో శుక్రవారం సాయంత్రం జరిగిన ఎన్‌కౌంటర్‌లో ఆరుగురు మావోయిస్టులు మృతి చెందారు. మృతుల్లో ఇద్దరు మహిళలు ఉన్నట్లు సమాచారం. ఘటనాస్థలి నుంచి ఒక ఏకే-47, మరో ఎస్ఎల్ఆర్ తుపాకీని స్వాధీనం చేసుకున్నట్లు నారాయణపూర్ పోలీసులు తెలిపారు. అబూజ్‌మడ్ అడవుల్లో మావోయిస్టులు ఉన్నట్లు సమాచారం అందడంతో.. డీఆర్‌జీ, ఎస్టీఎఫ్, కోబ్రా బలగాలు కూబింగ్ చేపట్టాయని వివరించారు. ఈ క్రమంలో మావోయిస్టులు, బలగాల మధ్య కాల్పులు జరిపాయని పేర్కొన్నారు. నక్సల్స్ వైపు కాల్పులు నిలిచిపోయాక.. పరిశీలించగా.. ఆరు మృతదేహాలు లభ్యమైనట్లు వెల్లడించారు. ఒక ఏకే-47, మరో ఎస్ఎల్ఆర్ తుపాకీని స్వాధీనం చేసుకున్నట్లు వివరించారు. కూంబింగ్ కొనసాగుతోందని, మృతుల సంఖ్య ఇంకా పెరిగే అవకాశాలున్నాయని అభిప్రాయపడ్డారు.

ఇదే ప్రాంతంలో నెలక్రితం

సరిగ్గా నెలరోజుల క్రితం ఇదే ప్రాంతంలో ఎన్‌కౌంటర్ జరిగినట్లు పోలీసులు గుర్తుచేస్తున్నారు. ఆ ఎన్‌కౌంటర్ మావోయిస్టు పార్టీ ప్రధాన కార్యదర్శి నంబాల కేశవరావు మృతిచెందారు. శుక్రవారం మృతి చెందినవారు పీఎల్‌జీపీ ఏడో బెటాలియన్ సభ్యులై ఉండొచ్చనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఏటా జూలై 28 నుంచి ఆగస్టు 3 వరకు మావోయిస్టులు అమరవీరుల వారోత్సవాలను నిర్వహిస్తారు. ఈసారి కూడా బస్తర్ అడవుల్లో వారోత్సవాలకు ఏర్పాట్లు జరుగుతున్నాయి. ఈ తరుణంలో ఎన్‌కౌంటర్ జరగడం మావోయిస్టు పార్టీకి పెద్ద దెబ్బగా బలగాలు భావిస్తున్నాయి. కాగా.. ఆపరేషన్ కగార్‌లో ఏడాది కాలంలో 357 మంది మావోయిస్టులు మృతిచెందారు. వీరిలో 126 మంది మహిళలు, నలుగురు కేంద్ర కమిటీ, 15 మంది రాష్ట్ర కమిటీ సభ్యులున్నారు.

మద్యం మత్తులో తల్లినే హతమార్చాడు!

తిరుపతి(నేరవిభాగం), జూలై 18 (ఆంధ్రజ్యోతి): మద్యం మత్తులో ఓ వ్యక్తి కన్నతల్లినే హత్య చేశాడు. తిరుపతి ఆటోనగర్ సమీపంలోని గొల్లవాని గుంటకు చెందిన సురేశ్, శారద భార్యాభర్తలు. కొన్నేళ్ల క్రితం సురేశ్ బతుకు దెరువు కోసం కువైత్ వెళ్లారు. శారద ఓ కార్ల షోరూంలో సేల్స్ ఎగ్జిక్యూటివ్‌గా పనిచేస్తున్నారు. తల్లికి ఇతరులతో వివాహేతర సంబంధముందన్న అనుమానంతో పెద్ద కుమారుడు ధనుష్ తరచూ శారదతో గొడవపడేవాడు. గురువారం రాత్రి మద్యం తాగి.. ఇదే విషయమై తల్లితో గొడవపడ్డాడు. మాటా మాటా పెరిగి శారద గొంతు నులిమి హత్య చేశాడు. మద్యం మత్తు దిగిన తర్వాత ఈ విషయాన్ని తన అమ్మమ్మ పార్వతికి ఫోనుచేసి చెప్పాడు. ఆమె అలిపిరి పోలీసులకు ఫిర్యాదు చేయగా ఎస్ఐ నాగార్జునరెడ్డి కేసు నమోదు చేశారు. నిందితుడిని అదుపులోకి తీసుకున్నారు.

తాడిపత్రిలో టెన్షన్ టెన్షన్

అడుగుపెట్టేందుకు పెద్దారెడ్డి యత్నం.. అడ్డుకున్న జేసీ వర్గం

- 'రీకాల్ చంద్రబాబు మేనిఫెస్టో' పేరుతో ఆ పార్టీ కార్యాలయంలో సమావేశం
- స్వగ్రామం తిమ్మంపల్లి నుంచి తాడిపత్రి బయల్దేరిన పెద్దారెడ్డిని అక్కడే అడ్డుకున్న పోలీసులు
- వైసీపీ సమావేశానికి ఆయన కోడలు హాజరు
- దీంతో అక్కడకు వెళ్లేందుకు జేసీ ప్రభాకర్‌రెడ్డి, ప్రయత్నం.. వారించిన పోలీసులు
- పెద్దారెడ్డి కోడలిని పంపించివేయడంతో శాంతించిన టీడీపీ శ్రేణులు



అనంతపురం జిల్లా యల్లనూరు మండలం తిమ్మంపల్లిలో పోలీసులతో పెద్దారెడ్డి వాగ్వాదం



తాడిపత్రిలోని వైసీపీ కార్యాలయంలో జేసీ ప్రభాకర్ రెడ్డి

తాడిపత్రి/యల్లనూరు, జూలై 18 (ఆంధ్రజ్యోతి): అనంతపురం జిల్లా తాడిపత్రిలో శుక్రవారం తీవ్ర ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. వైసీపీ మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డిని ఎలాగైనా తాడిపత్రి తీసుకురావడానికి వైసీపీ నాయకత్వం తాజాగా వేసిన ఎత్తు చిత్తయింది. ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు అనంత వెంకటరామిరెడ్డి నేతృత్వంలో శుక్రవారం 'రీకాల్ చంద్రబాబు మేనిఫెస్టో' కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. జడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ, మాజీ మంత్రి శైలజనాథ్‌తో పాటు ముఖ్యనేతలు హాజరయ్యారు. ఈ కార్యక్రమానికి వచ్చేందుకు పెద్దారెడ్డి విశ్వప్రయత్నాలు చేశారు. స్వగ్రామమైన యల్లనూరు మండలం తిమ్మంపల్లి నుంచి ఆయన తాడిపత్రికి బయల్దేరడానికి సిద్ధమవగా.. పోలీసులు అడ్డుకున్నారు. తాడిపత్రి రూరల్ డీఎస్పీ వెంకటేశ్వర్లు సిబ్బందితో తిమ్మంపల్లి చేరుకున్నారు. ఈ క్రమంలో పోలీసులు, పెద్దారెడ్డి అనుచరుల మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది. అయినా పోలీసులు శాంతిభద్రతల సమస్య తలెత్తుతుందంటూ పెద్దారెడ్డిని తాడిపత్రికి వెళ్లనివ్వలేదు. ఆయనకు నోటీసులు ఇచ్చి ఇంట్లోకి పంపించారు. బయటకురాకుండా గృహనిర్బంధం చేశారు. పోలీసుల తీరుపై పెద్దారెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. తనను ప్రతిసారీ అడ్డుకుంటే ఇకపై తిమ్మంపల్లిలో ఉండనని, యల్లనూరు పోలీసుస్టేషన్‌లోనే ఉంటానని, అక్కడే పడుకుంటానని వ్యాఖ్యానించారు. వైసీపీ అధికారంలో ఉన్న సమయంలో ఎమ్మెల్యే హోదాలో పెద్దారెడ్డి.. తాడిపత్రిలోని మాజీ ఎమ్మెల్యే జేసీ ప్రభాకర్‌రెడ్డి ఇంటిపై దాడి చేశారు. ఆయన ఇంట్లోకి వెళ్లి కుర్చీలో కూర్చుని వచ్చారు. ఆ ఘటనను ప్రభాకర్‌రెడ్డి తీవ్రంగా పరిగణించారు. అప్పటి నుంచి ఇరు వర్గాల మధ్య పోరు కొనసాగుతోంది. టీడీపీ కూటమి అధికారంలోకి వచ్చాక పెద్దారెడ్డి పలు మార్లు తాడిపత్రి రావాలని చూశారు. ఏ పరిస్థితుల్లోనూ ఆయన్ను అడుగుపెట్టనివ్వబోమని ప్రభాకర్‌రెడ్డి భీష్మించుకుని కూర్చున్నారు. కోర్టు ఆదేశాలున్నా.. శాంతిభద్రతల నేపథ్యంలో పోలీసులు పెద్దారెడ్డిని అడ్డుకుంటూ వస్తున్నారు. శుక్రవారం అదే పునరావృతమైంది. పెద్దారెడ్డి తాడిపత్రికి వస్తే.. అడ్డుకుంటామని జేసీతోపాటు ఆయన వర్గీయులు ముందే అల్టిమేటం జారీ చేశారు. అనుచరులు, టీడీపీ శ్రేణులు వందలాదిగా జేసీ ఇంటి వద్ద గుమిగూడారు. వైసీపీ ముఖ్యనేతల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న 'రీకాల్ చంద్రబాబు మేనిఫెస్టో' సమావేశానికి పెద్దారెడ్డి కోడలు హర్షితారెడ్డి హాజరుకావడాన్ని వారంతా తీవ్రంగా పరిగణించారు. భేటీ జరుగుతున్న వైసీపీ కార్యాలయానికి వెళ్లేందుకు ప్రభాకర్‌రెడ్డి, ఆయన అనుచరులు సిద్ధమయ్యారు. దీంతో ఎప్పుడేం జరుగుతుందోనన్న భయాందోళనలు వ్యక్తమయ్యాయి. అయితే అటువైపు వెళ్లకుండా పోలీసులు వారిని అడ్డుకున్నారు. హర్షితారెడ్డిని తాడిపత్రి నుంచి పంపించేస్తామని హామీ ఇచ్చారు. కొద్దిసేపటికే ఆమెను పంపించారు కూడా. టీడీపీ శ్రేణులు అక్కడితో శాంతించారు. కాగా.. 'రీకాల్ చంద్రబాబు మేనిఫెస్టో' సమావేశంలో వైసీపీ నాయకులు జేసీ ప్రభాకర్‌రెడ్డి పేరెత్తలేదు. చంద్రబాబు ప్రభుత్వంపై విమర్శలు, పోలీసులపై ఆరోపణలతో సరిపెట్టారు. దీంతో పరిస్థితి సద్దుమణిగింది.

వైసీపీ కార్యాలయంలో మందు బాటిళ్లు..

వైసీపీ సమావేశం ముగిశాక ఆ పార్టీ కార్యాలయానికి మున్సిపల్ చైర్మన్ హోదాలో జేసీ ప్రభాకర్‌రెడ్డి వెళ్లారు. అక్కడ చెత్తాచెదారం, మద్యం బాటిళ్లు చూసి ఆగ్రహం వ్యక్తం చేశారు. తాడిపత్రికి గ్రీన్ సిటీ అనే పేరు ఉందని, అలాంటి పట్టణానికి వచ్చి తిని, తాగి పడేసిపోతే చెత్తను ఎవరు ఎత్తేస్తారని వైసీపీ నాయకుల తీరుపై మండిపడ్డారు. 'మీరు వేసిన చెత్త వాసన వస్తోందని యాక్సిస్ బ్యాంకు వాళ్లు ఫిర్యాదు చేశారు. ఇక్కడకు మందు బాటిళ్లు, చెత్త కనిపిస్తున్నాయి. మీటింగ్‌కు వచ్చారా.. తిని, తాగడానికి వచ్చారా? అనంత వెంకటరామిరెడ్డీ.. తాడిపత్రి నా జాగీరు కాదు.. కానీ ఇది నా ఊరు. మీరు వచ్చి ఏదో చేయాలనుకుంటే కుదరదు. అనంతపురంలో డంపింగ్ యార్డు తీసివేయడానికి రూ.24 కోట్లు ఖర్చుపెట్టారు. అయినా వాసన పోలేదు. వైసీపీ హయాంలో తాడిపత్రి డంపింగ్ యార్డు తీసివేయడానికి రూ.10 కోట్లు కేంద్రం నుంచి వచ్చినా వాడుకోలేదు. తాడిపత్రిని కూడా అనంతపురంలాగే చేయాలనుకుంటున్నారా..' అని ప్రశ్నించారు.

సైబర్ నేరాలపై ఉక్కుపాదం

- నేరాల నియంత్రణకు చట్ట సవరణ
- వచ్చే అసెంబ్లీ సమావేశాల్లో బిల్లు
- డిప్యూటీ స్పీకర్ రఘురామ వెల్లడి



అమరావతి, జూలై18 (ఆంధ్రజ్యోతి): సైబర్ నేరాలపై ఉక్కుపాదం మోపేందుకు కసరత్తు చేస్తున్నట్లు డిప్యూటీ స్పీకర్, అసెంబ్లీ పిటిషన్ల కమిటీ చైర్మన్ రఘురామకృష్ణరాజు వెల్లడించారు. ప్రస్తుత చట్టానికి మరింత పదును పెట్టేలా వచ్చే శాసనసభ సమావేశాల్లో చట్ట సవరణ బిల్లు ప్రవేశ పెట్టాలని పిటిషన్ల కమిటీ అభిప్రాయపడుతున్నట్లు తెలిపారు. పటిష్టమైన చట్ట రూపకల్పనకు హోం, ఐటీ శాఖల కార్యదర్శులతో చర్చించినట్లు చెప్పారు. శుక్రవారం శాసనసభలోని తన చాంబరులో కమిటీ భేటీ అనంతరం ఎమ్మెల్యేలు కొణతాల రామకృష్ణ, పల్లా శ్రీనివాసరావు, విష్ణుకుమార్‌రాజు, గురజాల జగన్మోహన్‌లతో కలిసి ఆయన మీడియాతో మాట్లాడారు. సైబర్ క్రైమ్స్ నియంత్రణపై సీఎం చంద్రబాబు ఆదేశాల నేపథ్యంలో అసెంబ్లీ పిటిషన్ల కమిటీ కూడా ప్రత్యేక దృష్టి సారించినట్లు తెలిపారు. బెట్టింగ్, లోన్ యాప్స్ వల్ల రాష్ట్రంలో ఎంతో మంది మోసపోతున్నా కూడా వీటికి సంబంధించి కేవలం 4 శాతం కేసులే నమోదయ్యాయని చెప్పారు. మొత్తం రూ.960 కోట్ల మేర మోసాలు జరిగితే, రూ.300 కోట్లు వరకు రికవరీ చేసినట్లు గతేడాది నివేదికల ద్వారా తెలుస్తోందన్నారు. ఆ లెక్కన ఏడాదికి రూ.30 వేల కోట్ల వరకు సైబర్ క్రైమ్ మోసాలు జరుగుతున్నట్లు అవగతమవుతోందన్నారు. మూలాల నుంచి సైబర్ నేరాల సిండికేట్ మొత్తాన్ని నియంత్రించేలా చట్ట సవరణ తీసుకురానున్నట్లు చెప్పారు. దీనిపై త్వరలో తమ కమిటీ సమగ్ర నివేదికను స్పీకర్‌కు అందిస్తుందన్నారు. సైబర్ మోసాలపై 1930 నంబరుకు డయల్ చేసి వెంటనే ఫిర్యాదు చేస్తే తక్షణం చర్యలు తీసుకునే వీలుంటుందన్నారు. సైబర్ నేరాలపై సినీ ప్రముఖులతో ప్రజలకు అవగాహన కల్పించే అంశాన్ని సీఎం దృష్టికి తీసుకెళ్తామని చెప్పారు. కమిటీ భేటీలో అసెంబ్లీ సెక్రటరీ జనరల్ ప్రసన్నకుమార్, డిప్యూటీ సెక్రటరీ రాజ్‌కుమార్, హోంశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ కుమార్ విశ్వజిత్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ బడుల్లో 'నో వేకెన్సీ' పరిస్థితి తేవాలి

> నాణ్యమైన బోధన అందించడం ద్వారా అడ్మిషన్లు పెంచడమే ప్రభుత్వ లక్ష్యం

- మంచి విద్య అందిస్తారని విద్యార్థుల తల్లిదండ్రుల్లో నమ్మకం కలిగించాలి
- 'షైనింగ్ టీచర్' హెచ్ఎం దుర్గాభవానీకి మంత్రి లోకేశ్ అభినందన, సత్కారం
- అద్భుత పనితీరుతో ఆదర్శంగా నిలిచారని ప్రశంస



ప్రధానోపాధ్యాయురాలు దుర్గాభవానీని జ్ఞాపికతో సత్కరిస్తున్న మంత్రి లోకేశ్

అమరావతి/మచిలీపట్నం, జూలై 18 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లో బోధనలో నాణ్యత పెంచి, తద్వారా ప్రవేశాలు పెంచటమే ప్రభుత్వ లక్ష్యమని విద్య, ఐటీ శాఖ మంత్రి లోకేశ్ అన్నారు. కృష్ణా జిల్లా పెనమలూరు జడ్పీ ఉన్నత పాఠశాలలో పదో తరగతి పరీక్షలతో పాటు ఇతర అంశాల్లో అద్భుత ఫలితాలు సాధించిన ప్రధానోపాధ్యాయురాలు వై.దుర్గాభవానీని 'షైనింగ్ టీచర్' బిరుదుతో శుక్రవారం ఉండవల్లిలోని తన నివాసంలో సత్కరించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ వచ్చే నాలుగేళ్లలో ప్రైవేటు పాఠశాలల్లో అడ్మిషన్లు తగ్గి, ప్రభుత్వ పాఠశాలల్లో అడ్మిషన్లు పెరగాలన్నదే తమ లక్ష్యమన్నారు. 'ప్రభుత్వ బడుల ముందు అడ్మిషన్లు అయిపోయాయనే బోర్డులు పెట్టే పరిస్థితి రావాలి. అప్పుడే ప్రభుత్వ పాఠశాలల్లో మంచి విద్య అందుతుందని తల్లిదండ్రులు విశ్వసిస్తారు' అని పేర్కొన్నారు. ఈ లక్ష్యం కోసం నిరంతరం శ్రమిస్తామని, చిత్తశుద్ధితో పనిచేస్తామన్నారు. ప్రభుత్వ బడుల బలోపేతానికి తీసుకోవాల్సిన చర్యలపై దుర్గాభవాని నుంచి లోకేశ్ ఈ సందర్భంగా సలహాలు, సూచనలు స్వీకరించారు. అద్భుత పనితీరుతో ఉపాధ్యాయులందరికీ ఆదర్శంగా నిలిచారని ఆమెను ప్రశంసించారు. క్షేత్రస్థాయిలో వాస్తవాలు తెలుసుకునేందుకే ఉపాధ్యాయులను నేరుగా కలవాలని నిర్ణయం తీసుకున్నామని లోకేశ్ పేర్కొన్నారు. ప్రభుత్వ పాఠశాలలో చదివే ప్రతి విద్యార్థి ముఖ్యమేనని, వచ్చే నాలుగేళ్ల విద్యార్థుల అభ్యసన ఫలితాలపై దృష్టి సారిస్తామన్నారు.

హెచ్ఎం దుర్గాభవాని కృషి ఇదీ..

పెనమలూరు జడ్పీ ఉన్నత పాఠశాల హెచ్ఎం దుర్గాభవాని వృత్తి పట్ల నిబద్ధత చూపి విద్యార్థులను ఉన్నతంగా తీర్చిదిద్దారు. 2025 పదో తరగతి పరీక్షల్లో మంచి ఫలితాలు సాధించేలా కృషి చేశారు. పాఠశాలలో 54 మంది విద్యార్థులు 500కు పైగా మార్కులు సాధించారు. ఏడుగురు ట్రిపుల్ ఐటీల్లో అడ్మిషన్లు పొందారు. వరుసగా మూడేళ్ల పదుల సంఖ్యలో విద్యార్థులు ఎంఎంఎంఎస్ స్కాలర్‌షిప్‌కు అర్హత సాధించేలా చేశారు. రాష్ట్రంలో మొదటిసారిగా ప్రభుత్వ పాఠశాలలో గ్రాడ్యుయేషన్ డే ఈవెంట్ నిర్వహించారు. పీఎంశ్రీ యోజన కింద పాఠశాల ఎంపిక కావడానికి కృషి చేశారు. వాల్ ఆర్ట్స్, డ్యాన్స్, మ్యూజిక్ క్లాసులు, కంప్యూటర్ శిక్షణ అందించారు. తడిసిన ధాన్యాన్ని ఆరబెట్టే యంత్రంతోపాటు ఐరెన్‌బాక్స్ హీట్ కంట్రోల్ ఇన్‌క్లైన్, పాఠశాలలో చెత్తను శుభ్రం చేసేందుకు పాతవస్తువుల నుంచి బ్లోయర్ తయారీ, ఆల్కహాల్ సెన్సింగ్ హెల్మెట్ వంటి నవీన ఆవిష్కరణలను విద్యార్థులు ప్రధానోపాధ్యాయురాలి పర్యవేక్షణలో రూపొందించారు. మారుమూల ప్రాంతంలో పనిచేస్తున్న తనను మంత్రి లోకేశ్ పిలిచి.. ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు ఏం కోరుకుంటున్నారు? వారికి ప్రభుత్వ పరంగా ఇంకేం చేయగలం? అనే అంశాలపై అడగడం సంతోషంగా ఉందని దుర్గాభవాని తెలిపారు.

కొత్త 'సింగిల్ మేజర్' విధానంలోకి మారాలి

- డిగ్రీ కోర్సుల్లో ప్రస్తుత సీట్ల సంఖ్యనే కొనసాగింపు
- నూతన కరిక్యులమ్ ఫ్రేమ్‌వర్క్‌లోకి మారడంపై ఉన్నత విద్యామండలి మార్గదర్శకాలు

అమరావతి, జూలై 18 (ఆంధ్రజ్యోతి): సింగిల్ మేజర్ డిగ్రీ నుంచి కొత్త సింగిల్ మేజర్ డిగ్రీ విధానంలోకి మారేందుకు డిగ్రీ కాలేజీలకు ఉన్నత విద్యామండలి మార్గదర్శకాలు జారీచేసింది. ప్రస్తుత సింగిల్ మేజర్ విధానం నుంచి 2025-26లో అమలు చేయబోయే నూతన సింగిల్ మేజర్ కరిక్యులమ్ ఫ్రేమ్‌వర్క్‌లోకి మారాలని స్పష్టం చేసింది. కన్వర్షన్ కోసం ఈనెల 18 నుంచి 24 వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని తెలిపింది. 25 నుంచి 27 వరకు రూ.7 వేలు, 28 నుంచి 30 వరకు రూ.10 వేల జరిమానాతో దరఖాస్తు చేసుకోవచ్చని వివరించింది. ఈనెల 25 నుంచి 31 వరకు ప్రతిపాదనల పరిశీలన జరుగుతుందని, ఆగస్టు 1న అనుమతులు జారీ అవుతాయని వెల్లడించింది. ఇటీవల డ్యూయెల్ మేజర్ కన్వర్షన్ కోసం ఫీజులు చెల్లించిన కాలేజీలు మళ్లీ కట్టాల్సిన అవసరం లేదని తెలిపింది. ప్రతి కోర్సులో ప్రస్తుతం ఉన్న సీట్ల సంఖ్యనే యథావిధిగా మార్చుకోవాలని స్పష్టం చేసింది. ప్రస్తుత కోర్సు నుంచి కొత్త కోర్సులోకి మారాలంటే అందుకు అవసరమైన మౌలిక సదుపాయాలు ఉన్నట్లు చూపించాలని తెలిపింది. బీబీఏ, బీసీఏ కోర్సులకు ఏఐసీటీఈ అనుమతులు జారీచేస్తున్నందున.. ఆ సంస్థ అనుమతి లేకుండా ఆ కోర్సులకు మార్చుకోవడం కుదరదని పేర్కొంది. 2024-25 విద్యాసంవత్సరంలో డిజిటల్ అఫిలియేషన్ పొందిన కాలేజీలకు మాత్రమే కన్వర్షన్‌కు అవకాశం ఉంటుందని, డిజిటల్ అఫిలియేషన్ లేని కాలేజీలు ప్రొవిజినల్ అఫిలియేషన్‌కు దరఖాస్తు చేసుకోవాలని తెలిపింది. అన్ని కోర్సులు ఇంగ్లిష్ మీడియంలో మాత్రమే ఉంటాయని తెలిపింది. బీకాం, బీకాం(సీఏ), బీబీఏ, బీసీఏ, బీ ఒకేషనల్, ఏఈడీపీ కోర్సులకు కన్వర్షన్ ప్రతిపాదనలు అవసరం లేదని పేర్కొంది. సాధారణ డిగ్రీ కాలేజీలు కోర్సులను హోటల్ మేనేజ్‌మెంట్ కోర్సుల్లోకి మార్చుకోవడం కుదరదని స్పష్టం చేసింది.

ఏయూలో అగ్ని ప్రమాదం

- కెమిస్ట్రీ విభాగంలో షార్ట్ సర్క్యూట్
- ఆందోళనతో పరుగులు తీసిన విద్యార్థులు



అగ్ని ప్రమాదం జరిగిన హాలు

విశాఖపట్నం, జూలై 18 (ఆంధ్రజ్యోతి): ఆంధ్ర విశ్వవిద్యాలయంలోని కెమిస్ట్రీ విభాగంలో శుక్రవారం మధ్యాహ్నం రెండు గంటల సమయంలో అగ్ని ప్రమాదం సంభవించింది. షార్ట్ సర్క్యూట్ కావడంతో ఏసీలో మంటలు చెలరేగడంతో విద్యార్థులు పరుగులు పెట్టారు. ప్రమాదం కెమిస్ట్రీ విభాగంలోని ఒక హాల్‌లో చోటుచేసుకోగా, పక్కనున్న మరో గదిలో దూర విద్య విద్యార్థులకు తరగతులు జరుగుతున్నాయి. ప్రమాద విషయం తెలియగానే క్లాస్‌లో ఉన్న ఒక విద్యార్థి మంటలను ఆపేందుకు తీవ్రంగా యత్నించాడు. సదరు విద్యార్థి ఫైర్ అండ్ సేఫ్టీలో డిప్లమో కలిగి ఉండడంతో మంటలను అదుపులోకి తెచ్చేందుకు కృషిచేశాడు. అతని ప్రయత్నాలు సఫలం కావడంతో మంటలు కొంత వరకూ అదుపులోకి వచ్చాయి. మరోవైపు సైన్స్ కాలేజీ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ఎంవీఆర్ రాజు అగ్నిమాపక సిబ్బందికి సమాచారాన్ని అందించారు. అక్కడకు చేరుకున్న అగ్నిమాపక సిబ్బంది విభాగంలో మంటలను పూర్తిగా అదుపులోకి తీసుకువచ్చారు. ఈ ప్రమాదంలో ఏసీ, ఫర్నిచర్, కొన్ని టేబుళ్లు కాలిపోయాయి. అయితే, దూరవిద్యకు చెందిన విద్యార్థి సమయస్ఫూర్తితో వ్యవహరించడం వల్ల పెనుప్రమాదం తప్పిందని ప్రత్యక్ష సాక్షులు చెబుతున్నారు.

సీఎస్ఎస్ఆర్ పోటీల్లో ఏపీఎస్డీఆర్ఎఫ్‌కు మూడో స్థానం

- సభ్యులను అభినందించిన డీజీపీ హరీష్ కుమార్ గుప్తా

అమరావతి, జూలై 18 (ఆంధ్రజ్యోతి): సదరన్ లెవెల్ జాతీయస్థాయి సీఎస్ఎస్ఆర్ పోటీల్లో ఆంధ్రప్రదేశ్ స్టేట్ డిజాస్టర్ రెస్పాన్స్ ఫోర్స్ (ఏపీఎస్డీఆర్ఎఫ్) మూడో స్థానంలో నిలిచి సత్తా చాటింది. న్యూఢిల్లీలో జరిగిన పోటీల్లో హిమాచల్‌ప్రదేశ్, ఉత్తరాఖండ్ సహా వివిధ రాష్ట్రాలతో పోటీపడి తృతీయస్థానాన్ని కైవసం చేసుకుంది. ఏప్రిల్‌లో ఘజియాబాద్‌లో జరిగిన పోటీల్లో పాల్గొని జాతీయ స్థాయిలో అర్హత సాధించింది. ఉత్తమ ప్రతిభ కనబరిచిన ఈ బృందం శుక్రవారం డీజీపీని ఆయన కార్యాలయంలో కలిశారు. ఈ సందర్భంగా డీజీపీ హరీష్‌కుమార్ గుప్తా క్రీడాకారులను అభినందించారు.



అలిపిరిలోని భూదేవి కాంప్లెక్స్ వద్ద స్లాటెడ్ టికెట్ల కోసం ఉదయం నుంచే వేచి ఉన్న భక్తులు



తిరుమలలో సర్వదర్శనం క్యూలైన్‌లో వేచి ఉన్న భక్తులు

శ్రీవారి సర్వదర్శనానికి 16 గంటలు

- తిరుమలలో భారీగా పెరిగిన రద్దీ

తిరుమల, జూలై 18(ఆంధ్రజ్యోతి): తిరుమలలో రద్దీ మరింత పెరిగింది. శుక్రవారం వైకుంఠం క్యూకాంప్లెక్స్ 2లోని 31 కంపార్టుమెంట్లతో పాటు నారాయణగిరిలో తొమ్మిది షెడ్లు నిండిపోయాయి. క్యూలైన్ శిలా తోరణం సర్కిల్ దాకా వ్యాపించింది. ఈ క్యూలైన్‌లో ఉన్న వారికి స్వామి దర్శనానికి 16 గంటలు పట్టే అవకాశం ఉంది. ఇక స్లాటెడ్ భక్తులకు కూడా మూడు గంటల నిరీక్షణ సమయం పడుతోంది. స్లాటెడ్ సర్వదర్శనం(ఎస్ఎస్‌డీ) టికెట్ల కోసం తిరుపతిలోని అలిపిరి భూదేవి, కాంప్లెక్స్ విష్ణు నివాసం, శ్రీనివాసంలోని కౌంటర్ల వద్ద కూడా భక్తులు కిటకిటలాడుతున్నారు. సాయంత్రం 4 గంటలకు ఇచ్చే టోకెన్ల కోసం ఆయా కేంద్రాల వద్దకు భక్తులు ఉదయమే చేరుకోవడంతో ఆ ప్రాంతాలన్నీ రద్దీగా మారాయి. పది రోజులుగా తిరుమలలో రద్దీ ఇదే తీరులో కొనసాగుతోంది. మంగళవారం ఒక్క రోజు మాత్రమే కాస్త తగ్గినట్టే అనిపించి మళ్లీ పెరిగింది.

శ్రీవారి సేవలో జస్టిస్ కామేశ్వరరావు



తిరుమల, జూలై 18(ఆంధ్రజ్యోతి): కర్ణాటక హైకోర్టు తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి వి.కామేశ్వరరావు శుక్రవారం ఉదయం తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. జాతీయ బీసీ కమిషన్ చైర్మన్ హన్సరాజ్ గంగారాం కూడా స్వామి దర్శనం చేసుకున్నారు.

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

శాసన వివేకం

పొరుగు దేశం పాకిస్థాన్‌లో పవిత్ర గ్రంథాలు, పవిత్ర ప్రదేశాలు, పుణ్య పురుషులను అగౌరవపరిచినట్టు ఆరోపణలు ఎదుర్కొనే వారికి విధించే అసాధారణ శిక్షలను గమనిస్తే మత భావోద్రేకాల కాఠిన్యత విస్మయపరుస్తుంది. ఇటువంటి ధర్మోల్లంఘన చర్యలకు పాల్పడేవారిని కఠినంగా శిక్షించేందుకు మన పంజాబ్ రాష్ట్ర ప్రభుత్వం ఈ వారం శాసనసభలో ఒక బిల్లును ప్రవేశపెట్టింది. 'పంజాబ్ ప్రివెన్షన్ ఆఫ్ అఫెన్సెస్ ఎగెనిస్ట్ హోలీ స్క్రిప్చర్స్ బిల్–2025'ను ముఖ్యమంత్రి భగవంత్ మాన్ స్వయంగా శాసనసభలో ప్రవేశపెట్టారు. శ్రీగురు గ్రంథ్ సాహిబ్, శ్రీమద్ భగవద్గీత, హోలీ బైబిల్, ఖురాన్ షరీఫ్‌తో సహా ఏ మత పవిత్ర గ్రంథాలనైనా అపవిత్రం చేస్తే పది సంవత్సరాల నుంచి యావజ్జీవ కారాగార శిక్షతో పాటు ఐదు నుంచి పది లక్షల రూపాయల జరిమానా విధించాలని ఈ బిల్లు ప్రతిపాదించింది. ఏ పవిత్ర గ్రంథాన్ని అయినా చింపివేయడం, కాల్చివేయడం, ధ్వంసం చేయడం, వికృతం చేయడం, వివర్ణం చేయడం, మౌఖికంగా లేదా భౌతికంగా అగౌరవపరచడాన్ని నేరంగా పరిగణించాలని ఆ బిల్లు పేర్కొంది. మత సామరస్యాన్ని సంరక్షించేందుకు, పంజాబ్‌లో నివసిస్తున్న భిన్న మతాల అనుయాయుల మధ్య సౌభ్రాతృత్వాన్ని పెంపొందించేందుకు ఈ బిల్లును ఉద్దేశించారు. భారత్‌లో ఇటువంటి బిల్లును ప్రవేశపెట్టడం ఇదే మొదటిసారి అని ముఖ్యమంత్రి మాన్ సగర్వంగా ప్రకటించారు.

ఒక మత వ్యవస్థలో పవిత్రమైనవిగా భావించే వాటిని అగౌరవ పరచడం సహజంగానే సంబంధిత మతస్థుల మనసులను గాయపరుస్తుంది. అక్టోబర్ 12, 2015న ఫరీద్‌కోట్ జిల్లాలోని బర్గారీ గ్రామంలో, సిక్కు మత పవిత్ర గ్రంథం శ్రీగురుగ్రంథ్ సాహిబ్ నుంచి చింపిన పేజీలను కనుగొన్నారు. ఇది పంజాబ్ అంతటా తీవ్ర ఉద్రిక్తతలకు దారితీసింది. ఆ సందర్భంగా పోలీసు కాల్పుల్లో ఇద్దరు వ్యక్తులు చనిపోయారు. తదాది పంజాబ్‌లో ఏదో ఒక ప్రాంతంలో ఇటువంటి ధర్మోల్లంఘన సంఘటనలు జరుగుతున్నాయి. ఈ ఘటనల పరంపర పంజాబ్ రాజకీయాలను నిర్ణయాత్మకంగా ప్రభావితం చేశాయి. పర్యవసానంగా 2017 ఎన్నికలలో అకాలీదళ్–బీజేపీ సంకీర్ణ ప్రభుత్వం పరాజయం పాలయింది. గెలిచి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్, మతపరమైన భావోద్వేగాలను రాజకీయ ప్రయోజనాలకు ఉపయోగించుకోవడానికి ప్రయత్నించి విఫలమయింది. కొత్తగా రాష్ట్ర రాజకీయాలలోకి ప్రవేశించిన ఆమ్ ఆద్మీ పార్టీ యాదృచ్ఛికంగా లబ్ధి పొంది 2022లో అధికారానికి వచ్చింది. అకాలీ–బీజేపీ, కాంగ్రెస్ ప్రభుత్వాలు రెండూ ఈ ధర్మోల్లంఘన సంఘటనలను అరికట్టేందుకు కఠినమైన బిల్లులను తీసుకువచ్చాయి. అయితే భిన్న కారణాలతో అవి రాష్ట్రపతి ఆమోదం పొందలేకపోవడంతో చట్టాలు కాలేదు. ఇప్పుడు భగవంత్ మాన్ నేతృత్వంలోని ఆమ్ ఆద్మీ పార్టీ ప్రభుత్వం తాజాగా ఒక కొత్త బిల్లును ప్రవేశపెట్టింది. శాసన సభలో చర్చ అనంతరం మరింత విస్తృత చర్చలకు గాను ఆ బిల్లును సెలెక్ట్ కమిటీకి నివేదించారు.

ఆప్ ప్రభుత్వం ఈ బిల్లును తీసుకురావడాన్ని పలువురు విమర్శిస్తున్నారు. ఢిల్లీలో అధికారాన్ని కోల్పోయిన ఆప్ 2027లో జరగనున్న పంజాబ్ అసెంబ్లీ ఎన్నికలను దృష్టిలో ఉంచుకునే ఈ బిల్లును ప్రవేశపెట్టిందని తప్పుపడుతున్నారు. 'ఇదొక రాజకీయ జూద'మని ఒక విజ్ఞుడు వ్యాఖ్యానించారు. ధర్మోల్లంఘన ఘటనలకు పాల్పడినవారిని శిక్షించేందుకు కొత్త చట్టం అవసరం లేదని, ప్రస్తుతమున్న చట్టాలు సరిపోతాయని పంజాబ్ పౌర సమాజ ప్రముఖులు అభిప్రాయపడుతున్నారు. సామాజిక, ఆర్థిక, భద్రతాపరమైన సవాళ్ల నెదుర్కొంటున్న సరిహద్దు రాష్ట్రంలో ఒక భావోద్వేగ అంశాన్ని రాజకీయ చర్చల్లోకి తీసుకురావడం ఎంతవరకు సమంజసమని వారు ప్రశ్నిస్తున్నారు.

పౌర వివేకాన్ని పెంపొందించకుండా శాసనాలతో మతపరమైన భావోద్రేకాలను ఉపశమింపచేయడం సాధ్యమవుతుందా? ఇతరేతర ప్రయోజనాలను ఆశించి ఒక సమస్యను సాకుగా చూపి తీసుకువచ్చే చట్టాలు సార్థకమవుతాయా? నిగూఢ రాజకీయ ప్రయోజనాలు లేని శాసన నిర్మాణమే ఫలప్రదమవుతుంది. సెలెక్ట్ కమిటీ పరిశీలనలో ఉన్న బిల్లుపై విస్తృతస్థాయిలో చర్చలు, సంప్రదింపుల ద్వారా పౌర వివేకాన్ని పెంపొందించాలి. పవిత్ర గ్రంథాలను అగౌరవపరిచిన వారిని శాసనాలు శిక్షించగలవేగానీ ఆ దివ్య గ్రంథాలు ప్రబోధించే మానవ జీవిత ధర్మాలను అర్థం చేసుకుని అనుష్ఠానించేలా ప్రజలను పురిగొల్పగలుగుతాయా? శాసన వివేకానికి విధిగా పరిమితులు ఉంటాయి. ఆ పరిమితులు నిగూఢ రాజకీయ ఆరాటాలతో సంబంధమున్నవి అయితే ప్రమాదకర పర్యవసానాలకు కారణమవుతాయి. ఈ విపత్కర పరిస్థితి శాసన మూఢత్వం (లెజిస్లేటివ్ స్టుపిడిటీ–లక్ష్య శుద్ధి లేని శాసనాల నిర్మాణం)కు తార్కాణం. దీన్ని ప్రోత్సహించకూడదు. త్యజిస్తేనే పౌర విజ్ఞతను పెంపొందించే శాసన వివేకం వర్ధిల్లుతుంది. మరి అటువంటి శాసనాలను నిర్మించే పరిణతి మన రాజకీయాలకు ఎప్పుడు వస్తుంది?

మన్యం విప్లవవీరుడు, ఆదివాసీ నాయకుడు

భారత స్వాతంత్ర్య పోరాటంలో చిరస్మరణీయుడు, మన్యం విప్లవవీరుల్లో గొప్ప ఆదివాసీ నాయకుడు గాం మల్లుదొర. ఆయన బొగ్గు దొర, అక్కమ్మ దంపతులకు ప్రస్తుత అల్లూరి సీతారామరాజు జిల్లా, కొయ్యూరు మండలం, లంకవీధి, బట్టపనుకుల గ్రామంలో జన్మించారు. బ్రిటిష్ నిరంకుశ పాలనలో గిరిజనులు అనుభవిస్తున్న దయనీయ స్థితిని తొలగించి, గిరిజనుల జీవితాలలో వికాస అభ్యుదయాలు కలిగించడానికి అల్లూరి సీతారామరాజుతో కలసి బ్రిటిష్ వారి గుండెల్లో రైళ్లు పరిగెత్తించిన ఆదివాసీ వీరుడు మల్లుదొర. 1922 నుంచి 1924 వరకు సాగిన మన్యం విప్లవంలో ముఖ్యుడు, అల్లూరు సైన్యంలో ఎంతో పేరు పొందిన గాం సోదరుల్లో ఒకరు. అల్లూరి సీతారామ రాజుకి కుడిభుజంగా ఉంటూ బ్రిటిష్ ప్రభుత్వంపై రాజీలేని పోరాటం చేశారు. బ్రిటిష్ వారి చేతిలో చావు నుంచి బయటపడి దేశ స్వాతంత్ర్య సముపార్జన అనంతరం స్వేచ్ఛా వాయువులను కూడా పీల్చిన వ్యక్తి మల్లుదొర.



బ్రిటిష్ వారి పాలనలో చింతపల్లి తహసీల్దార్‌గా పని చేసే భాష్టియన్, అతని అనుచరులు మన్యంలో ఆదివాసీలను దోచుకుంటూ, ముక్కుపిండి పన్నులు వసూలు చేసేవారు. అప్పట్లో నర్సీపట్నం నుంచి లంబసింగి వరకు రోడ్డు నిర్మాణం జరుగుతుండేది. ఆ పనికి కూలీలుగా వచ్చిన ఆదివాసీలకు బ్రిటిష్‌వారు డబ్బులు కూడా సరిగా ఇచ్చేవారు కాదు. పైగా అప్పటికే బ్రిటీష్ ప్రభుత్వ ఆంక్షల వల్ల సంప్రదాయ సేద్యానికి, ఇతర అటవీ జీవన విధానానికి దూరమవుతున్న ఆదివాసీలు ప్రభుత్వానికి ఎదురు తిరిగారు. వీరి తిరుగుబాటు నుంచే గిరిజన విప్లవం మొదలైంది. అప్పటికే మన్యం ప్రాంతంలో తిరుగుతూ అదివాసీల్లో చైతన్యం తెచ్చేందుకు ప్రయత్నిస్తున్న అల్లూరి సీతారామ రాజును కలిసిన మొదటివాడు మల్లు దొర.

1922 ఆగస్టు 22న చింతపల్లి పోలీస్ స్టేషన్‌పై సీతారామరాజు దాడి చేశారు. ఆ దాడుల్లో ఎప్పుడూ 100 మంది వరకు ఆయన వెంట సైన్యంగా ఆదివాసీ స్వాతంత్ర్య పోరాట వీరులు ఉండేవారు. ఇందులో ముఖ్యుడు మల్లుదొర. 1923 సెప్టెంబర్ 17న ఆయన నడింపాలెంలో ఉన్నాడన్న సమాచారంతో బ్రిటీష్‌వారు అతన్ని అరెస్టు చేశారు. విప్లవ వీరుల గురించి చెప్పాలంటూ ఎంత హింసించినా ఆయన చెప్పలేదు. మల్లుదొరపై వివిధ సెక్షన్ల కింది కేసు పెట్టి కోర్టులో ప్రవేశపెట్టగా, వాల్తేరు ఏజెన్సీ జడ్జి 1924 అక్టోబర్ 23న మల్లుదొరకు మరణశిక్ష విధించారు. అయితే అది అమలయ్యే లోపు మద్రాస్ హైకోర్టుకి అప్పీలు చేయడంతో మరణశిక్షను జీవితకాలపు శిక్షగా మార్చింది కోర్టు. ఆయనను అండమాన్ జైలుకు పంపించారు. మల్లుదొర అక్కడ 13 సంవత్సరాల 6 నెలలు దుర్భర జీవితం అనుభవించారు. విడుదలైన తర్వాత సొంత గ్రామంలో స్థిరపడ్డారు.

దేశానికి స్వాతంత్ర్యం వచ్చాక 1952లో జరిగిన పార్లమెంటు ఎన్నికల్లో విశాఖపట్నం పార్లమెంట్ రిజర్వుడు స్థానం నుంచి స్వతంత్ర అభ్యర్థిగా పోటీచేసి పార్లమెంటులో అడుగుపెట్టారు. పోరాడి సాధించుకున్న స్వాతంత్ర్యాన్ని చూడడమే కాకుండా, రాజ్యమేలిన వాడిగా అదృష్టం పొందాడు మల్లుదొర. ఆయన తన తొలి ప్రసంగంలో అల్లూరి సీతారామరాజు నాయకత్వంలో జరిగిన స్వాతంత్ర్య పోరాటం గురించి చెప్పారు. ప్రసంగం ముగిసిన తర్వాత నాటి ప్రధాని నెహ్రూ సహా సభ్యులందరూ లేచి చప్పట్లు కొడుతూ ఆయనను అభినందించారు. అలాగే అప్పటి రాష్ట్రపతి డాక్టర్ రాజేంద్రప్రసాద్ మల్లుదొరతో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. తన పదవీ కాలం పూర్తి అయిన తర్వాత స్వగ్రామంలో నివాసం ఉంటూ తీవ్ర ఆర్థిక ఇబ్బందుల్లో జీవనం సాగించారు. అప్పటి ముఖ్యమంత్రి కాసు బ్రహ్మానందరెడ్డి కొంత ఆర్థిక సాయం కూడా చేశారు. తీవ్ర అనారోగ్య సమస్యలతో 1969 జూలై 21న మల్లుదొర తుదిశ్వాస విడిచారు.

– ఎన్. సీతారామయ్య

(జూలై 21: మల్లుదొర వర్ధంతి)

ఈ 'సర్'తో ఏ ప్రజాస్వామ్య వెల్గులకు?

ఆర్థిక సంస్కరణల ప్రథమ దశ అంటే 1991–96 సంవత్సరాల మధ్య మన రాజ్యాంగ వ్యవస్థలలో అత్యుత్తమ, అత్యంత ప్రభావశీల సంస్థ ఏది? అనే విషయమై దేశవ్యాప్తంగా సర్వే నిర్వహించి ఉంటే ప్రజలు భారత ఎన్నికల సంఘం (ఈసీఐ) వైపే మొగ్గు చూపి ఉండేవారు. రాజ్యాంగ న్యాయస్థానాల కంటే ఈసీఐకే అత్యధికులు ప్రథమ గణ్యత నిచ్చేవారనడంలో సందేహం లేదు. ఈసీఐకు అటువంటి గౌరవం దక్కడానికి ప్రధాన కారకుడు ఎన్నికల సంఘం ప్రధానాధికారి (సీఈసీ) టి.ఎన్. శేషన్. ఆయన హయాంలో ఈసీఐ స్వతంత్రత, న్యాయవర్తన, నిష్పాక్షికతతో తన విధ్యుక్త ధర్మాన్ని నిర్వహించిందని ప్రతి ఒక్కరూ గుర్తించారు, గౌరవించారు. శేషన్ అనంతరం సీఈసీలుగా బాధ్యతలు నిర్వర్తించిన ఎమ్ఎస్ గిల్, జేఎమ్ లింగ్డో, టిఎస్ కృష్ణమూర్తి, నవీన్ చావ్లా, ఎస్‌వై ఖురేషీలు ఈసీఐ స్వతంత్రత, న్యాయవర్తన, నిష్పాక్షికతను దృఢంగా కాపాడారు. ఇతర సీఈసీలు నిర్వాచన్ సదన్ (భారత ఎన్నికల సంఘం ప్రధాన కార్యాలయం)కు ఎలా వచ్చారో అలా వెళ్లిపోయారు. అధికారంలో ఉన్న ప్రభుత్వానికి కొన్నిసార్లు లొంగిపోయేవారు, మరికొన్నిసార్లు లొంగిపోలేదన్న విధంగా కనిపించేవారు. గత పన్నెండు సంవత్సరాలుగా సీఈసీలుగా నియమితులైన వారి విధి నిర్వహణ తీరుతెన్నులను రాజ్యాంగ దర్పణంలో చూస్తే వారు భారత ప్రజాస్వామ్యానికి ఉపద్రవాలే అని నిర్మోహమాటంగా చెప్పక తప్పదు.



■ పి. చిదంబరం

'పళని' పలుకు

ఈసీఐ స్వతంత్ర ప్రతిపత్తి ఉన్న సంస్థ. స్వతంత్ర భారత తొలి సంవత్సరాలలో ఎన్నికల నిర్వహణను ఒక గొప్ప సవాల్‌గా పరిగణించలేదు. స్థానిక పెత్తందారులు ఓటు ఎవరికి వేయాలో నిర్దేశిస్తే అత్యధికులు వారికే ఓటు వేసేవారు. కొన్ని సామాజికవర్గాల వారిని ఓటు వేయకుండా అడ్డుకునేవారు. ఓటుహక్కును వినియోగించుకోలేనివారు పేదలు, ఎటువంటి పలుకుబడి లేని వారు. ఫిర్యాదు ఎలా చేయాలో కూడా తెలియనివారు. ఈ కారణంగా కాంగ్రెస్‌కు ఎలాంటి రాజకీయ సవాళ్లు ఎదురయ్యేవి కావు. 1967 తరువాత ఎన్నికలు కాంగ్రెస్‌తో సహా అన్ని పార్టీలకు సవాల్‌గా పరిణమించాయి. 1965–2014 సంవత్సరాల మధ్య అధికారంలో ఉన్న ప్రభుత్వాలు ఈసీఐ విధుల నిర్వహణలో జోక్యం చేసుకునేవి కావు. ప్రభుత్వం తమ బాధ్యతల నిర్వహణలో జోక్యం చేసుకుంటోందని ఏ ఈసీఐ అయినా ఆరోపించినట్టు నాకు జ్ఞాపకం లేదు. కొన్ని రాష్ట్రాల ఎన్నికలలో అధికార పార్టీకి అనుకూలంగా రిగ్గింగ్ జరిగినట్టు ఆరోపణలు వచ్చాయి. అయితే ఆ ఆరోపణలు కేంద్రంలోని పాలక పక్షానికి వ్యతిరేకంగా కాకుండా ఈసీఐ అసమర్థతకు వ్యతిరేకంగా చేసినవే అన్నది గమనార్హం.

2014 లోక్‌సభ ఎన్నికలు స్వేచ్ఛాయుతంగా, నిష్పాక్షికంగా జరిగాయి. ఆ తరువాత లోక్‌సభ లేదా రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల నిర్వహణ అసమర్థంగా ఉందని, రిగ్గింగ్ విస్తృతంగా జరిగిందని మొదలైన ఆరోపణలు తీవ్రంగా వచ్చాయి. 2014 నుంచి ఈసీఐ పలు సవాళ్లను, ఒత్తిళ్లను ఎదుర్కోవలసివచ్చింది. ఈ రాజ్యాంగ సంస్థకు సుదీర్ఘకాలంగా ఉన్న పేరు ప్రతిష్ఠలు బాగా క్షీణించాయని చెప్పక తప్పదు.

నవంబర్ 2024లో మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికలు జరిగాయి. ఓటర్ల జాబితాలు వివాదాస్పదమయ్యాయి. ఈసీఐపై ఇవీ ఆరోపణలు: (1) ఓటర్ల జాబితాలో అసాధారణంగా చాలా పెద్ద సంఖ్యలో కొత్త, బహుశా బూటకపు ఓటర్ల పేర్లను అదనంగా చేర్చారు; (2) పోలింగ్ గడువు ముగిసిన తరువాత కూడా ఓటు వేసేందుకు వేలాది ఓటర్లను అనుమతించారు; ఈ రెండు ఆరోపణలను తిరస్కరిస్తూ తన నిర్ణయాలను ఈసీఐ సమర్థించుకున్నది. ఏది సత్యం, ఏదసత్యమనేది ఇంకా తేలవలసివున్నది.

బిహార్‌లో త్వరలో ఎన్నికలు జరగనున్నాయి. వచ్చే ఏడాది మరికొన్ని రాష్ట్రాలలో ఎన్నికలు జరగనున్నాయి. బిహార్ ఎన్నికలు నాలుగు నెలల్లో జరగవలసివుండగా ఈసీఐ ఆ రాష్ట్రంలో ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (సర్)ను చేపట్టింది. ఇది అసాధారణం, ఇంతకు ముందెన్నడూ జరగనిది. సాధారణంగా ఏటా జనవరి 1న ఓటర్ల జాబితాలను సవరించడం జరుగుతుంది. ఎన్నికల సందర్భంగా వాటిని నవీకరిస్తారు. నవీకరించిన జాబితాలలో కొత్త ఓటర్ల పేర్లను చేర్చుతారు. చనిపోయినవారి ఓటర్ల పేర్లను, శాశ్వతంగా వలసపోయిన ఓటర్ల పేర్లను ఆ జాబితాల నుంచి తొలగిస్తారు. కొత్త ఓటర్ల పేర్ల చేర్పు, చనిపోయిన, వలసపోయిన ఓటర్ల పేర్ల తొలగింపు రాజకీయ పార్టీలకు కూడా పూర్తిగా తెలిపి వాటికీ ప్రమేయం కల్పిస్తారు. కొత్తగా చేర్చే పేర్లకు సంబంధించి సంబంధిత ఓటరు వివరాలను చాలా జాగ్రత్తగా పరీక్షిస్తారు. అలాగే తొలగించే పేర్లకు సంబంధించి కూడా సంబంధిత ఓటరును సంప్రదించిన తరువాతనే తొలగిస్తారు.

ప్రత్యేక సమగ్ర సవరణ భిన్నమైనది. అది ప్రస్తుత ఓటర్ల జాబితాను పూర్తిగా రద్దు చేస్తుంది. సర్‌కు 2003 నాటి ఓటర్ల జాబితా ఆధారంగా ఉన్నదని చెబుతున్నప్పటికీ ఇది పూర్తిగా కొత్తది. మొదటి నుంచీ తిరిగి రూపొందిస్తున్న జాబితా ఇది. ప్రతి నియోజకవర్గానికి ఓటర్ల జాబితాను సరికొత్తగా రూపొందిస్తున్నారు.

ప్రస్తుత ఓటర్ల జాబితాలో తమ పేరు ఉండేలా చూసుకోవల్సిన బాధ్యతను పూర్తిగా ఓటర్‌పైనే మోపారు. ఓటు హక్కు ఉన్నవారే (వీరిలో అత్యధికులు ఇంతకు ముందు జరిగిన ఎన్నికలలో ఓటు వేసినవారే) అయినప్పటికీ సర్‌లో తమ పేరు ఉండేలా చూసుకోవల్సిన బాధ్యత పూర్తిగా వారిదేనని ఈసీఐ స్పష్టం చేసింది.



> అర్హులైన పౌరులు ఓటరుగా తమ పేరు నమోదు చేయించుకుని ఓటు వేసేందుకు 'సర్' తోడ్పడదు గాక తోడ్పడదు. లక్షలాది పేద ప్రజలు, వనరులు, అవకాశాలులేని అణగారిన వ్యక్తులు, వలసజీవుల ఓటుహక్కు రద్దు లక్ష్యంగా ఉన్న రహస్య పథకమే ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ.

తమ పౌరసత్వాన్ని నిరూపించే డాక్యుమెంట్లతో సహా ఓటర్ల జాబితాలో నమోదయ్యేందుకు దరఖాస్తు చేసుకోవాలి.

ఓటర్‌గా నమోదయ్యేందుకు వెసులుబాటు కల్పించడం కాకుండా... నమోదయ్యేందుకు, ఓటు వేసేందుకు అధిగమించలేని అవరోధాలు కల్పించడమే సర్ లక్ష్యంగా ఉన్నట్టు కనిపిస్తోంది. పౌరసత్వాన్ని నిరూపించుకునేందుకు రుజువులుగా 11 డాక్యుమెంట్లను ఈసీఐ నిర్దేశించింది. వాటిలో నాలుగు పుట్టిన ప్రదేశానికి సంబంధించిన ఎలాంటి సమాచారాన్ని ఇచ్చేవి కావు. మరో రెండిటిని బిహార్‌లో ఏ వ్యక్తికీ జారీ చేయనేలేదు. పోతే రుజువులుగా చూపించగలిగేవి (రెవెన్యూ అధికారులు జారీ చేసిన కుల ధ్రువీకరణ పత్రంతో సహా) ఐదు మాత్రమే. పాస్‌పోర్ట్, బర్త్ సర్టిఫికెట్, ప్రభుత్వ ఉద్యోగి ఐడి వంటివి బిహార్ జనాభాలో కేవలం 2.4 నుంచి 5 శాతం మందికి మాత్రమే ఉన్నాయి. ఈసీఐ నిర్దేశించిన డాక్యుమెంట్ల జాబితాలో ఆధార్, ఓటర్ గుర్తింపు కార్డు, రేషన్ కార్డు లేనే లేవు. ఈ డాక్యుమెంట్లను ఎందుకు మినహాయించారని సుప్రీంకోర్టు ప్రశ్నించినప్పుడు ఈసీఐ సమాధానం చెప్పలేకపోయింది. చిత్రమేమిటంటే నివాసం, కులానికి సంబంధించిన ధ్రువీకరణ పత్రాలను ఆధార్ కార్డు ప్రాతిపదికనే రెవెన్యూ అధికారులు జారీ చేస్తారు. సర్‌కు నివాస, కుల ధ్రువీకరణపత్రాలు అంగీకారయోగ్యమైనవి కాగా, ఆధార్ ఆమోదయోగ్యం కాలేదు!

సర్‌లో ఏకైక హేతుబద్ధ అంశం చనిపోయిన వ్యక్తుల పేర్లను, రెండుసార్లు నమోదు చేసిన పేర్లను విధిగా తొలగించివేయడం. బిహార్ నుంచి 17.5 లక్షల మంది ఓటర్లు వలసపోయారని ఈసీఐ అంచనా వేసింది. అయితే వారు ఇంకెంత మాత్రం బిహార్ నివాసులు కాదని, ఓటు వేయడానికి స్వరాష్ట్రానికి రారని భావించనవసరం లేదు. బిహార్ వెలుపల ఉన్న బిహారీ ఓటర్ల సౌకర్యార్థం రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి జూలై 15న ఓటరుగా నమోదయ్యేందుకు వివరాలు నింపవలసిన దరఖాస్తు పత్రాన్ని అప్‌లోడ్ చేశారు. ఆ ఓటర్ల నమోదు ప్రక్రియను జూలై 26 లోగా పూర్తి చేసేందుకు ఆయన సంకల్పించారు! దీన్నెలా అర్థం చేసుకోవాలి? సర్ ప్రక్రియ అర్హులైన పౌరులు ఓటరుగా తమ పేరు నమోదు చేయించుకుని ఓటు వేసేందుకు తోడ్పడదు గాక తోడ్పడదు అనే నిర్ధారణకు రావడాన్ని అనివార్యం చేస్తోంది. లక్షలాది పేద ప్రజలు, వనరులు, అవకాశాలు లేని అణగారిన వ్యక్తులు, వలసజీవుల ఓటుహక్కు రద్దు లక్ష్యంగా ఉన్న రహస్య పథకమే ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ. జూలై 28న దేశ సర్వోన్నత న్యాయస్థానం 'సర్'పై ఎటువంటి తీర్పు వెలువరించనున్నదో వేచిచూద్దాం.

(వ్యాసకర్త కేంద్ర మాజీ మంత్రి, కాంగ్రెస్ సీనియర్ నాయకులు)

ఇ–గ్రంథాలయాల ఏర్పాటు అవసరం

మన దేశంలో 54,854 గ్రంథాలయాలు ఉన్నాయి. వాటిలో ఒక్కో గ్రంథాలయంలో పుస్తకాల సంఖ్య సగటున 5,700. అభివృద్ధి చెందిన దేశాల్లోని గ్రంథాలయాల్లో దాదాపు లక్షా 8 వేల పుస్తకాలు ఉన్నాయి! 2018 యునెస్కో 'ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ స్టాటిస్టిక్స్' రిపోర్ట్ ప్రకారం.. మనదేశంలో కేవలం పన్నెండు శాతం లైబ్రరీల్లో మాత్రమే కంప్యూటర్లు ఉన్నాయి. వాటిలోనూ కొన్నింటికి మాత్రమే ఇంటర్‌నెట్ సౌకర్యం ఉంది! దేశంలో గ్రంథాలయ వ్యవస్థలో దాదాపు 12 లక్షల మంది పని చేస్తున్నారు. కానీ వీరిలో వృత్తిపరమైన అర్హతలు ఉన్నవారు కేవలం పదిశాతం మందే.

నేటి తరం పిల్లల్లో పఠనాసక్తిని పెంచడానికి నేషనల్ బుక్ ట్రస్ట్ సాయంతో కేంద్ర సాంస్కృతిక మంత్రిత్వ శాఖ ఇటీవల 'ఇ–పుస్తకాలయం'ను ప్రారంభించింది. దీనిలో వెయ్యి ఇ–పుస్తకాలను(పాఠ్యేతర) 22 భాషల్లో పొందుపరిచింది. ఇది మంచిదే. కానీ మనకు ఇంకా చాలా భాషలున్నాయి. ఆ భాషల పుస్తకాలనూ పొందుపరచాలి. మన దేశంలో పురాతన తాళపత్రాలను కంప్యూటరీకరించి, రేపటి తరాలకు అందించాల్సిన బాధ్యత ప్రభుత్వాలపై ఉంది. ప్రస్తుతం ఇ–బుక్స్ ఆడియోలు, గ్రాఫిక్ నవలలు, మల్టీ మీడియా, స్థానిక కథలు, మాండలికాలకు ప్రాధాన్యం పెరిగింది. ఈ విషయాన్ని ప్రభుత్వం గుర్తించి, గ్రంథాలయాల్లో వాటికి స్థానం కల్పించాలి. గ్రంథాలయాలకు ఉచిత వైఫై సదుపాయాన్ని కల్పించాలి. డార్జిలింగ్‌కు చెందిన సామాజిక సేవకురాలు 'ఆక్వి తామి' మహిళల్లో విద్యావ్యాప్తి కోసం మహారాష్ట్రలో మహిళా గ్రంథాలయాలను ఏర్పాటు చేశారు. తెలంగాణలోని గ్రామీణ ప్రాంతాల్లో గ్రంథాలయాల స్థాపనకు 2015లో 'తోపుడు బండి' సాదిక్ కూడా అలాంటి సాహసోపేత ప్రయత్నమే చేశారు. ఉభయ తెలుగు రాష్ట్రాలు గ్రంథాలయాలపై దృష్టి పెట్టాలి. వాటికి పూర్వ వైభవం తేవాలి.

– వి. వరదరాజు

మాతృభాషలో బోధనతోనే సరైన అవగాహన!

ప్రపంచంలోనే దాదాపు సగం దేశాలలో తెలుగువారు తమ సత్తా చూపుతూ తెలుగు బావుటాని ఎగురవేస్తున్నారు. కానీ దేశంలో అక్షరాస్యతలో, భాష తదితర విషయాల పట్ల అవగాహనలో అట్టడుగు స్థాయిలో ఉన్నారు. నేడు ఉన్నత స్థానాల్లో ఉన్న చాలా మంది ఉన్నత పాఠశాల స్థాయి వరకు తెలుగు మాధ్యమంలో చదివినవారే. 5 నుంచి 10 శాతం మంది ఆంగ్ల మాధ్యమంలో చదివినా, వారి తల్లిదండ్రులు విద్యావంతులైనందున వారి సహకారంతో మాతృభాషపై పట్టు సాధించినవారే. వీరు ఇతర భాషలు, విషయాలపై కూడా పట్టు సాధించి ఉన్నత స్థానానికి ఎదిగారని మరచిపోకూడదు. ఇటీవల కేంద్ర ప్రభుత్వ అజమాయిషీలోని సీబీఎస్‌ఈ వారు రెండవ తరగతి వరకు తప్పనిసరిగా తమ పాఠశాలల్లో మాతృభాషలోనే విద్యాబోధన ఉండాలని ఉత్తర్వులు జారీ చేశారు.

ఇటీవల కాలంలో మన రాష్ట్ర విద్యా విధానం క్రమంగా కేంద్ర ప్రభుత్వ నూతన విద్యా విధానం పద్ధతిలోకే వెడుతోంది. కాబట్టి మన రాష్ట్రంలో రెండవ తరగతి వరకు తప్పనిసరిగా మాతృభాషలోనే విద్యాబోధన అమలుపరచాలి. మూడో తరగతి నుంచి సరళమైన పద్ధతిలో ఆంగ్ల భాషను ప్రవేశపెట్టవచ్చు. దీనివల్ల ఐదవ తరగతి పూర్తయ్యే సమయానికి తెలుగు భాషపై ఓ మాత్రం పట్టు లభిస్తుంది. ఇంగ్లీషు భాష కూడా పరిచయం అవుతుంది. నిత్య జీవితావసరమైన గణితంలోని చతుర్విధ ప్రక్రియలు తెలుగు పుస్తకంలోనే పొందుపరచవచ్చు. ప్రచురణ, ముద్రణ మాఫియాలకు లొంగకుండా అనవసరమైన పుస్తకాల బరువును తగ్గిస్తూ, రెండవ తరగతి వరకు కేవలం తెలుగువాచకం మాత్రమే ఉండాలి. మూడవ తరగతి నుంచి తెలుగువాచకంతో పాటు సరళమైన ఆంగ్లవాచకం ప్రవేశపెట్టవచ్చు. అంటే ప్రాథమిక స్థాయిలో భాష పట్ల, నిత్యజీవితావసరమైన గణితం కూడా మాతృభాషలో ఉన్నందున పట్టు లభిస్తుంది. ఆంగ్లాన్ని కూడా ప్రవేశపెట్టడం వల్ల జనబాహుళ్యం కోరికను మన్నించినట్లవుతుంది.

ఆరవ తరగతి నుంచి ఒకేసారి అన్ని సబ్జెక్టులు ఆంగ్ల మాధ్యమంలో కాకుండా గణితం, విజ్ఞాన శాస్త్రం ఆంగ్ల మాధ్యమంలోనూ, సాంఘికశాస్త్రం తెలుగు మాధ్యమంలో కొనసాగించవచ్చు. దాని వల్ల ఒకేసారి మొత్తం ఆంగ్ల మాధ్యమం అయిపోయి, కష్టమైందన్న భావన లేకుండా అన్ని విషయాల పట్ల అవగాహనకు వీలవుతుంది. తొమ్మిదవ తరగతి నుంచి సాంఘికశాస్త్రం కూడా ఆంగ్ల మాధ్యమంలో కొనసాగించవచ్చు. అప్పుడు తెలుగు మాధ్యమం, ఆంగ్ల మాధ్యమం అనే తేడా ఉండదు. కామన్ మీడియం లేదా మిక్స్‌డ్ మీడియంగా వ్యవహరించవచ్చు. ఫలితంగా విద్యార్థికి తెలుగు భాషపై పట్టు లభిస్తుంది.

కేంద్ర ప్రభుత్వ పరీక్షల విభాగమైన యూపీఎస్సీ అంచనాల మేరకు వారు నిర్వహించే సివిల్ సర్వీసెస్ పరీక్షలలో దాదాపుగా 10 శాతం స్థానిక భాషల పరీక్షలలో సాధించవలసిన కనీస అర్హత 25 శాతం మార్కులు కూడా సాధించలేకపోతున్నారని తెలుస్తోంది. ఇలా ఉత్తీర్ణులు కాని వారిలో చాలా మంది తెలుగువారే. అందుకు కారణం మార్కుల యావతో మొదటి నుంచి కూడా తెలుగుకు బదులు ఇతర భాషలు ఎంపిక చేసుకోవడమే. కానీ ఆ భాషలలో వారికున్న పరిజ్ఞానం పోటీ పరీక్షలకు సరిపడేంతగా లేదు. యూపీఎస్సీ నిర్వహించే పరీక్షలలో ఇతర సబ్జెక్టులలో మంచి మార్కులు సాధించినా, తెలుగులో కనీస అర్హత మార్కులు సాధించకపోవడం వల్ల కేంద్ర ప్రభుత్వ ఉద్యోగాలలో తెలుగువారి సంఖ్య భవిష్యత్తులో తగ్గిపోనున్నది. దీనికి పరిష్కారంగా ఇంటర్మీడియట్ వరకు తెలుగును తప్పనిసరి చేయాలి.

– యనమండల ఆనందం, ఏలూరు

మతరాజ్య భావన ఒక మానసిక దౌర్బల్యం!

'భావజాల మార్పుతోనే హిందూరాజ్య స్థాపన' శీర్షికతో జూలై 11న దోర్బల బాలశేఖరశర్మ రాసిన అంశాలు దేశంలో విద్వేష ప్రచారానికి జనాలు ఎంతగా లోనైందీ వెల్లడిస్తున్నాయి. గత చరిత్రను చూసినపుడు భారత ఉపఖండంలో వివిధ మతాలను అవలంబించిన రాజులు ఉన్నారు తప్ప మత రాజ్యాలు ఉన్నట్లు చరిత్ర లేదు. కొన్ని దేశాల్లో ఉన్న ఇస్లామిక్, క్రైస్తవ, బౌద్ధ మతాలను అధికారికంగా ప్రకటించటాన్ని చూసి భారత్‌లో హిందూ రాజ్య స్థాపన చేయాలని కొందరు విదేశీ భావజాలాన్ని కాపీకొట్టి (ఆర్ఎస్ఎస్ వారు వేసుకొన్న నిక్కర్లు, ఇప్పటి పాంట్లు కూడా విదేశీ కాపీ తప్ప మన వస్త్రధారణ కాదు), గోబెల్స్‌ను ఆదర్శంగా తీసుకొని ప్రచారం చేస్తున్నారు. ఒక అబద్ధాన్ని వందసార్లు చెబితే 101వ సారి నిజంగా మారుతుందట. హిందూ, ముస్లిం, క్రైస్తవం, సిక్కు ఎవరైనా తమ మత రాజ్యాన్ని ఏర్పాటు చేయాలని కోరుతున్నారంటే దురహంకారవాదపు ప్రతికూల ప్రభావంతో తలెత్తే ఒక మానసిక దౌర్బల్యానికి చిహ్నం తప్ప మరొకటి కాదు. అది మతానికే పరిమితం కాదు, చివరకు కులాల రాజ్యాలు ఏర్పాటు జరగాలన్న దిగజారుడుకూ దారితీస్తుంది.

సోషలిజం అన్నది భారతీయ ఆర్థిక ఆలోచన కాదని అసోం సీఎం హిమంత బిశ్వశర్మ వాదించినట్లు రచయిత పేర్కొన్నారు. ఇదొక అర్థం లేని వాదన. ఒక్కో దేశానికి ఒక్కో ఆర్థిక ఆలోచన ఉండదు. ప్రపంచమంతా ఒక కుగ్రామం అని చెబుతున్న రోజుల్లో ఇలాంటి కబుర్లు చెప్పటం జనాలను మభ్యపెట్టే అతి తెలివి తప్ప మరొకటి కాదు. పొలంలో పని చేసేవాడు ఎక్కడైనా వ్యవసాయ కార్మికుడే, అలాగే అమెరికాలో అయినా అనకాపల్లిలో అయినా ఫ్యాక్టరీ పనివాడు పారిశ్రామిక కార్మికుడే. పెట్టుబడి, లాభాలు తప్ప మరొక గీటురాయి ఉండదు. సోషలిజం కూడా అలాంటిదే. భారతదేశం ఎల్లపుడూ సర్వోదయ, అంత్యోదయ సూత్రాలను అవలంబించిందని కూడా అసోం సీఎం చెప్పారట. సర్వేజనా సుఖినో భవంతు అని సోషలిస్టు భావన కంటే ముందే చెప్పారు. అయినా దానిలో అందరికీ మంచి జరిగితే అంత్యోదయ, అత్యల్ప వర్గాలు ఎందుకున్నట్లు! బ్రిటిష్ వారి హయాంలో కూడా లేని ఆర్థిక అంతరాలు ఎందుకు పెరుగుతున్నట్లు!

లౌకికవాదం దారి తప్పిందట, దాని వలన హిందూ ధర్మానికీ, సమాజానికీ హాని కలుగుతున్నందున దేశాన్ని పూర్తి స్థాయి హైందవ దేశంగా పునరుద్ధరించటం గురించి ఆలోచించాలట. లౌకికవాదం దారితప్పితే గాడిలో పెట్టమని అడగాల్సింది పోయి మతరాజ్యాన్ని ఏర్పాటు చేయాలనటం ఏమిటి? అది కూడా పునరుద్ధరించాలనటం హిమాలయమంత అవాస్తవాన్ని మెదళ్లలోకి ఎక్కించే యత్నం తప్ప మరొకటి కాదు.

"భారతదేశంలోకి స్థానభ్రంశం చెందిన ముస్లిం జనాభాకు వక్ఫ్ బోర్డును ప్రసాదించారు. ప్రతిగా స్థానభ్రంశం చెందిన హిందువులకు మాత్రం రిక్తహస్తం చూపించారు. పాకిస్థాన్‌లో ప్రతిదీ వదులుకున్న హిందువులకు శూన్యమే మిగిలింది" అని వ్యాసకర్త అనటానికి ఆధారాలు ఏమిటన్నది ప్రశ్న. రాష్ట్రాల వారీగా దేవాదాయ, ధర్మాదాయ సంస్థలకు ఎన్ని భూములు ఉన్నాయో, ఎన్ని ఆస్తులు ఉన్నాయో ఎవరైనా చెబుతున్నారా? వక్ఫ్‌బోర్డుకు భారత్‌లో దానం చేసిన ఆస్తుల నిర్వహణ బాధ్యత ఇచ్చారు తప్ప అదనంగా ఇచ్చిందేమీ లేదు. ప్రభుత్వం వెల్లడించిన సమాచారం ప్రకారం దేశంలో 8.7లక్షల ఆస్తులు 9.4లక్షల ఎకరాల భూములు ఉన్నాయి, వాటి విలువ రూ.1.2లక్షల కోట్లు. దాన్ని ఒక సంస్థగా చూసి భారతీయ రైల్వేలు, మిలిటరీ తరువాత పెద్దది అని చెబుతున్నారు. దేశంలో దేవాదాయ ధర్మాదాయ ఆస్తుల మొత్తం విలువ ఎంత ఉందో కేంద్ర ప్రభుత్వం క్రోడీకరించి చెప్పిందా? దాని దగ్గర ఉండవచ్చు గానీ ఎక్కడా బయటికి వెల్లడించలేదు. కేంద్ర ప్రభుత్వ ఎన్ఎస్ఎస్ఓ సేకరించిన సమాచారం ప్రకారం ఈ ఆస్తుల విలువ రూ.3.02లక్షల కోట్లు. మన దేశం నుంచి వెళ్లిపోయినవారి ఇక్కడి ఆస్తులను పాకిస్థాన్ వెళ్లినవారికి ఇవ్వలేదు కదా! ఉదాహరణకు హైదరాబాద్ నుంచి పాక్ వెళ్లిన వారి ఇండ్లు, పొలాలను అనేక మంది తరువాత ఆక్రమించి అన్యాక్రాంతం చేసుకున్నారు. వారిలో ముస్లింలు, హిందువులు అందరూ ఉన్నారు. ఇప్పటికీ ఆ వివాదాలు నడుస్తూనే ఉన్నాయి.



> లౌకికవాదం దారి తప్పిందట, దాని వలన హిందూ ధర్మానికీ, సమాజానికీ హాని కలుగుతున్నందున దేశాన్ని పూర్తి స్థాయి హైందవ దేశంగా పునరుద్ధరించటం గురించి ఆలోచించాలట. లౌకికవాదం దారి తప్పితే గాడిలో పెట్టమని అడగాల్సింది పోయి మతరాజ్యాన్ని ఏర్పాటు చేయాలనటం ఏమిటి?


ఇన్ని దశాబ్దాల అనంతరం కూడా భారతదేశంలో హిందువుల పరిస్థితి మెరుగుపడలేదట. ఇది ఒక మానసిక దాడి, గాలి పోగేయటం తప్ప మరొకటి కాదు. పాకిస్థాన్‌లో ముస్లింలు ఎలా బాగుపడ్డారో రచయిత చెప్పి ఉంటే అర్థం ఉండేది. ఒకవైపు "మతరాజ్యంగా మారిన పాకిస్థాన్ దుస్థితి ఎలా ఉందో చూడండి, మన దేశం ఎలా ముందుకు పోయిందో చూడండి" అంటూ కాషాయదళాలు ప్రచారం చేయటం చూస్తున్నాం. మనదేశాన్ని కూడా మతరాజ్యంగా మార్చటం అంటే మరో పాకిస్థాన్‌గా మార్చాలనేనా?

అసలు హిందూరాజ్యం అంటే ఏమిటో, దాని రూపురేఖలు ఎలా ఉంటాయో ఎవరైనా చెప్పగలరా? సామాన్యులకు పట్టింపు లేదు గానీ అసలు సిసలు నిలువుబొట్లకు ప్రాతినిధ్యం వహిస్తున్నామని చెప్పుకొనేవారు అడ్డబొట్ల ఆలయాల గడప తొక్కరన్న పచ్చి నిజం ఎంత మందికి తెలుసు? అలాంటప్పుడు ఎవరి భావనలకు అనుగుణంగా మతరాజ్యాన్ని ఏర్పాటు చేస్తారు? దాన్ని రెండవవారు అంగీకరిస్తారా? అలాంటి రాజ్యంలో ఇతర మతాలవారి పరిస్థితి ఎలా ఉంటుంది.

హిందువులు మెజారిటీగా ఉన్నప్పటికీ దురవస్థలో ఉన్నారని పదే పదే చెప్పటం గోబెల్స్ ప్రచారం, అందరూ అదే స్థితిలో ఉన్నారు. అన్ని మానవాభివృద్ధి సూచికల్లోను మనం ప్రపంచంలో ఎంత దిగువ స్థానాల్లో ఉన్నామో తెలిసిందే. దేశంలో హిందూ ద్వేష భావం ఉందని చెప్పటం ఒక మైండ్ గేమ్. జనాన్ని తప్పు దారి పట్టించే ఎత్తుగడ. మెజారిటీ వాదం చాలా ప్రమాదకరమైనదని ప్రపంచ అనుభవం చెబుతున్నది. అందువలన మార్చాల్సింది ఈ వాదాన్ని. దీన్ని ఇలాగే కొనసాగనిస్తే దేశ యువత పురోగమనంవైపు గాకుండా తిరోగమనంవైపు తిరిగితే దేశం మరింత అధోగతిలోకి దిగజారుతుంది.

సామాన్య భారతీయులకు మతం ఉంది గానీ విద్వేషం లేదు. ఉంటే 2024 ఎన్నికల్లో హిందూత్వకు ప్రమాదం ముంచుకువచ్చిందని చెప్పినా 34శాతం మంది అసలు ఓటింగ్‌కే రాలేదు. బీజేపీకి గత ఎన్నికల కంటే 0.8శాతం తగ్గి వచ్చిన ఓట్లు 36.56శాతం; ఇవి కూడా తెలుగుదేశం, జనసేన పార్టీలు వేయించిన ఓట్లు కూడా కలిస్తే. చివరిగా ఒక్క మాట రచయిత హిందూ ద్వేష భావజాలాన్ని నిర్మూలించాలన్నారు. దీనిలో కూడా సంకుచితమేనా! సర్వేజనా సుఖినో భవంతు అనే వారికి మత ద్వేషం అనటానికి నోరు రాలేదు. ఒక భావజాలం అది మతవిద్వేషమైనా, మరొకటైనా నిర్మూలించటానికి అదేమైనా వస్తువు, ప్రాణి కాదే! చరిత్రలో చార్వాకులను చంపేశారు, వారి గ్రంథాలను తగులబెట్టారు తప్ప వారి భావజాలాన్ని నిర్మూలించగలిగారా! జనం ఆదరించకపోతే ఏదైనా వెనక్కు పోతుంది, ఆదరిస్తే మనదేశంలో కవలపిల్లల మాదిరి మెజారిటీ, మైనారిటీ మతవిద్వేషం రెచ్చిపోతుంది!

■ ఎం. కోటేశ్వరరావు





వినూత్న ఆలోచనలతో రండి

- పరిశోధనలు, పరిశ్రమలకు ఏపీలో విస్తృత అవకాశాలు
- భవిష్యత్తు అంతా గ్రీన్ హైడ్రోజన్ ప్రాజెక్టులదే
- జీరో కాలుష్యమే ప్రభుత్వ ధ్యేయం
- పారిశ్రామిక వేత్తలు, కంపెనీల సీఈవో, ఎండీలతో సీఎం చంద్రబాబు ముఖాముఖి


ప్రాజెక్టులను పరిశీలిస్తున్న సీఎం చంద్రబాబు, కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్, తదితరులు

గుంటూరు(విద్య), జూలై 18(ఆంధ్రజ్యోతి): నీరు కొండలోని ఎస్ఆర్ఎం యూనివర్సిటీలో శుక్రవారం గ్రీన్ హైడ్రోజన్ సమ్మిట్-2025 సదస్సు జరిగింది. ఈ సదస్సుకు దేశంలోని వివిధ ప్రాంతాలకు చెందిన పారిశ్రామిక వేత్తలు, పరిశోధకులు, పలు కంపెనీల సీఈవోలు, ఎండీలు హాజరయ్యారు. సదస్సుకు ముఖ్య అతిథిగా విచ్చేసిన సీఎం చంద్రబాబు నాయుడు కంపెనీల ప్రతినిధులతో ముఖాముఖి మాట్లాడారు. ప్రస్తుతం సిమెంటు, ఉక్కు, ట్రాన్స్ పోర్టు తదితర పరిశ్రమలకు అవసరమైన విద్యుత్, ఇంధనం సరఫరాకు కాలుష్యం

ప్రోత్సాహకాలు అందిస్తాం

వెదజల్లే ఉద్గారాలను వినియోగించాల్సి వస్తోందని సీఎం అభిప్రాయపడ్డారు. దీని వల్ల కాలుష్యం పెరిగిపోయి.. పర్యావరణం కలుషితం కావడంతోపాటు అనేక సమస్యలు ఉత్పన్నమవుతున్నాయని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. ఈ సవాళ్లను అధిగమించేలా పరిశోధనలు చేసి పరిష్కారం అన్వేషించాలని వారికి సూచించారు.

భవిష్యత్తు అంతా గ్రీన్..

ముఖ్యంగా గ్రీన్ హైడ్రోజన్ పరిశోధనలకు, కంపెనీల ఏర్పాటుకు ఇక్కడ అనేక అవకాశాలు ఉన్నాయని సీఎం చంద్రబాబు వెల్లడించారు. జీరో కార్బన్ లక్ష్యాల సాధనకు గ్రీన్ హైడ్రోజన్ లాంటి ఇంధనమే సరైన పరిష్కారమని ఆయన (మిగతా 6వ పేజీలో)

'రానున్న రోజుల్లో గ్రీన్ హైడ్రోజన్ విస్తృతంగా వినియోగంలోకి రానుంది. ప్రాజెక్టులు ఏర్పాటు చేసేందుకు వినూత్న ఆలోచనలు, సాంకేతికతతో వచ్చే ఆవిష్కర్తలకు, పారిశ్రామికవేత్తలకు ప్రభుత్వం పెద్ద పీట వేస్తుంది, పరిశ్రమలకు, ప్రాజెక్టులకు అవసరమైన అన్ని రకాల ప్రోత్సాహకాలు అందిస్తాం'
- సీఎం, చంద్రబాబునాయుడు

నందివెలుగు ఆర్వోబీకి మోక్షం

నేడు పనులు పునః ప్రారంభం

- 2017లో మొదలు.. 2019 నుంచి గ్రహణం
- వైసీపీ ఐదేళ్ల పాలనలో పనులు నిలిపివేత
- ఎన్నికల సమయంలో కూటమి నేతల హామీ
- రూ.36.91 కోట్లు మంజూరు చేయించిన పెమ్మసాని

గుంటూరు, జూలై 18 (ఆంధ్రజ్యోతి): గుంటూరు నందివెలుగు ఆర్వోబీకి గత ఐదేళ్ల వైసీపీ పాలనలో పట్టిన గ్రహణం వీడింది. 2017లో టీడీపీ హయాంలో పనులు ప్రారంభించగా 2019 నుంచి పనులకు గ్రహణం పట్టింది. ఎన్నికల ప్రచారంలో ఈ బ్రిడ్జిని సందర్శించిన కూటమి నేతలు నిర్మాణానికి హామీ ఇచ్చారు. గుంటూరు నగరవాసులకు చెప్పినట్లుగానే కేంద్ర సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ ప్రత్యేకంగా చొరవ తీసుకుని కేంద్ర పెద్దలను ఒప్పించి రైల్వేశాఖ నుంచి రూ.36.91 కోట్లు మంజూరు చేయించారు. దీంతో శనివారం ఆర్వోబీ పనులను మేయర్ కోవెలమూడి రవీంద్ర, తూర్పు ఎమ్మెల్యే నసీర్‌తో కలిసి పెమ్మసాని పునఃప్రారంభించనున్నారు. ఆరు నెలల్లో బ్రిడ్జి నిర్మాణాన్ని పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకువస్తామని కేంద్ర మంత్రి, కూటమి నేతలు స్పష్టం చేస్తున్నారు. పాతగుంటూరు హనుమాన్ పాలెం రోడ్డులోని రైల్వే గేటుతో ట్రాఫిక్ ఇక్కట్లు తగ్గించేందుకు 850 మీటర్ల పొడవున ఆర్వోబీ నిర్మాణానికి 2014లో అప్పటి టీడీపీ ప్రభుత్వం ఆమోదం తెలిపింది. 2017లో మొదలైన ఈ ప్రాజెక్టును కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నిధులతో 2019 నాటికి పూర్తి చేసేలా అప్పట్లో ఒప్పందాలు జరిగాయి. రైల్వే శాఖ రూ.6.18 కోట్లు, అప్పటి టీడీపీ ప్రభుత్వం రూ.10.82 కోట్లతో పనులు జరిగాయి. అయితే 2019లో అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వ వాటా రూ.8 కోట్లను చెల్లించలేదు. దీంతో కేంద్రం పనులను ఆపేయడంతో బ్రిడ్జి నిర్మాణం మొండి గోడలకే పరిమితమైంది.


ఎన్నికల ప్రచార సమయంలో నందివెలుగు ఆర్వోబీ వద్ద పెమ్మసాని, నసీర్ (పాత చిత్రం)

గాంధీ జయంతికి.. స్వచ్ఛాంధ్ర బహుమతి!

గాంధీ జయంతికి 'స్వచ్ఛాంధ్ర'ను రాష్ట్ర ప్రభుత్వం బహుమతిగా ఇవ్వనుంది. మునిసిపాలిటీల కంపోస్టు యార్డుల్లో పేరుకుపోయిన చెత్త నిల్వలను పూర్తిగా తొలగించేందుకు లక్ష్యంగా పెట్టుకుంది. వ్యర్థాల నుంచి కూడా సంపద సృష్టించేలా ప్రణాళికాబద్ధంగా ముందు కెళ్తోంది. గుంటూరు, పల్నాడు, బాపట్ల జిల్లాల్లోని కార్పొరేషన్లు, మునిసిపాలిటీల్లో పరిశుభ్రతకు ప్రాధాన్యమిస్తూ.. రూ.30.35 కోట్ల నిధులు కేటాయించింది. స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ ద్వారా ఆహ్లాదకరమైన వాతావరణం నెలకొనేలా పనులు చేయిస్తోంది.

- కంపోస్టు యార్డుల్లో పేరుకుపోయిన చెత్తకు మోక్షం
- రూ.30.35 కోట్లతో చెత్త శుద్ధి పనులు
- అక్టోబరు 2వ తేదీ కల్లా తొలగింపు దిశగా చర్యలు
- స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ నుంచి నిధులు

(తెనాలి, ఆంధ్రజ్యోతి): మునిసిపాలిటీల కంపోస్టు యార్డుల్లో టన్నుల కొద్ది చెత్త నిల్వలు పేరుకుపోయాయి. వ్యర్థాలు కుళ్లి కంపుకొడుతున్నాయి. రోజూ సేకరించిన చెత్త అక్కడ వేసే పరిస్థితి లేదు. వైసీపీ ప్రభుత్వం హయాంలో యార్డుల్లో చెత్త తొలగింపు పనులు చేపట్టి, నిలిపివేశారు. అలాగే పెద్ద ఎత్తున నిధులు దుర్వినియోగం అయ్యాయి. చెత్త తొలగింపునకు లెక్కలు కూడా నాడు లేవు. కూటమి ప్రభుత్వం మునిసిపాలిటీల కంపోస్టు యార్డుల్లో పేరుకుపోయిన వ్యర్థాలను తొలగించేందుకు చర్యలు చేపట్టింది. స్వచ్ఛాంధ్ర (మిగతా 6వ పేజీలో)


నరసరావుపేట కంపోస్టు యార్డులో చెత్తశుద్ధి పనులు

మున్సిపాల్టీల వారీగా పేరుకుపోయిన వ్యర్థాలు

మునిసిపాల్టీ	తొలగించనున్న వ్యర్థాలు టన్నుల్లో
చిలకలూరిపేట	1,66,278
నరసరావుపేట	30,609
మాచర్ల	30,894
పిడుగురాళ్ల	10,793
వినుకొండ	11,195
దాచేపల్లి	6,194
గురజాల	1,675
గుంటూరు	43,811
పొన్నూరు	8,376
బాపట్ల	46,264
రేపల్లె	7,203



పెట్రోల్‌కు బదులు నీళ్లు కొట్టారు

- బంకు ముందు ఆందోళన..

ఓపెన్ స్కూల్ అడ్మిషన్లు ప్రారంభం

- ఈ నెల 30 తేదీ వరకు గడువు: డీఈఓ రేణుక

6



రక్తం అందిస్తేనే.. ప్రసవం

- ప్రతి ముగ్గురు గర్భిణుల్లో ఒకరికి రక్తహీనత
- పౌష్టికాహారం తీసుకోక బలహీనం

ఆనందం వెద జల్లుతున్నారు



8

ఇన్నర్ రింగ్‌రోడ్డు ఫేజ్-3కి.. టెండర్

- ఈ-ప్రొక్యూర్మెంట్ టెండర్లను ఆహ్వానిస్తూ ప్రకటన
- గుంటూరు అభివృద్ధిని మలుపుతిప్పే రహదారి : పెమ్మసాని



గుంటూరు, జూలై 18 (ఆంధ్రజ్యోతి): గుంటూరు ఇన్నర్ రింగ్ రోడ్ ఫేజ్-3 పనులు త్వరలో పట్టాలెక్క నున్నాయి. రూ.48 కోట్ల అంచనా వ్యయంతో జరగనున్న ఈ ప్రాజెక్టుకు సీఆర్డీఏ ఇటీవలే అనుమతులు జారీ చేసింది. ఈ క్రమంలో అధికారికంగా ఈ పనుల కోసం ఈ-ప్రొక్యూర్‌మెంట్ టెండర్ నోటిఫికేషన్ విడుదలైంది. శనివారం నుంచి ఆగస్టు 1వ తేదీ వరకు టెండర్ దాఖలు ప్రక్రియ కొనసాగనున్నది. జేకేసీ కళాశాల రోడ్డు(స్వర్ణభారతి నగర్) నుంచి పెదపలకలూరు రోడ్డు వరకు సుదీర్ఘ కాలంగా పెండింగ్‌లో ఉన్న రహదారి పనులు ప్రారంభం అవుతాయి. గతంలో ఎన్నోసార్లు ఈ ప్రాజెక్టు పురోగతి గురించి అధికారులతో కేంద్ర సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ సమీక్షించారు. ఈ క్రమంలో రూ.6.73 కోట్ల నష్ట పరిహారాన్ని ప్రజలకు చెల్లించేందుకు చొరవ తీసుకున్నారు. ఇన్నర్‌రింగ్‌రోడ్డు మూడో దశకు అధికారికంగా టెండర్ ప్రకటన విడుదలపై పెమ్మసాని హర్షం వ్యక్తం చేశారు. ఇన్నర్ రింగ్ రోడ్డు నిర్మాణం గుంటూరు అభివృద్ధిని మలుపుతిప్పే రహదారి అవుతుం దని ఓ ప్రకటనలో పెమ్మసాని తెలిపారు. ఈ ప్రక్రియకు తోడ్పడిన ప్రత్తిపాడు ఎమ్మెల్యే రామాంజనేయులుకి, మంత్రి నారాయణకి ఆయన కృతజ్ఞతలు తెలిపారు.


కొల్లిపరలో వర్షానికి జలమయమైన మెయిన్ రోడ్డు

జీవోకు తూట్లు.. లక్షల్లో వసూళ్లు

గ్రేడ్-3 ఏఎన్ఎంల బదిలీల్లో అక్రమాలు • వందమందికి సొంత మండలంలోనే పోస్టింగ్

గుంటూరు సిటీ, జూలై 18 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి గుంటూరు జిల్లాలో తాజాగా జరిగిన గ్రేడ్-3 ఏఎన్ఎం (యాక్జలరీ నర్స్ ఫర్ మిడ్ వైఫరీ)ల బదిలీల్లో భారీ అక్రమాలు జరిగాయి. వైద్య, ఆరోగ్య శాఖలో పని చేస్తు న్న ఏఎన్ఎంలు కోరుకున్న చోటకు బదిలీ అయ్యేం దు కు భారీగా ముట్టజెప్పినట్లు తెలుస్తుంది. అడిగినంత ఇచ్చిన వారి కోసం అధికారులు కూడా జీవో నిబం ధన లకు తిలోదకాలు ఇచ్చారు. అవినీతి వ్యవహారాలు ఆరో గ్య శాఖకు కొత్త కానప్పటికీ ఈసారి మోతదు మరీ పెరిగిపోవడంతో విషయం రచ్చకెక్కింది. జూన్ 12న వి డుదలైన జీవో 5 ప్రకారం ఐదేళ్లు దాటిన వారికి కచ్చి తంగా స్థానచలనం జరగాలి.. ఉద్యోగులను సొంత మం డలంలో ఉంచడానికి వీలులేదు. అయితే ఈ నిబం ధనను వైద్యఆరోగ్య శాఖలో పక్కన పెట్టేశారు. మొత్తం 977 మంది గ్రేడ్-3 ఏఎన్ఎంలకు కౌన్సెలింగ్ నిర్వహించగా వంద మందికిపైగా సొంత మండలాల్లోనే నియ మించారు. సొంత మండలం దాటితే ఇబ్బందని భా వించిన ఉద్యోగులు అక్కడే ఉండేందుకు రూ.లక్షల్లో ముడుపులు ఇచ్చేందుకు సిద్ధపడ్డారు. ఇది గుంటూరులోని వైద్య, ఆరోగ్య శాఖ అధికారులకు బాగా కలిసి వచ్చింది.

అటెండర్... సూపర్‌వైజర్ హవా..

గ్రేడ్-3 ఏఎన్ఎంల బదిలీలు గుంటూరు డీఎంహెచ్ కార్యాలయంలోని ఓ అటెండర్, ఓ సూపర్‌వైజర్ కనుసన్నల్లో జరిగిందన్న ఆరోపణలున్నాయి. ఎంతోకాలంగా అక్కడ తిష్ఠ వేసిన వీరు ముఖ్య అధికారికి, ఏఎన్ఎంలకు మధ్య రాయబేరాలు నడిపినట్లు సమాచారం. సొంత మండలంలో ఉంచడానికి ఒక్కొక్కరి వద్ద రూ.లక్ష నుంచి లక్షన్నర వరకు వసూలు చేశారని పలువురు ఆరోపిస్తున్నారు. నగదు ముట్టజెప్పిన వారికి లబ్ధి చేకూర్చేందుకు అధికారులు ఖాళీలను బ్లాక్ చేసినట్లు ఆరోపణలు ఉన్నాయి. ఈ క్రమంలోనే బదిలీల జాబితా ను పదే పదే మార్చినట్లు సమాచారం. పల్నాడు జిల్లా నరసరావుపేటలో జరిగిన నియామకాల్లోనూ అక్రమంగా జరిగాయని సమాచారం. ఈ అక్రమాలు వెలుగులోకి రావాలంటే విజిలెన్స్ విచారణ జరిపించాలని పలువురు కలెక్టర్‌కు విజ్ఞప్తి చేస్తున్నారు.

నిబంధనలకు విరుద్ధంగా..

- వేమూరు మండలం వర హాపురం ఏఎన్ఎంను అదే మండ లంలోని బలిజేపల్లికి, కుచ్చళ్ల పాడులోని ఏఎన్ఎంను వరహాపు రానికి, పెనుమర్రు ఏఎన్ఎంను జం పనికి మార్చారు.
- చుండూరు మండలం శ్రీ రంగపురం నుంచి ఏఎన్ఎంను అదే మండలంలోని వేటపాలేనికి, తొట్టెంపూడి ఏఎన్ఎంను మోదుకూరుకు, అంబేద్కర్‌నగర్ ఏ ఎన్ ఎంను పెనుగుదురుపాడుకి మార్చారు. భట్టిప్రోలు మండలం ఐలవరం-1, ఐలవరం-2ల్లోని ఏఎన్ఎంలను అటుఇటు మార్చారు.
- పెదనందిపాడు-1 ఏఎన్ఎంను అదే మండలంలోని వరగానికి, పెదనందిపాడు-2 ఏఎన్ఎంను పెదనందిపాడు-1కు బదిలీ చేశారు. గోగులమూడి ఏఎన్ఎంను సొంత మండలంలోనే నియమించారు.



వర్షంతో.. జలమయం

- తటాకాలను తలపించిన రోడ్లతో అవస్థలు

గుంటూరు, జూలై 18 (ఆంధ్రజ్యోతి): గురువారం అర్ధరాత్రి నుంచి శుక్రవారం తెల్లవారుజాము వరకు, మధ్యాహ్నం తర్వాత కురిసిన భారీ వర్షంతో నగరంలోని పలు ప్రాంతాలు జలమయమయ్యాయి. ప్రధాన రహదారులతో పాటు లోతట్టు ప్రాంతాల్లో పెద్ద ఎత్తున వర్షపు నీరు నిలిచిపోయింది. జిల్లాలోని పలు ప్రాంతాల్లో జల్లులు కురిసింది. ఆ తర్వాత వివిధ ప్రాంతాల్లో విడతల వారీగా ఓ మోస్తరు నుంచి భారీగా వర్షం పడింది. దీంతో ఆయా ప్రాంతాలను వరద నీరు ముంచెత్తింది. నగరంలోని విద్యానగర్, పాత గుంటూరు, పొన్నూరు రోడ్డులోని కాలనీలు, చుట్టుగుంటలోని శాంతినగర్, ఏటిఅగ్రహారం, హనుమాన్‌నగర్, కేవీపీ కాలనీ, కృష్ణబాబుకాలనీ, నల్లచెరువులోని లోతట్టు ప్రాంతాల్లో వర్షపునీరు నిలిచిపోయింది. కలెక్టరేట్ రోడ్డు, అమరావతి రోడ్డు, లాలాపేట, జీటీ రోడ్లపై వర్షపు నీరు నిలిచిపోవడంతో రాకపోకలకు వాహనదారులు ఇబ్బందులు పడ్డారు. ప్రధాన వీధులతో పాటు కాలనీ ల్లోని డ్రెయిన్లు పొంగి ప్రవహించాయి. దీంతో వర్షపునీరు ముందుకు పోయే పరిస్థితి లేకుండా పోవడంతో రోడ్లు తటాకాల్లా మారాయి. విద్యానగర్ మెయిన్ రోడ్డు నుంచి వర్షపు నీరు ఒకటో లైన్‌లోకి వరదలా ప్రవహించడంతో ఆ మార్గం నదిని మరిపించింది. పెద్దగుంతలు ఉండడంతో వాటిలో పడి విద్యార్థులు, వాహనచోదకులు గాయపడ్డారు. వర్షపు నీటి ప్రవాహానికి రోడ్డు సైతం కోసుకుపోయింది.


ఏటీ అగ్రహారం 15వ లైనులో తటాకాన్ని తలపిస్తున్న వర్షపునీరు


ఎస్‌కేబీఎం పాఠశాల ఆవరణలో వర్షపు నీరు


వర్షం వస్తే శాంతినగర్ మూడో లైనులో ఇలా...


విద్యానగర్ ఒకటో లైన్ రోడ్డుపై వర్షపు నీరు ప్రవాహం

గాంధీ జయంతికి.. 'స్వచ్ఛాంధ్ర' బహుమతి!

(5వ పేజీ తరువాయి)

కార్పొరేషన్ ద్వారా పల్నాడు, గుంటూరు, బాపట్ల జిల్లాల్లోని మునిసిపాలిటీల్లో చెత్త శుద్ధికి రూ.30.35 కోట్లు నిధులు విడుదల చేసింది. టెండర్ ప్రక్రియ ద్వారా మహాత్మా గాంధీ జయంతి అక్టోబరు 2వ తేదీ కల్లా వ్యర్థాలను తొలగించే దిశగా పనులు నిర్వహిస్తున్నారు.

3.63 లక్షల మెట్రిక్ టన్నుల చెత్త శుద్ధి

పల్నాడు జిల్లాలోని నరసరావుపేట, చిలకలూరిపేట, మాచర్ల, పిడుగురాళ్ల, వినుకొండ, దాచేపల్లి, గురజాల, గుంటూరు జిల్లాలోని గుంటూరు కార్పొరేషన్, పొన్నూరు, బాపట్ల జిల్లాలోని రేపల్లె, బాపట్ల కార్పొరేషన్ సహా మొత్తం 11 చోట్ల పనులు జరుగుతున్నాయి. 3.63 లక్షల మెట్రిక్ టన్నుల చెత్త శుద్ధి చేయాలని స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ లక్ష్యంగా పెట్టుకుంది. కంపోస్టు యార్డుల్లో పేరుకు పోయిన చెత్తను ఎరువుగా మార్చే ప్రక్రియ జరుగుతోంది. ఇందుకు సంబంధించి యార్డుల్లోనే యంత్రాలను ఏర్పాటు చేశారు.

వ్యర్థాల తొలగింపు ఇలా..

రెడిఏ టెక్నాలజీస్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ చెత్త తొలగింపు పనులను స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ అప్పగించింది. చెత్తలో ఉన్న ప్లాస్టిక్ కవర్లను వేరు చేసి అవసరమైన కంపెనీలకు తరలిస్తారు. వ్యర్థాల్లో వస్త్రాలు, మట్టి, రాళ్లు, ప్లాస్టిక్‌ను యంత్రాల ద్వారా వేరు చేస్తారు. ఇలా వచ్చే మట్టిని మునిసిపాలిటీల్లో లోతట్టు ప్రాంతాలను నింపేందుకు వినియోగించనున్నారు. మొత్తం మీద మునిసిపాలిటీల కంపోస్టు యార్డుల వద్ద రహదారులపై గుట్టలు గుట్టలుగా పేరుకుపోయిన వ్యర్థాలను పూర్తిగా శుభ్ర పరచనున్నారు. వ్యర్థాలను యార్డులకు తరలించే పరిస్థితి లేక.. రహదారుల మార్జిన్లలో తగలబెట్టె పరిస్థితి కూడా ఇక ఉండదు. ఇక మీదట తడి పొడి చెత్తను కచ్చితంగా వేరు చేయాలని మునిసిపాలిటీలను స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ ఆదేశించింది. ఘన వ్యర్థాలను విద్యుత్ ఉత్పత్తి ప్లాంటుకు తరలించాలని నిర్ణయించారు. ఈ ప్రక్రియ పూర్తి స్థాయిలో అమలు జరిగితే పట్టణాల్లో పరిశుభ్రత నెలకొనే అవకాశం ఉంది.

మద్యం మత్తులో ట్రాన్స్‌ఫార్మర్ పట్టుకుని..

● విద్యుదాఘాతంతో యువకుడికి గాయాలు


గాయపడిన యువకుడు

కొల్లూరు, జూలై 18 (ఆంధ్రజ్యోతి) : మద్యం మత్తులో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను పట్టుకున్న యువకుడు షాక్‌కు గురై గాయపడిన సంఘటన శుక్రవారం చోటు చేసుకుంది. కొల్లూరు ఎస్సీ కాలనీకి చెందిన గొరికపూడి కిరణ్‌కుమార్ మద్యం సేవించి.. మత్తులో మాత్ర విసర్జన చేసేందుకు ట్రాన్స్‌ఫార్మర్ వద్దకు వెళ్లాడు. ట్రాన్స్‌ఫార్మర్‌ను తాకడంతో షాక్‌కు గురై కింద పడిపోయాడు. గమనించిన స్థానికులు వెంటనే ప్రాథమిక వైద్య ఆరోగ్య కేంద్రానికి తరలించారు. వైద్యులు మెరుగైన చికిత్స నిమిత్తం తెనాలి జిల్లా ప్రభుత్వ వైద్యశాలకు తీసుకు వెళ్లాలని సూచించడంతో 108 అంబులెన్స్‌లో తరలించారు. యువకుడిని అక్కడి వైద్యులు పరిశీలించి ప్రాణాపాయం లేదని తెలిపారు.

ఓపెన్ స్కూల్ అడ్మిషన్లు ప్రారంభం

● ఈనెల 30 తేదీ వరకు గడువు: డీఈవో రేణుక

గుంటూరు (విద్య) జూలై 18 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ సార్వత్రిక విద్యాపీఠం దూర విద్య ప్రవేశాలు(ఓపెన్ స్కూల్)-2025-26 సంవత్సరానికి ప్రారంభమయ్యాయని జిల్లా విద్యా శాఖాధికారి సి.వి.రేణుక శుక్రవారం తెలిపారు. అపరాధ రుసుం లేకుండా ఈ నెల 30వ తేదీ వరకు ఆన్‌లైన్లో పొంద వచ్చని పేర్కొన్నారు. 15 ఏళ్ల నిండిన వారికి ఇంటర్ విద్యను అందిస్తున్నట్లు తెలిపారు. 10వ తరగతి, ఇంటర్మీడియట్‌లో ఉత్తీర్ణత సాధించనివారికి వారికి కూడా అవకాశం ఉందన్నారు. ఇతర వివరాల కోసం అభ్యర్థులు తమ ప్రాంతంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో లేదా దూరవిద్య కేంద్రాల్లో సంప్రదించాలని సూచించారు.

నేడు గుంటూరు నగరానికి

మంత్రి లోకేశ్

గుంటూరు (విద్య) జూలై 18 (ఆంధ్రజ్యోతి): ది ఇనిస్టిట్యూట్ ఆఫ్ చార్టెడ్ అకౌంటెంట్స్ ఆఫ్ ఇండియా(ఐసీఏఐ) ఆధ్వర్యంలో శనివారం గుంటూరులో జరిగే సదస్సుకు రాష్ట్ర ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ హాజరుకానున్నారు. స్థానిక అమరావతి రోడ్డులోని బంధుమిత్ర గార్డెన్స్‌లో సీఏ నిపుణులతో ముఖాముఖి మాట్లాడనున్నారు. ప్రతిభావంతులైన విద్యార్థులకు పురస్కారాలు అందజేస్తారు. సీఏ కోర్స్ కోర్సు పూర్తి చేయడానికి ఐసీఏఐ సహకారం గురించి వివరించనున్నట్లు ఐసీఏఐ అధ్యక్షుడు ప్రసన్నకుమార్ వెల్లడించారు.

గుండె సమస్యలకు కేఎల్‌యూ విద్యార్థిని నూతన పరిష్కారం


శ్రేయ కొసనం

తాడేపల్లి (వడ్డేశ్వరం), జూలై 18 (ఆంధ్రజ్యోతి): వడ్డేశ్వరంలోని కేఎల్ డీమ్డ్ యూనివర్సిటీ ఫార్మసీ కళాశాల పరిశోధక విద్యార్థిని శ్రేయ కొసనం గుండె సంబంధిత సమస్యలకు మొక్కల ఆధారిత చికిత్సలకు నూతన పరిష్కారాలు కను గొన్నట్లు వర్సిటీ ఫార్మసీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ చక్రవర్తి శుక్రవారం తెలిపారు. డాక్టర్ రాజేశ్వరి పసుపుల మార్గదర్శకత్వంలో గుండె సంబంధిత వ్యాధులపై పరిశోధన చేసిన శ్రేయ సాంప్రదాయ మొక్కల నుంచి గుండెకు ఏర్పడే పలు రకాల సమస్యలకు ఔషధాలు తయారు చేయవచ్చనే పరిశోధనకు శ్రేయ ఫార్మసీ కళాశాల నుంచి పీహెచ్‌డీ డిగ్రీని అందుకున్నట్లు తెలిపారు. ఆమె చేసిన పరిశోధనను మెడికల్ బాష్టల్ ఇన్వెస్టిగేషన్ ఆఫ్ మిథైల్ గ్లైకెక్సైడ్ అండ్ సిస్సామోయిల్ డెరివేటివ్ ప్రోమ్ అగస్త్య డైకోటోమా ఎగనెస్ట్ మయోకార్డియల్ ఇస్కీమియా రి పెరిఫ్యూజం ఇంజరీ ఇంటిగ్రేటింగ్ కంప్యూటేషనల్ టెక్నిక్స్ విత్ సెల్‌లైన్ వ్యాలిడేషన్ యూజింగ్ హెచ్9సీ2 కార్డియో ఈ సందర్భంగా ఆమెను కేఎల్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ చక్రవర్తి, డాక్టర్ బుచ్చినాయుడు, ఆర్ ప్యాక్ చైర్మన్ డాక్టర్ నరేంద్ర అభినందించారు.

పేద కుటుంబాలను ఆదుకోవడమే పీ4 లక్ష్యం

స్వర్ణాంధ్ర-2047 ఎగ్జిక్యూటివ్ వైస్ చైర్మన్ వెలమాటి రామ్‌నాథ్


మాట్లాడుతున్న వెలమాటి రామ్‌నాథ్

పెదనందిపాడు, జూలై, 18(ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలో ప్రతి పేద కుటుంబాన్ని ఆదుకోవడమే పీ4 లక్ష్యమని స్వర్ణాంధ్ర - 2047 ఎగ్జిక్యూటివ్ వైస్ చైర్మన్ వెలమాటి రామ్‌నాథ్ పేర్కొన్నారు. స్థానిక పీఏఎస్ కళాశాలలో ఓ కార్యక్రమానికి విచ్చేసిన సందర్భంగా ఆయన విలేకరుల సమావేశం నిర్వహించి, మాట్లాడారు. గ్రామాల్లో పేద కుటుంబాలను గుర్తించి, వారిని ఆదుకునేందుకు ఆ గ్రామంలోనే ఆయా రంగాల్లో అభివృద్ధి చెందిన వారికి అప్పగించి, అన్ని విధాలా ఆదుకునే లక్ష్యంతో సీఎం చంద్రబాబు కృషి చేస్తున్నారన్నారు. రాష్ట్రంలో 15 లక్షల పేద కుటుంబాలు ఉండగా ఇప్పటికే 5 లక్షల కుటుంబాలను గుర్తించడం జరిగిందన్నారు. త్వరలో మరో పది లక్షల కుటుంబాలను గుర్తించడం జరుగుతుందని.. దీనిపై ప్రణాళికా బద్ధంగా ప్రభుత్వం అడుగులు వేస్తుందని తెలిపారు. పథకం రూపకల్పనకు మేధావులతో చర్చించి నిర్ణయాలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ఈ పథకాన్ని ప్రధాన మంత్రి అన్ని రాష్ట్రాల్లో ఏర్పాటు చేసేవిధంగా ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు తెలిపారు. త్వరలో జిల్లా, నియోజకవర్గ, మండల గ్రామ కమిటీలు కూడా ఏర్పాటు చేయడం జరుగుతుందని తెలిపారు. దీనిని ఆగష్టు 15న లాంఛనంగా ప్రారంభించడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో విశ్రాంత ఏఎస్పీ కాళహస్తి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఒప్పంద అధ్యాపకుల రెన్యువల్‌కు ఆహ్వానం

గుంటూరు (విద్య)జూలై 18 (ఆంధ్రజ్యోతి): జోన్-3 పరిధిలోని ప్రభుత్వం డిగ్రఈ కళాశాలల్లో ఒప్పంద ప్రాతిపదికన గత సంవత్సరం పనిచేసిన అధ్యాపకుల నుంచి రెన్యూవల్ కోసం దరఖాస్తు ఆహ్వానిస్తున్నట్లు కళాశాల విద్య సంయుక్త సంచాలకులు పి.కళావతి శుక్రవారం ప్రకటన తెలిపారు. అధ్యాపకులు 2024-25 విద్యా సంవత్సరంలో పనిచేసి 60 సంవత్సరాలలోపు వయసు ఉండాలని సూచించారు. ఈ నెల 21లోగా దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. జోన్ 3 పరిధిలో ఉమ్మడి గుంటూరు, పల్నాడు, ప్రకాశం, నెల్లూరు జిల్లాల్లోని ప్రభుత్వ డిగ్రీ, ఓరియంటల్ కళాశాలల్లో పనిచేయాల్సి ఉంటుందని తెలిపారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో 39, ఓరియంటల్ కళాశాలల్లో 10 పోస్టులు రెన్యువల్ చేస్తామని తెలిపారు. ఇతర వివరాల కోసం ఆయా జిల్లాల్లోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలల్లో సంప్రదించాలని తెలిపారు.

జంతు శాస్త్ర అధ్యాపక పోస్టుకు..

ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో(గుంటూరు) జంతు శాస్త్రం అధ్యాపక పోస్టుకు దరఖాస్తు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపల్ డాక్టర్ వీఆర్ జ్యోత్స్నకుమారి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. అభ్యర్థికి 55 సంవత్సరాలోపు వయసు, జాతీయ స్థాయి అర్హత పరీక్ష పూర్తి చేసి, పీహెచ్‌డీ ఉన్నవారికి అవకాశం కల్పిస్తామని తెలిపారు. ఈ నెల 22న కళాశాల జరిగే ఇంటర్వ్యూకు హాజరుకావాలని సూచించారు.

కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్లకు ఎక్స్ గ్రేషియా

గుంటూరు సిటీ, జూలై 18(ఆంధ్రజ్యోతి): వైద్య, ఆరోగ్య శాఖలో పనిచేస్తున్న కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్లకు ఎక్స్ గ్రేషియా ప్రకటిస్తూ కూటమి ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు హెల్త్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్ కమిషనర్ వీర పాండ్యన్ శుక్రవారం ప్రత్యేక ఉత్తర్వులు జారీ చేశారు. 2019 ఫిబ్రవరిలో అప్పటి టీడీపీ ప్రభుత్వం రాష్ట్రంలోని కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల కోసం తీసుకొచ్చిన జీఓ నంబరు 25 కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్లకు కూడా వర్తిస్తుందని కమిషనర్ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ఈ జీఓ ప్రకారం ఉద్యోగులు ప్రమాదవశాత్తు మరణిస్తే.. రూ. 5 లక్షలు, సహజ మరణం పొందితే రూ. 2లక్షలు కుటుంబ సభ్యులకు ప్రభుత్వం అంద జేస్తుంది. దీనిపై ఏపీ మిడ్ లెవెల్ హెల్త్ ప్రొవైడర్లు, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ల అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు నిరంజన్, కార్యదర్శి సందీప్ హర్షం వ్యక్తం చేశారు.

'మందలింపు'తో..

రైలు కింద కాళ్లు పెట్టిన విద్యార్థిని

●కాళ్లు తెగిపోయి మృత్యువుతో పోరాటం

బాపట్ల, జూలై 18 (ఆంధ్రజ్యోతి) : రైలు కింద పెట్టిన రెండు కాళ్లు తెగిపోయి మృత్యువుతో పోరాడుతున్న విద్యార్థిని విషాద ఘటన ప్రజల్ని కలిచివేసింది. శుక్రవారం జరిగిన ఈ ఘటనపై కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల మేరకు.. బాపట్ల పట్టణంలోని 12వ వార్డు వెంగళ్ విహార్‌కు చెందిన విద్యార్థిని ఓ పాఠశాలలో 10వ తరగతి చవుతోంది. రెండు రోజులు నుంచి విద్యార్థిని పాఠశాలకు వెళ్లక పోవడంతో తల్లి ప్రశ్నించింది. దీంతో పాఠశాల ప్రిన్సిపల్ మందలించారని చెప్పింది. పాఠశాలకు వచ్చి మాట్లాడతామని చెప్పి, స్కూల్‌కు వెళ్లమని బాలికకు తల్లి సూచించింది. దీంతో మనస్థాపానికి గురైన విద్యార్థిని వాష్ రూమ్‌కు వెళ్తున్నట్లు చెప్పి.. జీబీసీ రోడ్డులోని ఆర్‌వోబీ దగ్గర రైలు పట్టాలపై కాళ్లు పెట్టి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. ఈ ఘటనలో బాలిక రెండుకాళ్లు తెగిపోయాయి. స్థానికులు గుర్తించి హుటాహుటీన బాలికను ఏరియా ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మెరుగైన చికిత్స కోసం గుంటూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. బాలిక ఆత్మహత్యాయత్నానికి సంబంధించి భిన్న కథనాలు వినిపిస్తున్నాయి. స్కూల్‌కు వెళ్లడం లేదని తల్లి మందలించడం ఒక వాదన కాగా.. పాఠశాలలో ఉపాధ్యాయులు మందలించారనే మరొక వాదన వినిపిస్తోంది. పూర్తివివరాలు తెలియాల్సి ఉంది. రైల్వే పోలీసులు ఘటన స్థలాన్ని పరిశీలించారు. ఆసుపత్రికి వెళ్లి బాలిక వివరాలు నమోదు చేసుకొన్నారు. రెండు కాళ్ళు తెగిపోయినట్లు వైద్యులు చెప్పారని ఈ మేరకు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

వినూత్న ఆలోచనలతో రండి!

(5వ పేజీ తరువాయి)

స్పష్టం చేశారు. భవిష్యత్తు అంతా గ్రీన్ హైడ్రోజన్‌దేనని, పారిశ్రామిక రంగంలో విప్లవాత్మక మార్పులకు ఇది శ్రీకారం చుట్టనుందన్నారు. సామాన్యులకు అందుబాటులో ఉండేలా దీనిని ప్రజలకు అందుబాటులోకి తేవాలని సీఎం సూచించారు. రాష్ట్రంలో గ్రీన్ హైడ్రోజన్ ఉత్పత్తికి ఇప్పటికే కార్యాచరణ సిద్ధమైందని, ఇందులో పారిశ్రామిక వేత్తలు భాగస్వాములు కావాలని ఆయన విజ్ఞప్తి చేశారు. కాకినాడలో గ్రీన్ అమ్మోనియా ఉత్పత్తి కూడా త్వరలోనే ప్రారంభం అవుతుందన్నారు. 160 మెగావాట్ల గ్రీన్ హైడ్రోజన్ విద్యుత్ ఉత్పత్తి లక్ష్యాన్ని ఏపీ నిర్దేశించుకుందని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. 3 గిగా వాట్ల సామర్థ్యంతో ఎలక్ట్రో లైజర్ల ద్వారా గ్రీన్ హైడ్రోజన్ ఉత్పత్తి చేయనున్నట్లు ప్రకటించారు. ఇప్పటికే ఏపీలో సౌర, పవన, పంప్డ్ విద్యుత్ ఉత్పత్తికి అపారమైన వనరులు ఉన్నాయని, గ్రీన్ హైడ్రోజన్ ప్రాజెక్టుల ఏర్పాటుకు 1000 కిలోమీటర్ల కోస్తా తీరం, నీరు అందుబాటులో ఉందని స్పష్టం చేశారు. వచ్చే ఏడాది నాటికి గ్రీన్ ప్రాజెక్టులు పనిచేసే స్థాయి రావాలని చంద్రబాబు అభిలాషించారు.

రూ.51 వేల కోట్ల ఒప్పందాలు

ఏపీలో గ్రీన్ హైడ్రోజన్, గ్రీన్ అమ్మోనియా ఉత్పత్తి చేసేందుకు రెండు సంస్థలు ముఖ్యమంత్రి చంద్రబాబు సమక్షంలో సదస్సు వేదికగా ట్రాన్స్‌ఫర్మేటివ్ అవగాహనా ఒప్పందాలను కుదుర్చుకున్నాయి. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం, సంస్థల ప్రతినిధులు ఒప్పంద పత్రాలను మార్చుకున్నారు. యూకేకు చెందిన యమ్నా సంస్థ రూ.16 వేల కోట్ల పెట్టుబడితో నెల్లూరు జిల్లా కృష్ణపట్నం వద్ద ఏడాదికి మిలియన్ టన్నుల ఉత్పత్తి సామర్థ్యంతో ప్లాంట్‌ను ఏర్పాటు చేసేందుకు ఎంఓయూ కుదుర్చుకుంది. అలాగే కేఎస్‌హెచ్ ఇన్‌ఫ్రా సంస్థ మచిలీపట్నంలో 150 కిలో టన్నుల సామర్థ్యంతో గ్రీన్ హైడ్రోజన్, 600 కిలో టన్నుల గ్రీన్ అమ్మోనియా ఉత్పత్తి సామర్థ్యంతో ప్లాంట్లను ఏర్పాటు చేసేందుకు ముందుకొచ్చింది. ఇందుకు రూ.35 వేల కోట్లను పెట్టుబడి పెట్టనుందని ముఖాముఖి తర్వాత జరిగిన సదస్సులో సీఎం చంద్రబాబు ప్రకటించారు. ముఖాముఖి సదస్సులో నీతి అయోగ్ సభ్యులు డాక్టర్ వీకే సారస్వత్, కేంద్ర సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్, రాష్ట్ర ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి కె.జయానంద్, ఎస్ఆర్ఎం వర్సిటీ ప్రో చాన్సలర్ డాక్టర్ పి.సత్యనారాయణ, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ డి నారాయణరావు, హైడ్రోజన్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా అధ్యక్షుడు డాక్టర్ ఆర్‌కే మల్హోత్రా, నేషనల్ కెమికల్ ల్యాబ్(పూనే) డైరెక్టర్ డాక్టర్ ఆశీస్ లేలే, నెడ్ క్యాప్ రాష్ట్ర అధికారి డాక్టర్ కమలాకర్‌బాబు పాల్గొన్నారు.

శ్రీలక్ష్మీ అమ్మవారి ఆలయం హుండీ రాబడి రూ. 51,23,353

దుర్గి, జూలై 18 (ఆంధ్రజ్యోతి): అడిగొప్పల నిదానంపాటి శ్రీలక్ష్మీ అమ్మవారి ఆలయ హుండీ ఆదాయం శుక్రవారం లెక్కించారు. రూ.51,23,353లు సమకూరినట్లు ఈవో ఆదిశేషు నాయుడు, కోటప్పకొండ ఏసీ చంద్రశేఖర్ తెలిపారు.

44,297 మిర్చి టిక్కీల అమ్మకం

గుంటూరు, జూలై 18 (ఆంధ్రజ్యోతి): మిర్చియార్డుకు శుక్రవారం 40,141 మిర్చి టిక్కీలు విక్రయానికి రాగా ముందురోజు నిల్వ ఉన్న వాటితో కలిపి 44,297 అమ్మకం జరిగినట్లు గుంటూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ ఉన్నతశ్రేణి కార్యదర్శి ఏ చంద్రిక తెలిపారు. ఇంకా యార్డు ఆవరణలో 3,365 మిర్చి టిక్కీలు నిల్వ ఉన్నట్లు పేర్కొన్నారు. వివిధ రకాల మిరపకాయలకు ధరలు ఈ కింది విధంగా నమోదయ్యాయి.

వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర
నాన్ ఏసీ కామన్ వెరైటీ		
334	9500	13000
నెంబరు. 5	10000	13300
273	----	-----
341	10000	13600
4884	----	---
సూపర్ 10	10000	13000
నాన్ ఏసీ స్పెషల్ వెరైటీ		
తేజ	10000	14000
షార్క్-1	-----	----
బ్యాడిగి	10000	12400
దేవనూరు డీలక్స్	10000	12400

వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర
ఆర్మూరు	9600	10800
ఏసీ కామన్ వెరైటీ		
334	9500	12800
నెంబరు. 5	10000	13500
273	---	----
341	10000	13700
4884	10000	12400
ఏసీ స్పెషల్ వెరైటీ		
తేజ	10000	13800
బ్యాడిగి	10000	12700
దేవనూరు డీలక్స్	10000	12600
తాలుకాయలు	4500	7000

తెలుగు భాషా వికాసంపై.. లఘు చలన చిత్ర పోటీలు

గుంటూరు(తూర్పు), జూలై 18: మూడవ ప్రపంచ తెలుగు మహా సభలు -2026 సందర్భంగా ఆంధ్ర సారస్వత పరిషత్తు ఆధ్వర్యంలో తెలుగు భాషా వికాసంపై అంతర్జాతీయ లఘు చలన చిత్ర పోటీలు నిర్వహించనున్నట్లు పరిషత్తు అధ్యక్షుడు డాక్టర్ గజల్ శ్రీనివాస్ ఒక ప్రకటనలో తెలిపారు. తెలుగు భాష చారిత్రక వైభవం, ఆంధ్ర సారస్వత దీప్తి, తెలుగు భాషా వికాసం, తెలుగు వెలుగులు, తెలుగు భాష రక్షణ - ప్రాచుర్యం అంశాలుగా పోటీలు ఉంటాయని పేర్కొన్నారు. ఎంపికైన చిత్ర ప్రదర్శన వేడుకను గుంటూరు భారతీయ విద్యా భవన్‌లో సెప్టెంబరు 14న నిర్వహిస్తామని తెలిపారు. ఎంట్రీలు లఘు చిత్రం నిడివి 5 నిమిషాలకు తక్కువగా ఉండాలని తెలిపారు. ఆగస్టు 14 లోపు పంపాలని పేర్కొన్నారు. ఎంట్రీలు "ఏఎస్‌పీ షార్ట్ ఫిలిమ్ కాన్ టెస్ట్" ఎడిటెడ్ మెయిల్‌కు పంపాలన్నారు. ఇతర వివరాలకు 91826 12419 అనే నంబరుకు సంప్రదించాలని సూచించారు.

పాత పెన్షన్ అమలు చేయాలి


నిరసనలో మాజీ ఎమ్మెల్సీలు లక్ష్మణరావు, రామకృష్ణ

గుంటూరు(తూర్పు), జూలై 18(ఆంధ్రజ్యోతి): అర్హతలు కలిగిన 2003 డీఎస్సీ ఉపాధ్యాయులకు పాత పెన్షన్ అమలు చేయాలని మాజీ ఎమ్మెల్సీలు కేఎస్ లక్ష్మణరావు, ఏఎస్ రామకృష్ణ డిమాండ్ చేశారు. పాత పెన్షన్ అమలు చేయాలని కోరుతూ డీఎస్సీ-2003 ఉపాధ్యాయుల ఫోరం ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట చేపట్టిన నిరసనకు లక్ష్మణరావు సంఘీభావం తెలిపారు. 2003లో నోటిఫికేషన్ ఇచ్చి నాటికి కొత్త కంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీమ్ లేదని గుర్తుచేసుకున్నారు. కొత్త పెన్షన్ విధానం తేదీకి ముందే ఈ నోటిఫికేషన్ పరీక్ష ఫలితాలు విడుదల అయ్యాయని అన్నారు. సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకువచ్చి పరిష్కరించే విధంగా కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ఫోరం రాష్ట్ర, జిల్లా అధ్యక్షులు మోపిదేవి శివశంకరరావు, సలగల ప్రసన్నకుమార్ మాట్లాడుతూ కేవలం ప్రభుత్వ ఆలసత్వంతోనే పాత పెన్షన్ కోల్పోయామని ఆవేదన వ్యక్తం చేశారు. 2003లో ఈ విధానాన్ని తీసుకొచ్చిన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు మరోసారి ఆయనే ముఖ్యమంత్రిగా ఉన్నందున సమస్యను పరిష్కరించాలని కోరారు. అనంతరం డీఆర్వో ఖాజావలీకి వినతి పత్రం అందజేశారు. నిరసనలకు ఏపీ ఎన్జీజీవో, యూటీఎఫ్, ఏపీటీఎఫ్, ఫ్యాప్టో, నోబల్ టీచర్స్ నాయకులు ఘంటశాల శ్రీనివాసరావు, రాజశేకర్, సంపత్‌బాబు, బొనిగల హైమారావు తదితరులు మద్దతు తెలిపారు. జిల్లా కన్వీనర్లు శీలం యలమంద, శ్రీనివాసరావు, రాయుడు శ్రీధర్, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

గ్రీన్ హైడ్రోజన్ సమ్మిట్‌లో నేడు కీలక చర్చలు

గుంటూరు, జూలై 18 (ఆంధ్రజ్యోతి): గ్రీన్ హైడ్రోజన్ సమ్మిట్ - 2025లో భాగంగా చివరి రోజైన శనివారం పలు అంశాలపై చర్చ జరగనుంది. ఉదయం 9.30 గంటల నుంచి టెక్నికల్ సెషన్స్ ప్రారంభవుతాయని నిర్వాహకులు తెలిపారు. తొలుత హైడ్రోజన్ ఉత్పత్తికి సాంకేతిక పరిజ్ఞానాలప ఏఆర్‌సీఐ డైరెక్టర్ డాక్టర్ ఆర్ విజయ్ ప్రసంగిస్తారు. ఉదయం 10.30 గంటలకు హైడ్రోజన్ ప్రస్తుత స్థితి, భవిష్యత్తు అవకాశాలపై పీడీఈయూ అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ రమేష్ గూడూరు ప్రజంటేషన్ ఇస్తారు. ఉదయం 11 గంటలకు టెక్నాలజీస్ ఫర్ క్లీన్ హైడ్రోజన్, అడ్వాన్స్ అండ్ చాలెంజెస్‌పై జరిగే చర్చాగోష్టికి మోడరేటర్‌గా బీపీసీఎల్ నుంచి రంజన్ నాయర్ వ్యవహరిస్తారు. ప్యానలిస్టులుగా డాక్టర్ రమేష్ గూడూరు, ప్రొఫెసర్ సీహెచ్ సుబ్రహ్మణ్యం(ఐఐటీ హైదరాబాద్), ప్రొఫెసర్ శ్రీదేవి ఉపాధ్యాయులు(ఐఐటీ ఢిల్లీ), హరీష్ జయరాం(హైజెన్‌కో గ్రీన్ ఎనర్జీస్), డాక్టర్ మల్లికార్జున్ భావనారి(మణిపాల్ యూనివర్శిటీ), డాక్టర్ పార్థప్రతీమ్ బేగ్(ఎస్ఆర్ఎం యూనివర్శిటీ సిక్కిం) పాల్గొంటారు. మధ్యాహ్నం 12 గంటలకు గ్రీన్ హైడ్రోజ్ ప్రాజెక్టులకు ఊతమిచ్చే ప్రభుత్వ విధానాలు, పెట్టుబడుల అవకాశాలు, ప్రోత్సాహకాలు, రుణసదుపాయాలపై చర్చాగోష్టి జరుగుతుంది. మధ్యాహ్నం 2 గంటలకు డిజైన్, డెవలప్‌మెంట్, టెస్టింగ్ ఆఫ్ లార్జ్‌స్కేల్ సాలిడ్ స్టేట్ హైడ్రోజన్ స్టోరేజ్ అంశంపై ఐఐటీ తిరుపతి ప్రొఫెసర్ ముత్తుకుమార్ ప్రసంగిస్తారు. 2.30 గంటలకు పీనరీ టాక్‌లో ఆర్ఈపీఏ అధ్యక్షుడు ఎ.గోపాలకృష్ణన్ అయ్యర్ ప్రసంగిస్తారు. మధ్యాహ్నం మూడు గంటలకు సమ్మిట్ ముగింపు కార్యక్రమం జరుగుతుంది.

పెట్రోల్‌కు బదులు నీళ్లు కొట్టారు

● బంకు ముందు వాహనదారుల ఆందోళన..

మాచవరం, జూలై 18 (ఆంధ్రజ్యోతి) : మాచవరం పెట్రోల్ బంకులో పెట్రోల్‌కు బదులు నీరు కొట్టడంతో వాహనదారులు బంకు ముందు ఆందోళన చేపట్టారు. శుక్రవారం బంకులో పెట్రోల్ కొట్టించుకున్న వినియోగదారులు కొంతదూరం వెళ్లే సరికి వాహనాలు ఆగి పోవడంతో.. నెట్టుకుంటూ పెట్రోల్ బంకు వద్దకు వచ్చారు. అంతలోనే బంకు వద్ద మరి కొంత మంది వినియోగదారులు నీరు కొడుతున్నారంటూ బంకు యజమానులను నిలదీశారు. ఈ విషయమంతా దావనంలా వ్యాపించటంతో సుమారు వంద మంది వరకు వినియోగదారులు గుమిగూడి బంకు నిర్వాహకులను నిలదీశారు. వారి నుంచి సరైన సమాధానం రాలేదు. అదే బంకులో మరో ట్యాంకు ద్వారా పెట్రోల్ మంచిగానే వస్తుందని నిర్వాహకులు, వినియోగదారులు గమనించారు. ఐతే పెట్రోల్‌లో నీరు ఎలా కలిసిందనే విషయంపై నిర్వాహకులు చెప్పలేక పోవడంతో.. వినియో గదారులకు పరిహారం చెల్లించేందుకు ఒప్పుకు న్నారు. ఈ విషయంపై తహసీల్దార్ నాగమల్లేశ్వరరావును వివరణ కోరగా ఈ విషయం తమ దాకా రాలేదని, నిపుణులతో కలసి పెట్రోల్ బంకును తనిఖీ చేసి నిర్వాహకులపై చర్యలు తీసుకుంటామని తెలిపారు.



జీఎంసీకి జాతీయ స్థాయిలో గుర్తింపు

● ఈ అవార్డు నగర ప్రజలకు, కార్మికులకు అంకితం
● నగర మేయర్ రవీంద్ర, కమిషనర్ పులి శ్రీనివాసులు


అవార్డులను చూపుతున్న మేయర్ రవీంద్ర, కమిషనర్, అదనపు కమిషనర్ తదితరులు

గుంటూరు కార్పొరేషన్, జూలై 18(ఆంధ్రజ్యోతి): స్వచ్ఛ భారత్ మిషన్ ద్వారా కేంద్ర ప్రభుత్వం నిర్వహించిన 'సూపర్ స్వచ్ఛ లీగ్ సిటీస్ 2024-25' పోటీల్లో గుంటూరు నగరపాలక సంస్థకు లభించిన ప్రతిష్టాత్మక అవార్డు నగర ప్రజలు, ప్రజారోగ్య కార్మికులకే అంకితమని నగర మేయర్ కోవెలమూడి రవీంద్ర అన్నారు. నగరానికి జాతీయ స్థాయిలో అవార్డు అందిన సందర్భంగా శుక్రవారం నగర పాలక సంస్థ కౌన్సిల్ సమావేశ మందిరంలో నగర మేయర్, కమిషనర్లు మీడియా సమావేశంలో మాట్లాడారు.

ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ, జాతీయ స్థాయిలో గుంటూరు నగర ఖ్యాతిని చాటడంలో అధికారులు, ప్రజారోగ్య కార్మికుల కృషితో పాటు ప్రజల భాగస్వామ్యం తోడ్పడిందన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయకత్వంలో ఎన్డీఏ కూటమి ప్రభుత్వం రాష్ట్ర అభివృద్ధిని గాడిలో పెడుతుందని, వారి స్ఫూర్తితో ఎంపీ, కేంద్రమంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ సూచనలతో నగరాన్ని సమగ్రాభివృద్ధి దిశగా కృషి చేస్తున్నామన్నారు. అవార్డు అందిన స్ఫూర్తితో నగరంలో వీధి దీపాలు, పారిశుధ్యం మెరుగుదల, తాగు నీటి సరఫరా, మౌలిక వసతుల కల్పన ద్వారా సమగ్రాభివృద్ధి చేసుకుంటానికి కృషి చేస్తామన్నారు.

కమిషనర్ మాట్లాడుతూ స్వచ్ఛ భారత్ మిషన్ ఏర్పాటు చేసి 10 ఏళ్లు నిండిన సందర్భంగా దేశంలో గతంలో ర్యాంకులు వచ్చి, ప్రస్తుతం స్వచ్ఛత ప్రమాణాల్లో ఉన్నత స్థానంలో నిలిచిన 23 నగరాలను సూపర్ స్వచ్ఛ లీగ్ నగరాలుగా ప్రకటించిందని, వాటిలో 3 నుంచి 10 లక్షల జనాభా లోపు నగరాల్లో గుంటూరు నగరపాలక సంస్థ నిలిచిందన్నారు. నగరంలో వ్యర్థాల నిర్వహణ ద్వారా ప్రస్తుతం సాధించిన స్థానాన్ని నిలబెట్టుకోవడంతో పాటు నగరాన్ని ప్లాస్టిక్ రహిత, సుందర, పరిశుభ్ర నగరంగా తీర్చిదిద్దుకోవడంలో అధికార యంత్రాంగం కృషి చేస్తుందన్నారు. త్వరలో జీఎంసీ పరిధిలో సి అండ్ డి వెస్ట్ ట్రీట్మెంట్ ప్లాంట్, ఎస్.టి.పి, వెండింగ్ జోన్ల ఏర్పాటుకు కసరత్తు చేస్తున్నామన్నారు. సమావేశంలో అదనపు కమిషనర్ చల్లా ఓబులేసు, డిప్యూటీ కమిషనర్లు, విభాగాధిపతులు పాల్గొన్నారు.

జాతీయస్థాయి అవార్డు సాధించటం అభినందనీయం : కలెక్టర్


అవార్డులను చూపుతున్న కలెక్టర్ నాగలక్ష్మి, కమిషనర్ శ్రీనివాసులు

గుంటూరు కార్పొరేషన్, జులై 18 (ఆంధ్రజ్యోతి): స్వచ్ఛ సర్వేక్షణ్‌లో నగరపాలక సంస్థ చరిత్రలో ఎన్నడూలేని విధంగా జాతీయ స్థాయిలో అత్యుత్తమ అవార్డులను సాధించడం అభినందనీయమని కలెక్టర్ ఎస్. నాగలక్ష్మి అన్నారు. స్వచ్ఛ సర్వేక్షణ్‌లో గుంటూరు నగరానికి అత్యుత్తమ అవార్డు వచ్చిన సందర్భంగా శుక్రవారం నగర కమిషనర్ పులి శ్రీనివాసులు, అదనపు కమిషనర్ చల్లా ఓబులేసులు కలెక్టర్‌ని క్యాంప్ కార్యాలయంలో కలిసి వారి చేతుల మీదుగా అవార్డు, మెమెంటోలను అందుకున్నారు. కలెక్టర్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన స్వచ సర్వేక్షణ్ అవార్డుల్లో గుంటూరు నగరపాలక సంస్థ దేశంలోని 23 నగరాల్లో ఒకటిగా నిల్వడం అభినందయనీయమన్నారు. అనంతరం ఒక జిల్లా-ఒక ఉత్పత్తి కేటగిరిలో గుంటూరు మిర్చికి జాతీయ స్థాయిలో లభించిన అవార్డుని అందుకున్న కలెక్టర్‌కు కమిషనర్, అదనపు కమిషనర్లు అభినందనలు తెలిపారు.

గిరిజనుల సమగ్ర అభివృద్ధికి కట్టుబడిన కూటమి ప్రభుత్వం

● మంత్రి నారా లోకేశ్


మంత్రి నారా లోకేశ్‌ను కలిసిన ధారూనాయక్

గుంటూరు, జూలై 18 (ఆంధ్రజ్యోతి) : గిరిజనుల సమగ్ర అభివృద్ధికి కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని మంత్రి నారా లోకేశ్ స్పష్టం చేశారు. ఈ మేరకు శుక్రవారం ఉండవల్లిలోని సీఎం నివా సంలో మంత్రి నారా లోకేశ్‌ను టీడీపీ ఎస్టీ సెల్ రాష్ట్ర అధ్య క్షుడు ఎం.ధారూ నాయక్ మర్యాదపూర్వకంగా కలిశారు. గత ఐదేళ్ళ వైసీపీ ప్రభుత్వ హయాంలో గిరిజనులకు తీవ్ర అన్యాయం జరిగిందని, ఈ నేపథ్యంలో గిరిజనుల అభివృద్ధికి ప్రత్యేక ప్రణాళిక రూపొందించాలని లోకేశ్‌ను కోరారు. గత వైసీపీ ప్రభుత్వంలో గిరి పుత్రులు అభివృద్ధికి ఆమడ దూరంలో ఉన్నారని, ఎస్టీ కార్పొరేషన్, ఎస్సీ ఎస్టీ సబ్ ప్లాన్, నిరుద్యోగ యువత నైపుణ్య శిక్షణ ఊసే లేకుండా గిరిజనులను అన్ని విధాలుగా మోసం చేశారన్నారు. 2014-19 మధ్య అమలైన గిరిజన సంక్షేమ పథకాలను ఆ తర్వాత వచ్చిన వైసీపీ ప్రభుత్వం నిలిపి వేసిందని వాటిని మళ్లీ పునరుద్ధరించాలని, గిరిజన యువతకు సరైన మార్గంలో నడిపించటానికి ఉపాధి కల్పనకు యూత్ ట్రైనింగ్ సెంటర్స్ నైపుణ్య శిక్షణ అందించాలని ధారు నాయక్ కోరారు. ఇందుకు స్పందించిన మంత్రి నారా లోకేశ్ మాట్లాడుతూ గిరిజనులను ఆర్థికంగా, సామాజికంగా, విద్య, వైద్య పరంగా అన్ని విధాలుగా తీర్చిదిద్దేందుకు అవసరమైన ప్రణాళిక రూపొందించామన్నారు. వైసీపీ ప్రభుత్వం వారిని ఓటు బ్యాంకుగానే వాడుకొని దగా చేసిందన్నారు. గత టీడీపీ ప్రభుత్వంలో అమలు చేసిన పథకాలను వైసీపీ ప్రభుత్వం దారుణంగా నిలిపివేసిందని అయితే వాటన్నింటిని తిరిగి పునరుద్ధరిస్తున్నట్లు తెలిపారు.

మానవ అక్రమ రవాణా అమానుషం, దారుణం

● గుంటూరు రైల్వేస్టేషన్‌లో అవగాహన కార్యక్రమం

గుంటూరు, జూలై 18 (ఆంధ్రజ్యోతి) : మానవ అక్రమ రవాణా అనేది అత్యంత అమానుషం.. దారుణమని రైల్వే ఎస్ఐలు శ్రీనివాస్, అనిత అన్నారు. ఈనెల 30న మానవ అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవం పురస్కరించుకొని ఈనెల 15 నుంచి 30 వరకు మానవ అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవ పక్షోత్సవాలు నిర్వహిస్తున్నారు. దీనిలో భాగంగా రైల్వే చైల్డ్ హెల్ప్ లైన్, క్రాఫ్ట్ సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో రైల్వే స్టేషన్లో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్పీఎఫ్ ఎస్ఐ శ్రీనివాస్, జీఆర్పీ ఎస్ఐ అనిత మాట్లాడుతూ చాప కింద నీరులా సాగుతున్న మానవ అక్రమ రవాణాను అరికట్టేందుకు ప్రతి ఒక్కరు తమ వంతు బాధ్యతగా కృషి చేయాలన్నారు. అక్రమ రవాణా జరిగినప్పుడు 1098 లేదా1800 1027 222 అనే ఉచిత సహాయ ఫోన్ నెంబర్లకు ఫోన్ చేయాలని సూచించారు. క్రాఫ్ట్ జిల్లా కో ఆర్డినేటర్ కోలా సమీర్ కుమార్ మాట్లాడుతూ వివిధ రాష్ట్రాల నుంచి బాల కార్మికులు అనేక రైళ్లల్లో గుంటూరుకు పనుల నిమిత్తం వస్తున్నారని, అటువంటి వారిని గుర్తించినట్లయితే వెంటనే స్థానిక పోలీసులకు లేదా జీఆర్పీకి లేదా రైల్వే పోలీస్‌లకు తెలియజేయాలని సూచించారు. ప్రపంచ మానవ అక్రమ రవాణా, పక్షోత్సవానికి సంబంధించిన ప్రచార బ్యానర్లను గుంటూరు రైల్వే స్టేషన్ తూర్పు, పశ్చిమ ముఖ ద్వారాల వద్ద, రైల్వే బుకింగ్ ఆఫీస్ వద్ద ఏర్పాటు చేశారు.


మానవ అక్రమ రవాణా పక్షోత్సవాల్లో భాగంగా రైల్వేస్టేషన్లో అవగాహన కార్యక్రమంలో పాల్గొన్న రైల్వే ఎస్ఐలు శ్రీనివాస అనిత క్రాఫ్ట్ జిల్లా కోఆర్డినేటర్ సమీర్ తదితరులు

రాత్రుళ్లు సెల్‌ఫోన్ వాడకం తగ్గించండి!

● రేడియాలజీ ప్రొఫెసర్ విజేత సూచన

గుంటూరు మెడికల్, జూలై 18 (ఆంధ్రజ్యోతి) : రాత్రుళ్లు అతిగా సెల్ ఫోన్ వాడకం తగదని, సెల్ రేడియేషన్ ప్రభావం వల్ల నిద్రలేమి, ఇతర సమస్యలు వేధిస్తాయని గుంటూరు ప్రభుత్వ సమగ్రాస్పత్రి రేడియాలజీ ప్రొఫెసర్ డాక్టర్ వి.విజేత తెలిపారు. ప్రతి వారం ప్రభుత్వాస్పత్రిలో రోగులు, వారి సహాయకుల కోసం నిర్వహించే మీ కోసం కార్యక్రమంలో భాగంగా శుక్రవారం జరిగిన కార్యక్రమంలో ఆమె ముఖ్యఅతిథిగా ప్రసంగించారు. ఇటీవల పెద్దలతో పాటు పిల్లల్లోనూ సెల్‌ఫోన్ వాడకం వ్యసనంగా మారినట్లు డాక్టర్ విజేత తెలిపారు. దీనివల్ల సామాజికంగా, ఆరోగ్యపరంగా పలు సమస్యలు ఎదురౌతున్నట్లు ఆమె వివరించారు. సాధ్యమైనంత వరకు సెల్‌ఫోన్ వాడకం తగ్గించుకోవాలని ఆమె సూచించారు. సూపరింటెండెంట్ డాక్టర్ రమణ యశస్వి మాట్లాడుతూ ఆసుపత్రిలో అమలు చేస్తున్న నూతన సెక్యూరిటీ పాలసీ ప్రకారం రోగి వెంట ఉండే అటెండర్‌కు పాస్ తప్పనిసరిగా ఉండాలన్నారు. అనంతరం జాగృతి సేవా సంస్థ తరపున నాగరాజకుమారి రోగులకు ఉచితంగా విటమిన్ ట్యాబ్లెట్లను పంపిణీ చేశారు.


ట్యాబ్లెట్లను పంపిణీ చేస్తున్న విజేత, పక్కన రమణ యశస్వి తదితరులు

చిన్నపాటి వర్షానికే ఎస్‌కేబీపీఎం పాఠశాల జలమయం

● ఆవరణలో గ్రావెల్ పోయించాలని చేసిన విజ్ఞప్తులు బుట్టదాఖలు

గుంటూరు(విద్య),జూలై 18(ఆంధ్రజ్యోతి): స్థానిక ఎన్జీవో కాలనీలోని ఎస్‌కేబీపీఎం స్కూల్ శుక్రవారం రాత్రి కురిసిన వర్షానికి జలమయమైంది. పాఠశాల ఆవరణలోని గ్రౌండ్ మురుగు కాల్వ కంటే తక్కువ ఎత్తులో ఉండటంతో వర్షపు నీరు మొత్తం పాఠశాలలోకి చేరింది. దీంతో విద్యార్థినీ, విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. నాడు-నేడు పనుల సందర్భంగా పాఠశాల గ్రౌండ్‌ను రోడ్డు, డ్రైయినేజి కాల్వల కంటే ఎత్తు ఉండేలా గ్రావెల్ పోయించాలని ఉపాధ్యాయులు చేసిన విజ్ఞప్తిని అప్పటి ప్రభుత్వం పట్టించుకోలేదు. ఫలితంగా వర్షపు నీరు పాఠశాలను చుట్టేసింది. ఇక్కడ నాడు-నేడు పనుల పేరుతో చేపట్టిన బిల్డింగ్‌లు నిర్మాణం పూర్తికాలేదు. వాటర్ ప్లాంట్ వచ్చినా ఇన్‌స్టలేషన్ చేయకుండా వదిలేశారు.


పాఠశాల ఆవరణలోకి చేరిన వర్షపు నీరు

ముగిసిన శ్రీమద్భగవద్గీత ప్రవచనాలు

గుంటూరు(తూర్పు), జూలై 18 (ఆంధ్రజ్యోతి): స్థానిక బృందావన్ గార్డెన్స్ శ్రీ వేంకటేశ్వరస్వామి దేవాలయ ప్రాంగణం పద్మావతి కళ్యాణవేదికపై శుక్రవారం జరుగుల బంగారుబాబు, శివకుమారి సౌజన్యంతో శ్రీమద్భగవద్గీత 16వ అధ్యాయం దైవాసుర సంపద్విభాగ యోగంపై ఆధ్యాత్మిక ప్రవచనాలు శుక్రవారంతో ముగిశాయి. తొలుత ఆలయ కమిటీ సహాయ కార్యదర్శి ఊటుకూరి నాగేశ్వరరావు జ్యోతిప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. చిన్మయామిషన్ బ్రహ్మచారి సువీరానందస్వామి భగవద్గీతలోని 16వ అధ్యాయంపై ప్రవచిస్తూ దైవిక లక్షణాలను అలవరచుకోవడం ద్వారా ఒక వ్యక్తి ఆధ్యాత్మిక ఉన్నతిని సాధించగలడని, అసుర లక్షణాలను విడిచిపెట్టడం ద్వారా బంధ విముక్తిని పొందగలడని ఈ అధ్యాయం బోధిస్తుందని శ్రీకృష్ణ పరమాత్మ అర్జునుడికి ఉపదేశించారన్నారు.


20 జిల్లా స్థాయి ఫుట్‌బాల్ జట్టు ఎంపికలు

గుంటూరు(తూర్పు), జూలై 18(ఆంధ్రజ్యోతి): జిల్లా ఫుట్‌బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈనెల 20న స్థానిక పేరేచర్ల మైదానంలో జూనియర్, సబ్ జూనియర్ బాలికల విభాగంలో జిల్లా స్థాయి ఫుట్‌బాల్ జట్టు ఎంపికలు నిర్వహిస్తున్నట్టు అసోసియేషన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు కుమ్మరి క్రాంతికుమార్, దుర్గామోహన్ ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపికలలో అర్హత సాధించిన క్రీడాకారులు నల్లమడ జోన్ లీగ్ మ్యాచ్‌లో పాల్గొంటారని అన్నారు. ఈ మ్యాచ్‌లో ప్రతిభ చూపిన క్రీడాకారులు రాష్ట్ర స్థాయి పోటీలలో పాల్గొంటారన్నారు. ఇతర వివరాలకు 73375 85790 అనే నెంబరులో సంప్రదించాలని సూచించారు.

సమస్యల పరిష్కారానికై బీసీ కమిషన్ కృషి చేయాలి

గుంటూరు, జూలై 18(ఆంధ్రజ్యోతి): సమస్యల పరిష్కారానికై బీసీ కమిషన్ కృషి చేయాలని జాతీయ బీసీ ఓబీసీ సంక్షేమ సంఘం కన్వీనర్ పావులూరి హనుమంతరావు సూచించారు. అరండల్‌పేటలోని ఆయన కార్యాలయంలో శుక్రవారం జరిగిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ విజయవాడకు వచ్చిన జాతీయ బీసీ కమిషన్ చైర్మన్ పర్యటన గురించి బీసీ సంఘాలకు సమాచారం ఇవ్వకపోవడం దురదృష్టకరమన్నారు. కొంత మందితో సమావేశం నిర్వహించడం సరైనది కాదన్నారు. ముఖ్యంగా బదిలీలలో బీసీ ఉద్యోగులకు రూల్ ఆఫ్ రిజర్వేషన్ అమలులో అన్యాయం జరుగుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. సమస్యలను దృష్టిలో ఉంచుకుని కమిషన్ మరోసారి పర్యటించాలని కోరారు. సమావేశంలో బాజ్జి నంద, ప్రజాపతి, అన్నవరపు నాగ మల్లేశ్వరరావు, నాని ముదిరాజ్ పాల్గొన్నారు.

శాకంబరి అలంకరణలో శ్రీ భద్రావతి దేవి


శాకంబరి అలంకరణలో శ్రీ భద్రావతిదేవి

గుంటూరు, జూలై 18(ఆంధ్రజ్యోతి): కొత్తపేట గాంధీబొమ్మ సెంటర్‌లోని శ్రీ భద్రావతి సమేత శ్రీ భావనారుషి స్వామి దేవస్థానంలో శుక్రవారం శ్రీ భద్రవతి దేవి శాకంబరి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ఆషాఢ మాసం పురస్కరించుకొని భక్తులు అందజేసిన పలు రకాల కూరగాయలతో అమ్మవారిని సర్వాంగ సుందరంగా అలంక రించారు. శాకంబరి దేవి అలంకరణలో ఉన్న అమ్మవారిని దర్శించుకునేందుకు భక్తులు ఉదయం నుంచే పెద్ద ఎత్తున తరలివచ్చారు. అనంతరం మహిళా భక్తులు పసుపు, కుంకుమలు, గాజులతో పాటు పలు రకాల పూజద్రవ్యాలతో అమ్మవారికి ఆషాఢం సారె అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ అర్చకుడు గోపాలకృష్ణాచారి, ఆలయ కమిటీ అధ్యక్షుడు వెనిగళ్ళ శ్రీనివాసరావు, అందె వెంకటేశ్వరరావు, గుంటి మురళీకృష్ణ, ఆకురాతి రాఘవేంద్రరావు, ఉమామహేశ్వరరావు, నర్రా శ్రీనివాసరావు తదితరులున్నారు.

రజక మహిళ మృతిపై విచారణ జరిపించాలి

గుంటూరు(తూర్పు), జూన్ 18(ఆంధ్రజ్యోతి): నగరంలో ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో అనుమానాస్పదంగా మృతి చెందిన రజక సామాజికవర్గానికి చెందిన తోరటి అనూష మృతిపై విచారణ జరిపించి తగు న్యాయం చేయాలని రజక వృత్తి ధోబిఘాట్ల పరిరక్షణ సమితి అధ్యక్షుడు చెన్నూరి చెన్నయ్య కోరారు. స్థానిక మంగళగిరి రోడ్డులోని ఆయన కార్యాలయంలో శనివారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. అనూష మరణానికి ఆమె భర్త సహకరించారని, దీనిపై పీజీఆర్ఎస్‌లో ఫిర్యాదు చేశామని గుర్తు చేసుకున్నారు. ఆ తరువాత సమస్యను పరిష్కరించినట్టు డీఎంహెచ్‌వో ఆన్‌లైన్‌లో నమోదు చేశారని అన్నారు. అధికారుల నిర్లక్ష్యాన్ని నిరసిస్తూ ఈనెల 21న చలో డీజీపీ కార్యాలయంను నిర్వహిస్తున్నట్టు స్పష్టం చేశారు. కార్యక్రమంలో సామ్రాజ్యం, సాంబశివరావు, సత్తెనపల్లి రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

దేశీయ విశ్వబ్రాహ్మణ మహాజన సభను జయప్రదం చేయాలి

గుంటూరు(తూర్పు), జూలై 18 (ఆంధ్రజ్యోతి) : స్థానిక అరండల్‌పేటలో ఈనెల 20వ తేదీన నిర్వహిస్తున్న దేశీయ విశ్వబ్రాహ్మణ మహాజన సభను జయప్రదం చేయాలని రాష్ట్ర విశ్వబ్రాహ్మణ సమాజం పూర్వ నాయకులు జంపని రాధాకృష్ణమూర్తి, కొలగాని నంద వీర ప్రసాదు తెలిపారు. స్థానిక విశ్వబ్రాహ్మణ కల్యాణ మండపం, ఆవరణలో శుక్రవారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సమాజ బైలా నిబంధనలకు విరుద్ధంగా 13 ఏళ్లకు పైగా ఎన్నికలు జరపకుండా కొంత మంది పాలన సాగిస్తున్నారని ఆరోపించారు. దీనికి తోడు లోకల్- నాన్ లోకల్ అనే ప్రాంతీయ భేదాలను సృష్టిస్తున్నారని అన్నారు. ఈ నేపథ్యంలో ఆదివారం జరిగే మహాసభలో విశ్వబ్రాహ్మణులు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో పార్లమెంట్ విశ్వ బ్రాహ్మణ సంఘం అధ్యక్షులు జంపని నాగేశ్వరరావు, శ్రీనివాస సుధాకర్ బాబు, పూసపాటి గిరిధర్, అద్దంకి భద్రయ్య, వెంకట్రావు, రావణ బ్రహ్మ పాల్గొన్నారు.

తారకరామనగర్‌లో నీటి ఎద్దడి

గుంటూరు సిటీ, జూలై 18 (ఆంధ్రజ్యోతి) : గుంటూరు నగరంలోని ఎస్‌వీఎన్ కాలనీ ఎక్స్‌టెన్షన్‌లో ఉన్న తారకరామనగర్‌లో తీవ్ర నీటి ఎద్దడి నెలకొని ఉందని రాష్ట్ర తెలుగు నాడు మెడికల్, హెల్త్ ఎంప్లాయిస్ యూనియన్ వర్కింగ్ ప్రెసిడెంట్ మలినేని భానుమూర్తి తెలిపారు. ఆరు రోజులుగా నీళ్లు రాక నానా ఇబ్బందులు పడుతున్నామని తెలిపారు. భూగర్భ జల మట్టం పూర్తిగా పడిపోవడంతో బోర్లు కూడా పని చేయటం లేదని అన్నారు. ఇప్పటికైనా మునిసిపల్ అధికారులు స్పందించి ప్రజలకు నీటిని సరఫరా చేయాలని విజ్ఞప్తి చేశారు. ఒకవేళ మునిసిపల్ కార్మికులు సమ్మెలో ఉంటే ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు. లేకపోతే తారకరామనగర్ ఆరో లైన్ వాసులు ధర్నా నిర్వహించాల్సి వస్తుందని స్పష్టం చేశారు.

శారదానికేతన్ అభివృద్ధి కార్యక్రమాలకు హాజరుకావాలి

● జనచైతన్య వేదిక రాష్ట్ర అధ్యక్షులు వల్లంరెడ్డి


కేంద్ర సహాయ మంత్రి డాక్టర్ చంద్రశేఖర్‌కు ఆహ్వాన పత్రిక అందజేస్తున్న లక్ష్మణ రెడ్డి తదితరులు

గుంటూరు కార్పొరేషన్, జూలై 18 (ఆంధ్రజ్యోతి): శారదానికేతన్ అభివృద్ధి కార్యక్రమాల శంకుస్థాపనకు హాజరు కావలసిందిగా గ్రామీణ అభివృద్ధి, కమ్యూనికేషన్ కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్‌ను ఆయన నివాసంలో జనచైతన్య వేదిక రాష్ట్ర అధ్యక్షుడు వల్లంరెడ్డి లక్ష్మణరెడ్డి, దేవదాయ శాఖ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ శారదానికేతన్ సెక్రటరీ జి.శ్రీనివాసరావులు కలిసి శుక్రవారం ఆహ్వానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గుంటూరులో 2/14 బ్రాడీపేటలో దాదాపు మూడు ఎకరాల విస్తీర్ణంలో శ్రీ శారదానికేతన్ స్థాపించారని, ఎంతోమంది దాతల సహకారంతో శ్రీ శారదా నికేతన్ అభివృద్ధి చెంది నేడు దాదాపు 500 మంది విద్యార్థినులకు ఉచితంగా విద్యతో పాటు భోజన వసతిని కల్పిస్తూ తోడ్పాటు అందిస్తుందని పెమ్మసాని చంద్రశేఖర్‌కు వివరించారు. నగరంలో దాతల సహకారంతో 4 తరగతి గదులను నిర్మించనున్నామని ఆగష్టు 13 తర్వాత శంకుస్థాపనకు హాజరు కావలసిందిగా పెమ్మసాని చంద్రశేఖర్‌ను కోరారు. పెమ్మసాని మాట్లాడుతూ శ్రీ శారదానికేతన్ వేలాది మంది పేద బాలికలకు విద్యతోపాటు, ఉచితంగా భోజన వసతి కల్పిస్తూ దిగ్విజయంగా కొనసాగుతున్న చారిత్రాత్మకమైన విద్యాలయంగా కొనియాడారు. ఉన్నవ లక్ష్మీనారాయణ దంపతుల కృషిని అభినందించారు. పార్లమెంట్ సమావేశాలు ఆగస్టు 12వ తేదీతో ముగుస్తాయని, అనంతరం తప్పకుండా శ్రీ శారదానికేతన్ అభివృద్ధి కార్యక్రమాలకు హాజరవుతానని పెమ్మసాని తెలిపారు.

నీటి ప్రాజెక్టులపై అంబటి వ్యాఖ్యలు హాస్యాస్పదం

గుంటూరు(తూర్పు), జూలై 18 (ఆంధ్రజ్యోతి): ప్రస్తుతం జరుగుతున్న నీటి ప్రాజెక్టులపై వైసీపీ జిల్లా అధ్యక్షుడు అంబటి రాంబాబు వ్యాఖ్యలు హాస్యాస్పదంగా ఉన్నాయని టీడీపీ రాష్ట్ర నాయకుడు కొర్రపాటి సురేష్ అన్నారు. స్థానిక నగరంపాలెంలోని టీడీపీ కార్యాలయంలో శుక్రవారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. అంబటి రాంబాబు ఇరిగేషన్ మంత్రిగా ఉన్న సమయంలో రాష్ట్రంలో ఒక్క ఇరిగేషన్ ప్రాజెక్టు కూడా పూర్తి చేయలేదని ఎద్దేవా చేశారు. డీపీఆర్‌ను ఆనాటి వైసీపీ ప్రభుత్వం సమర్పించకపోవడంతో కేంద్రం నిధులు విడుదల చేయలేదని అన్నారు. చివరికి సత్తెనపల్లి మీదుగా 6 వేల కోట్ల రూపాయల గోదావరి పెన్నా నదుల ప్రాజెక్టు సామగ్రిని కూడా వైసీపీ నాయకులు నాశనం చేశారని విమర్శించారు. అటువంటి రాంబాబు ఇరిగేషన్‌పై, చంద్రబాబు నాయుడు గురించి మాట్లాడటం విడ్డూరంగా ఉందన్నారు.

అనుమానాస్పద స్థితిలో ఆటో డ్రైవర్ మృతి

గుంటూరు, జూలై 18 (ఆంధ్రజ్యోతి) : స్థానిక అరండల్‌పేట పోలీస్ స్టేషన్ పరిధిలోని కళాకారుల కాలనీ మూడో లైన్లో కట్టా మహేష్ (32) అనే ఆటో డ్రైవర్ అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. అరండల్‌పేట పోలీసుల కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. మహేష్ చిన్న వయసులోనే కర్ణాటక రాష్ట్రం నుంచి వచ్చి గుంటూరులో ఉంటున్నాడు. నగరంలోని హనుమాన్‌నగర్‌కు చెందిన నాగ కుమారిని వివాహం చేసుకున్నాడు వీరికి ఇరువురు కుమారులు, కుమార్తె సంతానం ఉన్నారు. మహేష్ జీజీహెచ్ వద్ద ఆటో స్టాండ్‌లో ఆటో నడుపుతూ జీవనం సాగిస్తుంటాడు. కాగా 9 ఏళ్ల క్రితం భార్యాభర్తల మధ్య మనస్పర్థలు రావడంతో భార్య ముగ్గురు పిల్లలను తీసుకుని పుట్టింటికి వెళ్ళిపోయింది. అప్పటి నుంచి మహేష్ కళాకారుల కాలనీలో గది అద్దెకు తీసుకొని ఒంటరిగా ఉంటున్నాడు. అయితే మూడు రోజులుగా మహేష్ ఉంటున్న ఇంటి తలుపులు తీయలేదు. గది నుంచి దుర్వాసన వస్తున్నడంతో స్థానికులు ఇచ్చిన సమాచారం మేరకు అరండల్ పేట పోలీసులు ఘటనా స్థలానికి వెళ్ళి తలుపు పగలగొట్టి చూడగా మంచంపై మహేష్ మృతదేహం పూర్తిగా కుళ్ళిపోయి దుర్వాసన వస్తూ కనిపించింది. అయితే గదిలో ఆత్మహత్యకు సంబంధించిన ఎటువంటి ఆనవాళ్లు కనిపించలేదు. అనారోగ్య కారణంతో మృతి చెంది ఉంటాడని అనుమానిస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మార్చురీకి తరలించారు. భార్య నాగ కుమారి ఫిర్యాదు మేరకు అరండల్ పేట పోలీసులు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.


సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో కరపత్రాలను అందజేస్తున్న ఎమ్మెల్యే నసీర్

విజనరీ నేత చంద్రబాబు నాయకత్వం ఏపీకి వరం

● తూర్పు ఎమ్మెల్యే నసీర్
● 57వ డివిజన్లో 'సుపరిపాలనలో తొలి అడుగు'

గుంటూరు, జూలై 185(ఆంధ్రజ్యోతి) : విజనరీ లీడర్ నారా చంద్రబాబు నాయుడు ఆంధ్రప్రదేశ్‌ను అధోగతి నుంచి అద్భుతమైన రాష్ట్రంగా తీర్చుదిద్దుతున్నారని, అందుకే రాష్ట్రానికి ఆయన నాయకత్వం వరమని గుంటూరు తూర్పు ఎమ్మెల్యే నసీర్ అన్నారు. 'సుపరిపాలనలో తొలి అడుగు' కార్యక్రమంలో భాగంగా నగరంలోని 57వ డివిజన్లో శుక్రవారం ఆయన ప్రజలను కలిశారు. అన్ని వీధుల్లో పర్యటిస్తూ ప్రతి ఒక్కరినీ పేరుపేరునా పలకరిస్తూ ముందుకు కదిలారు. స్థానిక సమస్యల గురించి ప్రజలతోపాటు ఆ ప్రాంతానికి చెందిన నాయకులతో మాట్లాడి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గుంటూరు తూర్పు నియోజకవర్గం అభివృద్ధిలో సరికొత్త చరిత్ర లిఖిస్తున్నామని చెప్పారు. ఈ ప్రాంతవాసుల కల నందివెలుగు ఫ్లైఓవర్ నిర్మాణాన్ని అత్యంత వేగంగా పూర్తి చేసి ప్రజలకు అందించబోతున్నామని తెలిపారు. 19వ తేదీన నందివెలుగు బ్రిడ్జి శంకుస్థాపనకు ప్రజలు అధిక సంఖ్యలో హాజరవ్వాలని పిలుపునిచ్చారు. ఈ బ్రిడ్జి నిర్మాణం డెల్టా-గుంటూరు ప్రాంతానికి అనుసంధానంగా ఉంటుందని తెలిపారు. సీఎం చంద్రబాబు ఆధ్వర్యంలో గుంటూరు నగరం మళ్లీ అభివృద్ధి పథాన పయనిస్తోందన్నారు. గత ఐదేళ్ల కాలంలో యూజీడీ పనుల అలసత్వం, విపరీతమైన అవినీతి, చేతగానితనంతో నగరాభివృద్ధి 20 ఏళ్లు వెనక్కి వెళ్లిందని విమర్శించారు. అప్పటి నాయకులు ఎమ్మెల్యే పదవిని కేవలం వ్యాపారాలకు మాత్రమే ఉపయోగించుకున్నారని, అందుకే గుంటూరు తూర్పు నియోజకవర్గం అభివృద్ధిలో అట్టడుగుకు వెళ్లిందని విమర్శించారు. కేవలం ఏడాది కాలంలో నియోజకవర్గంలో ప్రతి ప్రాంతంపై ప్రత్యేక కార్యాచరణ ద్వారా అభివృద్ధికై అడుగులు వేశామని తెలిపారు. ఈ కార్యక్రమంలో రాజా మాస్టర్, డిప్యూటీ మేయర్ సజీల, శంకర్, ముకుందరావు, వాణి, వేములకొండ శ్రీనివాస్, ఎర్రగోపు నాగేశ్వరరావు, గణేష్, బలరాం, ఖాదర్, అరవపల్లి శ్రీను, రమేష్, మీరావలి, ఉమా, నవీన్, నారాయణ, షఫీ, గొడుగు శంకర్, హుస్సేన్, వినోద్, తదితరులు పాల్గొన్నారు.


శంకర్ విలాస్ బ్రిడ్జి విస్తరణలో భూ సేకరణకు అంగీకరించిన షాపుల యజమానులు ఐదుగురికి రూ.25 లక్షల 50వేల పరిహారాన్ని పంపిణీ చేస్తున్న పశ్చిమ ఎమ్మెల్యే గళ్లా మాధవి
-గుంటూరు (ఆంధ్రజ్యోతి).

జీడీసీసీ బ్యాంకు పురోభివృద్ధిలో నల్లపాటి పాత్ర ఎనలేనిది

● చైర్మన్ మక్కెన మల్లికార్జునరావు

గుంటూరు, జూలై 18(ఆంధ్రజ్యోతి): గుంటూరు జిల్లా కేంద్ర సహకార బ్యాంకు పురోభివృద్ధిలో బ్యాంకు చైర్మన్‌గా దివంగత నల్లపాటి శివరామ చంద్రశేఖరరావు పాత్ర ఎనలేనిదని బ్యాంకు చైర్మన్ మక్కెన మల్లికార్జునరావు ప్రశంసించారు. ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన బ్యాంకు మాజీ చైర్మన్ నల్లపాటి సంస్మరణ కార్యక్రమం బ్రాడీపేటలోని ఎన్టీఆర్ సహకార భవన్‌లో శుక్రవారం జరిగింది. ఈ సందర్భంగా మక్కెన మాట్లాడుతూ నల్లపాటి తన రాజకీయ జీవితంలో కూడా విలువలతో వ్యవహ రించారన్నారు. సహకార బ్యాంకు అభివృద్ధికి అనేక నిర్ణయాలు తీసుకున్నారన్నారు. ఈ సందర్భంగా నల్లపాటి శివరామచంద్రశేఖరరావు చిత్రపటానికి పూలమాలలతో నివాళులర్పించారు. కార్యక్రమంలో బ్యాంకు సీఈవో అజయ్‌కిషోర్, జీఎం కృష్ణవేణి, పలువురు అధికారులున్నారు.


నల్లపాటి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న చైర్మన్ మక్కెన, సీఈవో అజయ్‌కిషోర్ తదితరులు

27న పారా అథ్లెటిక్ ఛాంపియన్‌షిప్‌కు జిల్లా స్థాయి ఎంపికలు

గుంటూరు(తూర్పు), జూలై 18 (ఆంధ్రజ్యోతి) : జిల్లా పారా స్పోర్ట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 27 తేదీన గుంటూరు బీఆర్ స్టేడియంలో సబ్ జూనియర్, జూనియర్ విభాగాల్లో పారా అథ్లెటిక్ ఛాంపియన్‌షిప్‌కు ఉమ్మడి జిల్లా స్థాయి ఎంపికలు నిర్వహిస్తున్నట్టు అసోసియేషన్ సభ్యులు డాక్టర్ వై శ్రీనివాస్ గౌడ్, యల్లయ్య, వెంకటేశ్వర్లు ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపికైన క్రీడాకారులు ఆగస్టు 9న వైజాగ్‌లో జరిగే 6వ రాష్ట్ర స్థాయి, ఆగస్టు 22 నుంచి హర్యానాలో జరిగే జాతీయ స్థాయి ఛాంపియన్‌షిప్ పోటీలలో పాల్గొంటారని వివరించారు. ఆసక్తి కలిగిన క్రీడాకారులు ఈనెల 25 లోపు తమ పేర్లు నమోదు చేసుకోవాలని కోరారు. వివరాలకు 70135 69514, 91828 77433, 63048 57147 అనే నెంబర్లలో సంప్రదించాలని సూచించారు.

పారిశుధ్య పాఠం నేర్చేదెన్నడు?

- విస్తరిస్తున్న పిడుగురాళ్ల పట్టణం
- తగ్గట్లుగా కనిపించని పారిశుధ్య సిబ్బంది
- పారిశుధ్య లోపంతో అనారోగ్య సమస్యలు
- సమీపిస్తున్న వర్షాకాలం
- పూడుకుపోతున్న మురుగు కాల్వలు
- ఆక్రమణల నుంచి కలగని మోక్షం
- చిన్నపాటి వర్షాలకే రోడ్లన్నీ జలమయం



మురుగు కాల్వల్లో పేరుకుపోయిన వ్యర్థాలు



తహసీల్దార్ కార్యాలయం ఆవరణలో నిలిచిన వర్షపు నీరు



కాల్వపై నాపరాళ్లు పరిచిన దృశ్యం

పిడుగురాళ్ల, జూలై 18 (ఆంధ్రజ్యోతి): వర్షాకాలం సమీపిస్తున్నా.. మున్సిపల్ అధికారులు ముందస్తు పారిశుధ్య చర్యలకు పూనుకున్నట్లు కనిపించడం లేదు. పిడుగురాళ్ల పట్టణంలోని 33 వార్డుల్లో ప్రధాన రహదారిలోని సైడ్ డ్రెయిన్స్‌తో పాటు పలు వార్డుల్లో ఉన్న కాల్వలు చెత్తాచెదారంతో నిండిపోతున్నాయి. ప్రధాన రహదారుల వెంట దుకాణదారులు సైడ్ డ్రెయిన్స్‌ను స్లాబులు, నాపరాళ్లతో మూసివేయడంతో.. పారిశుధ్య కార్మికులు పూడిక తీసేందుకు వీలు పడటం లేదు. అద్దంకి - నార్కెట్‌పల్లి రహదారికి ఒకవైపు ఉన్న ప్రధాన సైడ్ డ్రెయిన్ ఓవర్ బ్రిడ్జి వద్ద నుంచి బస్టాండ్ వరకు ఆక్రమణకు గురైంది దుకాణదారులు పూర్తిగా దీనిని కప్పేశారు. కారంపూడి రోడ్డు, మాయాబజార్, వాసవి నగర్, రైల్వే స్టేషన్ రోడ్డులో సైడ్ డ్రెయిన్స్ అన్నీ ఆక్రమణలకు గురయ్యాయి.

పారిశుధ్య కార్మికులకు ఇబ్బందే

మురుగు కాల్వల పూడిక తీతకు పిడుగురాళ్ల పురపాలక సంఘంలో కాంట్రాక్ట్ కార్మికులతో కలిపి మొత్తం 111 మంది ఉన్నారు. అందులో సగం మందికి పైగా సెలవులతోనే గడుపుతారు. తాత్కాలిక సిబ్బందిని ఏర్పాటు చేసుకున్నప్పటికీ పట్టణం విస్తరిస్తున్న విధంగా.. పారిశుధ్య కార్మికుల సంఖ్య అందుకు తగ్గట్లు లేకపోవడంతో ఎక్కడికక్కడ పారిశుధ్యం అధ్వానంగా తయారైంది. కొన్ని వార్డుల్లో పారిశుధ్య సిబ్బంది రెండు రోజులకు ఒకసారి పారిశుధ్య పనులు నిర్వహించాల్సి వస్తోంది. మురుగు కాల్వలు ఆక్రమించిన దుకాణదారులకు మున్సిపల్ అధికారులు నోటీసులు ఇస్తున్నప్పటికీ.. వాటిని ఏమాత్రం లెక్క చేయడం లేదు. ఆక్రమణలు తొలగిస్తే వ్యతిరేకత వస్తుందేమోనన్న పాలకవర్గం ఆలోచన వారికి వరంలా మారింది.

గుణపాఠం నేర్చుకోవాలి

గతేడాది ఆగస్టులో పట్టణ సమీపంలోని లెనిన్ నగర్‌లో పారిశుధ్యం సమస్య, నీటి కలుషితం వల్ల ఎంతో మంది అనారోగ్యంపాలయ్యారు. మరికొంత మంది కొన్ని కారణాలతో మృతి చెందడం రాష్ట్ర వ్యాప్తంగా సంచలనం కలిగించింది. అప్పటికప్పుడు అధికారులు స్పందించినప్పటికీ కొంతమంది తీవ్ర అనారోగ్యానికి గురయ్యారు. మున్సిపల్ అధికారులు ఇప్పటికైనా గత అనుభవాలను దృష్టిలో పెట్టుకొని ముందస్తుగా మేల్కోకుంటే.. అలాంటి ఘటనలు పునరావృతమైనా ఆశ్చర్యపోవాల్సిన పనిలేదు. పెరుగుతున్న జనాభా, పట్టణ విస్తీర్ణానికి తగ్గట్టుగా పారిశుధ్య కార్మికుల సంఖ్య పెంచుకోవాల్సిన అవసరం ఉన్నప్పటికీ.. రాష్ట్ర ప్రభుత్వం నుంచి సరైన సూచనలు రాకపోవడంతో మున్సిపల్ అధికారులు ఉన్న కార్మికులతోనే కాలం గడుపుతూ వస్తున్నారు.

అరుదైన డెస్మాయిడ్ ట్యూమర్ తొలగింపు



కేసు వివరాలు వెల్లడిస్తున్న రమణ యశస్వి, జీవన్ స్రవంతి

- శ్రమించిన 11 మంది వైద్యుల బృందం
- మహిళకు కొత్త జీవితం ప్రసాదం

గుంటూరుమెడికల్, జూలై 18 (ఆంధ్రజ్యోతి): పది లక్షల మందిలో ఇద్దరికో, ముగ్గురికో వచ్చే అరుదైన డెస్మాయిడ్ ట్యూమర్‌తో ఆమె బాధపడుతోంది. కణితిని వెంటనే శస్త్ర చికిత్సతో తొలగించకుంటే క్యాన్సర్ ట్యూమర్‌గా మారే ప్రమాదం ఉంటుంది. అత్యంత ప్రమాదకరమైన ఈ ట్యూమర్‌ను శస్త్రచికిత్స చేసి తొలగించేందుకు ప్రైవేటు వైద్యులు సాహసించ లేదు. చివరి ప్రయత్నంగా బాధితురాలు.. గుంటూరు ప్రభుత్వాస్పత్రికి రాగా, ఆమె పరిస్థితి తెలుసుకొని చలించిన 11 మంది వైద్యుల బృందం అత్యంత నైపుణ్యంతో శస్త్రచికిత్స చేసి కణితిని తొలగించింది. దీంతో ఆమెకు కొత్త జీవితం లభించింది. వివరాల్లోకి వెడితే... గుంటూరుకు చెందిన జీవన్ స్రవంతి (28) రెండేళ్ల కిందట ఆంబ్లికల్ హెర్నియాకి ల్యాప్రోస్కోపిక్ సర్జరీ చేయించుకున్నారు. రెండు నెలల తర్వాత పొట్ట మీద కణితి ఏర్ప క్రమేపి పెరిగి పెద్దది కావడంతో చికిత్స కోసం ఆమె పలు ఆసుపత్రులను సంప్రదించారు. ఇది డెస్మాయిడ్ ట్యూమర్‌గా తెలిసిన ప్రైవేటు వైద్యులు సర్జరీ చేసేందుకు సాహసించ లేదు. చివరకు ఆమె జీజీహెచ్‌లో జనరల్ సర్జరీ ప్రొఫెసర్ డాక్టర్ వై.కిరణ్ కుమార్‌ను సంప్రదించారు. వైద్య పరీక్షల అనంతరం ల్యాప్రోస్కోపిక్ ఆపరేషన్ ద్వారా మెష్ వేసి కణితిని తొలగించారు. ఈ శస్త్ర చికిత్సలో జనరల్ సర్జరీ వైద్య బృందం కిరణ్ కుమార్, అరుణ, గీతిక, అక్షయ్, సత్యదేవ్, రవి, పావని, వెంకట రమణ పాల్గొన్నారు. పోలయ్య, శాంసన్, సంతోష్ తదితర ఎనస్థటిస్టులు మత్తు వైద్యం అందించారు. ఆపరేషన్ తర్వాత కూడా డెస్మాయిడ్ ట్యూమర్ మరలా వచ్చే గుణం ఉంటుందని, అందువల్ల రోగి తరచూ చెకప్ చేయించుకోవాల్సి ఉంటుందని ఆయన తెలిపారు. అతి క్లిష్టమైన శస్త్ర చికిత్సను విజయవంతంగా నిర్వహించిన జనరల్ సర్జరీ వైద్య బృందాన్ని జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ రమణయ శస్వి అభినందించారు.

రక్తం అందిస్తేనే.. ప్రసవం



, సత్తెనపల్లి ఏరియా వైద్యశాలలో పరీక్షలకు వచ్చిన గర్భిణులు

- ప్రతి ముగ్గురు గర్భిణుల్లో ఒకరికి రక్తహీనత
- పౌష్టికాహారం తీసుకోక బలహీనం
- సత్తెనపల్లి డివిజన్‌లో ఆందోళనకరంగా పరిస్థితి



పరీక్షిస్తున్న గైనకాలజిస్టు బి.అరుణ

సత్తెనపల్లి, జూలై 18 (ఆంధ్రజ్యోతి): ఇంటికి దీపం ఇల్లాలు. ఆమె ఆరోగ్యంగా ఉంటేనే కుటుంబం బాగుంటుంది. కానీ, సత్తెనపల్లి సబ్ డివిజన్ పరిధిలోని సత్తెనపల్లి, ముప్పాళ్ళ, రాజుపాలెం, బెల్లంకొండ, క్రోసూరు, అచ్చంపేట, పెదకూరపాడు మండలాలకు చెందిన పలువురు మహిళల్లో అది కూడా గర్భిణుల్లో చాలా మంది రక్త హీనతో బాధ పడుతుండటం ఆందోళన కలిగించే విషయం. సత్తెనపల్లి ఏరియా వైద్యశాలకు ఆయా మండలాల నుంచి గర్భిణులు, మహిళలు, బాలింతలు, బాలికలు చికిత్స నిమిత్తం వస్తుంటారు. వైద్యశాలలో గర్భిణులకు చికిత్స అందించే సమయంలో చాలా మందికి రక్తం ఎక్కించాల్సి వస్తోంది. గర్భిణులకు అంగన్ వాడీ కేంద్రాల్లో బాల సంజీవని పేరుతో కిట్లను పంపిణీ చేస్తున్నారు. నెలలో 25 కోడి గుడ్లు, ఐదు లీటర్ల పాలు, మూడు కేజీల విటమిన్‌లతో కూడిన బియ్యం అందిస్తున్నారు. కానీ, ఆశించిన స్థాయిలో ప్రయోజనం కన్పించడం లేదు. అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా అందిస్తున్న పోషకాహారాన్ని చాలా మంది గర్భిణులు తీసుకోవడం లేదు. ఈ విషయంలో నిర్లక్ష్యం చూపుతున్నారని స్త్రీ శిశు సంక్షేమ శాఖ అధికారులు, వైద్యులు చెబుతున్నారు.

2024 ఏప్రిల్ నుంచి ఈ ఏడాది మార్చి వరకు 7,128 మంది గర్భిణులకు పరీక్షలు నిర్వహిస్తే.. 2,761 మంది రక్త హీనతతో బాధ పడుతున్నట్లు వైద్యులు గుర్తించారు.

ఎన్నెన్నో సమస్యలు

రక్త హీనత బారిన పడిన మహిళల్లో చురుకుదనం లోపిస్తుంది. మెదడు, వెన్నెముక సమస్యలు వస్తాయి. తల్లి బలంగా ఉంటేనే శిశువు సైతం ఆరోగ్యంగా ఉంటుంది. రక్త హీనత బారిన పడిన గర్భిణుల శిశువుల్లో ఎదుగుదల ఉండదు. ప్రసవం జరిగాక కొన్ని రోజులు ఆస్పత్రిలోనే ఉండాల్సి వస్తోంది. అందుకే గర్భిణులు మంచి పోషకాహారం తీసుకోవాలని వైద్యులు సూచిస్తున్నారు.

సమతుల ఆహారం తప్పనిసరి

మహిళలు సమతుల ఆహారం తీసుకోవాలి. గర్భిణులు ఆకు కూరలు, పప్పు తప్పనిసరిగా ఉండేలా చూసుకోవాలి. రాగి జావలో బెల్లం కలుపుకొని తాగాలి. గర్భిణులు బాగా తింటేనే బిడ్డ ఎదుగుదల ఉంటుంది. తల్లిబిడ్డ ఆరోగ్యంగా ఉంటారు.

- డాక్టర్ బంకా అరుణ, గైనకాలజిస్టు

ఐరన్ మాత్రలు, ఇంజక్షన్‌లు అందిస్తున్నాం



వైద్యశాలకు వచ్చే గర్భిణుల్లో రక్త హీనతతో బాధ పడే వారిని గుర్తించి ఐరన్ మాత్రలు, ఐరన్ శుక్రోజ్ ఇంజక్షన్‌లు అందిస్తున్నాం. రక్త శాతం పెరిగేందుకు కృషి చేస్తున్నాం. డెలివరి సమయంలో రక్తం కూడా అందిస్తున్నాం.

- డాక్టర్ లక్ష్మణరావు, సూపరింటెండెంట్, సత్తెనపల్లి ఏరియా వైద్యశాల

నిఘా నేత్రాలతో నేరస్థుల ఆటకట్టు



వృద్ధురాలు రాజేశ్వరి మృతదేహం(ఫైల్)



ఓ అపార్ట్‌మెంటులోని సీసీ కెమెరా

తెనాలి మారీసు పేట జూలై18, (ఆంధ్రజ్యోతి): పెరిగిన సాంకేతిక పరిజ్ఞానం సహాయంతో పలు కీలక మైన కేసుల్లో నేరస్థులను గుర్తించేందుకు నిఘా నేత్రాలు కీలక పాత్ర పోషిస్తున్నాయి. సీసీ కెమెరాల వ్యవస్థ ప్రయోజనాలను గుర్తించిన పోలీసులు గృహాలు, వ్యాపార సముదాయాలకు అమర్చుకోవాలని అవగాహన కల్పిస్తున్నారు. దీంతో చాలా వరకు నేర నియంత్రణ జరిగినప్పటికీ.. అక్కడక్కడ కేసులనూ ఫుటేజీల సాయంతో ఛేదిస్తున్నారు. తెనాలి పట్టణంలో ముత్తెశెట్టి పాలెం కబేళా వంతెన సమీపంలో చిన్న టిఫిన్ కొట్టు నిర్వహించుకునే ఒంటరి వృద్ధురాలిని నగల కోసం ఇంటి పక్కనే ఉంటున్న యువకులు పక్కా ప్రణాళికతో హత్య చేశారు. గొంతు నులిమి ప్రాణం తీసి ఆమె ఇంట్లోనే మంచంపై పడుకోబెట్టి నగలు దొంగిలించారు. పోలీసులు కేసు విచారణలో.. సమీపంలోని సీసీ కెమెరాలను పరిశీలించగా యువకులు చేసిన ఘాతకం బట్టబయలైంది.

● అదే విధంగా మారీసుపేటలో నివసించే మరో వృద్ధురాలు ధరించిన బంగారంపై పరిసర ప్రాంతంలో ఉండేవారి కన్నుపడింది. ఒంటరిగా ఉన్న వృద్ధురాలి ప్రాణం తీసి సహజ మరణంగా చిత్రీకరించి నగలు అపహరించుకుపోయారు. దీనిపై కుటుంబ సభ్యులు సైతం సహజ మరణంగా తొలుత భావించిన, నగలు కనిపించక పోవడంతో.. పోలీసులను ఆశ్రయించారు. అలాగే పరిమి డొంక రోడ్డులో అప్పడాల కంపెనీ నిర్వాహకురాలు తన ఇంటిలో వియ్యపురాలితో కలసి నివాసముంటోంది. ఒకరికి ఒకరు తోడు నిలిచి జీవనం సాగిస్తున్నారు. ఇదే అదునుగా పట్టపగలే వారి ఇంటిలోకి ప్రవేశించి అద్దెకు షాపు విషయం మాట్లాడదామంటూ ఇంట్లోకి ప్రవేశించి వృద్ధురాళ్లను హత్య చేశారు. పై రెండు కేసుల్లో సీసీ కెమెరాలు నిందుతులను పట్టించగా మధ్య కేసులో కెమెరాలు లేకపోవడంతో అనుమానస్పద మృతిగానే మిగిలింది. ఒంటిరిగా ఉండే వృద్ధుల కుటుంబ సభ్యులు సీసీ కెమెరా ఆవస్యకతను గుర్తించి ఏర్పాటు చేసుకుంటే అగంతకులు అనుమానస్పద వ్యక్తులు ఇంటి ముందుకు రాగానే గుర్తించి చోరీలకు పాల్పడక ముందే వారిపై చర్యలు తీసుకునే అవకాశం ఉంటుందని పలువురు చెప్తున్నారు. పలు మిస్టరీ కేసులు కూడా నిందితులను గుర్తించడంలో సీసీ కెమెరాల సహకారం ఎంతో ఉంది.

ఏర్పాటు చేసుకోవాలి: సీఐ రమేష్ బాబు

పెరుగుతున్న నేరాలను అదుపు చేసేందుకు సీసీ కెమెరాలు ఎంతగానో దోహదపడుతున్నాయని త్రీటౌన్ సీఐ ఎస్ రమేష్‌బాబు అన్నారు. ఒంటరి వృద్ధులు, మహిళలు నివసించే ఇళ్లకు సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. పట్టణంలో జరిగిన పలు నేరాల్లో సీసీ కెమెరాల ద్వారా నేరగాళ్లను పట్టుకున్నామని చెప్పారు.

ఈ రోడ్డుకు మోక్షం లేదా?

- రోడ్డు అభివృద్ధికి వైసీపీ ప్రభుత్వంలో రూ.22 కోట్లు మంజూరు
- బిల్లులు రావన్న భయంతో కాంట్రాక్టర్ పరార్
- టెండర్ రద్దుతో అధ్వానంగా రోడ్డు
- నాలుగేళ్లుగా అవస్థల నడుమ ప్రయాణం





కాలువను తలపిస్తున్న తెనాలి - నేలపాడు రోడ్డు

తెనాలిరూరల్, జూలై 18(ఆంధ్రజ్యోతి): తెనాలి పట్టణం నుంచి కొల్లిపర మండలానికి నేలపాడు గ్రామీణ ప్రాంతం మీదుగా వెళ్లే రోడ్డు అధ్వానంగా తయారైంది. రోడ్డుకు వేసిన మెటల్ విడిపోయి తారు, గులకరాళ్లు సైతం రోడ్డు చివరలకు చేరి గుంతలమయంగా మారింది. దాదాపుగా 7కిలోమీటర్ల రోడ్డు గత వైసీపీ ప్రభుత్వంలో అభివృద్ధి చేసేందుకు టెండర్ ప్రక్రియను చేపట్టి.. కాంట్రాక్టర్‌కు రూ.22 కోట్లకు అప్పగించారు. నాలుగేళ్లు గడుస్తున్నా ఈ రోడ్డుకు మాత్రం మోక్షం కలగడం లేదు. గత ప్రభుత్వంలో రోడ్డు పనులు చేపట్టినప్పటికీ బిల్లులు రావన్న భయం కాంట్రాక్టర్‌ను వెంటాడటంతో పనులు నిలిచిపోయాయి. టెండర్ సమయం దాటుతున్నా పనులు చేపట్టకపోవడంతో మంజూరైన నిధులు వెన్నక్కి పోగా కాంట్రాక్ట్ సైతం రద్దయింది. దీంతో రోజులు గడుస్తున్న కొద్ది దాని రూపురేఖలు మారిపోయాయి. ప్రస్తుతం కురుస్తున్న వర్షాల కారణంగా రోడ్డు కాస్త కాలువ మాదిరిగా నీళ్లు నిలిచి దర్శనమిస్తోంది. ఈ రోడ్డుపై వెళ్లాలంటే వాహనదారులు సాహసం చేయాల్సి ఇక ఇదే మార్గంలో.. జగనన్న కాలనీలు సిరిపురం లేఅవుట్‌లు కూడా ఉన్నాయి. దాదాపుగా ఐదు వేల కుటుంబాలు నివసించేందుకు స్థలాలను అప్పటి ప్రభుత్వం మంజూరు చేసింది. అర్బన్ హెల్త్ సెంటర్‌ను సమీపంలోనే ఏర్పాటు చేసింది. రోడ్డు సరిగా లేకపోవడంతో.. సిరిపురం లే అవుట్‌లో స్థలాలు పొందిన లబ్ధిదారులు ఇళ్ల నిర్మాణానికి ముందుకు రావడంలేదు. తెనాలి ఐతానగర్ నుంచి నేలపాటు, సిరిపురం మీదుగా కొల్లిపర మండలానికి వెళ్లే వారు గతంలో తక్కువ దూరంతో ప్రయాణించవచ్చని ఈ మార్గాన్ని ఎంచుకునే వారు. పొలాలకు రైతులు సైతం ఈ మార్గంలోనే వెళ్లి రావాల్సి ఉంది. ప్రజలందరికి ఉపయోగపడే ఇటువంటి రోడ్డుపై అటు వైసీపీ ప్రభుత్వం నిర్లక్ష్యం చేయగా కూటమి ప్రభుత్వం దృష్టిపెట్టాల్సి ఉంది.

ఆనందం వేద జల్లుతున్నారు



జమ్ములపాలెం గ్రామంలోని పొలాలలో వెదపెడుతున్న దృశ్యం

బాపట్ల, జూలై 18 (ఆంధ్రజ్యోతి): బాపట్ల నియోజకవర్గ రైతులు ఆనందం 'వెద'జల్లుతున్నారు. సముద్ర తీర ప్రాంత గ్రామాలకు సాగు నీరు అందించే పీటీ చానల్‌కు 120 నుంచి 150 క్యూసెక్కుల నీరు విడుదల చేస్తున్నారు. తిమ్మరాజు కాల్వ ద్వారా సాగునీరు సరఫరా కావటంతో ఆయకట్టు రైతులంతా ఉత్సాహంగా వెద పెడుతున్నారు. బాపట్ల, కర్లపాలెం, పిట్టలవానిపాలెం మండలాల్లో ఈ ఏడాది రైతులు వెద సాగు చేసేందుకు ఆసక్తి చూపుతున్నారు. వరి నారు పెంచి.. నాట్లు వేస్తే సాగు ఆలస్యమవుతుందని భావించి ముందస్తుగానే వెదపెడుతున్నారు. అప్పికట్ల, చుండూరు పల్లి పరిసర ప్రాంతాల్లో ఇప్పటికే వెద పెట్టిన పొలాలు పచ్చని పైరుతో కళకళలాడుతున్నాయి. సముద్ర తీర ప్రాంతంలోని ఇసుక భూముల్లో కూడా వెద పెట్టారు. వర్షాభావ పరిస్థితులు ఏర్పడినప్పటికీ.. సాగు నీటికి ఎలాంటి ఇబ్బందులుండవని ఇరిగేషన్ అధికారులు భరోసానివ్వడంతో రైతులు ఉత్సాహంగా సాగు ప్రారంభించారు. కొంతమంది వరినారు పెంచుతున్నారు.



పీటీ చానల్‌లో ప్రవహిస్తున్న సాగునీరు



వెద పద్ధతి వరి చేనులో నిలిచిన వర్షపు నీరు

వెద పైరుకు.. వర్షపు జల్లు ఊపిరి

కొల్లూరు, జూలై 18 (ఆంధ్రజ్యోతి): వెద సాగు వరికి వరుణుడు జీవం పోశాడు. గురువారం సాయంత్రం, శుక్రవారం ఉదయం పడిన వర్షానికి.. పంటలు జీవం పోసుకుని కళకళలాడుతున్నాయి. ఈ వర్షాలతో మరో వారం రోజులు వరి పంటకు, నారుమళ్లకు నీటి తడులు అందించాల్సిన అవసరం లేదని, మళ్లీ అడపా దడపా వర్షాలు కురిస్తే పంటకు సాగునీరు అంది కళకళలాడతాయని రైతులు చెబుతున్నారు. వర్షాభావ పరిస్థితులతో ఖరీఫ్ ప్రారంభం నుంచి రైతులు ఇబ్బందులు పడ్డారు. కొల్లూరు, భట్టిప్రోలు మండలాల పరిధిలోని మాగాణి భూముల్లో ఎక్కువ శాతం వెద పద్దతిలో వరి సాగు చేశారు. మరికొందరు నారుమళ్లు పోశారు. జూలై నెల ప్రారంభం నుంచి వర్షపు జాడలు లేకపోవడంతో రైతులు వరి పంటకు, నారుమళ్లకు సాగునీరు అందించేందుకు బోర్లపై ఆధారపడ్డారు. ఇటీవల కాల్వలకు సాగు నీరు విడుదల అయినప్పటికీ పొలాలకు అందకపోవడంతో.. ఆయిల్ ఇంజన్లతో పంటకు తడులు అందించారు. విపరీతమైన వడగాలులు వీయడంతో రైతుల కష్టం కొరగాకుండా పోయింది. దీంతో వెద్ద పద్దతి వరి పంట, నారుమళ్లు సాగునీరు అందకపోవడంతో జీవం కోల్పోతున్నాయి. పైగా సాగు నీటి తడుల కోసం రైతులపై అదనపు వ్యయ భారం పడింది. ఈ క్రమంలో పడిన వర్షాలు రైతులకు కొంత ఊరటనిచ్చినట్లైంది.

నవ్య
కుటుంబ కదంబం
శనివారం • 19 జూలై 2025

వంటిల్లు

ఉసిరికాయతో నోరూరేలా

బజారులో ఉసిరికాయలు కనిపిస్తే కొనకుండా ఉండలేం. ఇవి చిన్న, పెద్ద సైజుల్లో లభ్యమవుతూ ఉంటాయి. మరీ చిన్నగా ఉండే రాశి ఉసిరి కాయలనైతే అసలు వదిలిపెట్టం. వెంటనే కొనుక్కుని ఉప్పు చల్లుకుని తినేస్తూ ఉంటాం. ఇలాంటి ఉసిరికాయలతో తయారు చేసే కమ్మని రుచులు మీకోసం...



ఉసిరి జ్యూస్

కావాల్సిన పదార్థాలు: ఉసిరికాయలు- నాలుగు, పుదీనా ఆకులు- ఎనిమిది, చిన్న అల్లం ముక్కలు- రెండు, ఉప్పు- చిటికెడు, తేనె- ఒక చెంచా, నిమ్మరసం- అర చెంచా, నీళ్లు- ఒక గ్లాసు

తయారీ విధానం: ఉసిరికాయలను నీళ్లతో కడిగి చిన్న ముక్కలుగా కోయాలి. అల్లం ముక్కలు, పుదీనా ఆకులను కూడా కడగాలి.

- మిక్సీలో ఉసిరికాయ ముక్కలు, పుదీనా ఆకులు, అల్లం ముక్కలు, ఉప్పు, తేనె, నిమ్మరసం వేసి నీళ్లు పోసి మెత్తగా గ్రైండ్ చేయాలి. ఈ మిశ్రమాన్ని ఒక గాజు గ్లాసులోకి వడబోయాలి. ఇందులో రెండు ఐస్ ముక్కలు వేసి సర్వ్ చేసుకోవడమే!

జాగ్రత్తలు

- ఇందులో కొద్దిగా బెల్లం, మిరియాల పొడి కూడా కలుపుకుని తాగవచ్చు.
- ఈ జ్యూస్‌లో చిటికెడు నల్ల ఉప్పు, జీలకర్ర పొడి వేసుకుంటే మరింత రుచిగా ఉంటుంది. వగరుగా ఉందనిపిస్తే మరో పావు చెంచా నిమ్మ రసం కలుపుకోవచ్చు.



ఉసిరికాయ పచ్చడి

కావాల్సిన పదార్థాలు: ఉసిరికాయలు- 11, నూనె- ఎనిమిది చెంచాలు, మినప్పప్పు- ఒకటిన్నర చెంచా, పచ్చి శనగ పప్పు- ఒక చెంచా, పచ్చి మిర్చి- 12, కరివేపాకు- రెండు రెమ్మలు, కొత్తిమీర- చిన్న కట్ట, ఉప్పు- అర చెంచా, చింతపండు- మూడు రెబ్బలు, వెల్లుల్లి రెబ్బలు- ఆరు, జీలకర్ర- అర చెంచా, ఆవాలు- అర చెంచా, ఇంగువ- పావు చెంచా, ఎండు మిర్చి- రెండు, పసుపు- పావు చెంచా

తయారీ విధానం: ఉసిరి కాయలను నీళ్లతో కడగాలి. తరవాత చాకుతో చిన్న ముక్కలుగా కోయాలి. కొత్తిమీరను తుంచి నీళ్లతో కడిగి ఉంచుకోవాలి. పచ్చిమిర్చిని ముక్కలుగా కోయాలి.

- స్టవ్ మీద గిన్నె పెట్టి రెండు చెంచాల నూనె వేసి వేడిచేయాలి. ఇందులో ఒక చెంచా మినప్పప్పు, పచ్చి శనగ పప్పు వేసి దోరగా వేపాలి. తరవాత పచ్చి మిర్చి ముక్కలు, కొద్దిగా కరివేపాకు, కొత్తిమీర వేసి చిన్న మంటమీద వేపాలి. వీటిని ఒక పళ్లెంలోకి తీయాలి. గిన్నెలో మరో మూడు చెంచాల నూనె వేసి వేడి చేయాలి. ఇందులో ఉసిరికాయ ముక్కలు, ఉప్పు వేసి కలపాలి. మూతపెట్టి చిన్న మంట మీద మగ్గించాలి. ఉసిరికాయ ముక్కలు మెత్తబడిన తరవాత చింతపండు రెమ్మలు వేసి కలపాలి. రెండు నిమిషాలు తరవాత స్టవ్ మీద నుంచి దించి చల్లారనివ్వాలి.
- మిక్సీలో పప్పులు-పచ్చి మిర్చి-కొత్తిమీర మిశ్రమం, ఉసిరికాయ ముక్కలు-చింతపండు మిశ్రమం, వెల్లుల్లి రెబ్బలు వేసి గ్రైండ్ చేయాలి. ఇందులో నీళ్లు పోయకూడదు. మధ్య మధ్యలో చెంచాతో కలుపుతూ బరకగా ఉండేలా గ్రైండ్ చేయాలి. తరవాత ఈ పచ్చడిని గిన్నెలోకి తీయాలి.
- స్టవ్ మీద చిన్న మూకుడు పెట్టి మూడు చెంచాల నూనె వేసి వేడి చేయాలి. ఇందులో అర చెంచా మినప్పప్పు, ఆవాలు, జీలకర్ర, ఇంగువ, ఎండు మిర్చి ముక్కలు, కరివేపాకు, పసుపు వేసి దోరగా వేపాలి. తరవాత గిన్నెలోని పచ్చడిని కూడా వేసి బాగా కలిపి స్టవ్ మీద నుంచి దించాలి. ఉప్పు సరిచూడాలి. ఇలా తయారు చేసుకున్న ఉసిరికాయ పచ్చడిని వేడి అన్నంలో కలుపుకుని తింటే బాగుంటుంది.

జాగ్రత్తలు

- ఉసిరికాయలను పది నిమిషాలు ఆవిరి మీద ఉడికిస్తే ముక్కలు కోయడం సులువుగా ఉంటుంది.
- పచ్చిమిర్చికి బదులు ఎండు మిర్చి కూడా వేసుకోవచ్చు.
- ఇష్టమైతే నువ్వులు లేదా పచ్చి కొబ్బరి ముక్కలు వేసుకోవచ్చు.
- రోట్లో దంచి తయారుచేసుకుంటే ఈ పచ్చడి మరింత రుచిగా ఉంటుంది.



ఉసిరికాయ పులిహోర

కావాల్సిన పదార్థాలు: ఉసిరికాయలు- ఆరు, బియ్యం- ఒక పెద్ద కప్పు, నూనె- మూడు చెంచాలు, వేరుశనగ గుండ్లు- రెండు చెంచాలు, పచ్చి శనగ పప్పు- ఒక చెంచా, మినప్పప్పు- అర చెంచా, ఆవాలు- అర చెంచా, పచ్చిమిర్చి- నాలుగు, ఎండు మిర్చి- మూడు, ఇంగువ- పావు చెంచా, పసుపు- అర చెంచా, కరివేపాకు- మూడు రెమ్మలు, ఉప్పు- ఒక చెంచా, నిమ్మకాయ- ఒకటి

తయారీ విధానం: ముందుగా బియ్యాన్ని కడిగి... పొడిపొడిగా ఉండేలా అన్నం వండాలి. ఈ అన్నాన్ని వెడల్పాటి గిన్నెలోకి తీసుకోవాలి. ఇందులో పావు చెంచా ఉప్పు, ఒక చెంచా నూనె, కొద్దిగా కరివేపాకు వేసి కలపాలి. ఉసిరికాయలను కడిగి చిన్న ముక్కలుగా కోయాలి. వీటిని మిక్సీలో వేసి బరకగా గ్రైండ్ చేయాలి.

- స్టవ్ మీద మందపాటి గిన్నె పెట్టి రెండు చెంచాల నూనె వేసి వేడి చేయాలి. ఇందులో ఆవాలు, వేరుశనగ గుండ్లు, పచ్చి శనగపప్పు, మినప్పప్పు వేసి దోరగా వేపాలి. తరవాత ఇంగువ, పసుపు, ఎండు మిర్చి, పచ్చిమిర్చి చీలికలు, కరివేపాకు వేసి బాగా కలపాలి. ఇవి రెండు నిమిషాలు వేగాక గ్రైండ్ చేసుకున్న ఉసిరికాయల పేస్టు, ముప్పావు చెంచా ఉప్పు వేసి కలపాలి. మూతపెట్టి రెండు నిమిషాలు మగ్గించాలి. తరవాత మూత తీసి ముందుగా సిద్ధం చేసుకున్న అన్నం, నిమ్మరసం వేసి బాగా కలపాలి. ఒక నిమిషం తరవాత స్టవ్ మీద నుంచి దించి సర్వ్ చేసుకోవాలి. ఈ ఉసిరికాయ పులిహోరను వేడిగా తింటే బాగుంటుంది. చల్లారాక కూడా రుచిగానే అనిపిస్తుంది.

జాగ్రత్తలు


- ఉసిరికాయ ముక్కలను మరీ మెత్తగా కాకుండా కొబ్బరి తురుంలా గ్రైండ్ చేయాలి.
- కొద్దిగా పచ్చి కొబ్బరి తురుం కలిపితే పులిహోర కమ్మగా ఉంటుంది.

రాశి ఉసిరికాయల పప్పు

కావాల్సిన పదార్థాలు: రాశి ఉసిరి కాయలు- ఒక కప్పు, కందిపప్పు- అర కప్పు, ఉల్లిపాయ- ఒకటి, టమాటాలు- రెండు, పచ్చిమిర్చి- ఎనిమిది, పసుపు- పావు చెంచా, నూనె- రెండు చెంచాలు, ఆవాలు- అర చెంచా, జీలకర్ర- ఒక చెంచా, ఎండు మిర్చి- రెండు, వెల్లుల్లి రెబ్బలు- అయిదు, ఇంగువ- పావు చెంచా, కరివేపాకు- రెండు రెమ్మలు, కొత్తిమీర- కొద్దిగా, ఉప్పు- తగినంత

తయారీ విధానం: రాశి ఉసిరికాయలను కడిగి ముక్కలుగా కోయాలి. లోపలి గింజలు తీసివేయాలి. పచ్చిమిర్చి, ఉల్లిపాయ, టమాటాలను కూడా చిన్న ముక్కలుగా కోసుకోవాలి. కందిపప్పును కడిగి నీళ్లు పోసి అర గంటసేపు నానబెట్టాలి.

- స్టవ్ మీద కుక్కర్ పెట్టి అందులో నానబెట్టిన కందిపప్పు, ఉల్లిపాయ ముక్కలు, టమాటా ముక్కలు, పచ్చిమిర్చి ముక్కలు, పసుపు వేసి తగినన్ని నీళ్లు పోయాలి. కుక్కర్ మీద మూత పెట్టి మూడు విజిల్స్ రానివ్వాలి. తరవాత కుక్కర్‌ను స్టవ్ మీద నుంచి దించాలి. ఆవిరి మొత్తం పోయిన తరవాత మూత తీసి ఉసిరికాయ ముక్కలు వేసి కలపాలి. కుక్కర్‌ను మరల స్టవ్ మీద పెట్టి రెండు విజిల్స్ రానిచ్చి దించాలి. స్టవ్ మీద వెడల్పాటి గిన్నె పెట్టి నూనె వేసి వేడి చేయాలి. ఆవాలు, జీలకర్ర, ఎండు మిర్చి ముక్కలు, కచ్చాపచ్చాగా దంచిన వెల్లుల్లి రెబ్బలు, ఇంగువ, కరివేపాకు వేసి దోరగా వేపాలి. తరవాత ముందుగా ఉడికించుకున్న పప్పు-ఉసిరికాయ ముక్కల మిశ్రమం, ఉప్పు వేసి బాగా కలపాలి. రెండు నిమిషాలు చిన్న మంట మీద మగ్గనివ్వాలి. చివరగా కొత్తిమీర తరుగు చల్లి స్టవ్ మీద నుంచి దించాలి. ఇలా తయారు చేసుకున్న రాశి ఉసిరికాయల పప్పు... వేడి అన్నం, చపాతీ, పూరీ, పుల్కాల్లోకి రుచిగా ఉంటుంది.



జాగ్రత్తలు

- రాశి ఉసిరి కాయల్లో లేత పసుపు రంగులో ఉండేవి పుల్లగా ఉంటాయి. వీటిని మాత్రమే వేసి పప్పు వండాలి. ఆకుపచ్చగా ఉండేవి వగరుగా ఉంటాయి.
- పప్పును మెత్తగా ఉడికించుకోవాలి. అప్పుడే రుచి బాగుంటుంది.
- కందిపప్పుకు బదులు పెసరపప్పుతో కూడా ఈ వంటకం చేసుకోవచ్చు.

భోజన కుతూహలం

మేలు చేసే మెంతి

మెంతి కూరని దీపనీ అంటారు. జఠరాగ్ని రాజిల్లజేస్తుంది కాబట్టి దీనికి ఈ పేరు వచ్చింది. మెంతి కూర చేదుగా ఉంటుంది కానీ ఆరోగ్యానికి చాలా మంచిది. మేథస్సుని పెంపు చేస్తుంది కాబట్టి మెంతికూరను 'మేథీ' అని కూడా అంటారు. దీనిని కొన్ని ప్రాంతాల్లో జ్యోతి అని కూడా పిలుస్తారు. దీనివల్ల మనకు అనేక ప్రయోజనాలు ఉన్నాయి.. అవేమిటో చూద్దాం..

- మెంతి కూర నాలుక మీద జిగురును తొలగిస్తుంది. నాలుకకు రుచి తెలిసేలా చేస్తుంది.
- వాత వ్యాధులతో బాధపడేవారికి ఇది మంచి ఔషధం. ఇది వేడిని పెంచుతుంది. అదే సమయంలో ఇది ఎసిడిటి పెంచుతుంది. అందువల్ల దీనిని కొద్దిగా తింటేనే మంచిది.
- అన్నం సహించటం లేదని సరిగ్గా తిండి అరగని వారికి మెంతికూర నోటికి రుచిని కలిగిస్తుంది.
- మధుమేహ వ్యాధి ఉన్నవారికి ఇది దివ్య ఔషధం. ప్రతి రోజూ క్రమం తప్పకుండా మెంతి కూర తింటే మధుమేహం నియంత్రణలో ఉంటుంది.
- మన శరీరంలోని విష దోషాలను ఇది హరిస్తుంది. రోగనిరోధక శక్తిని పెంచుతుంది.
- రుతుస్రావం రాని వారు ప్రతి రోజు మెంతి కూర తింటే మంచిది. గర్భశయ దోషాలు ఉన్నా అవి తొలగిపోతాయి.
- ఉబ్బస రోగులకు కూడా మెంతి కూర ఉపకరిస్తుంది. మెంతి కూర ఆకుల్ని సన్నగా తరిగి కందిపప్పుతో ఉడికించి.. తాలింపు పెడితే రోగనిరోధక శక్తి బాగా పెరుగుతుంది.

- మెంతి ఆకులను ఎండబెట్టి మెత్తగా దంచి సీసాలో భద్రపరుచుకుంటారు. ఈ పొడిని కసూరి మెంతి అని పిలుస్తారు. అన్ని రకాల కూరలలోను దీనిని ఉపయోగించుకోవచ్చు.
- మెంతి ఆకుల గుజ్జును తలకు పట్టిస్తే జుట్టు మృదువుగా ఉంటుంది. ఈ గుజ్జును ముఖానికి రాసుకుంటే మొటిమలు తగ్గుతాయి.

\- గంగరాజు అరుణాదేవి



నూనె మరకలా..?

ఒక్కోసారి దుస్తుల మీద నూనె మరకలు ఎంత ప్రయత్నించినా వదలవు. ఈ చిట్కాలతో వాటిని వదిలించుకోవచ్చు.

- నూనె మరక మీద కొద్దిగా బేకింగ్ సోడా చల్లాలి. పది నిమిషాలు అలాగే ఉంచాలి. తరవాత పాత టూత్ బ్రష్‌తో రుద్దితే నూనె మరక మాయమవుతుంది. గంజి పొడి వేసి రుద్దినా ఫలితం కనిపిస్తుంది.
- చిన్న గిన్నెలో నాలుగు చుక్కల వెనిగర్ వేసి రెండు చుక్కల నీళ్లు చిలకరించి బాగా కలపాలి. ఈ మిశ్రమాన్ని చూపుడు వేలితో తీసుకుని మరక మీద రుద్దాలి. అయిదు నిమిషాల తరవాత మంచినీళ్లతో కడిగేస్తే నూనె మరక తొలగిపోతుంది.



- మరక పడిన దుస్తులను చల్లని నీళ్లలో ముంచి తీయాలి. తరవాత మరక మీద కలబంద గుజ్జు వేసి రుద్దితే ఫలితం ఉంటుంది.
- నూనె మరక మీద రెండు చుక్కల నిమ్మ రసం వేసి పది నిమిషాలు అలాగే ఉంచాలి. తరవాత దుస్తులను మామూలుగా ఉతికి ఆరేస్తే సరిపోతుంది.

మేకప్

ముఖం కోలగా.. కోమలంగా...

గుండ్రటి ముఖాన్ని కోలగా కనిపించేలా చేయడం కోసం కొన్ని మేకప్ మెలకువలు పాటించాలి. వ్యూహాత్మకమైన కాంటూరింగ్, కళ్లను తీర్చిదిద్దుకునే విధానాలకు స్వల్ప మార్పులు చేసుకుంటే గుండ్రని ముఖం కోలగా కనిపిస్తుంది. ఆ మెలకువల గురించి లోతుగా తెలుసుకుందాం!



కాంటూర్ ఇలా: చర్మపు రంగుకు రెండింతలు ముదురు రంగులో ఉండే కాంటూరింగ్ షేడ్ ఎంచుకోవాలి. చెవుల దగ్గరి నుంచి మొదలుపెట్టి, చెక్కిళ్ల మధ్యలోకి బ్లెండ్ చేయాలి. ఈ టెక్నిక్‌తో చెక్కిళ్ల ఎముకలు స్పష్టంగా కనిపించడంతో పాటు ముఖం కోలగా మారిపోతుంది

- అలాగే నుదుటి దగ్గరి వెంట్రుకలతో పాటు, దవడ దగ్గర కూడా కాంటూర్ చేసుకుంటే ముఖ పరిమితులు స్పష్టంగా కనిపిస్తాయి.

హైలైటింగ్: ముఖంలో ఎత్తుగా కనిపించే ప్రదేశాల్లో హైలైటర్ అప్లై చేయాలి. చెక్కిళ్ల ఎముకలు, ముక్కు దూలం, కనుబొమల ఎముకలు, చుబుకం దగ్గర హైలైటర్ అద్దుకోవాలి. ఆయా ప్రదేశాల్లో వెలుగు ప్రతిఫలించి, ఉబ్బెత్తుగా కనిపిస్తాయి

- లైట్ హ్యాండ్ హైలైటర్‌ను ఎంచుకుంటే ఆయా ప్రదేశాలు అసహజమైన మెరుపును సంతరించుకోవు.

కనుబొమలు: కనుబొమలు పైకి లేచినట్టుగా తీర్చిదిద్దుకుంటే ముఖం కోలగా కనిపిస్తుంది

- అందుకోసం బ్రో పెన్సిల్ లేదా పౌడర్‌తో కనుబొమలను తీర్చిదిద్దుకోవాలి. అలాగే కనుబొమల ఎముకలను హైలైట్ చేసుకోవాలి

కళ్లు: ఐలైనర్‌తో కళ్ల చివర్లను వంపు తిప్పుకోవాలి. దీంతో ముఖం కోలగా మారిపోతుంది

- కళ్లు పెద్దవిగా కనిపించడం కోసం పైకనురెప్పలకు తప్పనిసరిగా మస్కారా అద్దుకోవాలి
- ముదురు రంగు ఐ షాడోను కనురెప్పల పైన అద్దుకుని, చివర్లలో తేలిక రంగు షాడోను అద్దుకోవాలి.

చెత్త బుట్టను ఇలా ఉంచుకోవాలి...

చెత్త బుట్టలో ఆహార వ్యర్థాలు, ఇతర చెత్తాచెదారం వేస్తూ ఉంటాం. వీటివల్ల చెత్త తొలగించినా ఒక్కోసారి బుట్టలో ఈ దుర్వాసన వదలదు. చిన్న చిట్కాలతో దుర్వాసన రాకుండా ఎలా ఉంచుకోవాలో తెలుసుకుందాం.

- చెత్తను తొలగించిన ప్రతిసారీ... బుట్టను నీళ్లతో శుభ్రంగా కడగాలి. వారానికి ఒకసారి ఖాళీ చెత్త బుట్టలో ఒక చెంచా బ్లీచింగ్ పౌడర్ లేదా కొద్దిగా వెనిగర్ వేసి పొడవాటి బ్రష్‌తో రుద్దాలి. తరవాత వేడినీళ్లు పోసి కడిగి ఎండలో ఆరబెట్టాలి.
- శుభ్రం చేసిన చెత్త బుట్టలో అడుగున కొద్దిగా బేకింగ్ సోడా చల్లాలి. దానిమీద మందపాటి పొడవైన కాగితాన్ని పరచాలి. ఈ కాగితం... బుట్ట పై భాగం వరకూ వచ్చేలా అమర్చాలి. దీనివల్ల వ్యర్థ పదార్థాల తేమను కాగితం పీల్చుకుంటుంది. బుట్ట పొడిగా శుభ్రంగా ఉంటుంది.



- బుట్టను వంటగదిలో పెట్ట కూడదు. బాల్కనీలో ఓ మూలగా పెట్టాలి. దీనివల్ల వ్యర్థ పదార్థాలు గాలికి ఆరుతూ కుళ్లిపోకుండా ఉంటాయి. బుట్ట నుంచి దుర్వాసన కూడా రాదు.
- వాడేసిన నిమ్మ, నారింజ తొక్కలను ఎండబెట్టి వాటిని చెత్త బుట్టలో అడుగున వేసినా మంచి ఫలితం ఉంటుంది.
- తడి, పొడి చెత్తలకు వేర్వేరు బుట్టలు ఏర్పాటు చేసుకోవాలి.

సెలబ్ ఫిట్

ఆరోగ్యమే అందం..!

వెండితెరపైనే కాదు... నిజ జీవితంలోనూ ఉత్సాహంగా... ఉత్తేజంగా కనిపిస్తుంది దీపికా పదుకోన్.
ప్రకాష్ పదుకోన్ వారసురాలిగా బ్యాడ్మింటన్ రాకెట్ పట్టినా... ఆ తరువాత సినిమాల మీద మక్కువతో మైదానం వదిలేసింది.
నాడు బాలీవుడ్‌లో ఎంట్రీ ఇచ్చినా... నేడు ప్రభాస్ 'స్పిరిట్' నుంచి తప్పుకున్నా... ఆమె ప్రతి అడుగూ ఒక సంచలనం.
ఎనిమిది గంటల పని సమయాన్ని మరోసారి తెరపైకి తెచ్చి... చిత్రసీమలో ఆదాయంతో పాటు ఆరోగ్యకర జీవనానికి ప్రాధాన్యం ఇవ్వాలనే సందేశాన్ని ఇచ్చింది.

'క్లిష్ట పరిస్థితులు ఎదురైనప్పుడల్లా నా మనసు చెప్పింది వింటాను. ఆ తరువాతే నిర్ణయాలు తీసుకొంటాను. ఆ నిర్ణయాలకు కట్టుబడే క్రమంలో ఎలాంటి సవాళ్లనైనా ఎదుర్కొంటాను. జీవితంలో సమతులంగా ఉండాలంటే నిజాయితీ ముఖ్యం. అలా ఉండడానికే నేను ప్రాధాన్యత ఇస్తాను' అంటూ ఆ మధ్య ఓ ఫ్యాషన్ షో సందర్భంగా దీపికా పదుకోన్ చెప్పుకొచ్చింది. అంతేకాదు... రోజుకు ఎనిమిదికి మించిన పని గంటలు తగదంటూ మరో సందర్భంలో వ్యాఖ్యానించింది. కొంత కాలంగా అటు బాలీవుడ్‌లో... ఇటు సామాజిక మాధ్యమాల్లో దీనిపై తీవ్ర చర్చ జరుగుతోంది. పని గంటలు ఎక్కువగా ఉన్న కారణంగానే దీపిక ఓ బడా ప్రాజెక్ట్ నుంచి తప్పుకున్నదనే వార్తలు చక్కర్లు కొడుతున్నాయి.

గత ఏడాది సెప్టెంబర్‌లో పాపకు జన్మనిచ్చిన దీపిక... తిరిగి షూటింగ్‌లో పాల్గొంటున్న సందర్భంగా... 'ప్రస్తుతం నేను మాతృత్వపు మాధుర్యాన్ని ఆస్వాదిస్తున్నాను. ఇకపై బిడ్డకు తల్లిగా నా బాధ్యతలు నిర్వర్తిస్తూనే షూటింగ్‌లో పాల్గొనాలి. ఇది ఎప్పుడూ సవాలే' అంటూ తన అనుభవాలు పంచుకుంది. ఈ కారణంగానే ఆమె పని గంటల విషయంలో రాజీపడడం లేదనేది బాలీవుడ్‌లో వినిపిస్తున్న మాట. కుటుంబంతో సమయాన్ని గడపకపోతే జీవితంలో ఎంత సాధించినా అది విజయం కాదని, నిజాయతీ గల దర్శకనిర్మాతలు పని గంటల విషయంలో వ్యతిరేకంగా ఉండరని హిందీ హీరోలు సైఫ్ అలీఖాన్, అజయ్ దేవ్‌గణ్ పరోక్షంగా దీపికకు మద్దతు తెలిపారు. వీటికి తోడు ఆరోగ్యానికి అత్యధిక ప్రాధాన్యం ఇవ్వాలనేది దీపికతోపాటు మరికొందరి వాదన. ఏదిఏమైనా... పరిశ్రమలోకి వచ్చి ఇన్నేళ్లయినా... బిడ్డకు తల్లి అయినా... నేటికీ దీపికలో అవే మెరుపులు. బిజీ షెడ్యూల్స్‌తో ఉక్కిరిబిక్కిరి అవుతున్నా... గంటల తరబడి కెమెరా ముందు గడిపినా... ముఖంలో చిరునవ్వు చెదరదు. ఉత్సాహం ఇసుమంతైనా తగ్గదు. అందుకు ప్రధాన కారణం... క్రమం తప్పని వ్యాయామం, దృఢమైన ఆరోగ్యమే అంటుంది ఈ బ్యూటీ.

ఆకలి వేసినప్పుడే...

ఇడ్లీ- సాంబార్, ఉప్మా, దాల్ రైస్ తదితర దక్షిణాది వంటకాలు దీపిక మెనూలో కచ్చితంగా ఉంటాయి. సాధ్యమైనంత వరకు ఇంటి నుంచే తెప్పించుకుంటుంది. అలాగే చైనీస్ ఫాస్ట్ ఫుడ్స్ కూడా. డార్క్ చాక్లెట్, సేవ్ పూరీ బాగా ఇష్టం. రెండు గంటలకు ఒకసారి... అలా రోజుకు ఆరుసార్లు ఆహారం తీసుకుంటుంది. దీపిక... నచ్చింది తినేస్తుంది. కాకపోతే మితంగా. అందులో పోషక విలువలు పుష్కలంగా ఉండేలా జాగ్రత్తలు తీసుకొంటుంది. 'కంటికి నచ్చిందని కాకుండా... ఆకలి వేసినప్పుడు కడుపుకు సరిపడానే తినాలి. అతిగా తినకూడదు' అంటుంది దీపిక.

- ఉదయం నిద్ర లేవగానే నిమ్మ రసం, తేనె కలిపిన గోరువెచ్చటి నీరు. లేదంటే రాత్రంతా నానబెట్టిన మెంతులతో ఒక కప్పు నీళ్లు.
- బ్రేక్‌ఫాస్ట్‌లో ఎక్కువగా రెండు ఎగ్ వైట్, బ్రెడ్ టోస్ట్ లేదంటే ఇడ్లీ, రవ్వ దోశ. ఒక వేళ బెంగళూరు ఇంటికి వెళితే... కప్పు ఫిల్టర్ కాఫీ, ఇడ్లీ సాంబార్.
- మధ్యాహ్న భోజనానికి రెండు గంటల ముందు... ఒక బౌల్ కూరగాయలు, పండ్ల ముక్కలు. దీనివల్ల లంచ్‌లో అతిగా తినే అవసరం ఉండదనేది ఈ భామ ఆలోచన.
- మధ్యాహ్న భోజనంలో ఒక్కో రోజూ ఒకో వెరైటీ ఉంటుంది. అందులో పోషక విలువలు తప్పనిసరి. కొన్నిసార్లు సబ్జీ, దాల్, రోటీతో సరిపెడితే... మరికొన్నిసార్లు రెండు చపాతీలు, గ్రిల్డ్ ఫిష్, కాయగూరల ముక్కలతో లంచ్ ఆస్వాదిస్తుంది. లేదంటే చారు అన్నం ఆమె మెనూలో చేరుతుంది.
- సాయంత్రం స్నాక్స్‌లో బాదం, పిస్తా లాంటి డ్రైఫ్రూట్స్, కప్పు ఫిల్టర్ కాఫీ.
- రాత్రిపూట మితాహారం. రెండు చపాతీలు, వెజిటబుల్స్ గ్రీన్ సలాడ్, కొబ్బరి నీళ్లు. ఎప్పుడైనా తీపి తినాలనిపిస్తే ఒక చిన్న డార్క్ చాక్లెట్.

వ్యాయామం ఇలా...

- రన్నింగ్, స్కిప్పింగ్, బ్రిస్క్ వాకింగ్‌లతో వార్మప్. 'వర్కవుట్‌కు ముందు వార్మప్ తప్పనిసరి. అప్పుడే తీవ్రంగా సాగే వర్కవుట్ సెషన్‌కు శరీరం సిద్ధమవుతుంది' అనేది దీపిక మాట.
- తరువాత బ్యాండ్ స్ట్రెచ్, నీ టూ చెస్ట్ స్ట్రెచ్, చైల్డ్ పోజ్, సైడ్ లంగెస్. వీటివల్ల శరీరం చువ్వలా ఎటు కావాలంటే అటు వంగుతుంది.
- అప్పుడప్పుడు కిక్ బాక్సింగ్, బ్యాడ్మింటన్, డ్యాన్స్, స్విమ్మింగ్ కూడా వచ్చి చేరుతుంటాయి.
- పిలెట్స్ వర్కవుట్ రోజూ ఉండాల్సిందే. దీనివల్ల కండరాలు దృఢంగా మారతాయి. బాడీ బ్యాలెన్స్‌డ్‌గా ఉంటుంది. ఆరోగ్యమే అందం. అందుకు క్రమబద్ధమైన జీవనశైలి ఒక్కటే మార్గం అనేది సెలబ్రిటీ ట్రైనర్ల మాట.



24న అల్పపీడనం

విశాఖపట్నం/అమరావతి, జూలై 18(ఆంధ్రజ్యోతి): ఎండలతో అల్లాడుతున్న ప్రజలకు, రైతులకు ఇక వర్షాలతో ఉపశమనం లభించనుంది. దక్షిణ కోస్తా పరిసరాల్లో శుక్రవారం ఉపరితల ఆవర్తనం ఏర్పడింది. మరోవైపు చెన్నై మీదుగా తూర్పు, పడమరకు ద్రోణి విస్తరించింది. వీటి ప్రభావంతో బంగాళాఖాతం నుంచి భారీగా తేమగాలులు కోస్తాపైకి వీస్తున్నాయి. దీంతో కోస్తాలో అనేకచోట్ల రుతుపవనాలు చురుగ్గా మారి గురువారం రాత్రి నుంచి వర్షాలు కురుస్తున్నాయి. శని, ఆదివారాల్లో కోస్తా, రాయలసీమల్లో అనేకచోట్ల భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ తెలిపింది. రాష్ట్రంలో రెండు రోజుల పాటు పిడుగులతో కూడిన వర్షాలు కురుస్తాయని విపత్తుల నిర్వహణ సంస్థ తెలిపింది. గురువారం ఉదయం నుంచి శుక్రవారం ఉదయం వరకు గుంటూరు జిల్లా వంజిపురంలో 130.5, ప్రకాశం జిల్లా టంగుటూరులో 123.25, గుంటూరు జిల్లా నల్లపాడులో 106.3, కడప జిల్లా కామకుంటలో 103 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. అలాగే శుక్రవారం రాత్రి 7 గంటల వరకు కోనసీమ జిల్లా ముమ్మిడివరంలో 67.7 మిల్లీమీటర్ల వర్షం కురిసింది. కాగా సుదీర్ఘకాలం ఎండలు, వర్షాభావం కొనసాగిన కోస్తా, రాయలసీమల్లో వర్షాలు ప్రారంభం కావడం ఖరీఫ్ పంటలకు ప్రాణం పోసినట్టయిందని వాతావరణ నిపుణుడొకరు తెలిపారు. ఈనెల 22 వరకు రాష్ట్రంలో ఈ వర్షాలు కొనసాగుతాయని వివరించారు. కాగా, ఈనెల 24న ఉత్తర బంగాళాఖాతంలో అల్పపీడనం ఏర్పడనుందని చెప్పారు.

చారిత్రక నవలా రచయిత సాధు సుబ్రహ్మణ్యం శర్మ కన్నుమూత

- బంకోలా నవల ద్వారా ప్రత్యేక గుర్తింపు


సాధు సుబ్రహ్మణ్యం శర్మ

హైదరాబాద్ సిటీ, కాకినాడ కార్పొరేషన్, జూలై 18 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ నవలా రచయిత సాధు సుబ్రహ్మణ్యం శర్మ (94) కాకినాడలోని తన స్వగృహంలో శుక్రవారం తుది శ్వాస విడిచారు. కొంత కాలంగా వయసు రీత్యా తలెత్తే ఆరోగ్యసమస్యలతో ఆయన బాధ పడుతున్నారు. చారిత్రక నవల బంకోలాతో సుబ్రహ్మణ్యం శర్మ తెలుగుసాహిత్యంలో సుస్థిర స్థానం సంపాదించు కున్నారు. ఆయన స్వస్థలం ఉమ్మడి అనంతపురం జిల్లా మానె సముద్రం. ఉద్యోగ రీత్యా ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాకు వచ్చి అక్కడే స్థిరపడ్డారు. పరిశ్రమల శాఖలో జనరల్ మేనేజర్ హోదాలో 1990లో ఉద్యోగ విరమణ పొందారు. 1981లో 'బంకోలా' నవల రాశారు. 1830లో వచ్చిన పెనుఉప్పెన కోరంగి ఓడరేవును ముంచేయడాన్ని ఇతివృత్తంగా చేసుకుని ఈ నవల రాశారు. 'సాధువాడి మాట- నవ సహస్రాబ్ది బాట', 'కాల వాహిని', 'సాధు బాల శిక్ష'.. ఆయన ఇతర రచనలు. కాగా, శుక్రవారం సాయంత్రం కాకినాడలో సుబ్రహ్మణ్యం శర్మ అంత్యక్రియలు పూర్తయినట్లు కుటుంబసభ్యులు తెలిపారు.

వణికిస్తున్న పార్కిన్సన్స్..!



పార్కిన్సన్స్... దీన్నే వణుకుడు వ్యాధి లేదా కంపవాతం అని పిలుస్తారు. వృద్ధుల్లో ఈ వ్యాధి ఎక్కువగా వస్తుంది. సాధారణంగా 60 ఏళ్లు పైబడిన వారిలో చురుకుదనం తగ్గుతుంది. నడక నెమ్మదిస్తుంది. కుర్చీలో నుంచి లేవడమూ కష్టమవుతుంది. తేలికైన పనులు కూడా చేయలేరు. కొన్నిసార్లు శరీరంలోని ఒక వైపు భాగాలు వణుకుతుంటాయి. ఇలాంటి లక్షణాలను చాలామంది వయసు పైబడడం వల్ల వస్తుంటాయని భావిస్తుంటారు. కానీ.. ఇవి పార్కిన్సన్స్ లక్షణాలు కావొచ్చు..! పార్కిన్సన్స్ అనేది మెదడుకు సంబంధించిన రుగ్మత. ఇటీవల దీని బారినపడుతున్న వారి సంఖ్య పెరుగుతోంది. రాష్ట్రంలోనూ ఇది చాప కింద నీరులా విస్తరిస్తోంది..!

మెదడుపై ప్రభావం చూపే రుగ్మత.. దీర్ఘకాలిక సమస్యగా పార్కిన్సన్స్

- స్టేజ్-5లో మంచానికే పరిమితం.. సమస్య ముదిరితే చేతులెత్తేస్తున్న వైద్యులు
- ముందుజాగ్రత్త అవసరమంటున్న నిపుణులు
- ఏపీలో ఇటీవల పెరుగుతున్న బాధితులు

(అమరావతి - ఆంధ్రజ్యోతి)


శరీరంలో మెదడు చాలా కీలకమైనది. అయితే వయస్సు పెరిగే కొద్దీ మన మెదడు పనితీరు తగ్గుతుంది. దీనివల్ల జ్ఞాపకశక్తి, ఆలోచనా సామర్థ్యం తగ్గుతుంది. ఇలాంటి సమస్యలే పార్కిన్సన్స్‌కు దారితీస్తాయి. మానవ శరీరంలో వేగస్ అనే నరం పేగులో ప్రారంభమై మెదడు వరకూ ఉంటుంది. పార్కిన్సన్స్ సమస్య తొలుత ఈ వేగస్ నరంలోనే మొదలవుతుంది. ప్రారంభంలో ఎలాంటి సమస్యా ఉండదు. కానీ.. కొన్నేళ్ల తర్వాత మెదడు ముఖ్యమైన డోపమైన్, ఎపినెఫ్రిన్ వంటి హార్మోన్లను విడుదల చేయడం తగ్గిస్తుంది. అప్పటి నుంచి పార్కిన్సన్స్ సమస్య మొదలైనట్టే. దీన్ని ముందుగానే గుర్తిస్తే స్టేజ్-5 వరకూ వెళ్లకుండా నయం చేసుకునే అవకాశం ఉంటుంది. నిర్లక్ష్యం చేస్తే మాత్రం ప్రాణాప్రాయ స్థితి తప్పదు. మనిషి రోజువారీ పనులు చేసుకునేందుకు సహాయపడే డోపమైన్ హార్మోన్ మెదడు నుంచి తక్కువగా విడుదల కావడం వల్లనే పార్కిన్సన్స్ వ్యాధి వస్తుంది. 60 ఏళ్లు దాటిన వారిలో ఎక్కువగా ఈ సమస్య కనిపిస్తుంది. పార్కిన్సన్స్ స్త్రీలకంటే పురుషుల్లో ఎక్కువగా వచ్చే అవకాశం ఉంటుంది. కుటుంబంలో ఎవరైనా పార్కిన్సన్స్ బాధితులు ఉంటే ఇతరులకూ వచ్చే అవకాశం ఉంటుంది. గాలి కాలుష్యంతో పాటు మనం తినే ఆహారం వల్ల కూడా ఈ వ్యాధి వస్తుంది. ఈ రోజుల్లో వ్యవసాయంలో పురుగు మందుల వాడకం అధికమైంది. ఇలా పండించే ఆహార పదార్థాల్లో విషపూరిత రసాయనాలు అధికంగా ఉంటాయి. అలాంటి ఆహారం తినడం వల్ల కూడా మెదడులో డోపమైన్ రసాయనం ఉత్పత్తి తగ్గి పార్కిన్సన్స్ బారిన పడుతుంటారు.

వ్యాధి లక్షణాలు...

తల, చేతులు వణకడం పార్కిన్సన్స్ ప్రధాన లక్షణం. వీటితోపాటు శరీరంలో వణుకు, మాట తడబడడం, ఆహారం మింగడంలో ఇబ్బంది, వాసన కోల్పోవడం, నడకలో వేగం తగ్గిపోవడం, కదలికలు నెమ్మదించడం, కండరాలు బిగుసుకుపోవడం వంటి లక్షణాలు కనిపిస్తాయి. మూత్ర సంబంధమైన సమస్యలు, మలబద్ధకం, రక్తపోటులో హెచ్చుతగ్గులతో పాటు కుంగుబాటు, ఆందోళన, నిద్రలేమి వంటి సమస్యలు కూడా కనిపిస్తాయి. ఆరంభ దశలో ఒకవైపు భాగాల్లోనే వణుకు ఉండొచ్చు. వ్యాధి ముదురుతున్న కొద్దీ రెండోవైపు కూడా వణుకు మొదలవుతుంది. శరీరంలో సమన్వయం కొరవడుతుంది. నియంత్రణ తప్పుతుంది. నడుస్తూ నడుస్తూ కిందపడిపోయే ముప్పు పెరుగుతుంది. నడక తీరు మారుతుంది. ముందుకు వంగిపోయి నడవాల్సి వస్తుంది. స్థిరంగా నిలబడడం, పక్కకు తిరగడం కష్టమవుతుంది. చాలా మందిలో పార్కిన్సన్స్ దీర్ఘకాలికంగా ఉంటుంది. కానీ బయటపడడానికి కొంత సమయం పడుతుంది. మరికొందరిలో త్వరగానే బయటపడుతుంది.

ముందుగానే గుర్తిస్తే మేలు..

మొదటి, రెండో దశలోనే 50 శాతం డ్యామేజ్ జరిగిందని నిర్ధారించుకోవాలి. ఇక మూడు, నాలుగు దశల్లో అడ్వాన్స్‌డ్ థెరపీతో 50 శాతం తగ్గించే అవకాశం ఉంటుంది. కానీ స్టేజ్-5కు చేరుకున్నాక సుదీర్ఘకాలం మందులతో నడిపించడం తప్ప కోలుకోవడం కష్టం. అయితే డీప్ బ్రెయిన్ న్యూక్లియర్ సర్జరీతో స్టేజ్-5కి వెళ్లిన వారిని కూడా కాపాడే అవకాశం ఉంటుంది. 60 ఏళ్లు దాటిన వారిలో 80 శాతం మందికి ఈ వ్యాధి వచ్చే అవకాశం ఉంది. 40 ఏళ్లు దాటిన వారిలోనూ 20 శాతం మందికి ఈ సమస్య తలెత్తవచ్చు. వాయు కాలుష్యంలో ఎక్కువగా ఉండేవారికి, బ్యాటరీ, లెడ్ తయారీ కంపెనీల్లో పనిచేసేవారికి రావొచ్చు.



ఏపీలో 2 శాతం మందికి..


మన రాష్ట్రంలో రెండు శాతం మంది పార్కిన్సన్స్‌తో ఇబ్బంది పడుతున్నట్టు సమాచారం. బీపీ, షుగర్‌లాగే ఇది కూడా దీర్ఘకాలిక సమస్య. ఒక్కసారి వస్తే జీవితాంతం మందులు వాడుకోవాల్సిందే. తీవ్రమైన ఒత్తిడితో కూడిన జీవనశైలి, వయస్సు పెరగడం, వంశపారపర్యం, మెదడుకు దెబ్బ తగలడం, మెదడుకు ఇన్ఫెక్షన్ సోకడం, తలకు గాయాలు కావడం వల్ల పార్కిన్సన్స్ బారిన పడే ప్రమాదం ఉంది. అలాగే మెదడుకు రక్తప్రవాహం తగ్గడం, ఆల్కహాల్ వంటి ఇతర దురలవాట్ల వల్ల కూడా పార్కిన్సన్స్ రావొచ్చు. పార్కిన్సన్స్ తీవ్రమైతే బ్రెయిన్ పేస్ మేకర్ సర్జరీ చేయించుకోవాలి. లేదంటే ఏపోమార్ఫిన్ ఇంజెక్షన్స్ ద్వారా కొంత మేరకు నయమవుతుంది. ఏపీలో చాలా తక్కువ మంది న్యూరాలజీ వైద్యులు ఈ వ్యాధికి చికిత్స అందిస్తున్నారు.

బీపీ, షుగర్‌లాగే ఇదీ దీర్ఘకాలిక సమస్యే..



"పార్కిన్సన్ తీవ్రమైన అనారోగ్య సమస్యగా మారుతోంది. ఇది స్వల్ప లక్షణాలతోనే ప్రారంభమవుతుంది. నడస్తున్నప్పుడు, కూర్చుకున్నప్పుడు తెలియకుండానే ఒకవైపు తూలడం వంటివి వ్యాధి లక్షణాలు కనిపిస్తాయి. దీన్ని నిర్లక్ష్యం చేస్తే నెమ్మదిగా స్టేజ్‌లు మారుతూ ప్రాణప్రాయ స్థితికి చేరుస్తుంది. ఏపీలో పార్కిన్సన్స్ చాపకింద నీరులా విస్తరిస్తోంది. షుగర్, బీపీ మాదిరిగానే ఇది కూడా దీర్ఘకాలిక సమస్యే. కాబట్టి ప్రతిఒక్కరూ జాగ్రత్తపడాల్సిన అవసరం ఉంది."

- డాక్టర్ నవీన్ తోట, చీఫ్ కన్సల్టెంట్ న్యూరాలజిస్ట్, సెంటిని సిటీ హాస్పిటల్



దశల వారీగా వ్యాధి సంకేతాలు...

స్టేజ్ 1: తేలికపాటి సంకేతాలు, లక్షణాలు ఉంటాయి. నడుస్తున్నప్పుడు శరీరం ఒకవైపు లాగేస్తుంది. వణుకు మొదలవుతుంది. అయితే రోజువారీ కార్యకలాపాలకు అంతరాయం కలగదు.

స్టేజ్ 2: శరీరం రెండు వైపులా ప్రభావితమవుతుంది. లక్షణాలు తీవ్రమవుతాయి. నడకలో తేడా వస్తుంది.

స్టేజ్ 3: లక్షణాలు గణనీయంగా పెరుగాయి. శరీరంలో కదలికలు మందగిస్తాయి. బ్యాలెన్స్ కోల్పోతారు.

స్టేజ్ 4: లక్షణాలు మరింత తీవ్రమవుతాయి. బాధితులు ఒంటరిగా నడవలేరు. కచ్చితంగా ఇతరుల సాయం అవసరం అవుతుంది.

స్టేజ్ 5: నడవలేరు.. నిలబడలేరు. కొన్ని సందర్భాల్లో భ్రాంతితో భయాందోళనకు గురవుతుంటారు. కుంగుబాటుకు లోనవుతారు.

చిత్రజ్యోతి
SINCE 1965

'నువ్వుంటే చాలే..' అంటున్న రామ్



రామ్ పోతినేని కథానాయకుడిగా మహేశ్ బాబు.పి దర్శకత్వంలో తెరకెక్కుతున్న చిత్రం 'ఆంధ్రా కింగ్ తాలూకా'. మైత్రీ మూవీ మేకర్స్ బేనర్‌పై నవీన్ యర్నేని, వై. రవిశంకర్ నిర్మిస్తున్నారు. ఈ చిత్రం కోసం రామ్ రాసిన పాటను చిత్రబృందం శుక్రవారం ఆవిష్కరించింది. 'నువ్వుంటే చాలే..' అంటూ సాగే ఈ గీతానికి సంగీత ద్వయం వివేక్- మెర్విన్ స్వరాలు సమకూర్చగా అనిరుధ్ రవిచందర్ ఆలపించారు. ఈ పాటలోని ప్రతి లైన్ మనసుని తాకుతుంది. ప్రేమకు నిజమైన నిర్వచనాన్ని కనుగొనడానికి హీరో చేసే ప్రయత్నంలా అనిపిస్తుంది. 'ప్రేమని నిర్వచించలేం, కేవలం అనుభవించగలం. ఈ పాట ఒక చిన్న కథలా అనిపిస్తుంది. భావోద్వేగాలతో ప్రయాణించే అనుభూతిని కలిగిస్తుంది' అని చిత్రబృందం పేర్కొంది. కాగా, ఈ సినిమాలో రామ్ సరసన భాగ్యశ్రీ బోర్సే కథానాయికగా నటిస్తున్నారు. ఉపేంద్ర, రావు రమేశ్, మురళీ శర్మ, సత్య, రాహుల్ రామకృష్ణ తదితరులు కీలక పాత్రలు పోషిస్తున్నారు.

ఓ కళాకారిణి కథ..



ఆనంది ప్రధాన పాత్రలో గౌరీ నాయుడు జమ్ము తెరకెక్కిస్తోన్న సినిమా 'గరివిడి లక్ష్మి'. పీపుల్ మీడియా ఫ్యాక్టరీ బేనర్‌పై టీజీ విశ్వప్రసాద్, టీజీ కృతి ప్రసాద్ నిర్మిస్తున్నారు. తాజాగా మేకర్స్ ఆనందిని 'గరివిడి లక్ష్మి' పాత్రలో పరిచయం చేస్తూ ఫస్ట్‌లుక్ పోస్టర్‌ని రిలీజ్ చేశారు. లంగా, ఓణి ధరించి, రిక్షాలో కూర్చున్న ఆనంది.. ఒడిలో హార్మోనియంతో ఆకట్టుకున్నారు. గరివిడి లక్ష్మి ఒక గొప్ప బుర్రకథ కళాకారిణి. ఉత్తరాంధ్ర జానపద సంప్రదాయాల్ని ప్రజల్లోకి తీసుకెళ్లిన వ్యక్తిగా ఆమెకు ప్రత్యేక గుర్తింపు దక్కింది. ఈ సినిమాలో చరణ్ అర్జున్ సంగీతం ఉత్తరాంధ్ర సంస్కృతిని ఆవిష్కరిస్తూ హృదయాన్ని తాకేలా ఉంటుందని చిత్ర బృందం పేర్కొంది.




సత్యలోకం చూపించబోతున్నాం

చిరంజీవి కథానాయకుడిగా నటిస్తున్న తాజా చిత్రం 'విశ్వంభర' కథ గురించి దర్శకుడు వశిష్ఠ ఆసక్తికర విషయాలను వెల్లడించారు. 'మన పురాణాల ప్రకారం మొత్తం 14 లోకాలుంటాయి. యమలోకం, పాతాళం, స్వర్గం.. ఇలా ఇప్పటివరకూ పలు చిత్రాల్లో ఈ లోకాలను ఎవరికి వారు తమకు తోచినట్లు చూపించారు. 'విశ్వంభర'లో మేం వీటిని దాటి ఇంకా పైకి వెళ్లాం. ఈ 14 లోకాలకు మూలమైన సత్యలోకాన్ని ఇందులో చూపించబోతున్నాం. కథానాయకుడు ఆ లోకానికి ఎలా వెళ్తాడు, కథానాయికను భూమిపైకి ఎలా తీసుకొస్తాడు అనే పాయింట్ చుట్టూ అల్లుకున్న కథ ఇది' అని చెప్పారు. ఈ సినిమా కోసం భారీ ఖర్చుతో అద్భుతమైన సెట్స్ వేసి అందులో చిత్రీకరణ జరుపుతున్నారు. చిరంజీవికి జోడీగా త్రిష, ఆషికా రంగనాథ్ నటిస్తున్నారు. యూవీ క్రియేషన్స్ ఈ చిత్రాన్ని నిర్మిస్తోంది.

టాంజానియాలో చిత్రీకరణకు సిద్ధం

రాజమౌళి దర్శకత్వంలో మహేశ్‌బాబు కథానాయకుడిగా రూపొందుతోన్న చిత్రం ('ఎస్ఎస్ఎంబీ 29'- వర్కింగ్ టైటిల్) కొత్త షెడ్యూల్‌కు సిద్ధమవుతోంది. వచ్చే వారంలో టాంజానియాలోని సెరెంగెటి నేషనల్ పార్క్‌లో చిత్రీకరణ కోసం యూనిట్ సన్నద్ధమవుతోంది. మహేశ్‌బాబు, ప్రియాంక చోప్రా, పృథ్వీరాజ్ సుకుమారన్‌పై ఈ షెడ్యూల్ లో కీలక సన్నివేశాలు తెరకెక్కించనున్నారు. ఆ తర్వాత దక్షిణాఫ్రికాలో కొంత భాగం చిత్రీకరణ జరపనున్నట్లు సమాచారం. ఈ చిత్రంలోని యాక్షన్ ఘట్టాలను తొలుత కెన్యాలో చిత్రీకరించాలనుకున్నా అక్కడున్న రాజకీయ అనిశ్చితి నేపథ్యంలో చిత్రబృందం టాంజానియా వైపు మొగ్గు చూపినట్లు తెలుస్తోంది. అటవీ నేపథ్యంలో సాగే యాక్షన్ డ్రామాగా ఈ చిత్రం తెరకెక్కుతోంది. రాజమౌళి తండ్రి విజయేంద్రప్రసాద్ ఈ చిత్రానికి కథను అందిస్తున్నారు.



సీతగా సాయిపల్లవి.. అందుకే!

'రామాయణ'.. భారతీయ చలనచిత్ర పరిశ్రమలో ప్రకంపనలు సృష్టిస్తున్న చిత్రం. దేశవ్యాప్తంగా ఇప్పుడు ఆ సినిమా గురించే అంతా చర్చించుకుంటున్నారు. 'నాలుగు వేల కోట్ల రూపాయల బడ్జెట్ అట.. 'అవతార్' సినిమా బడ్జెట్ కంటే ఇది ఎక్కువట.. వర్కవుట్ అవుతుందా?'

అనేది వారి చర్చ. సినిమా బాగా ఆడాలని, భారతీయ సినిమా గొప్పతనాన్ని 'రామాయణ' మరోసారి చాటి చెప్పాలని చాలామంది కోరుకుంటున్నారు. ఇటీవల విడుదల చేసిన గ్లింప్స్ సినిమా మీద అంచనాలను భారీగా పెంచాయి. అయితే ఎందరో హీరో హీరోయిన్లు ఉండగా రాముడిగా రణ్‌బీర్ కపూర్‌ను, సీతగా సాయిపల్లవిని తీసుకోవడం ఏమిటనే విమర్శలు వినిపించకపోలేదు. దీనిపై సినిమా క్యాస్టింగ్ డైరెక్టర్ ముఖేశ్ చబ్రా స్పష్టత ఇచ్చారు. 'రాముడిగా రణ్‌బీర్‌ను తీసుకోవడానికి కారణం.. ప్రశాంతమైన ఆయన వ్యక్తిత్వం, గొప్పగా నటించగల నైపుణ్యం. అలాగే సీత పాత్రకు సాయిపల్లవిని ఎన్నుకోవడానికి కూడా ప్రత్యేక కారణం ఉంది. మొదటి నుంచీ ఆమె గ్లామర్ పాత్రలకు దూరంగా ఉంటున్నారు. అందం కోసం సర్జరీలు చేయించుకోలేదు. కృత్రిమం కంటే సహజ అందమే మేలు అనే భావన ఆమెది. తెరపై సీతారాముల్ని చూడగానే ఓ పవిత్రమైన భావన కలగాలని ఆ పాత్రలకు వీరిద్దరినీ ఎంపిక చేశాం' అని వివరించారు. 'రామాయణ'లో రావణుడిగా కన్నడ హీరో యశ్ నటిస్తున్నారు. ఆయన ఈ చిత్ర నిర్మాణ భాగస్వామి కూడా. ఆయన సరసన మండోదరి పాత్రలో కాజల్ అగర్వాల్ నటిస్తున్నారు. సన్నీ డియోల్ హనుమంతుడిగా నటిస్తున్నారు.

హాన్స్ జిమ్మర్‌తో రెహమాన్

'రామాయణ' చిత్రానికి సంగీత దర్శకత్వం వహించడం కోసం జర్మనీ మ్యూజిక్ డైరెక్టర్ హాన్స్ జిమ్మర్‌తో చేతులు కలిపారు ఏఆర్ రెహమాన్. ఇప్పటివరకూ జిమ్మర్‌తో కలసి లండన్, లాస్‌ఏంజెల్స్, దుబాయ్‌లో సంగీత చర్చలు జరిపాననీ, భారతీయ కళావైభవాన్ని చాటే గొప్ప చిత్రం 'రామాయణ'కు పని చేయడం అదృష్టంగా భావిస్తున్నట్లు రెహమాన్ వెల్లడించారు. నితీశ్ తివారీ దర్శకత్వంలో నమిత్ మల్హోత్రా, యశ్ కలసి ఈ సినిమాను నిర్మిస్తున్నారు.



భిక్షాటన చేసిన నటి నళిని



సీనియర్ నటి నళిని శుక్రవారం భిక్షాటన చేశారు. చెన్నై తిరువేర్కాడులోని కరుమారి అమ్మవారు కలలో కనిపించి కోరడంతో ఈ భిక్షాటన చేసినట్టు ఆమె వెల్లడించారు. తమిళ చిత్రాలు, టీవీ సీరియల్స్‌లో నటిస్తూ బిజీగా ఉన్న నళిని తిరువేర్కాడు కరుమారి అమ్మన్ ఆలయంలో కొంగుపట్టుకుని భక్తుల దగ్గర భిక్షాటన చేశారు. ఈ విషయంపై ఆమె మాట్లాడుతూ, 'నన్ను ఆశీర్వదిస్తూ ఎల్లవేళలా రక్షిస్తున్న నా ఇష్టదైవమైన తిరువేర్కాడు కరుమారి అమ్మ కలలో కనిపించి నాకోసం ఏం చేయబోతున్నావని అడిగింది. దీంతో ఏం చేయాలో తోచక... కొంగుపట్టి భక్తుల వద్ద భిక్షాటన చేశాను. తద్వారా వచ్చిన కానుకలను అమ్మవారికి కానుకగా సమర్పించాను' అని వివరించారు.

చెన్నై (ఆంధ్రజ్యోతి)

హాస్య నటుడు ఫిష్ వెంకట్ కన్నుమూత



తెలుగు చిత్ర పరిశ్రమ మరో నటుణ్ణి కోల్పోయింది. కొంతకాలంగా తీవ్ర అనారోగ్యంతో బాధపడుతున్న హాస్య నటుడు ఫిష్ వెంకట్ (53) శుక్రవారం రాత్రి హైదరాబాద్‌లో చందానగర్ పిఆర్ కె హాస్పిటల్‌లో కన్నుమూశారు. రెండు కిడ్నీలు దెబ్బతినడంతో ఆయన నాలుగేళ్లుగా డయాలసిస్ చికిత్స పొందుతున్నారు. పూర్తిగా పాడైపోవడంతో ఆయనకు కిడ్నీ మార్పిడి చేయాలని వైద్యులు తెలిపారు. పరిస్థితి విషమించడంతో వెంటిలేటర్‌పై చికిత్స పొందుతూ ఆయన తుదిశ్వాస విడిచారు. అనారోగ్యంతో వెంకట్ సినిమాలకు దూరమవడంతో వారి కుటుంబం ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటోంది. చికిత్స కోసం రూ. 50 లక్షలు ఖర్చు అవుతుందనీ, తమకు భరించే స్తోమత లేదనీ, సినిమా ఇండస్ట్రీలోని పెద్దలు, ప్రభుత్వం ఆదుకోవాలని వెంకట్ కూతురు స్రవంతి ఇటీవల కోరారు. పవన్‌కల్యాణ్, విష్వక్‌సేన్, 'జెట్టి' హీరో కృష్ణ మానినేని కొంత మేర ఆర్థిక సాయం అందించారు. అలాగే వెంకట్ చికిత్సకు అయ్యే ఖర్చు మొత్తం ప్రభుత్వం భరిస్తుందని తెలంగాణ మంత్రి వాకిటి శ్రీహరి హామీ ఇచ్చారు. తక్షణ ఖర్చుల కోసం రూ. లక్షను కుటుంబసభ్యులకు అందజేశారు. చికిత్స కోసం ఏర్పాట్లు జరుగుతుండగానే ఆయన తుదిశ్వాస విడిచారు. వెంకట్‌కు భార్య సువర్ణ, కూతురు స్రవంతి, ఇద్దరు కుమారులు ఉన్నారు.

ఫిష్ వెంకట్ అసలు పేరు మంగిలంపల్లి వెంకటేశ్. హైదరాబాద్‌లో పుట్టి పెరిగారు. ముషీరాబాద్‌లోని కూరగాయల మార్కెట్‌లో ఆయన చేపలు అమ్ముకునేవారు. దాంతో ఆయన పేరు ఫిష్ వెంకట్‌గా స్థిరపడింది. తన మిత్రుడు, నటుడు శ్రీహరి ప్రోత్సాహంతో సినీరంగంలోకి అడుగుపెట్టారు. ఎన్టీఆర్ హీరోగా నటించిన 'ఆది'లో 'తొడ కొట్టు చిన్నా' అనే డైలాగ్‌తో ఆయన అందరి దృష్టినీ ఆకర్షించారు. అగ్రహీరోలందరి చిత్రాల్లో విలన్‌గా, కమెడియన్‌గా నటించారు. కామెడీ విలన్ పాత్రల్లో తెలంగాణ మాండలికంలో చెప్పే సంభాషణలతో ఆయన ప్రేక్షకులకు దగ్గరయ్యారు. ఇప్పటివరకూ వందకుపైగా సినిమాల్లో నటించారు. దిల్, బన్నీ, అదుర్స్, గబ్బర్‌సింగ్ తదితర చిత్రాల్లో ఆయన నటనకు మంచి పేరొచ్చింది.

బిజినెస్

ఎస్‌బీఐకి వరల్డ్ బెస్ట్ కన్స్యూమర్ బ్యాంక్ అవార్డు



న్యూఢిల్లీ: దేశీయ బ్యాంకింగ్ దిగ్గజం భారతీయ స్టేట్ బ్యాంక్ (ఎస్‌బీఐ).. 2025 సంవత్సరానికిగాను గ్లోబల్ ఫైనాన్స్ మ్యాగజైన్ నుంచి ప్రపంచంలోనే అత్యుత్తమ కన్స్యూమర్ బ్యాంక్ అవార్డును గెలుచుకుంది. ప్రపంచవ్యాప్తంగా కార్పొరేట్ ఫైనాన్స్ ఎగ్జిక్యూటివ్స్, బ్యాంకర్స్, విశ్లేషకుల నుంచి సేకరించిన వివరాలను మదింపు చేయటంతో పాటు సమగ్ర పరిశోధన, విశ్లేషణ ఆధారంగా ఎస్‌బీఐని ఈ అవార్డుకు ఎంపిక చేసినట్లు గ్లోబల్ ఫైనాన్స్ వెల్లడించింది. కాగా బ్యాంక్ అభివృద్ధి వ్యూహానికి ఖాతాదారుల అనుభూతి మూలస్తంభమని ఎస్‌బీఐ చైర్మన్ సీ. శ్రీనివాసులు శెట్టి ఈ సందర్భంగా అన్నారు. ఖాతాదారులకు మరింత చేరువయ్యేందుకు ఎప్పటికప్పుడు కొత్త చర్యలు తీసుకుంటున్నట్లు ఆయన వివరించారు. ఈ అవార్డు ఖాతాదారుల సేవలకు తమను మరింత కట్టుబడి ఉండేలా చేస్తుందన్నారు. ఐఎంఎఫ్, ప్రపంచ బ్యాంక్ వార్షిక సమావేశాల సందర్భంగా ఈ ఏడాది అక్టోబరు 18న అమెరికాలోని వాషింగ్టన్‌లో జరిగే కార్యక్రమంలో ఎస్‌బీఐ చైర్మన్ శెట్టి ఈ అవార్డును అందుకోనున్నారు.

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)



19వ తేదీ			
హైదరాబాద్	510	విజయవాడ	520
వరంగల్	512	గోదావరి	500
చిత్తూరు	563	విశాఖపట్నం	540
		డజను గుడ్లు రూ. 72	

ఫామ్‌గేట్ ధర — వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్



హైదరాబాద్	99	విజయవాడ	102
వరంగల్	99	గుంటూరు	107
కరీంనగర్	99	ఒంగోలు	110
మహబూబ్‌నగర్	99	చిత్తూరు	103
కర్నూలు	99	నెల్లూరు	108
విశాఖపట్నం	87	అనంతపురం	108
గోదావరి	102		

బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)



	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	99,380 ▲	91,100 ▲	1,23,900 ▼
విజయవాడ	1,00,500 ▲	94,500 ▲	1,11,600 ▼
విశాఖపట్నం	1,01,390 ▲	91,000 ▼	1,23,900 ▼
రాజమండ్రి	99,820 ▲	91,500 ▲	1,15,000 ▲
ప్రొద్దుటూరు	97,900 ▲	90,007 ▲	1,14,700 ▲
ముంబై	98,243 ▲	89,991 ▲	1,12,700 ▲

రిలయన్స్ రికార్డు లాభం



క్యూ1లో 78 శాతం వృద్ధితో రూ.26,994 కోట్లకు చేరిక

- ఆదాయం రూ.2.48 లక్షల కోట్లు
- రిటైల్, జియో వ్యాపారాలు జిగేల్
- లాభాల్లో భారీ వృద్ధికి కలిసివచ్చిన ఏషియన్ పెయింట్స్ వాటా విక్రయం

న్యూఢిల్లీ: ఆసియా కుబేరుడు ముకేశ్ అంబానీకి చెందిన రిలయన్స్ ఇండస్ట్రీస్ లిమిటెడ్ (ఆర్ఐఎల్) ఆర్థిక ఫలితాలు మార్కెట్ వర్గాల అంచనాలను మించాయి. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2025-26)లో జూన్‌తో ముగిసిన తొలి త్రైమాసికం (క్యూ1)లో ఆర్ఐఎల్ ఏకీకృత నికర లాభం వార్షిక ప్రాతిపదికన 78.3 శాతం వృద్ధితో రూ.26,994 కోట్లకు (ఒక్కో షేరుకు రూ.19.95) పెరిగింది. కంపెనీ చరిత్రలో ఇదే అత్యధిక త్రైమాసిక లాభం. రిటైల్, జియో వ్యాపారాలు మెరుగైన పనితీరు కనబరచడంతో పాటు ఏషియన్ పెయింట్స్‌లో వాటా విక్రయం ద్వారా సమకూరిన ఏకకాల ఆర్జన (వన్ టైమ్ గెయిన్) లాభాల్లో భారీ వృద్ధికి దోహదపడింది. వన్ టైమ్ గెయిన్స్‌ను మినహాయిస్తే, సంస్థ లాభం వార్షిక ప్రాతిపదికన 25 శాతం వృద్ధిని కనబరిచింది. కాగా, క్యూ1లో కంపెనీకి కార్యకలాపాల ద్వారా ఆదాయం వార్షిక ప్రాతిపదికన 5.3 శాతం పెరిగి రూ.2,48,660 కోట్లకు చేరుకుంది. స్థూల రాబడి 6 శాతం వృద్ధితో రూ.2,73,252 కోట్లుగా, ఎబిటా 35.7 శాతం వృద్ధితో రూ.58,024 కోట్లుగా నమోదైంది. వ్యాపార విభాగాల వారీగా పనితీరు..

ఓ2సీ

రిలయన్స్ కీలక వ్యాపార విభాగమైన ఆయిల్ టు కెమికల్స్ (ఓ2సీ) ఆదాయం ఈ క్యూ1లో 1.5 శాతం తగ్గి రూ.1,54,804 కోట్లకు పరిమితమైంది. అంతర్జాతీయ మార్కెట్లో ముడి చమురు ధరలు దిగిరావడంతో పాటు ముందస్తు ప్రణాళిక ప్రకారంగా ప్లాంట్‌ను కొన్ని రోజులు మూసివేసిన కారణంగా రిఫైనింగ్ తగ్గడం ఇందుకు కారణమని కంపెనీ పేర్కొంది. అయితే, కంపెనీకి చెందిన జియో-బీపీ బంకులకు ఇంధన సరఫరా పెంచడం ఆదాయానికి మద్దతుగా నిలిచాయి. ఎబిటా మాత్రం 10.8 శాతం వృద్ధితో రూ.14,511 కోట్లుగా నమోదైంది.

రిలయన్స్ రిటైల్

ఆర్ఐఎల్ రిటైల్ అనుబంధ విభాగమైన రిలయన్స్ రిటైల్ వెంచర్స్ లిమిటెడ్ (ఆర్ఆర్‌వీఎల్) నికర లాభం జూన్ త్రైమాసికంలో 28.3 శాతం పెరిగి రూ.3,271 కోట్లకు చేరింది. స్థూల ఆదాయం 11.3 శాతం వృద్ధితో రూ.84,171 కోట్లకు పెరిగింది. అన్ని రిటైల్ వ్యాపార విభాగాల మెరుగైన పనితీరు ఇందుకు దోహదపడిందని కంపెనీ పేర్కొంది. గడిచిన మూడు నెలల్లో 388 కొత్త స్టోర్లను ప్రారంభించటంతో మొత్తం స్టోర్ల సంఖ్య 19,592కు చేరుకుందని తెలిపింది.

జియో ప్లాట్‌ఫామ్స్

టెలికాం సంస్థ రిలయన్స్ జియోతో పాటు డిజిటల్ సేవలన్నింటినీ ఒకే గొడుగు కిందికి చేర్చి ఏర్పాటు చేసిన జియో ప్లాట్‌ఫామ్ నికర లాభం ఈ క్యూ1లో 25 శాతం పెరిగి రూ.7,110 కోట్లకు ఎగబాకింది. స్థూల ఆదాయం 19 శాతం వృద్ధితో రూ.41,054 కోట్లకు పెరిగింది. ఈ జూన్ చివరి నాటికి రిలయన్స్ జియో మొత్తం వినియోగదారులు 49.81 కోట్లకు పెరిగారు. ఒక్కో వినియోగదారు నుంచి సగటు ఆదాయం (ఆర్పూ) రూ.208.8కి చేరింది. కంపెనీ 5జీ కస్టమర్లు తొలిసారిగా 20 కోట్ల స్థాయికి చేరారని, హోమ్ బ్రాడ్‌బ్యాండ్ కనెక్షన్లు 2 కోట్లు దాటినట్లు తెలిపింది. జియో ఎయిర్ ఫైబర్ 74 లక్షల మంది ఇప్పుడు ప్రపంచంలోనే అతిపెద్ద ఫిక్స్‌డ్ వైర్‌లెస్ యాక్సెస్ (ఎఫ్‌డబ్ల్యూఏ) సర్వీస్‌గా అవతరించిందని కంపెనీ వెల్లడించింది.

ఆయిల్ అండ్ గ్యాస్

కంపెనీకి చెందిన ఆయిల్ అండ్ గ్యాస్ అన్వేషణ, ఉత్పత్తి వ్యాపార విభాగ ఆదాయం జూన్ త్రైమాసిక కాలంలో 1.2 శాతం తగ్గి రూ.6,103 కోట్లకు, ఎబిటా 4.1 శాతం తగ్గుదలతో రూ.4,996 కోట్లకు పరిమితమైంది. కేజీ బేసిన్‌లోని డీ6 బ్లాక్ నుంచి ఉత్పత్తితో పాటు విక్రయాలు తగ్గడం ఇందుకు కారణమైందని కంపెనీ తెలిపింది. సీబీఎం గ్యాస్ ధరతో పాటు ముడిచమురుపై మార్జిన్లు తగ్గడమూ ఆదాయంపై ప్రభావం చూపిందని సంస్థ పేర్కొంది.

జియోస్టార్

ఈ జూన్ క్వార్టర్‌లో రిలయన్స్‌కు చెందిన జియో హాట్‌స్టార్ వ్యాపార విభాగ ఆదాయం రూ.11,222 కోట్లకు పెరిగింది. లాభం రూ.581 కోట్లకు ఎగబాకింది. ఆండ్రాయిడ్ ఓఎస్‌పై జియోహాట్‌స్టార్ యాప్ డౌన్‌లోడ్లు 104 కోట్లకు చేరాయని కంపెనీ తెలిపింది.

మళ్లీ 25,000 దిగువకు నిఫ్టీ

- సెన్సెక్స్ 501 పాయింట్లు పతనం
- రూ.3 లక్షల కోట్ల సంపద ఆవిరి

ముంబై: దేశీయ స్టాక్ మార్కెట్ ప్రామాణిక సూచీలు వారాంతం ట్రేడింగ్‌లో భారీగా నష్టపోయాయి. సెన్సెక్స్ 501.51 పాయింట్లు క్షీణించి 81,757.73 వద్దకు జారుకుంది. నిఫ్టీ 143.05 పాయింట్లు కోల్పోయి నెల రోజుల కనిష్ఠ స్థాయి 24,968.40 వద్ద ముగిసింది. ఈక్విటీ వర్గాల సంపదగా భావించే బీఎస్ఈ లిస్టెడ్ కంపెనీల మొత్తం మార్కెట్ క్యాపిటలైజేషన్ దాదాపు రూ.3 లక్షల కోట్లు తగ్గి రూ.458.37 లక్షల కోట్లకు జారుకుంది. నిరాశాజనక త్రైమాసిక ఆర్థిక ఫలితాలు, విదేశీ సంస్థాగత పెట్టుబడుల ఉపసంహరణ నేపథ్యంలో ఇన్వెస్టర్లు బ్యాంకింగ్ షేర్లలో అమ్మకాలకు పాల్పడటం ఇందుకు కారణమైంది. సెన్సెక్స్‌లోని 30 కంపెనీల్లో 22 నష్టపోయాయి.

రష్యాపై ఈయూ మరిన్ని ఆంక్షలు

బ్రస్సెల్స్ (బెల్జియం): బ్రిటన్, యూరోపియన్ యూనియన్ (ఈయూ) రష్యాపై మరిన్ని ఆంక్షలు విధించాయి. ఇందులో భాగంగా రష్యా ఎగుమతి చేసే బ్యారల్ చమురు గరిష్ఠ ధరను ప్రస్తుత 60 డాలర్ల నుంచి 45 డాలర్లకు కుదించాయి. ఏ దేశమైనా రష్యా చమురుకు ఇంత కంటే ఎక్కువ చెల్లిస్తే ఆ దేశాలపైనా ఆంక్షలు తప్పవని హెచ్చరించాయి. దీనికి తోడు రష్యా చమురుతో ఉత్పత్తి చేసే పెట్రోల్, డీజిల్ దిగుమతులనూ నిషేధించాయి. దీంతో భారత్‌లో రష్యా చమురు దిగ్గజం రోస్‌నెఫ్ట్ నిర్వహణలోని నయారా ఎనర్జీపైనా ఈ ప్రభావం పడనుంది. మరోవైపు రష్యా బ్యాంకులతో లావాదేవీలపైనా బ్రిటన్, ఈయూ మరిన్ని ఆంక్షలు విధించాయి. అయితే ఈ బెదిరింపులు తమను ఏమీ చేయలేవని రష్యా స్పష్టం చేసింది.

రిలయన్స్ గూటికి కెల్వినేటర్

ఒప్పందం విలువ రూ.160 కోట్లు

ముంబై: స్వీడన్ కేంద్రంగా ఉన్న ఎలక్ట్రోలక్స్ గ్రూప్‌నకు చెందిన కన్స్యూమర్ డ్యూరబుల్ ఉత్పత్తుల బ్రాండ్ కెల్వినేటర్‌ను కొనుగోలు చేసినట్లు రిలయన్స్ రిటైల్ శుక్రవారం ప్రకటించింది. ఈ లావాదేవీ విలువ 18 కోట్ల స్వీడిష్ క్రౌన్లు. అంటే, మన కరెన్సీలో దాదాపు రూ.160 కోట్లు. ఆసియా కుబేరుడు ముకేశ్ అంబానీకి చెందిన రిలయన్స్ ఇండస్ట్రీస్ అనుబంధ విభాగమే రిలయన్స్ రిటైల్. దేశంలో అతిపెద్ద రిటైల్ వ్యాపార సంస్థ కూడా. దేశంలో వేగంగా విస్తరిస్తున్న కన్స్యూమర్ డ్యూరబుల్స్ (ఏసీ, రిఫ్రిజిరేటర్, వాషింగ్ మెషీన్లు, టీవీలు తదితర ఉత్పత్తులు) మార్కెట్లో రిలయన్స్ తన వ్యాపార వృద్ధిని కదం తొక్కించేందుకు ఈ కొనుగోలు ఒప్పందం దోహదపడనుంది. కాగా, ఎలక్ట్రోలక్స్‌తో లైసెన్స్ ఒప్పందం కుదుర్చుకోవడం ద్వారా రిలయన్స్ రిటైల్ 2019 నుంచే తన రిలయన్స్ డిజిటల్ స్టోర్లలో కెల్వినేటర్ ఏసీలు, రిఫ్రిజిరేటర్లు, వాషింగ్ మెషిన్లను విక్రయిస్తోంది.

'దొడ్ల' చేతికి ఓసామ్ డెయిరీ

హైదరాబాద్ కేంద్రంగా ఉన్న దొడ్ల డెయిరీ.. తూర్పు రాష్ట్రాలలో ప్రీమియం బ్రాండ్‌గా గుర్తింపు పొందిన ఓసామ్ డెయిరీని కొనుగోలు చేసినట్లు ప్రకటించింది. రూ.271 కోట్లకు ఓసామ్ డెయిరీలో వంద శాతం వాటాను చేజిక్కించుకున్నట్లు వెల్లడించింది. దేశ తూర్పు ప్రాంతంలో సంస్థ కార్యకలాపాలు విస్తరించేందుకు ఈ కొనుగోలు దోహదపడనుందని దొడ్ల డెయిరీ ఎండీ సునీల్ రెడ్డి తెలిపారు.

తెలుగు రాష్ట్రాలపై బెంట్లే సిస్టమ్స్ దృష్టి

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): అమెరికాకు చెందిన ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఇంజనీరింగ్ సాఫ్ట్‌వేర్ సంస్థ బెంట్లే సిస్టమ్స్.. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ మార్కెట్లపై దృష్టి సారించింది. గడిచిన కొన్నేళ్లుగా ఈ రెండు రాష్ట్రాల్లో రవాణా, అర్బన్ ప్లానింగ్, పారిశ్రామిక, ఇంధన రంగాలు శరవేగంగా వృద్ధి చెందుతూ వస్తున్నాయని, ఈ రంగాలకు అవసరమైన సొల్యూషన్లను అందించటంలో బెంట్లే ఇప్పటికే కీలకంగా ఉందని సంస్థ రీజినల్ ఎగ్జిక్యూటివ్ (దక్షిణాసియా) కమలకన్నన్ తిరువాది తెలిపారు. కాగా ఆంధ్రప్రదేశ్ ప్రస్తుతం రైల్వే, నౌకాశ్రయాలు, జాతీయ రహదారులు, విమానాశ్రయ ప్రాజెక్టుల అభివృద్ధిపై దృష్టి సారించటంతో తాము కూడా ఈ విభాగాల్లో మరిన్ని అవకాశాలు చేజిక్కించుకోవాలని చూస్తున్నట్లు ఆయన చెప్పారు. మరోవైపు తెలంగాణలో కొత్తగా ఇండస్ట్రియల్ జోన్ల ఏర్పాటుతో పాటు మెట్రో రైల్ నెట్‌వర్క్ విస్తరణ, రహదారుల అభివృద్ధికి పెద్దపీట వేస్తుండటం కూడా బెంట్లే సిస్టమ్స్‌కు కలిసి రానుందన్నారు.

అమెరికాతో చర్చల్లో జాగ్రత్త

ఆర్‌బీఐ మాజీ గవర్నర్ రాజన్

న్యూఢిల్లీ: తాత్కాలిక ద్వైపాక్షిక వాణిజ్య ఒప్పందం (బీటీఏ) కోసం అమెరికాతో జరుగుతున్న చర్చల్లో భారత్ అత్యంత జాగ్రత్తగా వ్యవహరించాలని ఆర్‌బీఐ మాజీ గవర్నర్ రఘురామ్ రాజన్ కోరారు. ఈ చర్చల్లో ముఖ్యంగా వ్యవసాయోత్పత్తుల విషయంలో మన ప్రభుత్వం అత్యంత జాగ్రత్తగా, తెలివిగా వ్యవహరించాలన్నారు. లేకపోతే దేశ ప్రయోజనాలు దెబ్బతినే ప్రమాదం ఉందని హెచ్చరించారు. అమెరికాతో సహా అన్ని అభివృద్ధి చెందిన దేశాలు తమ రైతులకు పెద్దఎత్తున సబ్సిడీలు ఇస్తున్న విషయాన్ని గుర్తు చేశారు. ఈ దేశాల నుంచి స్వేచ్ఛగా వ్యవసాయ ఉత్పత్తుల దిగుమతులను అనుమతిస్తే మన రైతులు రోడ్డున పడే ప్రమాదం ఉందని పరోక్షంగా హెచ్చరించారు. తన వ్యవసాయ, పాల ఉత్పత్తులను కూడా భారత్ జీరో డ్యూటీతో అనుమతించాలని అమెరికా ఒత్తిడి చేస్తోంది. ఈ నేపథ్యంలో రాజన్ ఈ హెచ్చరిక చేయడం విశేషం. నేరుగా ఆ దేశాల నుంచి వ్యవసాయ ఉత్పత్తుల దిగుమతులను స్వేచ్ఛగా అనుమతించే బదులు.. ఆ దేశాల కంపెనీలు, మన వ్యవసాయ రంగానికి తోడ్పడేలా విలువ జోడింపు ఉత్పతుల తయారీ కంపెనీలు ఏర్పాటు చేసేలా ప్రోత్సహించాలని రాజన్ సూచించారు.



హనుమాన్ చాలీసా నుంచి పాప్ గీతాల వరకు..

మాంచెస్టర్: నాలుగో టెస్టు కోసం భారత జట్టు కెంట్ కౌంటీ క్రికెట్ గ్రౌండ్‌లో జోరుగా ప్రాక్టీస్ చేస్తోంది. లండన్ నుంచి బెకెన్‌హామ్‌లోని ఈ మైదానం కోసం ఆటగాళ్లంతా గంటపాటు ప్రయాణించారు. ఈక్రమంలో అలిసిపోయినట్టు కనిపించిన వీరంతా డ్రెస్సింగ్ రూమ్‌లో తమకిష్టమైన సంగీతాన్ని వింటూ సేద తీరారు. ఇందులో హనుమాన్ చాలీసా నుంచి ఇంగ్లిష్ పాప్ గీతాలు, పంజాబీ హిట్స్ కూడా ఉన్నాయి. ఇక పంత్, బుమ్రా వామప్ చేసి కొంచెం సేపు జిమ్‌లో గడిపారు. బుమ్రాతో పాటు సిరాజ్ మాత్రం బౌలింగ్ వేయలేదు.

'కుల్దీప్‌ను ఆడించాలి'

ఇంగ్లండ్‌తో జరిగే నాలుగో టెస్టులో స్పెషలిస్ట్ స్పిన్నర్ కుల్దీప్‌తో పాటు పేసర్ అర్ష్‌దీప్‌లను ఆడించాలని మాజీ కెప్టెన్ వెంగ్‌సర్కార్ సూచించాడు. 'అర్ష్‌దీప్ బంతిని చక్కగా స్వింగ్ చేయగలడు. అలాగే పాత బంతితో రివర్స్ స్వింగ్‌ను కూడా రాబట్టగలడు. ఇంగ్లండ్ పిచ్‌లపై ఇలా చేయగలగడం భారత్‌కు లాభిస్తుంది. అలాగే స్పిన్నర్ కుల్దీప్ సైతం జట్టుకు కీలకంగా మారతాడు. ఇక వీరిని భర్తీ చేసేందుకు నితీశ్ కుమార్, సుందర్‌లను పక్కకు తప్పించవచ్చు. టెస్టుల్లో గెలవాలంటే కచ్చితంగా ఐదుగురు బౌలర్లు ఉండాల్సిందే. ఎందుకంటే ఆరుగురు బ్యాటర్లు భారీ స్కోరు సాధించలేకపోతే, కనీసం బౌలర్లయినా బాధ్యత తీసుకుంటారు. పార్ట్ టైమ్ బౌలర్లతో మ్యాచ్‌లు గెలవలేం' అని వెంగీ తెలిపాడు.

డ్యూక్ బంతుల నాణ్యతపై చర్చ



భారత్-ఇంగ్లండ్ జట్ల మధ్య జరుగుతున్న ఐదు టెస్టుల సిరీస్‌లో డ్యూక్ బంతుల నాణ్యతపై అధికంగా చర్చ సాగుతోంది. ఇప్పటిదాకా జరిగిన మూడు టెస్టుల్లోనూ బంతి ఆకారంపై భారత ఆటగాళ్లు అంపైర్లకు పదేపదే ఫిర్యాదు చేయడం తెలిసిందే. ముఖ్యంగా 30 ఓవర్ల తర్వాత ఈ సమస్య ఎక్కువగా వస్తోంది. దీంతో పదే పదే బంతులను మార్చుతుండడంతో ఆటకు కూడా అంతరాయం కలుగుతోంది. అటు విశ్లేషకులు సైతం డ్యూక్ బంతుల పనితీరుపై సందేహాలు వ్యక్తం చేశారు. తొలి టెస్టు ముగిశాక భారత కెప్టెన్ గిల్ బాహాటంగానే ఈ విషయమై తన అసంతృప్తిని వ్యక్తం చేశాడు. డ్యూక్ బాల్స్ త్వరగా గట్టితనాన్ని కోల్పోతున్నట్టు, దీంతో బ్యాటర్లకు అనుకూలంగా మారుతున్నాయని ఆరోపించాడు. బంతి మెత్తబడితే పేసర్లకు ఉపయోగం ఉండదని, ఎందుకు ఇలా అవుతున్నాయో అర్థం కావడం లేదని చెప్పాడు. అటు ఇంగ్లండ్ కెప్టెన్ బెన్ స్టోక్స్ సైతం డ్యూక్ బంతులపై ఇదే అభిప్రాయాన్ని వ్యక్తం చేశాడు. తాము విదేశాలకు వెళ్లినప్పుడు ఇలాంటి సమస్య వచ్చేదని, కానీ ఇప్పుడు డ్యూక్ బంతులు కూడా మృదువుగా మారి ఆకారం కోల్పోవడం బాగాలేదన్నాడు. దీనిపై ఏదో ఒక పరిష్కారం కనుక్కోవాలని సూచించాడు. ఇలా అన్ని వైపుల నుంచి విమర్శలు వ్యక్తమవుతుండడంతో డ్యూక్ బంతుల తయారీదారులు స్పందించారు. ఆ బంతులను క్షుణ్ణంగా పరిశీలిస్తామని బ్రిటిష్ క్రికెట్ బాల్స్ లిమిటెడ్ యజమాని దిలీప్ జజోడియా తెలిపాడు. 'మేం ఇప్పటిదాకా జరిగిన మూడు మ్యాచ్‌ల్లో వాడిన బంతులను పరిశీలిస్తాం. తయారీ నిపుణులతో సమీక్షించడమే కాకుండా, బంతుల తయారీకి వాడే ముడి సరుకులపై కూడా రివ్యూ నిర్వహిస్తాం' అని చెప్పాడు.

స్పోర్ట్స్

సెమీఫైనల్లో అర్జున్



- ప్రజ్ఞానంద అవుట్
- ఫ్రీస్టయిల్ గ్రాండ్‌స్లామ్ చెస్

లాస్‌వెగాస్ (యూఎస్ఏ): భారత గ్రాండ్‌మాస్టర్ అర్జున్ ఇరిగేసి ఫ్రీస్టయిల్ గ్రాండ్‌స్లామ్ చెస్ టూర్ సెమీఫైనల్‌కు దూసుకుపోయాడు. అయితే మరో జీఎం ప్రజ్ఞానంద క్వార్టర్‌ఫైనల్లో ఓటమి చవిచూశాడు. శుక్రవారం జరిగిన క్వార్టర్‌ఫైనల్లో అర్జున్ 1.5-0.5తో ఉజ్బెకిస్థాన్ జీఎం అబ్దుసత్తోరోవ్‌పై విజయం సాధించాడు. హోరాహోరీగా జరిగిన మరో క్వార్టర్‌ఫైనల్లో అమెరికాకు చెందిన కరువాన 4-3తో ప్రజ్ఞానందను ఓడించాడు. దీంతో ప్రజ్ఞానంద టైటిల్ రేసు నుంచి నిష్క్రమించాడు. అమెరికా ఆటగాళ్లు ఆరోనియన్, హాన్స్ నీమన్ కూడా సెమీస్ చేరారు. సెమీఫైనల్స్‌లో ఆరోనియన్‌తో అర్జున్, కరువానతో నీమన్ అమీతుమీ తేల్చుకుంటారు. ఐదో స్థానం కోసం జరిగిన మ్యాచ్‌లో వరల్డ్ నెం.1 కార్ల్‌సన్ 2-0తో భారత గ్రాండ్‌మాస్టర్ విదిత్ గుజరాతీపై నెగ్గాడు.

సిరీస్ లక్ష్యంగా..



ఇంగ్లండ్‌తో హర్మన్ సేన రెండో వన్డే నేడు

మ. 3.30 నుంచి సోనీ స్పోర్ట్స్‌లో..

లండన్: తొలి వన్డే విజయంతో జోష్‌లో ఉన్న భారత మహిళల జట్టు ఇప్పుడు సిరీస్‌పై కన్నేసింది. మూడు మ్యాచ్‌ల సిరీస్‌లో భాగంగా ప్రఖ్యాత లార్డ్స్ మైదానంలో శనివారం ఇంగ్లండ్‌తో రెండో వన్డేలో తలపడనుంది. ఇప్పటికే ఐదు టీ20ల సిరీస్‌ను హర్మన్‌ప్రీత్ సేన 3-2తో గెలిచిన విషయం తెలిసిందే. అలాగే శ్రీలంక, దక్షిణాఫ్రికాలతో మేలో జరిగిన ముక్కోణపు వన్డే సిరీస్‌ను సైతం గెలిచిన భారత్ ఆత్మవిశ్వాసంతో ఉంది. అలాగే ఈ ఏడాది చివర్లో భారత్‌లోనే జరిగే వన్డే వరల్డ్‌కప్‌నకు కూడా ఈ సిరీస్ విజయం చక్కటి సన్నాహకం కానుంది. పేసర్లు రేణుకా సింగ్, పూజా వస్త్రాకర్ జట్టులో లేకపోయినా బౌలింగ్ విభాగం రాణించగలుగుతోంది. క్రాంతి గౌడ్, అరుంధతి రెడ్డిలతో పాటు స్పిన్నర్లు శ్రీచరణి, స్నేహ్ రాణా విశేషంగా ఆకట్టుకుంటున్నారు. ఇక తొలి వన్డేలో భారత బ్యాటింగ్ విభాగం కలిసికట్టుగా రాణించింది. కెప్టెన్ హర్మన్ నిరాశపర్చినా ఓపెనర్లు ప్రతికా రావల్, మంధానతో పాటు మిడిలార్డర్‌లో జెమీమా, దీప్తి శర్మ కీలకంగా నిలిచారు. చివర్లో అమన్‌జోత్ హిట్టింగ్‌తో చెలరేగడం జట్టుకు లాభించేదే. అటు ఆతిథ్య ఇంగ్లండ్‌కు ఈ మ్యాచ్ చావోరేవో కాబట్టి లార్డ్స్‌లో గెలిచి తీరాలనే కసితో బరిలోకి దిగనుంది. జట్టు మిడిలార్డర్ ఫర్వాలేదనిపించినా టాపార్డర్ వైఫల్యం దెబ్బతీసింది. నేటి పోరులో అన్ని విభాగాల్లో రాణించి ప్రత్యర్థిని కట్టడి చేయడంతో పాటు సిరీస్‌లోనూ నిలవాలని సివర్ బ్రంట్ బృందం భావిస్తోంది.

ఫీజులో కోత.. ఓ డీమెరిట్ పాయింట్



ప్రతికా రావల్‌కు జరిమానా

దుబాయ్: ఇంగ్లండ్ మహిళలతో తొలి వన్డేలో నిబంధనలను ఉల్లంఘించినందుకు గాను టీమిండియా బ్యాటర్ ప్రతికా రావల్‌కు జరిమానా విధించారు. భారత ఇన్నింగ్స్ 18వ ఓవర్‌లో ప్రతిక.. సింగిల్ తీసే క్రమంలో ప్రత్యర్థి బౌలర్ లారెన్ ఫిలర్‌ను ఢీకొట్టింది. అంతేగాకుండా తర్వాతి ఓవర్‌లో తాను అవుటవగానే ప్రతిక.. మరో బౌలర్ సోఫీ ఎకెల్‌స్టోన్‌తో వాగ్వాదానికి దిగింది. దీంతో లెవెల్ 1 తప్పిదం కింద ప్రతికకు మ్యాచ్ ఫీజులో పది శాతం కోత విధించడంతో పాటు ఓ డీ మెరిట్ పాయింట్‌ను కేటాయించారు. అదే మ్యాచ్‌లో స్లో ఓవర్ రేట్‌కు పాల్పడిన ఇంగ్లండ్ జట్టు సభ్యులకు మ్యాచ్ ఫీజులో ఐదు శాతం కోత విధించారు.

బీసీసీఐ ఆర్జన రూ.9,741 కోట్లు



న్యూఢిల్లీ: ప్రపంచ క్రికెట్‌లో అత్యంత ధనిక బోర్డుగా విలసిల్లుతున్న బీసీసీఐ తమ ఆదాయాన్ని ఏటేటా రికార్డు స్థాయిలో పెంచుకుంటోంది. తాజాగా 2023-24 ఆర్థిక సంవత్సరానికిగాను బోర్డు ఆదాయం రూ.9,741.70 కోట్లుగా తేలింది. ఇందులో ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్) ద్వారానే ఏకంగా రూ.5,761 కోట్లు (59 శాతం) సమకూరడం విశేషం. 2007లో ఐపీఎల్ మొదలైనప్పటినుంచి బోర్డు ఖజానాకు ప్రధాన ఆదాయ వనరుగా మారింది. మరోవైపు బోర్డు దగ్గర దాదాపు రూ. 30 వేల కోట్లు రిజర్వ్‌లో ఉండగా, దానిపై వచ్చే వడ్డీయే ఏడాదికి వెయ్యి కోట్లు.

కివీస్ రెండో విజయం



కాన్వే

హరారే: ముక్కోణపు టీ20 సిరీస్‌లో న్యూజిలాండ్ జట్టు వరుసగా రెండో విజయం సాధించింది. శుక్రవారం జరిగిన మ్యాచ్‌లో ఎనిమిది వికెట్లతో ఆతిథ్య జింబాబ్వేను ఓడించింది. తొలుత జింబాబ్వే 20 ఓవర్లలో 120/7 స్కోరుకే పరిమితమైంది. మధెవెరె (36), బెన్నెట్ (21) మాత్రమే రాణించారు. మ్యాట్ హెన్రీ (3/26) మూడు వికెట్లు పడగొట్టాడు. స్వల్ప ఛేదనను కివీస్ 13.5 ఓవర్లలో 122/2 స్కోరుతో పూర్తి చేసింది. కాన్వే (59 నాటౌట్) హాఫ్ సెంచరీ చేయగా, రచిన్ (30) సత్తా చాటాడు. ఈ గెలుపుతో పాయింట్ల పట్టికలో న్యూజిలాంట్ టాప్‌లో నిలిచింది. దక్షిణాఫ్రికా (2 పాయింట్లు) ఆ తర్వాతి స్థానంలో నిలవగా, జింబాబ్వే పాయింట్ల ఖాతా తెరవలేదు.

క్వార్టర్స్‌లో హంపి, హారిక

వైశాలి, దివ్య కూడా..

మహిళల చెస్ ప్రపంచ కప్

బటూమి (జార్జియా): భారత గ్రాండ్‌మాస్టర్లు కోనేరు హంపి, ద్రోణవల్లి హారిక, వైశాలీ రమేశ్‌బాబు, దివ్యా దేశ్‌ముఖ్ ఫిడే మహిళల చెస్ వరల్డ్ కప్‌లో పతకం సాధించే దిశగా దూసుకెళుతున్నారు. ఈ నలుగురు క్వార్టర్‌ఫైనల్‌కు చేరారు. కాగా, ఒకే దేశానికి చెందిన నలుగురు క్రీడాకారిణులు క్వార్టర్స్ చేరడం టోర్నీ చరిత్రలో ఇదే తొలిసారి కావడం విశేషం. శుక్రవారం జరిగిన ప్రీక్వార్టర్‌ఫైనల్ టైబ్రేకర్లలో అలెగ్జాండ్రా కొస్టెన్యూక్ (స్విట్జర్లాండ్)ని హంపి, రష్యా గ్రాండ్‌మాస్టర్ క్యాటరీనా లగ్నోని హారిక ఓడించారు. ఇక.. కమలిదెనోవా (కజకిస్థాన్)పై వైశాలి, చైనాకు చెందిన రెండో సీడ్ ఝుఝినెర్‌పై దివ్య విజయం సాధించారు.

సెమీస్‌లో అనిరుధ్ జోడీ

లాస్ కాబోస్ (మెక్సికో): తెలుగు కుర్రాడు అనిరుధ్ చంద్రశేఖర్ మిఫెల్ టెన్నిస్ ఓపెన్‌లో డబుల్స్ టైటిల్ దిశగా దూసుకెళ్తున్నాడు. అమెరికా ఆటగాడు రీస్ స్టాడ్లర్ జతగా పురుషుల డబుల్స్‌లో సెమీస్ చేరాడు. క్వార్టర్స్‌లో అనిరుధ్/రీస్ జోడీ 7-5, 6-1తో బెర్నార్డ్ (ఆస్ట్రేలియా)/శాంచెజ్ (మెక్సికో) జంటను చిత్తు చేసింది. ఫైనల్‌బెర్త్ కోసం ఆస్ట్రేలియా ద్వయం బ్లేక్/ట్రిస్టన్‌తో అనిరుధ్ జంట తలపడనుంది. ఇక, స్విట్జర్లాండ్‌లోని గెస్టాడ్‌లో జరుగుతున్న ఈఎఫ్‌జీ స్విస్ ఓపెన్‌లో భారత జోడీ అర్జున్/విజయ్ సుందర్ పోరాటం ముగిసింది. సెమీస్‌లో అర్జున్ ద్వయం 5-7, 5-7తో అల్బానో (ఫ్రాన్స్)/హెండ్రిక్ (జర్మనీ) జంట చేతిలో ఓటమి పాలైంది.

యువ భారత్ శుభారంభం

ఆసియా జూనియర్ మిక్స్‌డ్ టీమ్ బ్యాడ్మింటన్

సొలో (ఇండోనేసియా): ఆసియా జూనియర్ మిక్స్‌డ్ టీమ్ బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్‌లో భారత్ శుభారంభం చేసింది. గ్రూప్-డిలో భాగంగా శుక్రవారం జరిగిన తమ తొలి పోరులో యువ భారత్.. శ్రీలంకపై గెలిచింది. సింగిల్స్‌లో తన్వీ శర్మ, డబుల్స్‌లో గాయత్రి/మన్నా రావత్, మిక్స్‌డ్‌లో విష్ణు కోడె/రేషిక ప్రత్యర్థులపై గెలిచి భారత్ విజయంలో కీలకపాత్ర పోషించారు.



అశోక్ కంటతడి

పార్టీకి రాజీనామా సమయంలో తీవ్ర భావోద్వేగం

సింహాచలం, జూలై 18 (ఆంధ్రజ్యోతి): టీడీపీ సీనియర్ నాయకుడు అశోక్ గజపతి రాజు ఆ పార్టీ ప్రాథమిక సభ్యత్వానికి, పొలిట్ బ్యూరో పదవికి శుక్రవారం రాజీనామా చేశారు. రాజీనామా లేఖలను టీడీపీ జాతీయ, రాష్ట్ర అధ్యక్షులు చంద్రబాబు, పల్లా శ్రీనివాస్‌కు మెయిల్స్ ద్వారా, రిజిస్టర్ పోస్టు ద్వారా పంపారు. రాజీనామా చేసే సందర్భంలో ఆయన భావోద్వేగానికి గురయ్యారు. తొలుత ఆయన వరాహ లక్ష్మీనృసింహస్వామిని దర్శించుకున్నారు. అనంతరం ఆలయ ధ్వజస్తంభం వద్ద రాజీనామా పత్రంపై సంతకం పెడుతూ... భావోద్వేగానికి గురై కంటతడి పెట్టుకున్నారు. "ఎన్ని ఒడిదుడుకులు ఎదుర్కొన్నప్పటికీ నేటివరకూ టీడీపీని వీడలేదు. అందరి మన్ననలతో ఎన్నో పదవులు చేపట్టి ఎటువంటి అపకీర్తి లేకుండా పనిచేసే శక్తిని అప్పన్నస్వామి ప్రసాదించడం అదృష్టంగా భావిస్తున్నాను. గవర్నర్ పదవి అనేది రాజ్యాంగపరమైన బాధ్యత కావటంతో టీడీపీకి రాజీనామా చేయ్యాల్సి వచ్చింది. బాధగా ఉన్నా.. దేశం కోసం సేవలందించాలని పెద్దలు సూచించటంతో పార్టీకి రాజీనామా చేస్తున్నాను. గవర్నర్ పదవి మరింతగా నా బాధ్యతలను పెంచింది." అంటూ ఉద్వేగానికి గురయ్యారు. ఈ సందర్భంగా ఆయన ప్రధాని నరేంద్రమోదీకి, ముఖ్యమంత్రి చంద్రబాబుకు, ఎన్‌డీఏ నేతలకు కృతజ్ఞతలు తెలిపారు. రాజ్యాంగానికి, న్యాయానికి కట్టుబడి కొత్త పాత్రని సమర్థంగా నిర్వహిస్తానని తెలిపారు. కాగా, అశోక్‌గజపతిరాజు లేని టీడీపీని ఊహించుకోలేం అంటూ టీడీపీ శ్రేణులు ఉద్వేగానికి గురి అవుతున్నాయి. ఆయనతో ఉన్న అనుబంధాన్ని గుర్తుచేసుకుంటున్నాయి.

'రాజు' వెడలె!

కోటలు దాటి నాడు ప్రజా జీవితంలోకి.. 40ఏళ్లపాటు టీడీపీకి, ఏపీకి నిస్వార్థ సేవ

- గోవా గవర్నర్‌గా బాధ్యతల కారణంగా పార్టీ సభ్యత్వానికి అశోక్‌గజపతిరాజు రాజీనామా
- ప్రత్యక్ష రాజకీయాలకు శాశ్వతంగా సెలవు
- రాజకీయాల్లో రాజసం ఆయన ప్రత్యేకత
- మచ్చలేని నాయకుడిగా అరుదైన గుర్తింపు
- ఆర్థికశాఖ సహా పలు కీలక పదవులకు న్యాయం
- విమానయాన శాఖ మంత్రిగానూ సేవలు

(విజయనగరం - ఆంధ్రజ్యోతి)



రాజీనామా లేఖపై సంతకం చేస్తున్న పూసపాటి అశోక్‌గజపతిరాజు

అజాతశత్రువు..

అశోక్‌గజపతిరాజు అజాతశత్రువుగా పేరుపొందారు. ఐదు ప్రధాన శాఖలకు మంత్రిగా ఉంటూ, శాసనసభ వ్యవహారాలు కూడా ఆయన పర్యవేక్షించారు. కీలకమైన ఆర్థికశాఖ మంత్రిగా బాధ్యతలు నిర్వహించి, ఎంతోమంది ప్రశంసలు అందుకున్నారు. 2014లో ఎంపీగా గెలిచి కేంద్ర పౌర విమానాయన శాఖ మంత్రిగా బాధ్యతలు నిర్వహించారు. 2019 నుంచి 2024 వరకూ వైసీపీ హయాంలో ఇబ్బందులు పడ్డారు. 2024 ఎన్నికల్లో టీడీపీ అభ్యర్థుల గెలుపునకు తన వంతు కృషి చేశారు. స్వయంగా తాను పోటీ నుంచి తప్పుకొని విజయనగరం నుంచి ఎమ్మెల్యేగా అదితి గజపతిరాజు, విజయనగరం ఎంపీ స్థానం నుంచి కలిశెట్టి అప్పలనాయుడు విజయంలో కీలకపాత్ర పోషించారు.

పుట్టుకతోనే అశోక్‌గజపతి...రాజు. చుట్టూ పరివారం.. ఆపై రాజసౌధం. బాల్యం నుంచి దర్పం, దర్జా అన్నీ చూశారు. కానీ అవేవీ ఆయనకు సాంత్వన చేకూర్చలేదు. సంతృప్తిని ఇవ్వలేదు. అందుకే ప్రజాక్షేత్రంలో అడుగుపెట్టారు. ప్రజా జీవితాన్ని దగ్గరుండి చూశారు. ప్రజాసేవే పరమావధిగా అడుగులు వేశారు. దాదాపు నాలుగు దశాబ్దాలకు పైగా ప్రజలతో మమేకమై పనిచేశారు. అసలు సిసలైన రాజకీయ నాయకుడిగా.. అవినీతి మచ్చలేని నేతగా గుర్తింపు పొందారు. గోవా గవర్నర్‌గా నియమితులైన ఆయన ఇప్పుడు ప్రత్యక్ష రాజకీయాల నుంచి శాశ్వతంగా సెలవు తీసుకుంటున్నారు. విలువలతో కూడిన రాజకీయం రాజు సొంతం. కొందరు దానిని అసమర్థత అన్నా, మరికొందరు రాజకీయం తెలియనివాడు అన్నా.. రాజకీయంలో రాజసం ఆయన శైలి. దాన్ని చేసి చూపించారు. ఐదు దశాబ్దాల పాటు విజయనగరం జిల్లా రాజకీయాలను శాసించారు. ఉమ్మడి రాష్ట్రంలో సుదీర్ఘ కాలం అధికారంలో ఉంది టీడీపీ. ఉమ్మడి రాష్ట్రంతో పాటు నవ్యాంధ్రప్రదేశ్‌లోని అన్ని జిల్లాల్లో ఆ పార్టీకి కార్యాలయాలు ఉన్నాయి. ఒక్క విజయనగరంలో తప్ప. అప్పటికీ ఇప్పటికీ అశోక్ బంగ్లానే అక్కడ తెలుగుదేశం కార్యాలయం.

హేమాహేమీలతో...

అది 1978 సంవత్సరం. జాతీయ కాంగ్రెస్‌తో పాటు ఇందిరా కాంగ్రెస్ సైతం బరిలో దిగింది. జనతా పార్టీతో పాటు కమ్యూనిస్టులు పోటీలో ఉన్నారు. ఆ ఎన్నికల్లో జనతాపార్టీ తరపున విజయనగరం నుంచి నూనుగు మీసాలతో అసెంబ్లీలో అడుగుపెట్టారు అశోక్‌గజపతిరాజు. అప్పుడే పులివెందుల నుంచి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి, చంద్రగిరి నుంచి చంద్రబాబు గెలిచి అసెంబ్లీకి వచ్చారు. గోదావరి జిల్లాలోని ప్రత్తిపాడు నియోజకవర్గం నుంచి ముద్రగడ పద్మనాభం జనతా పార్టీ నుంచి గెలిచారు. అనంతర కాలంలో ఎన్టీఆర్ పిలుపు మేరకు అశోక్ టీడీపీలో చేరారు. ఎన్టీఆర్ పార్టీ ప్రకటించినప్పుడు ఆయన వెంటే ఉన్నారు. అది మొదలు.. నేటి వరకూ తెలుగుదేశం పార్టీకి సుశిక్షితుడైన నాయకుడిగా, పొలిట్‌బ్యూరో సభ్యుడిగా, ఎమ్మెల్యేగా, ఎంపీగా, రాష్ట్రమంత్రిగా, కేంద్ర మంత్రిగా ఆయన చేయని పదవి లేదు.

డిగ్రీ పట్టాల పాట్లు!

(మొదటి పేజీ తరువాయి)

చెల్లించనందుకు వర్సిటీలు సర్టిఫికెట్ల జారీని నిలిపివేశాయి. ఏయూ పరిధిలోని కాలేజీలు ఒక్కో విద్యార్థికి ఏడాదికి రూ.1,100 చొప్పున పరీక్ష ఫీజు చెల్లించాల్సి ఉంది. అయితే కాలేజీల్లో కొనసాగుతున్న వారి ఫీజులు చెల్లిస్తామని కాలేజీ యాజమాన్యాలు చెబుతుండగా, డిగ్రీలో అడ్మిషన్ పొందిన విద్యార్థులందరికీ ఫీజు చెల్లించాలని ఏయూ వర్గాలు స్పష్టం చేస్తున్నాయి. కాలేజీలో చేరి, మధ్యలోనే చదువు మానేసిన వారికి కూడా ఫీజులు ఎందుకు కట్టాలని యాజమాన్యాలు ప్రశ్నిస్తున్నాయి. ఈ గందరగోళంతో వర్సిటీ పరిధిలో అనేకమంది విద్యార్థులకు సర్టిఫికెట్ల జారీ ఆగిపోయింది. ఇక ఏఎన్‌యూ పరిధిలోని కొన్ని కాలేజీలు అఫిలియేషన్ల ఫీజులు చెల్లించడం లేదు. డిగ్రీ కాలేజీలు ప్రతి సంవత్సరం ఫీజు చెల్లిస్తేనే వర్సిటీలు వాటికి అఫిలియేషన్లు పునరుద్ధరిస్తాయి. కానీ ఏఎన్‌యూ పరిధిలో కొన్ని కాలేజీలకు ఈ ఫీజులు కట్టకపోయినా అఫిలియేషన్లు కొనసాగిస్తున్నారు. తీరా ఇప్పుడు ఫీజులు పెండింగ్‌లో ఉన్నాయనే కారణంతో ఆ కాలేజీల్లోని విద్యార్థులకు సర్టిఫికెట్లు ఆపేశారు. దీంతో పీజీ కోర్సుల్లో చేరే అవకాశాన్ని విద్యార్థులు కోల్పోతున్నారు. ఇటీవల ఎంబీఏ, ఎంసీఏ కోర్సుల్లో ప్రవేశాల కోసం నిర్వహించిన ఐసెట్ రాసిన విద్యార్థుల్లో కొందరు డిగ్రీ సర్టిఫికెట్లు రాకపోవడంతో కౌన్సెలింగ్‌కు రిజిస్ట్రేషన్ చేసుకోలేకపోయారు. దీనిపై కాలేజీల యాజమాన్యాలు న్యాయస్థానాన్ని ఆశ్రయించగా సర్టిఫికెట్లు జారీ చేయాలని కోర్టు ఆదేశించింది. అయినా ఏఎన్‌యూ అధికారులు స్పందించకపోవడంతో ఐసెట్ కౌన్సెలింగ్‌లో విద్యార్థులు అవకాశం కోల్పోయారు. అయితే ఐసెట్ రాసిన విద్యార్థులకు మాత్రమే ఏయూ సర్టిఫికెట్లు జారీ చేస్తోంది. ఇతరత్రా పీజీ కోర్సుల్లో చేరేవారికి మాత్రం ఇవ్వడం లేదు.

ఫీజు బకాయిలను చూపుతూ..

కాలేజీ యాజమాన్యాలు యూనివర్సిటీలకు అఫిలియేషన్, వర్సిటీ డెవలప్‌మెంట్, పరీక్ష, ఇతరత్రా పలు రకాల ఫీజులు చెల్లించాల్సి ఉంటుంది. రీయింబర్స్‌మెంట్ బకాయిలు పెరిగిపోవడం వల్లే ఈ ఫీజులు కట్టలేకపోతున్నాయని యాజమాన్యాలు పేర్కొంటున్నాయి. 2023-24 విద్యా సంవత్సరంలో వైసీపీ ప్రభుత్వం మూడు క్వార్టర్ల ఫీజులు బకాయిలు పెట్టింది. 2024-25 విద్యా సంవత్సరంలోనూ బకాయిలున్నాయి. అయితే ఫీజులు చెల్లించకపోయినా అఫిలియేషన్ ఎందుకు కొనసాగిస్తున్నారనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి.

ప్రొఫెసర్‌గా పదోన్నతి ఇవ్వండి

- బోధనాస్పత్రుల్లో పోస్టులకు 315 మంది దరఖాస్తు

అమరావతి, జూలై 18(ఆంధ్రజ్యోతి): రాష్ట్రవ్యాప్తంగా బోధనాస్పత్రుల్లో ప్రొఫెసర్‌గా పదోన్నతుల కోసం 315 మంది వైద్యులు దరఖాస్తు చేసుకున్నారు. ఈ ఖాళీలను భర్తీ చేసేందుకు ప్రభుత్వం బోధనానుభవాన్ని కుదించింది. అసోసియేట్ ప్రొఫెసర్‌గా ఏడాది అనుభవం ఉన్న వైద్యులందరికీ ప్రొఫెసర్‌గా పదోన్నతి కల్పించాలని నిర్ణయించింది. శుక్రవారం డీఎంఈ విడుదల చేసిన ప్రొవిజనల్ జాబితాలో అనస్థీషియా విభాగం నుంచి 44 మంది, గైనిక్ 52 మంది, జనరల్ మెడిసిన్ 41 మంది, జనరల్ సర్జరీ నుంచి 38 మంది ఇలా అన్ని విభాగాల్లో కలిపి 315 మంది ఆప్షన్లు పెట్టుకున్నారు. అయితే మొత్తం ఖాళీలు 80 లోపే ఉన్నాయి. ఈ నెల 26లోగా వీరికి పదోన్నతులు కల్పించాలని అధికారులు నిర్ణయించారు.

పోస్టుల అమ్మకానికి 'ఆంధ్రజ్యోతి' బ్రేక్

రాష్ట్రవ్యాప్తంగా అన్ని బోధనాస్పత్రుల్లోని అసోసియేట్ ప్రొఫెసర్లు ఎంతోకాలం నుంచి ప్రొఫెసర్ పదోన్నతుల కోసం ఎదురుచూస్తున్నారు. వీరికి అవకాశం కల్పించకుండా అడ్డగోలుగా కాంట్రాక్టు పద్ధతిలో ప్రొఫెసర్, అసోసియేట్ ప్రొఫెసర్ పోస్టులు నింపడానికి ఆరోగ్యశాఖ అధికారులు భారీ స్కెచ్ వేశారు. ఈ పోస్టులు అమ్ముకోవడానికి బేరసారాలు కూడా నడిపారు. ఈ విషయాన్ని 'ఆంధ్రజ్యోతి' వెలుగులోకి తీసుకురావడంతో పోస్టుల అమ్మకానికి బ్రేక్ పడింది. కాంట్రాక్ట్ పద్ధతిన పోస్టుల భర్తీకి ప్రభుత్వం తాత్కాలికంగా బ్రేక్ వేసింది. ప్రస్తుతం ప్రభుత్వ సర్వీసులో ఉన్న వైద్యులందరికీ పదోన్నతి కల్పించాలని ఆదేశించింది.

కొత్తగా 'రక్తమార్పిడి మండలి'

- ఆరోగ్యశాఖ మంత్రి అధ్యక్షతన ఏర్పాటు

అమరావతి, జూలై 18(ఆంధ్రజ్యోతి): ఆరోగ్యశాఖ మంత్రి నేతృత్వంలో కొత్తగా రక్తమార్పిడి మండలిని ప్రభుత్వం ఏర్పాటు చేసింది. ఈ మేరకు ఆ శాఖ స్పెషల్ సీఎస్ ఎం.టి. కృష్ణబాబు శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. ప్రభుత్వం ఏర్పాటు చేసిన గవర్నింగ్ బాడీలో ఆరోగ్యశాఖ మంత్రి అధ్యక్షుడిగా వ్యవహరిస్తారు. ఆరోగ్య శాఖ స్పెషల్ సీఎస్, ఆర్థిక శాఖ సెక్రటరీ, ఆరోగ్య శాఖ కమిషనర్, సెకండరీ హెల్త్ డైరెక్టర్, ఏపీఎంఎస్ఐడీసీ ఎండీ, ఎన్టీఆర్ వైద్యసేవ ట్రస్ట్ సీఈవోతో పాటు మరో తొమ్మిది మందిని సభ్యులుగా నియమించారు. ఏపీ శాక్స్ ప్రాజెక్టు డైరెక్టర్ మెంబర్ సెక్రటరీగా వ్యవహరిస్తారు. అలాగే రక్తమార్పిడి మండలికి ఎగ్జిక్యూటివ్ బాడీని కూడా నియమించారు.

విశాఖ ఉక్కు ప్రైవేటీకరణను నిలిపివేయాలి

- జంతర్‌మంతర్ వద్ద ధర్నాలో డీవైఎఫ్ఐ డిమాండ్

న్యూఢిల్లీ, జూలై 18(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక హోదా ఇవ్వకుండా, విభజన హామీలు అమలు చేయకుండా ద్రోహం చేసిన కేంద్ర ప్రభుత్వం ఇప్పుడు తెలుగు ప్రజల ఆత్మగౌరవానికి ప్రతీకగా ఉన్న విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను నష్టాల పేరుతో ప్రైవేటీకరించేందుకు కుట్రలు చేస్తోందని డీవైఎఫ్ఐ అధ్యక్షుడు, ఎంపీ ఏఏ రహీం ఆరోపించారు. శుక్రవారం, డీవైఎఫ్ఐ ఆంధ్రప్రదేశ్ కమిటీ అధ్వర్యంలో జంతర్‌మంతర్‌లో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీ రహీం, వ్యవసాయ కార్మిక సంఘం కార్యదర్శి బి.వెంకట్, ఐద్వా కోశాధికారి పుణ్యవతి, డీవైఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి రామన్న మాట్లాడారు.

దేవుడికి ఆధార్ కష్టాలు!

(మొదటి పేజీ తరువాయి)

రికార్డులన్నీ డిజిటలైజ్ చేసి వెబ్‌ల్యాండ్‌లో పొందుపరిచారు. రైతుల భూములతో పాటు వారి బ్యాంకు ఖాతాలు, మొబైల్ నంబర్లకు ఆధార్ అనుసంధానం చేశారు. ఈ డేటా ఆధారంగానే ప్రభుత్వ సంక్షేమ పథకాలైన పంట పెట్టుబడి, రాయితీలు, పంట నష్టపరిహారం, ఇన్‌పుట్ సబ్సిడీ తదితర ప్రయోజనాలు నేరుగా రైతుల ఖాతాల్లో పడుతున్నాయి. మరి దేవుడి భూముల విషయంలో ఏం చేయాలనేదే ప్రశ్న.

హక్కుదారులుగా అర్చకులు

రాష్ట్రవ్యాప్తంగా 3.48 లక్షల ఎకరాలకు పైగా దేవుడి మాన్యం ఉంది. ఇందులో ప్రముఖ ఆలయాలతో పాటు చిన్న గుడులు ఉన్నాయి. అధికారిక లెక్కల ప్రకారం దాదాపు లక్ష ఎకరాల ఆలయ భూమి ఇప్పటికీ వెబ్‌ల్యాండ్‌లో నమోదు కాలేదు. ఇక నమోదైన దానిలో 48 వేల కేసుల్లో ఆలయ భూమి అర్చకుల పేరిట ఉన్నట్లు గుర్తించారు. భూములకు తప్పనిసరిగా ఆధార్ సీడింగ్ చేయాలని గతంలో ప్రభుత్వం రెవెన్యూ శాఖకు టార్గెట్ విధించింది. దీంతో 100 శాతం సీడింగ్ జరిగిందని చెప్పుకోవడానికి కొన్ని ఆలయ భూములను వేంకటేశ్వర స్వామి, శివయ్య స్వామి, గణపతి స్వామి, ఆంజనేయ స్వామి... ఇలా వెబ్‌ల్యాండ్‌లో నమోదు చేశారు. హక్కుదారుల కింద ఆయా ఆలయాల్లో కైంకర్యాలు చేసే అర్చకుల పేర్లు రాసి, వారి ఆధార్ నంబర్‌ను సీడింగ్ చేశారు. దీనివల్ల వారికి మేలు కన్నా నష్టమే ఎక్కువగా జరిగింది. ఒక్కో ఆలయానికి 20 నుంచి 60 ఎకరాలకు పైగా భూములు ఉండటంతో వారికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు, ఇతర ప్రయోజనాలు అందడం లేదు. 15 ఎకరాల లోపు భూములున్న ఆలయాల పూజారులకు రైతుభరోసా వంటివి వారి ఖాతాల్లో పడినా ఇలా లబ్ధి పొందినవారు తక్కువ మంది ఉన్నారు. అధిక భూములున్నాయనే పేరిట ప్రభుత్వ పథ కాలు, ఇతర లబ్ధిని కోల్పోయిన వారే ఎక్కువగా ఉన్నారు. దీంతో ఆలయ భూములతో అనుసంధానమైన తమ ఆధార్, మొబైల్ నంబర్లను తొలగించాలని రెవెన్యూ శాఖకు అర్చకులు పెద్దఎత్తున విన్నపాలు చేసుకుంటున్నారు. వీరిలో చాలామంది ఇప్పటికే తమ ఆధార్‌ను వెబ్‌ల్యాండ్ డేటాతో డీలింక్ చేసుకున్నారు. దీంతో ఆ భూములు మరోసారి ఆధార్ సీడింగ్ జరగాల్సిన జాబితాలోకి వచ్చాయి. వాటికి ఆయా దేవుడి ఆలయాల పేరిట ఆధార్ ఇవ్వాలా? లేక దేవదాయ శాఖకు ప్రత్యేక ఆధార్ నంబరు ఇవ్వాలా? అన్న చర్చ జరుగుతోంది.

ఆధార్ ఉంటేనే సీడింగ్

వెబ్‌ల్యాండ్ సాఫ్ట్‌వేర్‌లో ఆధార్ సీడింగ్ కాని భూములను ప్రత్యేకమైనవిగా చూపిస్తోంది. వాటికి సీడింగ్ జరగాలంటే భూములున్న ప్రతీ దేవుడి పేరిట ఆధార్ నంబర్ తీసుకోవాలి. దానితో అనుసంధానమైన మొబైల్ నంబర్ కూడా ఉండాలి. ఇందు కోసం దేవుళ్లు కూడా ఆధార్ నమోదు కేంద్రానికి వెళ్లి తమ వేలిముద్రలు, ఐరిస్, ఇతర డేటా ఇచ్చి, ఓ ఫొటో దిగి ఆధార్ తీసుకోవాలని రెవెన్యూ అధికారులు చమత్కరిస్తున్నారు. ఇక గుడి పేరిట ఆధార్ ఇవ్వడం అయ్యే పని కాదని చెబుతున్నారు. దీంతో దేవుడి భూములకు ఆధార్ ఎలా? అని అధికారులు తలలు పట్టుకుంటున్నారు. ఈ విషయంపై తేల్చాలని దేవదాయ శాఖను రెవెన్యూశాఖ కోరింది. వెబ్‌ల్యాండ్‌లో నమోదు కాని లక్ష ఎకరాలతో పాటు, పూజారుల పేరిట ఉన్న భూముల విషయంలోనూ సత్వరం నిర్ణయం తీసుకోవాలని కోరినట్లు తెలిసింది.

కౌలు రైతులకు నష్టమే

అన్నదాత సుఖీభవ పథకం కోసం ప్రభుత్వం వెబ్‌ల్యాండ్ డేటాను పునఃపరిశీలన చేస్తోంది. ఈ స్కీమ్ లబ్ధిదారులు ఎంతమంది ఉన్నారు? ఆధార్ సీడింగ్ ఎలా జరిగిందని మరోసారి పరిశీలిస్తోంది. దీంతోపాటు పీఎం-కిసాన్ కోసం ప్రతీ కమతం వివరాలను అన్నదాత సుఖీభవ పోర్టల్‌లో నమోదు చేస్తోంది. ఇప్పటి వరకు నమోదు కాని వాటిలో ఎక్కువగా ఆలయ భూములే ఉన్నాయి. వాటిని వెబ్‌ల్యాండ్‌లో, పీఎం- కిసాన్‌లో అప్‌డేట్ చేయకపోతే, ఆ భూముల్లోని కౌలు రైతులు నష్టపోయే ప్రమాదం ఉందని అధికార వర్గాలు చెబుతున్నాయి.

2 నుంచి మున్సిపల్ కార్మికుల సమ్మె

- మున్సిపల్ డైరెక్టర్‌కు నోటీసులు అందజేత

అమరావతి, విజయవాడ, జూలై 18 (ఆంధ్రజ్యోతి): ఆగస్టు 2 నుంచి మున్సిపల్ సిబ్బంది సమ్మె చేపట్టనున్నట్లు ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఆసుల రంగనాయకులు, పోరుమామిళ్ల సుబ్బరాయుడు తెలిపారు. శుక్రవారం మున్సిపల్ డైరెక్టర్ కార్యాలయంలో అడిషనల్ మున్సిపల్ డైరెక్టర్ మురళీకృష్ణగౌడ్‌కు సమ్మె నోటీసును అందజేశారు. 'ఔట్ సోర్సింగ్‌లో పనిచేస్తున్న ఇంజనీరింగ్ కార్మికులకు, ఆఫీసు సిబ్బందికి, పార్కు కూలీలకు వేతనాలు పెంచాలి. పారిశుధ్య, ఇంజనీరింగ్ కార్మికులకు సంక్షేమ పథకాలు వర్తింపజేయాలి. డీఏలు, సరెండర్ లీవ్‌ల ఎన్‌క్యాష్‌మెంట్ విడుదల చేయాలి. రిటైర్డ్ కార్మికుల గ్రాట్యుటీ చెల్లించాలి. కార్మికులపై పనిభారం అధికమైనప్పటికీ సమస్యల పరిష్కారంపై ప్రభుత్వం మొగ్గు చూపడం లేదు. దీనిని నిరసిస్తూ ఆగస్టు 1 వరకు ప్రభుత్వానికి గడువిచ్చి 2వ తేదీ నుంచి సమ్మె చేపడతామ'ని నోటీసులో పేర్కొన్నారు. ప్రస్తుత వర్షాకాలంలో ప్రజారోగ్యం దెబ్బతినకుండా కార్మిక సంక్షేమం పట్ల చిత్తశుద్ధితో వ్యవహరించాలని రంగనాయకులు ప్రభుత్వాన్ని కోరారు.

'ఆది కర్మయోగి' ప్రజలకు చేరువ కావాలి

- కేంద్ర గిరిజన వ్యవహారాల శాఖ జాయింట్ సెక్రటరీ

అమరావతి, జూలై 18 (ఆంధ్రజ్యోతి): ఆది కర్మయోగి కార్యక్రమంలో భాగంగా.. ప్రభుత్వ కార్యక్రమాల అమల్లో మెరుగైన సహకారం, ప్రజలకు చేరువ కావడం, క్షేత్రస్థాయిలో పూర్తి మద్దతు పొందేందుకు చర్యలు తీసుకోవాలని కేంద్ర గిరిజన వ్యవహారాల శాఖ జాయింట్ సెక్రటరీ అనంత్ ప్రకాశ్ పాండే సూచించారు. శుక్రవారం ఆదికర్మయోగి-ప్రతిస్పందన పాలనా కార్యక్రమంపై 22 ప్రభుత్వ శాఖలతో రాష్ట్ర స్థాయి అవగాహన శిక్షణను గిరిజన సంక్షేమశాఖ కార్యాలయంలో నిర్వహించారు. ఢిల్లీ నుంచి వర్చువల్‌గా పాల్గొన్న ఆయన.. ప్రభుత్వ పాలనలో ప్రజల భాగస్వామ్యం పెంచడం, క్షేత్ర స్థాయిలో నాయకత్వాన్ని ప్రోత్సహించడం, వివిధ విభాగాల మధ్య సమన్వయాన్ని పెంచడం, అలాగే స్పష్టమైన పాత్రలతో గిరిజన వర్గాలను బలోపేతం చేయడమే ఈ కార్యక్రమ ప్రధాన ఉద్దేశమన్నారు. కాగా, రాష్ట్రం నుంచి 8 మంది మాస్టర్ ట్రైనర్లు బెంగళూరులో వారంపాటు శిక్షణ పొందారని గిరిజన సంక్షేమశాఖ డైరెక్టర్ సదా భార్గవి తెలిపారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ డైరెక్టర్ సరస్వతి మాట్లాడారు.

పబ్లిక్ హెల్త్ చీఫ్ ఇంజనీర్ల సీనియారిటీ జాబితా

అమరావతి, జూలై 18 (ఆంధ్రజ్యోతి): మున్సిపల్ పబ్లిక్ హెల్త్ విభాగంలో చీఫ్ ఇంజనీర్ల సీనియారిటీ జాబితాను విడుదల చేస్తూ మున్సిపల్, పట్టణాభివృద్ధిశాఖ ఉత్తర్వులు జారీచేసింది. ఈ జాబితాలో పి.ఆనంద్‌రావు, ఎం.ప్రభాకర్‌రావు, ఆర్.శ్రీనాథ్‌రెడ్డి, డి.శ్రీరామ చంద్రమూర్తి, ఎం.వినయ్‌కుమార్, కె.వేణుగోపాలరావు, ఎన్ శ్రీనివాసులు ఉన్నారు.

యువతకు యూరప్‌లో ఉద్యోగావకాశాలు

- నమోదుకు ఏపీ నైపుణ్యాభివృద్ధి సంస్థ పిలుపు

అమరావతి, జూలై 18 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్‌లోని యువతకు యూరప్ దేశాల్లో ఉద్యోగావకాశాలు కల్పిస్తున్నట్లు నైపుణ్యాభివృద్ధి సంస్థ ఈడీ డి.మనోహర్ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. మెకానికల్ డిజైన్ ఇంజనీర్లు, ఫ్యాక్టరీ మెకానిక్స్, ఫ్యాక్టరీ ఎలక్ట్రీషియన్ ఉద్యోగాలు కల్పించే కార్యక్రమం చేపట్టామని వివరించారు. బీటెక్/బీఈ, ఐటీఐ మెకానికల్, ఎలక్ట్రికల్ చదివిన 45ఏళ్ల లోపు పురుషులు అర్హులని తెలిపారు. అభ్యర్థులు ఏపీ నైపుణ్యం వెబ్‌సైట్‌లో నమోదు చేసుకోవాలని, 9988853335 హెల్ప్ లైన్ సంప్రదించవచ్చని సూచించారు.

ఎంటెక్ ఫీజులు ఖరారు

అమరావతి, జూలై 18 (ఆంధ్రజ్యోతి): ఎంటెక్ కోర్సుల ఫీజులను 2025-26 విద్యా సంవత్సరానికి ఖరారు చేస్తూ ఉన్నత విద్యాశాఖ ఉత్తర్వులు జారీచేసింది. 188 కాలేజీలకు ఫీజులు ఖరారు చేసింది. కనీస ఫీజు రూ.50వేలు, గరిష్ఠ ఫీజు రూ.90వేలుగా నిర్ణయించింది. కాగా, 136 కాలేజీలు కనీస ఫీజు రూ.50వేల కేటగిరీలోనే ఉన్నాయి.

టీచర్లకు అంతర్ జిల్లాల బదిలీలు చేపట్టండి

అమరావతి, జూలై 18 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయులకు అంతర్ జిల్లాల బదిలీలు చేపట్టాలని తెలుగునాడు ఉపాధ్యాయ సంఘం అధ్యక్షుడు మన్నం శ్రీనివాస్ ప్రభుత్వాన్ని కోరారు. అంతర్ జిల్లాల బదిలీలు జరిగి చాలా ఏళ్లయ్యిందని, దీంతో ఉపాధ్యాయులుగా ఉన్న భార్యాభర్తలు వేర్వేరు జిల్లాల్లో ఉండాల్సి వస్తోందని వివరించారు.

ఆఫ్‌లైన్‌లోనే డిగ్రీ ప్రవేశాలు చేపట్టాలి

- ఆధార్ అథెంటికేషన్‌తో ఇబ్బందులు

అమరావతి, జూలై 18 (ఆంధ్రజ్యోతి): డిగ్రీ ప్రవేశాలకు ఆధార్ అథెంటికేషన్‌ను తప్పనిసరి చేయడం వల్ల కొత్త సమస్యలు తలెత్తే అవకాశం ఉందని ప్రైవేటు డిగ్రీ కాలేజీల యాజమాన్యాల సంఘం తెలిపింది. దీనిపై ఆ సంఘం అధ్యక్షుడు జె.రమణాజీ, గౌరవాధ్యక్షుడు సి.విజయ్‌భాస్కర్‌రెడ్డి కళాశాల విద్యాశాఖ డైరెక్టర్‌కు శుక్రవారం ఓ లేఖ రాశారు. అడ్మిషన్లలో జాప్యం జరిగే అవకాశం ఉందని, అడ్మిషన్లను ఆఫ్‌లైన్‌లో చేపట్టాలన్నారు.

పంచాయతీల గ్రేడ్ల పునర్వ్యవస్థీకరణ భేష్

- ప్రభుత్వ నిర్ణయానికి ఉద్యోగ సంఘాల మద్దతు

అమరావతి, జూలై 18(ఆంధ్రజ్యోతి): పంచాయతీల గ్రేడ్ల పునర్వ్యవస్థీకరణపై కూటమి సర్కార్ తీసుకుంటున్న నిర్ణయాన్ని స్వాగతిస్తున్నామని పంచాయతీ కార్యదర్శుల సంఘాలు ఏకాభిప్రాయంతో మద్దతు పలికాయి. పంచాయతీల ఆదాయం ఆధారంగా 2010లో ఏర్పాటు చేసిన క్లస్టర్ వ్యవస్థను పునర్వ్యవస్థీకరించేందుకు పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధిశాఖ ఉత్తర్వులతో నియమించిన కమిటీ శుక్రవారం ఆ శాఖ కమిషనరేట్‌లో పంచాయతీ కార్యదర్శుల సంఘాలతో సమావేశమైంది.

జేసీ ప్రభాకర్‌రెడ్డిపై చర్యలు తీసుకోవాలి

- పంచాయతీరాజ్ గెజిటెడ్ అధికారుల సంఘం డిమాండ్

అమరావతి, జూలై 18(ఆంధ్రజ్యోతి): అనంతపురం జిల్లా పంచాయతీ అధికారి (డీపీఓ) టి.నాగరాజు నాయుడును దూషించిన తాడిపత్రి మున్సిపల్ చైర్మన్ జేసీ ప్రభాకర్‌రెడ్డిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఏపీ పంచాయతీరాజ్ గెజిటెడ్ అధికారుల సంఘం డిమాండ్ చేసింది. ఈ వ్యవహారంపై ముఖ్యమంత్రి, ఉపముఖ్యమంత్రి చొరవచూపాలని సంఘం నేతలు వెంకట్రావు, ప్రసాదరావు, జీవీ సూర్యనారాయణ, నాతి బుజ్జి కోరారు.

రూ.2,200 కోట్లిస్తే.. పునరావాసానికి ఖర్చు చేయరేం?

- 'ప్రైమావెరా' యాప్‌లో పోలవరం పనుల వివరాలేవీ?
- జల వనరుల శాఖపై కేంద్ర జలశక్తి కార్యదర్శి సీరియస్
- 1,100 కోట్లు, లబ్ధిదారుల జాబితా సిద్ధంగా ఉన్నాయన్న ఈఎన్‌సీ నరసింహమూర్తి
- మరి ఎందుకు చెల్లించలేదన్న దేబర్షి
- డయాఫ్రం వాల్ పనుల్లో ఆలస్యం.. డిసెంబరుకల్లా పూర్తిచేయగలరా: కార్యదర్శి
- కుదరకపోతే ఫిబ్రవరి, మార్చినాటికి పూర్తిచేస్తామన్న రాష్ట్రప్రభుత్వం
- పనుల్లో వేగం పెంచాలని దేబర్షి సూచన

అమరావతి, జూలై 18 (ఆంధ్రజ్యోతి): పోలవరం ప్రాజెక్టు కోసం కేంద్రం ముందస్తుగా రూ.2,200 కోట్లు విడుదల చేసినా.. సహాయ, భూసేకరణ కోసం ఎందుకు ఖర్చు చేయడం లేదని రాష్ట్ర జల వనరుల శాఖపై కేంద్ర జలశక్తి శాఖ కార్యదర్శి దేబర్షి ముఖర్జీ ఆగ్రహం వ్యక్తం చేశారు. శుక్రవారం ప్రాజెక్టుపై ఆమె ఢిల్లీ నుంచి సమీక్ష నిర్వహించారు. రాష్ట్రప్రభుత్వ సలహాదారు ఎం.వెంకటేశ్వరరావు, ఈఎన్‌సీ నరసింహమూర్తి, కేంద్ర జలసంఘం అధికారులు వర్చువల్‌గా హాజరయ్యారు. నిధులిస్తున్నా నిధులు వ్యయం చేయకపోవడంపై రాష్ట్రప్రభుత్వానికి లేఖ రాస్తానని దేబర్షి న్నారు. కేంద్ర నిధులను ఎందుకు సకాలంలో ఖర్చు చేయడం లేదని నిలదీశారు. సహాయ పునరావాసానికి ఎంత మొత్తం చెల్లించాల్సి ఉందని ఈఎన్‌సీని ప్రశ్నించారు. సలహాదారు వెంకటేశ్వరరావుకు కూడా నిధుల వ్యయంపై ప్రశ్నలు సంధించారు. రూ.1,100 కోట్లు చెల్లించేందుకు లబ్ధిదారుల జాబితా సిద్ధంగా ఉందని ఈఎన్‌సీ చెప్పినప్పుడు.. మరి ఎందుకు చెల్లించడం లేదని దేబర్షి మరోమారు సీరియస్ అయ్యారు. నిధుల వ్యయం విషయంలో తీవ్ర అసంతృప్తితో ఉన్నామని స్పష్టంచేశారు. పోలవరం పనుల వివరాలను కేంద్ర ప్రభుత్వ యాప్ 'ప్రైమావెరా'లో ఎందుకు అప్‌లోడ్ చేయడం లేదని కూడా ఆమె ప్రశ్నించారు. ఎప్పటికప్పుడు అప్‌లోడ్ చేయకపోతే.. ప్రాజెక్టు ప్రగతిని తామెలా సమీక్షించగలుగుతామని ఆక్షేపించారు. 20 రోజుల్లో పోలవరం పనులన్నింటినీ ఆ యాప్‌లో అప్‌లోడ్ చేయాలని స్పష్టం చేశారు. డయాఫ్రం వాల్ డిజైన్లన్నీ ఆమోదించామని.. గ్యాప్-1, గ్యాప్-3 డిజైన్లను కూడా త్వరలోనే ఆమోదిస్తామని జల సంఘం వెల్లడించింది. డయాఫ్రం వాల్ పనుల్లో వెనుకబడి ఉన్నందున షెడ్యూల్ మేరకు డిసెంబరులోగా పూర్తి చేయగలరా అని దేబర్షి అడిగారు. యంత్ర సామగ్రి రావడం ఆలస్యమైందని.. డిసెంబరు నాటికే పనులు పూర్తి చేసేందుకు గట్టిగా ప్రయత్నిస్తామని.. ఒకవేళ కుదరకపోతే 2026 ఫిబ్రవరి, మార్చి నాటికి కచ్చితంగా పూర్తి చేస్తామని నరసింహమూర్తి బదులిచ్చారు. ఒకసారి షెడ్యూల్ ప్రకటించాక... వాయిదాలు వేస్తే ఎలాగని దేబర్షి నిలదీశారు. సవరించిన టైం షెడ్యూల్‌ను పంపాలని నరసింహమూర్తిని ఆదేశించారు. పనుల్లో వేగం పెంచాలని సూచించారు. క్వాలిటీ కంట్రోల్ యూనిట్ ఏర్పాటుపై ఆమె సంతృప్తి వ్యక్తం చేశారు.

పకడ్బందీగా పంచాయతీ ఆడిట్

- గ్రామాల్లో ఆర్థిక అవకతవకలకు చెక్..
- హోటళ్లు, ప్రైవేటు స్థలాల్లో ఆడిట్ చేస్తే చర్యలు
- విధివిధానాలు సిద్ధం చేస్తున్న పంచాయతీరాజ్ శాఖ

అమరావతి, జూలై 18(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని గ్రామ పంచాయతీల్లో జరుగుతున్న నిధుల దుర్వినియోగాన్ని అరికట్టేందుకు పంచాయతీరాజ్ శాఖ చర్యలు తీసుకుంది. ఇప్పటికే ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ఆదేశాలతో గ్రామ పంచాయతీల్లో పన్నుల వసూళ్లు పారదర్శకంగా జరిగేందుకు సరికొత్త సాఫ్ట్‌వేర్‌ను రూపొందించారు. పన్నుల చెల్లింపులన్నీ పారదర్శకంగా జరిగేలా చర్యలు తీసుకున్నారు. పన్నుల సొమ్ముతోపాటు కేంద్ర ప్రభుత్వ నిధులను కూడా పంచాయతీలు సద్వినియోగం చేసుకునేలా పకడ్బందీ వ్యవస్థను రూపొందించాలని పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ భావించింది. ప్రతి పైసా సద్వినియోగం అయ్యేలా ఆడిట్ నిర్వహణ పకడ్బందీగా చేపట్టాలని నిర్ణయించారు. ఈమేరకు పంచాయతీల్లో ఆడిట్ నిర్వహించే స్టేట్ ఆడిట్ అధికారులు, పంచాయతీ ఆడిట్ అధికారులు, పంచాయతీ కార్యదర్శులకు ఎస్ఐఆర్‌డీలో ఇటీవల పంచాయతీరాజ్‌శాఖ అధికారులు శిక్షణ ఇచ్చారు. విధివిధానాలు కూడా రూపొందిస్తున్నారు.

లోపభూయిష్టమైన ఆడిట్ వ్యవస్థ

గ్రామ పంచాయతీ ఆడిట్ నిర్వహణ లోపభూయిష్టంగా ఉంది. కేంద్రం ఇచ్చిన నిధులే కాకుండా, ప్రజల నుంచి వసూలు చేసిన పన్నుల సొమ్మూకూడా పంచాయతీ కార్యదర్శులు, సర్పంచ్‌లు, ఆడిట్ అధికారులు, డీపీవో, డీఎల్‌పీవో, ఈఓపీఆర్‌ఆర్డీలు.. అంతాకలిసి పంచేసుకుంటున్నారు. కోస్తా జిల్లాల్లో అత్యధిక ఆదాయ వనరులున్న పంచాయతీల్లో అవినీతి తాండవిస్తోంది. తూర్పుగోదావరి జిల్లాలోని మేజర్ పంచాయతీల్లో రూ.కోట్లు దుర్వినియోగం అయ్యాయి. రాజమండ్రి రూరల్‌లోని పలు పంచాయతీల్లో రూ.కోట్లు దుర్వినియోగం అయ్యాయని ఒక ఆడిట్ అధికారి ప్రభుత్వానికి ఫిర్యాదు చేసినా పట్టించుకున్న దాఖలాల్లేవు. పైగా రీ ఆడిట్‌కు ఆదేశించిన ఆ ఆడిట్ అధికారిని పంచాయతీ కార్యదర్శులందరూ ఏకమై బదిలీ చేయించారు.

ఆడిట్ సక్రమ నిర్వహణకు నిబంధనలు

గ్రామ పంచాయతీల ఆడిట్ ఇప్పటివరకూ హోటళ్లలోను, అతిథి గృహాల్లోనూ నిర్వహించేవారు. ఒక్కో పంచాయతీకి ఒక రేటు నిర్ణయించి ఆడిట్ అధికారులకు సమర్పించడం ఆనవాయితీగా ఉంది. ఇందులో గ్రామ పంచాయతీల నుంచి జీఎస్టీ కూడా చెల్లించడం లేదు. దీంతో హోటళ్లు, అతిథిగృహాల్లో ఆడిట్ నిర్వహించే పంచాయతీ కార్యదర్శులపై చర్యలు తీసుకోవాలని పంచాయతీరాజ్ శాఖ నిర్ణయించింది. గ్రామ పంచాయతీల్లో ఆడిట్‌ను రాష్ట్రస్థాయి అధికారులే పర్యవేక్షిస్తున్నారు. వారు ఆర్థిక శాఖ పరిధిలో ఉండటంతో వారి అడ్డగోలు వ్యవహారాలకు అడ్డూ అదుపూలేకుండా పోతోంది. తప్పుడు ఆడిట్ నిర్వహించే రాష్ట్ర ఆడిట్ అధికారులపై చర్యలు తీసుకునేలా పంచాయతీరాజ్ అధికారులు ఆర్థిక శాఖకు సిఫార్సులు చేయాలని పలువురు డిమాండ్ చేస్తున్నారు.

వైసీపీ పాలనలో ప్రశ్నిస్తే చంపించారు

» జగన్‌వి కక్షపూరిత రాజకీయాలు: మంత్రి అనిత



సభలో మాట్లాడుతున్న హోం మంత్రి అనిత, పక్కన ఎమ్మెల్యే ప్రవీణ్

పెదకూరపాడు, జూలై 18(ఆంధ్రజ్యోతి): 'వైసీపీ ఐదేళ్ల పాలనలో జగన్ కక్షపూరిత రాజకీయాలు చేశారు. అనేక మందిపై అక్రమంగా కేసులు పెట్టించారు. ప్రశ్నిస్తే చంపించారు' అని హోం మంత్రి వంగలపూడి అనిత తెలిపారు. పల్నాడు జిల్లా పెదకూరపాడు మండలం కంభంపాడు గ్రామంలో శుక్రవారం జరిగిన సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో పాల్గొన్నారు. అనిత మాట్లాడుతూ... 'జగన్ పేరు చెబితే గంజాయి బ్యాచ్, గొడ్డలి వేటు, కోడికత్తి, చర్లపల్లి జైలు, బూతులు గుర్తుకు వస్తాయి. చంద్రబాబు పేరు చెబితే పోలవరం, అమరావతి అభివృద్ధి గుర్తుకు వస్తాయి. జగన్ లాంటి దుర్మార్గులు అధికారంలోకి వస్తే ఆంధ్రప్రదేశ్‌లో ప్రజలు ఉండరు. ఉద్యోగులు పని చేయాల్సిన అవసరం ఉండదు. మనం అక్రమ కేసులు పెట్టాల్సిన అవసరం లేదు. వైసీపీ వారు తప్పులు చేసిన దానికే శిక్షపడే పరిస్థితి వస్తుంది. ఇంకా జైలుకు వెళ్లాల్సిన వారు చాలా మంది ఉన్నారు. రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తిని తీసుకొని వెళ్లడానికి అంబులెన్స్ రావడానికి ఆలస్యం అవుతుండడంతో మంత్రి సత్యకుమార్ తన వాహనంలో ఆస్పత్రికి తరలించారు. అదే జగన్మోహన్‌రెడ్డి... వైసీపీ కార్యకర్త తన కారు కింద పడితే ఆస్పత్రికి తీసుకెళ్లకుండా రోడ్డు పక్కన పడేసి వెళ్లిపోయాడు. ఫ్యాక్షన్ రాజకీయాలను, నక్సలిజాన్ని అణిచేసి ఆంధ్రప్రదేశ్‌ను అభివృద్ధి చేసిన 75 ఏళ్ల యువకుడు చంద్రబాబు' అని మంత్రి అనిత అన్నారు.

వైసీపీ కుట్రలను భగ్నం చేద్దాం

» రాష్ట్ర తెలుగు మహిళ విస్తృతస్థాయి సమావేశంలో మంత్రి అనిత

» పాల్గొన్న ఎమ్మెల్యే ప్రశాంతి, టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాస్

అమరావతి, జూలై 18(ఆంధ్రజ్యోతి): 'గత ఐదేళ్ల వైసీపీ పాలనలో రాష్ట్రంలో అన్ని వ్యవస్థలు నిర్వీర్యం అయ్యాయి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత సీఎం చంద్రబాబు సారథ్యంలో అన్ని వ్యవస్థలను గాడిలో పెట్టుకుంటూ రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తున్నాం' అని అని హోం మంత్రి వంగలపూడి అనిత అన్నారు. టీడీపీ కేంద్ర కార్యాలయంలో శుక్రవారం తెలుగు మహిళ విస్తృతస్థాయి సమావేశం జరిగింది. కార్యక్రమానికి పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాస్, కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డితో పాటు హాజరైన మంత్రి అనిత మాట్లాడుతూ, 'వైసీపీ రాష్ట్రాభివృద్ధిని అడ్డుకునేలా కుట్రలు పన్నుతోంది. కుట్రలు చేయడం వైసీపీకి వెన్నతో పెట్టిన విద్య. ఈ కుట్రలను భగ్నం చేయడంతోపాటు కూటమి చేస్తున్న మంచిని ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లాల్సిన అవసరం ఎంతైనా ఉంది' అని అన్నారు. సమావేశంలో వైసీపీ కుట్ర రాజకీయాలు, మహిళలను ఆ పార్టీ అధినేత, ఇతర నేతలు అవమానిస్తున్న తీరుపై చర్చ జరిగింది. ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి మాట్లాడుతూ... 'గత ప్రభుత్వంలో జరిగిన అవినీతిని ప్రశ్నిస్తే నా వ్యక్తిత్వాన్ని కించపరిచేలా వైసీపీ మాజీ ఎమ్మెల్యే ఎదురుదాడి చేస్తున్నారు. ప్రసన్నకు నేను చెల్లెలి వరుస అవుతాను. అయినా కూడా సభ్యసమాజం సిగ్గుపడేలా మురికి వ్యాఖ్యలు చేశారు. ఇలాంటి నాయకులను జగన్ వెనకేసుకొస్తున్నారంటే ఆయన ఆలోచన తీరు ఎలాంటిదో అర్థం చేసుకోవచ్చు. ప్రసన్న వ్యాఖ్యలపై త్వరలో రాష్ట్రపతిని కలసి ఫిర్యాదు చేస్తాం' అని అన్నారు. టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు మాట్లాడుతూ... 'మహిళల వ్యక్తిత్వాన్ని కించపరిచే వారి విషయంలో కఠినంగా ఉండాలి. అలాంటి వారు చరిత్రహీనులుగా మిగిలిపోతారనేది సత్యం.' అని స్పష్టం చేశారు.

అంతర్జాతీయ స్థాయికి ఏపీ లిక్కర్ స్కాం

» 30 వేల ప్రాణాలు బలిగొన్న స్కాం ఇది: సోమిరెడ్డి

అమరావతి, జూలై 18(ఆంధ్రజ్యోతి): ఏపీలో లిక్కర్ స్కాం అంతర్జాతీయ స్థాయికి వెళ్లిందని సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి అన్నారు. టీడీపీ కేంద్ర కార్యాలయంలో శుక్రవారం మాట్లాడారు. ఏపీ మద్యం స్కాం కేవలం 3 వేల కోట్ల కుంభకోణం మాత్రమే కాదని, 30 వేల మంది అమాయక ప్రజల ప్రాణాలు బలిగొన్న స్కాం అని ఆరోపించారు. ఈ కేసులో వైసీపీ నేతల అవినీతి దేశ సరిహద్దులను దాటేసిందన్నారు. రూ.3 వేల కోట్ల కుంభకోణంలో ఈడీ ఎందుకు వేగంగా స్పందించలేకపోతోందని ప్రశ్నించారు. కాగా, మద్యంస్కాంలో విచారణ వేగవంతం కావడంతో వైసీపీ నేతల కళ్లల్లో భయం కనిపిస్తోందని టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు వర్ల రామయ్య వ్యాఖ్యానించారు. పోలీసులను బెదిరించే రీతిలో మాట్లాడుతున్న జగన్‌పై కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. ఐదేళ్ల వైసీపీ పాలనలో ఉత్తరాంధ్ర ప్రజలు బిక్కుబిక్కుమంటూ బతికారని టీడీపీ ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు అన్నారు. ఉత్తరాంధ్రను దోపిడీ, దౌర్జన్యాలకు అడ్డాగా మార్చి పీక్కుతిన్న ఘతన వైసీపీ నేతలకు దక్కుతుందని, అలాంటి వారు ఇప్పుడు ఉత్తరాంధ్ర అభివృద్ధిపై మాట్లాడటం విచిత్రంగా ఉందన్నారు.

10 లక్షల కోట్ల అప్పులు.. 85 లక్షల టన్నుల చెత్త

» వైసీపీ ఐదేళ్ల పాలనా నిర్వాకమిది: మంత్రి నారాయణ ఫైర్

అనంతపురం క్లాక్ టవర్, జూలై 18(ఆంధ్రజ్యోతి): వైసీపీ ఐదేళ్ల పాలనలో రాష్ట్రానికి రూ.10 లక్షల కోట్లు అప్పులు, 85 లక్షల టన్నుల చెత్తను కట్టబెట్టారని మంత్రి పొంగూరు నారాయణ విమర్శించారు. అనంతపురం జిల్లా కేంద్రంలోని డంపింగ్ యార్డులో లెగసీ బయోమైనింగ్ ప్రాసెసింగ్ యూనిట్‌ను శుక్రవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, వైసీపీ ప్రభుత్వం ఖజానాను ఖాళీ చేసి పోయినా, కేంద్ర ప్రభుత్వ సహకారంతో సీఎం చంద్రబాబు సంక్షేమం, అభివృద్ధిని పరుగులు పెట్టిస్తున్నారని తెలిపారు. అభివృద్ధి, సంక్షేమాన్ని విస్మరించిన వైసీపీ ప్రభుత్వం.. రూ.10 లక్షల కోట్ల అప్పులను మిగిల్చిందని మండిపడ్డారు. ఐదేళ్ల వైసీపీ పాలనలో ప్రజల నుంచి చెత్తపై పన్ను వసూలు చేశారని, అయినా రాష్ట్ర వ్యాప్తంగా 85 లక్షల టన్నుల చెత్తను డంపింగ్ యార్డుల్లోనే ఉంచారని తెలిపారు. సీఎం చంద్రబాబు ఆదేశాల మేరకు అక్టోబరు 2 నాటికి డంపింగ్ యార్డుల్లో చెత్త లేకుండా చేయడమే లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు.

జగన్‌కు ఏ వ్యవస్థపైనా గౌరవం లేదు: కొలుసు

విశాఖపట్నం, జూలై 18(ఆంధ్రజ్యోతి): 'మాజీ సీఎం జగన్‌కి ఏ వ్యవస్థపైనా గౌర వం లేదు. ఆయన చేస్తున్న వ్యాఖ్యలు, విమర్శలు ప్రజాస్వామ్యంపై చేస్తున్న దాడే' అని మంత్రి కొలుసు పార్థసారథి అన్నారు. శుక్రవారం జిల్లా టీడీపీ కార్యాలయంలో మాట్లాడారు. 'శాంతిభద్రతలు పరిరక్షించే పోలీసులపై కూడా అనుచిత వ్యాఖ్యలు చేయడం జగన్ విచిత్ర మనస్తత్వానికి పరాకాష్ఠ. అన్ని ప్రభుత్వ శాఖల అధికారులను ఆయన భయపెడుతున్నారు. గత ఐదేళ్లలో జరిగిన విధ్వంసం, పోలవరం తదితర ప్రాజెక్టుల్లో చేసిన తప్పిదాల నుంచి ప్రజల దృష్టి మరల్చడానికి జగన్ విషం చిమ్ముతున్నారు. రప్పా రప్పా నరికేస్తాం... పొడిచేస్తాం అంటున్నారు. ఈ రాష్ట్రానికి పెట్టుబడులు రాకుండా జగన్ అడ్డుకుంటున్నారు.' అని మంత్రి పార్థసారథి విమర్శించారు.

పోలవరం నిర్వాసితుల నిధులూ పక్కదారి

» డిసెంబరుకల్లా డయాఫ్రంవాల్ పూర్తి: నిమ్మల



విశాఖపట్నం, జూలై 18(ఆంధ్రజ్యోతి): వైసీపీ ప్రభుత్వం పోలవరం ప్రాజెక్టులో ఐదేళ్లలో 3 శాతం పనులు చేస్తే.. టీడీపీ కూటమి ప్రభుత్వం వచ్చిన ఏడాదిలోనే 6 శాతానికి పైగా పనులు పూర్తి చేసినట్లు జలవనరుల మంత్రి నిమ్మల రామానాయుడు చెప్పారు. పోలవరం నిర్వాసితుల కోసం ఇచ్చిన నిధులను కూడా జగన్ ప్రభుత్వం పక్కదారి పట్టించిందన్నారు. ఎడమ కాలువను పూర్తి చేసి ఉంటే ఉత్తరాంధ్రకు ఈపాటికే గోదావరి జలాలు అందేవన్నారు. శుక్రవారం విశాఖలో టీడీపీ ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు నివాసంలో ఆయన మాట్లాడారు. సముద్రంలోకి వృథాగా పోయే నీటిని వాడుకోవడానికే పోలవరం-బనకచర్లను ప్రతిపాదిస్తున్నామని చెప్పారు. ఏడాదికి మూడు వేల టీఎంసీల నీరు వృథాగా పోతుంటే అందులో 200 టీఎంసీల నీటిని వాడుకోవడానికి ఆ ప్రాజెక్టును రూపొందిస్తున్నామన్నారు. ఈ ఏడాది జనవరిలో ప్రారంభించిన డయాఫ్రం వాల్ నిర్మాణాన్ని డిసెంబరు నాటికి పూర్తి చేస్తామని చెప్పారు.

జగన్‌తో జాగ్రత్త!

(మొదటి పేజీ తరువాయి)



టీడీపీ పార్లమెంట్ సభ్యులతో మాట్లాడుతున్న సీఎం

వస్తే ఎలా ఉంటుందనేది జగన్ ప్రవర్తనతో అర్థమవుతుంది. జగన్ నేరమనస్తత్వాన్ని అంచనా వేయడంలో మనం ఎప్పటికప్పుడు వెనుకబడుతున్నాం. వైసీపీ నేతలు అధికారం కోసం ఎంతకైనా.. ఎటువంటి చర్యలకైనా తెగిస్తారనడానికి ఇటీవల రెంటపాళ్ల పర్యటనలో జరిగిన సింగయ్య మృతే నిదర్శనం. తన సొంత కారు కింద సొంత పార్టీ కార్యకర్త పడి చనిపోయే పరిస్థితిలో ఉంటే మానవత్వం లేకుండా జగన్ ప్రవర్తించిన తీరు సభ్యసమాజాన్ని తలదించుకునేలా చేసింది. జగన్ కారు డ్రైవర్ ప్రభుత్వ ఉద్యోగి అయి ఉండి కూడా ఈ విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకురాలేదు. అలా తీసుకురాకుండా చేయడంలో జగన్, ఆయన అనుచరులు విజయం సాధించారు. రెంటపాళ్ల పర్యటన జరిగిన రెండుమూడు రోజుల తర్వాత, జగన్ కారు కిందే పడి సింగయ్య మృతి చెందాడన్న వీడియో సామాజిక మాధ్యమాల్లో వస్తే తెలుసుకునే పరిస్థితిలో మనం ఉన్నాం. జగన్ కారు కింద పడి తన భర్త చనిపోయాడని సింగయ్య భార్య ఫిర్యాదు చేస్తే, ఆ కేసులో నిందితుడిగా ఉన్న జగన్ సింగయ్య కుటుంబాన్ని తన ఇంటికి పిలిపించుకుని.... లోకేశ్ కోటి రూపాయలు ఇస్తానని ఆశ చూపారంటూ ఆమెతో తప్పుడు ఆరోపణలు చేయించారు. వైఎస్ వివేకానందరెడ్డి హత్య విషయంలోనూ జగన్ క్రిమినల్ ఆలోచనలు ఏ స్థాయిలో ఉంటాయో చూశాం. సొంత బాబాయ్‌ను గొడ్డలితో నరికేసి, దాన్ని గుండెపోటుగా చిత్రీకరించడంలో సక్సెస్ అయ్యారు. అప్పుడు మనమే అధికారంలో ఉన్నాం. కానీ నిజాన్ని నిగ్గు తేల్చడంలో పూర్తిగా విఫలమయ్యాం. ఇలాంటి నేరగాళ్లు ప్రజాధనాన్ని కూడా ఎంత పకడ్బందీగా స్వాహా చేస్తారనే దానికి మద్యం స్కాం మంచి ఉదాహరణ. మామిడి, పొగాకు రైతుల పరామర్శ పేరుతో జగన్ ప్రజలను పక్కదారి పట్టిస్తున్నారు. వైసీపీ నేతలు చేసే నేరాలు.. అరాచకాలను ఎప్పటికప్పుడు ప్రజల్లోకి తీసుకెళ్లడంలో మనం వెనుకబడుతున్నాం. ఇకపై అప్రమత్తంగా ఉండండి." అని చంద్రబాబు స్పష్టం చేశారు. ఆయన ఇంకా ఏమన్నారంటే..

మామిడి రైతులకు న్యాయం మీ బాధ్యతే..

"రాజకీయ పరిణామాలపై ఎప్పటికప్పుడు దృష్టి పెట్టాలి. నేను కచ్చితమైన సమాచారంతో ఉండబట్టే ఢిల్లీలో జరిగిన తెలుగు రాష్ట్రాల సీఎంల సమావేశంలో రాష్ట్రానికి మేలు కలిగేలా వాదనలు వినిపించగలిగాను. సబ్జెక్ట్ పరంగా అవగాహన పెంచుకోండి. ఎప్పటికైనా అది ఉపయోగపడుతుంది. తెలంగాణలో సాగునీటి ప్రాజెక్టులపై వైసీపీ వారు నోటికొచ్చిన విమర్శలు చేస్తే దానిపై సంపూర్ణ అవగాహన ఉండబట్టే వారికి దీటుగా సమాధానం ఇవ్వగలిగాను. తెలంగాణ సీఎం రేవంత్ నాకు తెలంగాణ ముఖ్యం అంటే....నేను తెలుగు రాష్ట్రాలు ముఖ్యం అని చెప్పాను. తాజా రాజకీయ పరిణామాలపై అవగాహన ఉంటే మనం ఏ అంశంపై ఎలాంటి వైఖరి తీసుకోవాలనేది మీకు అవగాహన ఉంటుంది. మామిడి రైతులకు కేంద్రం నుంచి అందాల్సిన సాయం వచ్చేలా చూడాల్సిన బాధ్యత ఎంపీలపై ఉంది. పల్ప్ పరిశ్రమలకు జీఎస్టీ తగ్గించే అంశంపైనా కేంద్రంతో సంప్రదింపులు జరపాలి."

అధికారాన్ని ప్రజలకోసం వినియోగించాలి..

"స్థానిక వివాదాల్లో ఎవరూ జోక్యం చేసుకోవద్దు. వన్‌టైం ఎంపీలుగా మిగిలిపోయేలా ప్రవర్తించవద్దు. రాష్ట్రం సంక్షోభంలో ఉన్న సమయంలో ప్రజలు మనకు ఓట్లు వేసి అధికారం ఇచ్చారు. పెద్ద సంఖ్యలో ఎంపీలనూ ఇచ్చారు. దీన్ని మనం రాష్ట్రాభివృద్ధి కోసం వినియోగించుకోవాలి. ఎంపీలు ప్రజలతో మమేకమవ్వాలి. మీ నియోజకవర్గంలో కొత్తగా ఏ ప్రాజెక్టు తీసుకురావాలి.. కేంద్రం నుంచి అదనంగా నిధులు ఎలా తెచ్చుకోవాలి వంటి అంశాలపై దృష్టి కేంద్రీకరించండి."

ఎంపీల పనితీరు, హాజరు భేష్ అభినందించిన సీఎం చంద్రబాబు

పార్లమెంటులో టీడీపీ ఎంపీల పనితీరు బాగుందంటూ సీఎం చంద్రబాబు సంతృప్తి వ్యక్తం చేశారు. "మీరు క్రమం తప్పకుండా సమావేశాలకు హాజరవుతున్నారు. సమర్థవంతంగా సమస్యలను వినిపిస్తున్నారు. ఎంపీల హాజరులో దేశవ్యాప్తంగా సగటు 85 శాతం ఉంటే, టీడీపీ ఎంపీలది 86.2 శాతం ఉంది. చర్చల్లో పాల్గొనడంలోను, ప్రశ్నలు అడగడంలోనూ మీ పనితీరు బాగుంది. పార్లమెంటులో రాష్ట్రానికి సంబంధించిన అంశాలను ప్రస్తావించడంతోపాటు ప్రధాని మోదీ చేస్తున్న మంచినీ ప్రస్తావించండి. ఆపరేషన్ సిందూర్, ఎమర్జెన్సీకి 50 ఏళ్లు వంటి అంశాలపై చర్చల్లో చురుగ్గా పాల్గొని కేంద్రానికి మద్దతు తెలపండి." అంటూ చంద్రబాబు దిశానిర్దేశం చేశారు.

రాష్ట్ర ప్రగతిని ఢిల్లీలో చాటండి

"రాష్ట్రంలో జరుగుతున్న ప్రగతిని పార్లమెంటు దృష్టికి తీసుకెళ్లండి. సమయానుకూలంగా వ్యవహరించి సభలో క్వాంటమ్ వ్యాలీ, గ్రీన్ హైడ్రోజన్ వ్యాలీ, జనాభా నిర్వహణ, పీ4 వంటి అంశాల్లో రాష్ట్రం తీసుకుంటున్న చర్యలను ప్రస్తావించండి. నేరపూరిత రాజకీయ అంశాల ప్రస్తావన వచ్చినప్పుడు రాష్ట్రంలో జరుగుతున్న పరిణామాలనూ వివరించండి." అని చంద్రబాబు సూచించారు.

ఇప్పుడు మాట్లాడటం సరికాదు: లావు

టీడీపీ పార్లమెంటరీ పార్టీ సమావేశం అనంతరం లోక్‌సభలో టీడీపీ పార్లమెంటరీ పార్టీ నేత లావు శ్రీకృష్ణ దేవరాయలు విలేకరులతో మాట్లాడారు. చంద్రబాబు రాష్ట్రానికి అదనపు నిధులు ఎలా తీసుకురావాలనే అంశంపై ఎంపీలకు దిశానిర్దేశం చేశారని తెలిపారు. భారత్ గౌరవ్ ట్రైన్ పేరుతో నిర్వహిస్తున్న ప్రత్యేక రైళ్లను రాష్ట్రంలో ఎక్కువగా నడిచేలా చూడాలని సూచించారని తెలిపారు. మద్యం కుంభకోణం విచారణ తుది దశలో ఉన్నందున ఇప్పుడు దానిపై మాట్లాడటం సరికాదని లావు అన్నారు.

పెండింగ్ ప్రాజెక్టులపై దృష్టి పెట్టండి

"రాష్ట్ర అభివృద్ధికి అవసరమైన నిధులు, ప్రాజెక్టుల సాధనకు కృషి చేయండి. పార్లమెంటు సమావేశాలను సద్వినియోగం చేసుకోండి. రైతులకు మద్దతు ధర, నదీ జలాలు, పారిశ్రామీకకరణ వంటి అంశాలను పార్లమెంటులో ప్రస్తావించండి. ఆయా అంశాలపై రాష్ట్ర ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలను వివరించడంతోపాటు కేంద్రం నుంచి ఆశిస్తున్న సాయాన్ని పార్లమెంటు ద్వారా కేంద్రం దృష్టికి తీసుకెళ్లండి. కేంద్ర ప్రాయోజిత పథకాలు వీలైనంత ఎక్కువగా రాష్ట్రానికి తీసుకొచ్చేందుకు కృషి చేయండి. ప్రతి ఎంపీకీ కొన్ని శాఖలను అప్పగించాం. కేంద్రం స్థాయిలో ఆయా శాఖల్లో రాష్ట్రానికి సంబంధించిన పెండింగ్ ప్రాజెక్టులు ఏమున్నాయనేది దృష్టి సారిస్తూ వాటి సాధనకు కృషి చేయండి. నిరంతరం ఆయాశాఖలకు చెందిన కేంద్రమంత్రులతో మాట్లాడుతూ ఉండండి. అలా నిరంతర సంప్రదింపుల వల్లే ఉపాధి హామీకి సంబంధించి పెండింగ్ బిల్లులు సాధించగలిగాం. ప్రతి అంశంపైనా ఎంపీలు పూర్తి అవగాహన కలిగి ఉండాలి."

5 లక్షల బంగారు కుటుంబాలు!

47 వేల మంది మార్గదర్శకులు

» ఆగస్టు 15 కల్లా 15 లక్షల కుటుంబాల దత్తత

» సమాజానికి కొంత తిరిగివ్వాలి: చంద్రబాబు

» పీ-4 మార్గదర్శులకు విందు

అమరావతి, జూలై 18(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో 2029 నాటికి పేదరికం లేకుండా చూసేందుకు కృషి చేస్తున్నామని.. పీ-4 ఆ దిశగా చేపట్టిందేనని ముఖ్యమంత్రి చంద్రబాబు తెలిపారు. ఇప్పటి వరకు 5 లక్షల బంగారు కుటుంబాలను గుర్తించామని.. వీరికి చేయూతనిచ్చేందుకు 47 వేల మంది మార్గదర్శులుగా నమోదు చేసుకున్నారని చెప్పారు. సీఎంగా ఇప్పటి వరకు ఎన్నో కార్యక్రమాలు చేపట్టినా.. పీ-4 తన మనసుకు దగ్గరగా ఉన్న కార్యక్రమమని అన్నారు. పీ4లో భాగంగా పేదలకు సాయం చేసేందుకు ముందుకొచ్చిన మార్గదర్శులకు శుక్రవారం ఉండవల్లి క్యాంపు కార్యాలయంలో ఆయన విందు ఇచ్చారు. ఈ సందర్భంగా వారితో మాట్లాడారు. పీ-4 లక్ష్యాలను, దానిపై తన ఆలోచనలను పంచుకున్నారు. మార్గదర్శుల అభిప్రాయాలూ అడిగి తెలుసుకున్నారు. ఆగస్టు 15 కల్లా 15 లక్షల బంగారు కుటుంబాలను మార్గదర్శులు దత్తత తీసుకునేలా చూడాలనేది తన సంకల్పమని.. ఇందుకు సంపన్నులు, కార్పొరేట్ సంస్థలు, పారిశ్రామికవేత్తలు, స్వచ్ఛంద సంస్థలు కలిసి రావాలని సీఎం కోరారు. గేట్స్ ఫౌండేషన్ ఈ విషయంలో స్ఫూర్తిగా నిలుస్తోందని తెలిపారు.

నాడు జన్మభూమి.. నేడు పీ4

47 ఏళ్లుగా రాజకీయాల్లో ఉన్నానని, తాను ముఖ్యమంత్రి అయిన తర్వాత రెండో విడత సంస్కరణలు తీసుకొచ్చామని చంద్రబాబు తెలిపారు. ఐటీకి పెద్ద పీట వేశామని, విద్యకు ప్రాధాన్యం ఇచ్చామని.. ఇవన్నీ మంచి ఫలితాలిచ్చాయన్నారు. 'తెలుగు ప్రజలు అన్నింటా అభివృద్ధి చెందారు. సంపద సృష్టించగలిగాం. దీంతో సంక్షేమ-అభివృద్ధి కార్యక్రమాలు చేయగలిగాం. జన్మభూమి వంటి కార్యక్రమం ద్వారా అందరినీ అభివృద్ధిలో భాగస్వాములను చేశాం. రాష్ట్రంలో అట్టడుగున ఉన్న 20 శాతం పేదలను ఆర్థికంగా, సామాజికంగా పైకి తీసుకురావాలన్నదే నా సంకల్పం. పేదల భవిష్యత్‌ను బంగారుమయం చేసేందుకు పీ-4కి శ్రీకారం చుట్టాం' అని తెలిపారు. చంద్రబాబు చేపట్టిన ఈ కార్యక్రమాన్ని పలువురు మార్గదర్శులు ప్రశంసించారు. ఇంతగా ఆలోచన చేసిన నాయకుడిని గతంలో తామెప్పుడూ చూడలేదని కొనియాడారు. విందు సమావేశంలో ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్, స్వర్ణాంధ్ర-పీ4 ఫౌండేషన్ వైస్ చైర్మన్ కుటుంబరావు, ప్రణాళిక శాఖ ఉన్నతాధికారులు పాల్గొన్నారు. శ్రీనిరాజు, రవిసన్నారెడ్డి-శ్రీసిటీ, అనిల్ చలమలశెట్టి-గ్రీన్కో, డాంగ్ లీ-కియా మోటా ర్స్, పీవీ కృష్ణారెడ్డి-మెగా ఇంజనీరింగ్, ఏపీవీ రంగరాజు-ఎన్‌సీసీ, వీవీఎస్‌రావు-జీఎంఆర్, సజ్జన్‌కుమార్ గోయంకా- -జయరాజ్, ఇస్పాత్ లిమిటెడ్, దొరైస్వామి-బ్రాండిక్స్, సతీశ్‌రెడ్డి-రెడ్డి ల్యాబ్స్, సుచిత్రా ఎల్లా-భారత్ బయోటెక్, జయకృష్ణ-అమర్‌రాజా, శ్రీనివాసరావు-బీఎస్సార్, పూజా యాదవ్-హీరో మోటార్స్ కార్పొరేషన్, విక్రమ్ నారాయణరావు-లాయడ్ హెల్త్‌కేర్, ఇంద్రకుమార్-అవంతి ఫీడ్స్, శివప్రసాద్-హెచ్‌సీఎల్, గురు-సెల్ కాన్ మొబైల్స్, మాధవ్-రిలయెన్స్, పీవీ వెంకటరమణ రాజు-రామ్‌కో, ఎం శ్రీనివాసరావు-జెమిని ఎడిబుల్స్ సంస్థ పాల్గొన్నారు.

ఒక చేత్తో బీజేపీ జెండా.. మరో చేతిలో కూటమి ఎజెండాతో..

26 నుంచి రాష్ట్రంలో పర్యటిస్తా

» జిల్లాల పర్యటన కడప నుంచి మొదలు

» త్వరలోనే జిల్లా, రాష్ట్ర కమిటీల నియామకం: మాధవ్



విశాఖపట్నం, జూలై 18(ఆంధ్రజ్యోతి): ఈ నెల 26 నుంచి జిల్లాల పర్యటన ప్రారంభించనున్నట్టు బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ ప్రకటించారు. పార్టీ అధ్యక్షునిగా బాధ్యతలు చేపట్టిన తరువాత అన్ని జిల్లాలకు వెళ్లాల్సిన అవసరం ఉన్నందున, దేవుడి గడపగా పేరొందిన కడప నుంచి దీనికి శ్రీకారం చుడతామన్నారు. నగరంలోని పార్టీ కార్యాలయంలో ఆయన శుక్రవారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. రోజుకొక జిల్లా చొప్పున పర్యటిస్తానని, తొలుత రాయలసీమ, ఆ తరువాత ఉత్తరాంధ్ర, చివరిగా కోస్తా జిల్లాలకు వెళతానన్నారు. బీజేపీకి నాయకుల అవసరం ఉందని, వారిని తయారుచేసే విధంగా పార్టీని బలోపేతం చేస్తామన్నారు. త్వరలోనే జిల్లా కమిటీలు, ఆ తరువాత రాష్ట్ర కమిటీ నియామకం కూడా పూర్తిచేస్తామన్నారు. ప్రతి ఊరిలో బీజేపీ జెండా ఎగరాలనేది ధ్యేయమన్నారు. రాష్ట్రంలో టీడీపీ, జనసేన పార్టీలతో కలసి అభివృద్ధికి కృషి చేస్తామన్నారు. స్వరాష్ట్ర భావన పెరిగేలా, మరోసారి రాష్ట్ర విభజనపై చర్చ రాకుండా ఉండేలా తెలుగువారంతా కలిసి కట్టుగా ఉండేందుకు చిత్తూరు నుంచి శ్రీకాకుళం వరకు అవసరమైన చర్యలు చేపడతామన్నారు. పోలవరంలో భాగమైన ఉత్తరాంధ్ర సుజల స్రవంతికి ఇప్పటికి మూడుసార్లు శంకుస్థాపనలు జరిగాయని, అందుకు కీలకమైన ఎడమ కాలువ పనులు 40 శాతమే మాత్రమే పూర్తయ్యాయన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రత్యేక శ్రద్ధ తీసుకొని మిగిలిన పనుల పూర్తికి నాలుగు ప్యాకేజీలు ప్రకటించారని వాటిని ఏడాదిన్నరలో పూర్తిచేసేలా చూస్తామన్నారు. ఆ పనులు పూర్తయితే విశాఖకు గోదావరి నుంచి 24.33 టీఎంసీల నీరు వస్తుందని, పారిశ్రామిక, తాగునీటి ఇబ్బందులు తొలగిపోతాయన్నారు. అదేవిధంగా నాగావళి, వంశధార లింక్ ప్రాజెక్టుపైనా పనిచేస్తామన్నారు. రాష్ట్రంలో సాంస్కృతిక, వారసత్వ సంపదను కాపాడుతూ వాటిని పరిరక్షించేందుకు అవసరమైన కృషిచేస్తామన్నారు. టెంపుల్ టూరిజం అభివృద్ధికి పనిచేస్తామన్నారు. ఒక చేత్తో బీజేపీ జెండా, మరో చేత్తో ఎన్‌డీఏ ఎజెండా పట్టుకొని జాతీయ వాదంతో ముందుకు వెళతామని మాధవ్ ప్రకటించారు. విలేకరుల సమావేశంలో విశాఖపట్నం జిల్లా అధ్యక్షుడు పరశురామరాజు పాల్గొన్నారు.

పదోన్నతుల రిజర్వేషన్లపై మరింత అధ్యయనం

» మార్కెట్ ధరలపైనా మంత్రుల కమిటీ సమీక్ష



ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల పదోన్నతుల్లో రూల్ ఆఫ్ రిజర్వేషన్ల అమలుపై జరిగిన సమావేశంలో పాల్గొన్న మంత్రులు నాదెండ్ల, డోలా, సంధ్యారాణి, సత్యకుమార్

అమరావతి, జూలై 18(ఆంధ్రజ్యోతి): ఎస్సీ ఎస్టీ ఉద్యోగుల పదోన్నతుల్లో రూల్ ఆఫ్ రిజర్వేషన్‌పై మంత్రుల కమిటీ శుక్రవారం సచివాలయంలో సమావేశమైంది. మంత్రులు డోలా బాలవీరాంజనేయ స్వామి, గుమ్మిడి సంధ్యారాణి, నాదెండ్ల మనోహర్, అనగాని సత్య ప్రసాద్, సత్యకుమార్ యాదవ్, పలువురు ఉన్నతాధికారులు సమావేశమై చర్చించారు. ఇతర రాష్ట్రాల్లో ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల పదోన్నతుల్లో రూల్ ఆఫ్ రిజర్వేషన్ అమలు తీరు, పలు కేసుల్లో రూల్ ఆఫ్ రిజర్వేషన్‌పై న్యాయస్థానాలు ఇచ్చిన తీర్పులపైనా సమావేశంలో సుదీర్ఘంగా చర్చించారు. ఈ అంశంపై మరోసారి సమావేశం కావాలని మంత్రుల కమిటీ నిర్ణయించింది. ఈ అంశంపై మరింత అధ్యయనం చేసి ఎవరికీ ఇబ్బందులు లేకుండా నిర్ణయం తీసుకుంటామని మంత్రుల కమిటీ తెలిపింది.

ఆహార నాణ్యతపై అవగాహన, తనిఖీలు

విజయవాడ, విశాఖపట్నం, తిరుపతి తదితర నగరాల్లో ఆహార నాణ్యతపై ప్రజలకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించడంతోపాటు తరచూ తనిఖీలు నిర్వహించాలని తూనికలు, కొలతలశాఖ, ఫుడ్ సేఫ్టీ అధికారులను మంత్రుల ఉపసంఘం ఆదేశించింది. శుక్రవారం సాయంత్రం సచివాలయంలో పౌరసరఫరాలశాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ అధ్యక్షతన జరిగిన మంత్రుల ఉపసంఘం మార్కెట్ ధరలపై సమీక్షించింది. ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్, వ్యవసాయశాఖ మంత్రి కె.అచ్చెన్నాయుడు, ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్, సంబంధిత శాఖల ఉన్నతాధికారులు ఈ సమావేశంలో పాల్గొన్నారు. వరిపై మార్కెట్ రుసుము 2 శాతం నుంచి ఒక శాతానికి తగ్గించే ప్రతిపాదనపై చర్చించారు. ద్రవ్యోల్బణం నియంత్రణకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని నిర్ణయించారు. సన్నరకం ధాన్యం సాగుపై రైతులకు అవగాహన కల్పించేందుకు వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని నిర్ణయించారు. ప్రజలకు తక్కువ ధరలకే నాణ్యమైన నిత్యావసర సరుకులు అందుబాటులో ఉండేలా ప్రభుత్వం చర్యలు చేపడుతుందని మంత్రి నాదెండ్ల చెప్పారు. టమాటా ఉత్పత్తిని బట్టి ధరల నియంత్రణకు చర్యలు తీసుకుంటామని చెప్పారు.

దివ్యాంగులకు 21 రకాల పత్రాలు: మంత్రి డోలా

దివ్యాంగులకు చట్ట ప్రకారం 21 రకాల వైకల్య ధ్రువీకరణ (డిజేబిలిటీ సర్టిఫికెట్) పత్రాల జారీకి చర్యలు తీసుకోవాలని సాంఘిక సంక్షేమశాఖ మంత్రి డోలా బాలవీరాంజనేయస్వామి అధికారులను ఆదేశించారు. శుక్రవారం సచివాలయంలో దివ్యాంగ, సీనియర్ సిటిజన్ అధికారులు, గ్రామ, వార్డ్ సచివాలయ అధికారులతో సమీక్ష నిర్వహించారు. దివ్యాంగులకు ఆధార్ కార్డులు, సదరం సర్టిఫికెట్లు, పెన్షన్లపై సమీక్ష చేశారు. ఇతర ప్రాంతాల్లో చదువుతున్న దివ్యాంగ విద్యార్థులందరికీ డీబీటీ విధానంలో పెన్షన్లు పంపిణీ చేయాలని నిర్ణయించారు. 70 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరికీ పీఎం అజయ్ వయోవందన పథకం కింద రూ.5 లక్షల ఉచిత వైద్యం అందించనున్నట్లు మంత్రి స్వామి తెలిపారు.

నేడు తిరుపతికి చంద్రబాబు

» కపిలతీర్థం వద్ద స్వచ్ఛాంధ్రలో పాల్గొననున్న సీఎం

తిరుపతి, జూలై 18(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు శనివారం తిరుపతి రానున్నారు. ప్రతి నెలా మూడవ శనివారం స్వచ్ఛాంధ్ర-స్వర్ణాంధ్ర కార్యక్రమానికి ఏదో ఒక జిల్లాలో పర్యటించడం ఆనవాయితీగా పెట్టుకున్న సీఎం ఈనెల తిరుపతిని ఎంచుకున్నారు. తిరుపతిలోని కపిలతీర్థం వద్ద స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో పాల్గొనడంతో పాటు ప్రజా వేదికలో పాల్గొంటారు. సీఎంవో నుంచి ఖరారైన షెడ్యూలు ప్రకారం చంద్రబాబు పర్యటన వివరాలిలా వున్నాయి. శనివారం ఉదయం విజయవాడ విమానాశ్రయం నుంచి బయల్దేరి 11 గంటలకు రేణిగుంట విమానాశ్రయం చేరుకుంటారు. అక్కడి నుంచి రోడ్డు మార్గాన తూకివాకం గ్రామం వెళ్తారు. అక్కడ తిరుపతి కార్పొరేషన్‌కు చెందిన ఇంటిగ్రేటెడ్ సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్ ప్లాంట్‌ను సందర్శిస్తారు. మధ్యాహ్నం 12.15 గంటలకు తిరుపతి కపిలతీర్థం చేరుకుని అక్కడ కపిలేశ్వరస్వామిని దర్శించుకుంటారు. అక్కడే స్వచ్ఛాంధ్ర భాగస్వాములతో ముఖాముఖి సమావేశమవుతారు. 2 నుంచీ 3.45 దాకా పోలీస్ పరేడ్ మైదానంలో నిర్వహించే ప్రజావేదిక కార్యక్రమంలో పాల్గొంటారు. సాయంత్రం 4 గంటలకు అలిపిరి వద్ద ఉన్న కంచి కామకోటి పీఠం మఠానికి చేరుకుని కంచి స్వాములతో సమావేశమవుతారు.

చంద్రబాబూ... సీమ ఎత్తిపోతలను రద్దు చేయండి

» కొల్లాపూర్ బహిరంగ సభలో టీసీఎం రేవంత్ రెడ్డి



మహబూబ్‌నగర్/నాగర్ కర్నూల్, జూలై 18(ఆంధ్రజ్యోతి): రాయలసీమ ఎత్తిపోతల పథకాన్ని రద్దు చేయాలని టీసీఎం రేవంత్‌రెడ్డి ఏపీ సీఎం చంద్రబాబుకు విజ్ఞప్తి చేశారు. నాగర్ కర్నూల్ జిల్లా కొల్లాపూర్ నియోజకవర్గం, జటప్రోలులో జరిగిన 'ప్రజా పాలన - ప్రగతి బాట' బహిరంగ సభలో రేవంత్ రెడ్డి మాట్లాడారు. 'ఏపీ సీఎంకు విజ్ఞప్తి చేస్తున్నా. ఉమ్మడి రాష్ట్రానికి మీరు సీఎంగా ఉన్నప్పుడు కల్వకుర్తి, నెట్టెంపాడు, భీమా, కోయిల్‌సాగర్, పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకాలు చేపట్టారు. గతంలో పాలమూరు జిల్లాను దత్తత తీసుకున్నారు. ఇప్పుడు అదే పాలమూరు జిల్లాకు అన్యాయం చేసే రాయలసీమ ఎత్తిపోతల పథకాన్ని రద్దు చేయండి. రెండు తెలుగు రాష్ట్రాల అభివృద్ధి నినాదం ఇచ్చే మీరు ఉదారంగా వ్యవహరించండి. మీ హయాంలో చేపట్టిన ప్రాజెక్టులకు మీరే అడ్డుపడొద్దు. బాధ్యతగా ఉండి మమ్మల్ని బతకనివ్వండి' అని టీసీఎం రేవంత్‌రెడ్డి విజ్ఞప్తి చేశారు. సీమ లిఫ్టును రద్దు చేయాలని విజ్ఞప్తి చేస్తున్నానని, వినకపోతే పోరాటాలు చేస్తామని, అందుకు తాను బాధ్యత తీసుకుంటానని, తమ రక్తంలోనే పోరాటం ఉందని రేవంత్‌రెడ్డి స్పష్టం చేశారు.

నన్నెవరూ బెదిరించలేదు.. భయపెట్టలేదు

» జగన్ పత్రిక అసత్య కథనాలు మానుకోవాలి

» సంతనూతలపాడు బర్లీ రైతు సుబ్బారెడ్డి వెల్లడి



గుదిబండి సుబ్బారెడ్డి

పర్చూరు, జూలై 18(ఆంధ్రజ్యోతి): 'నన్నెవరూ బెదిరించలేదు.. భయపెట్టలేదు.. జగన్ పత్రిక తప్పుడు కథనాలతో రైతుల ఆత్మస్థైర్యాన్ని దెబ్బతీస్తూ, వారిని భయభ్రాంతులకు గురిచేస్తోంది' అని బాపట్ల జిల్లా పర్చూరు మండలం నూతలపాడుకు చెందిన బర్లీ రైతు గుదిబండి సుబ్బారెడ్డి ఆరోపించారు. శుక్రవారం రోత పత్రికలో వెలువడిన కథనాలపై ఆయన మండిపడ్డారు. పొగాకును తొక్కించానని జగన్ పత్రికలో వచ్చిన కథనంతో కలత చెందినట్లు చెప్పారు. ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు ఫోన్‌లో తనను పరామర్శించారని తెలిపారు. పాడైన, పనికిరాని పొగాకును పొలానికి ఎరువుగా వినియోగించడానికి తొక్కించానని ఎమ్మెల్యేకి చెప్పినట్లు వివరించారు. జగన్ పత్రికలో మాత్రం తనను బెదిరించినట్లు, హెచ్చరించినట్లు కథనం అల్లారని ఆగ్రహం వ్యక్తం చేశారు. బాధిత రైతును ఎమ్మెల్యే పరామర్శించడం నేరమా అని సుబ్బారెడ్డి ప్రశ్నించారు. అసత్య వార్తలు ప్రచురించడం ఆ పత్రికకు పరిపాటిగా మారిందన్నారు. ఈ ధోరణిని వ్యతిరేకిస్తూ రైతులతో కలసి నిరసన వ్యక్తం చేశామని తెలిపారు. పనికిరాని పొగాకును మాత్రమే ఎరువు కోసం వినియోగించానని, మిగిలిన పంటను విక్రయానికి సిద్ధంచేసి తన గోదాములో భద్రపరిచినట్లు స్పష్టం చేశారు. ప్రతి చివరి ఆకు వరకు ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని ఎమ్మెల్యే చెప్పారని ఆయన పేర్కొన్నారు.



నిస్తార్ జలప్రవేశం

విశాఖపట్నం, జూలై 18 (ఆంధ్రజ్యోతి): ఆపదలో చిక్కుకున్న జలాంతర్గాములను రక్షించడానికి ఆధునిక పరిజ్ఞానంతో స్వదేశీయంగా నిర్మించిన 'ఐఎన్ఎస్ నిస్తార్' విశాఖపట్నం నేవల్ డాక్‌యార్డులో శుక్రవారం జలప్రవేశం చేసింది. రక్షణ శాఖ సహాయ మంత్రి సంజయ్ సేథ్ దీన్ని జలప్రవేశం చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ నౌకను లోతైన సముద్రంలో సహాయక కార్యకలాపాలు చేపట్టడానికి రూపొందించారన్నారు. ప్రపంచంలో కొన్ని దేశాల వద్దే ఇలాంటి ప్రత్యేక డైవింగ్ టీమ్ కలిగిన సహాయక నౌకలు ఉన్నాయని, అందులో భారత్ కూడా చేరడం గర్వకారణంగా ఉందని చెప్పారు. నౌకాదళం చీఫ్ అడ్మిరల్ దినేశ్ త్రిపాఠి మాట్లాడుతూ.. ఈ డైవింగ్ సహాయక నౌక పొరుగు ప్రాంతాలలో కూడా సబ్‌మెరైన్ రెస్క్యూ ఆపరేషన్లలో సహాయం అందిస్తుందన్నారు. నౌకా నిర్మాణ రంగంలో భారత్ ఎదుగుదలకు నిస్తార్ ఓ నిదర్శనంలా నిలుస్తుందన్నారు.



'ఐఎన్ఎస్ నిస్తార్' ప్రారంభ కార్యక్రమంలో పాల్గొన్న రక్షణ శాఖ సహాయ మంత్రి సంజయ్ సేథ్, నౌకాదళం చీఫ్ అడ్మిరల్ దినేశ్ త్రిపాఠి తదితరులు

ఐఎన్ఎస్ నిస్తార్ ప్రత్యేకతలు

- హిందుస్థాన్ షిప్‌యార్డ్‌లో నిర్మించిన నిస్తార్ బరువు 10,500 టన్నులు. పొడవు 120 మీటర్లు.
- దీనిపై హెలికాప్టర్ దిగేందుకు వీలుగా ప్రత్యేక హెలిప్యాడ్ ఉంటుంది.
- దీనిలోని డైవింగ్ బృందం సముద్రం లోపల 300 మీటర్ల లోతు వరకు డైవింగ్ చేసి, సహాయక చర్యలు చేపడుతుంది.
- ఈ నౌకలో రిమోట్‌తో ఆపరేట్ చేయగలిగే వాహనాలుంటాయి.
- సముద్రం లోపలకు వెళ్లి రెస్క్యూ నిర్వహించే బోట్లకు ఇది మదర్ షిప్‌గా వ్యవహరిస్తుంది.
- ప్రమాదంలో చిక్కుకున్న సబ్‌మెరైన్లలోని సిబ్బందిని రక్షిస్తుంది.

గ్రీన్ హైడ్రోజన్ వ్యాలీగా రాష్ట్రం



ఇంధన ఖర్చు తగ్గాలి. ప్రజలకు ప్రయోజనం చేకూరాలి. గ్రీన్ హైడ్రోజన్‌తో అతి తక్కువ ఖర్చుతో విద్యుత్ ఇవ్వచ్చు. కేంద్ర ప్రభుత్వం 2030 నాటికి 5 ఎంటీపీఏ గ్రీన్ హైడ్రోజన్ ఉత్పత్తిని లక్ష్యంగా నిర్దేశించుకుంది. దీనిలో 1.5 ఎంటీపీఏ(సుమారు 20 శాతం) మన రాష్ట్రంలోనే ఉత్పత్తి జరిగేలా చూడాలి.

'నెట్ జీరో' కార్బన్ లక్ష్యాల సాధనకు గ్రీన్ హైడ్రోజన్ సరైన పరిష్కారం. సమీప భవిష్యత్ అంతా గ్రీన్ హైడ్రోజన్‌దే. ఇంధన రంగంలో ఇదొక 'గేమ్ చేంజర్'. ఏపీలోనూ గ్రీన్ హైడ్రోజన్ ఉత్పత్తికి ఇప్పటికే కార్యాచరణ ప్రారంభించాం. - సీఎం చంద్రబాబు

(మొదటి పేజీ తరువాయి)

ప్రస్తుతం కేజీకి రూ.400 ఖర్చు అవుతోందని, దీనిని రూ.100లోపు ఖర్చుకు తీసుకొచ్చినప్పుడే ఉపయోగకరంగా ఉంటుందని తెలిపారు. గ్రీన్ హైడ్రోజన్‌ను తక్కువ వ్యయంతోనే ఉత్పత్తి చేసేలా కొత్త సాంకేతికను అభివృద్ధి చేయాలని సూచించారు. ఈ మేరకు యూనివర్సిటీలు, పరిశోధకులు ముందుకు రావాలని సూచించారు. వాతావరణంలో ఉష్ణోగ్రతలు పెరిగిన నేపథ్యంలో గ్రీన్ హైడ్రోజన్ ప్రాధాన్యం పెరిగిందన్నారు. పర్యావరణ హితాన్ని దృష్టిలో ఉంచుకుని దీని ఉత్పత్తి పెద్ద ఎత్తున జరగాలని సీఎం చెప్పారు. 2070 నాటికి కార్బన్ రహిత ఇంధనాలు వాడాలన్నది జాతీయ లక్ష్యమని పేర్కొన్నారు. తక్కువ ఖర్చుతో హరిత విద్యుత్ తయారీ, నిల్వ చేయడంపై దృష్టి సారించాలన్నారు. కేంద్రం కూడా గ్రీన్ హైడ్రోజన్, పరిశోధన, ఉత్పత్తికి అత్యధిక ప్రాధాన్యం ఇస్తోందని తెలిపారు. కొత్త ఆవిష్కరణలను అందిపుచ్చుకునేందుకు రాష్ట్రం ఎప్పుడూ ముందు ఉంటుందన్నారు. సీఎం చంద్రబాబు ఇంకా ఏమన్నారంటే..



మచిలీపట్నంలో రూ.35 వేల కోట్లతో గ్రీన్ హైడ్రోజన్, గ్రీన్ అమ్మోనియా ప్లాంట్ల ఏర్పాటుకు ఎంవోయూ చేసుకొంటున్న కేఎస్‌ఏహెచ్ ఇన్‌ఫ్రా సంస్థ యాజమాన్యం



నెల్లూరు జిల్లా కృష్ణపట్నం వద్ద 16 వేల కోట్లతో హైడ్రోజన్ ప్లాంట్ ఏర్పాటుకు ఎంవోయూ చేసుకొంటున్న యూకేకు చెందిన యమ్నా సంస్థ ప్రతినిధులు

విద్యుత్ సంస్కరణలు..

నేను ఎమ్మెల్యే అయ్యేనాటికి విద్యుత్‌లో సమస్యలు వచ్చాయి. లోవోల్టేజీతో పంపుసెట్లు పాడైపోయేవి. అసెంబ్లీలో ఎమ్మెల్యేలు ఆందోళనలు చేసేవారు. ఆ సమయంలో సంస్కరణలకు వెళ్లడమే మంచిదనిపించింది. అప్పటికే ఒడిసా విద్యుత్ సంస్కరణలు అమలు చేసి రాజకీయ ఒత్తిళ్లతో వెనక్కు తగ్గింది. 1999-2000 మధ్య విద్యుత్ రంగంలో దేశంలోనే ప్రప్రథమంగా సంస్కరణలు తీసుకొచ్చా. దీంతో జవాబుదారీతనం, పారదర్శకత వచ్చింది. దీనిపై ప్రతిపక్షాలు తప్పుగా ప్రచారం చేయడంతో అధికారం కోల్పోవాల్సి వచ్చింది. సౌర విద్యుత్ ఉత్పాదన కూడా మొదట్లో ఎంతో ఖర్చుతో కూడుకుంది. యూనిట్‌కి రూ.14 వరకు ఖర్చయ్యేది. సోలార్ ప్యానెల్స్ ఇతర పరికరాలను చైనా నుంచి దిగుమతి చేసుకోవాల్సి వచ్చేది. ప్రధానమంత్రి మోదీ ముందుకొచ్చి ప్రోత్సాహకాలు ఇవ్వడంతో నేడు సౌర విద్యుత్ ఇళ్ల శ్లాబులపైనే ఉత్పత్తి అవుతోంది. యూనిట్ ఖర్చు రూ.2.20కి తగ్గింది. అలానే గ్రీన్ హైడ్రోజన్ ఉత్పత్తి ఖర్చు తగ్గించడంపై ప్రతి ఒక్కరు దృష్టి పెట్టాలి.

భవిష్యత్తు గ్రీన్ హైడ్రోజన్‌దే!

ఇంధన రంగంలో ప్రస్తుతం ఎదుర్కొంటున్న సవాళ్లను అధిగమించేలా పరిశోధనలు చేసి పరిష్కారం అన్వేషించాలి. సంప్రదాయ ఇంధన వనరుల కారణంగా తీవ్ర కాలుష్యం బారిన పడుతున్నాం. 'నెట్ జీరో' కార్బన్ లక్ష్యాల సాధనకు గ్రీన్ హైడ్రోజన్ లాంటి ఇంధనమే సరైన పరిష్కారం. సమీప భవిష్యత్ అంతా గ్రీన్ హైడ్రోజన్‌దే. ఇంధన రంగంలో ఇదొక 'గేమ్ చేంజర్'గా మారుతుంది. అయితే, తక్కువ ఖర్చుతో సామాన్యులకు అందుబాటులోకి తేవాలి. ఏపీలోనూ గ్రీన్ హైడ్రోజన్ ఉత్పత్తికి ఇప్పటికే కార్యాచరణ ప్రారంభించాం. విశాఖలో ఎన్టీపీసీ సంస్థ గ్రీన్ హైడ్రోజన్ ఉత్పత్తి చేసేందుకు ప్లాంట్‌ను ఏర్పాటు చేస్తోంది. అలాగే, కాకినాడలో 'గ్రీన్ అమ్మోనియా' ఉత్పత్తి కూడా త్వరలోనే ప్రారంభం అవుతుంది. 160 మెగావాట్ల గ్రీన్ హైడ్రోజన్ విద్యుత్‌ను ఉత్పత్తి చేయాలని లక్ష్యంగా నిర్దేశించుకున్నాం. దీనివల్ల 7.50 లక్షల మందికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కలుగుతాయి. 3 గిగావాట్ల సామర్థ్యంతో ఎలక్ట్రోలైజర్ల ద్వారా గ్రీన్ హైడ్రోజన్ ఉత్పత్తితో పాటు ఏపీలో సౌర, పవన, పంప్డ్ విద్యుత్ ఉత్పత్తికి అపారమైన వనరులు ఉన్నాయి. అమరావతిలో ఏఐ కేంద్రంగా క్వాంటం వ్యాలీని ఏర్పాటు చేస్తున్నాం. రాష్ట్రాన్ని గ్రీన్ హైడ్రోజన్ వ్యాలీగా తీర్చిదిద్దుతాం. రెండు రోజుల సదస్సులో 'అమరావతి గ్రీన్ హైడ్రోజన్' డిక్లరేషన్‌ను ప్రకటించాలి. ఏడాది తర్వాత డిక్లరేషన్ అమలుపై సమీక్షిస్తా.

ప్రతి 50 కిలోమీటర్లకు ఒక పోర్టు

రాష్ట్రంలో ఎకో సిస్టమ్‌ని ప్రారంభిస్తున్నాం. 400 కేటీపీఏ హైడ్రోజన్ డిమాండ్ ఉంది. ప్రతి 50 కిలోమీటర్లకు ఒక పోర్టు నిర్మించేందుకు కృతనిశ్చయంతో ఉన్నాం. పరిశ్రమల ఏర్పాటుకు దేశంలో ఎక్కడా లేని విధంగా రాయితీలు ఇస్తున్నాం. ఇక్కడి కంటే వేరే రాష్ట్రంలో తక్కువగా ఇస్తుంటే ఆ విషయాన్ని మా దృష్టికి తీసుకొస్తే సరి చేసుకుంటాం.

రూ.20 వేల కోట్ల బడ్జెట్: పెమ్మసాని

గ్రీన్ హైడ్రోజన్‌కు గత పదేళ్లలో ప్రాధాన్యం ఏర్పడిందని కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ తెలిపారు. ప్రస్తుత విద్యుత్ అవసరాల కోసం 40శాతం మేర.. ఇతర దేశాలపై ఆధారపడుతున్నామన్నారు. గ్రీన్ హైడ్రోజన్‌కు కేంద్రం 20 వేల కోట్ల బడ్జెట్ కేటాయించిందని తెలిపారు. రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టేందుకు ముందుకు రావాలని ఆయన సూచించారు. 2023, జనవరి 4న 'నేషనల్ గ్రీన్ హైడ్రోజన్ మిషన్'కు కేంద్ర కేబినెట్ అనుమతిచ్చిందని తెలిపారు.

అబ్బురపరిచిన ఆవిష్కరణలు

భవిష్యత్‌లో గ్రీన్ హైడ్రోజన్ ప్రాజెక్టులు ఏర్పాటే లక్ష్యంగా యువత వినూత్నంగా ఏర్పాటు చేసిన ప్రదర్శన ఆకట్టుకుంది. 'గ్రీన్ హైడ్రోజన్ సమ్మిట్-2025' సందర్భంగా యూనివర్సిటీ విద్యార్థులు, ఇతర ప్రాంతాల నుంచి వచ్చిన యువత కొన్ని గ్రీన్ హైడ్రోజన్ ప్రాజెక్టులను ప్రదర్శనలో ఉంచారు. గ్రీన్ హైడ్రోజన్‌ను తక్కువ ఖర్చుతో ఎలా తయారు చేయాలి? దీనికి అవసరమైన మౌలిక వసతులు, వనరులు, సాంకేతిక పరికరాలు ఏమిటి? అనే అంశాలను ప్రదర్శించారు. ఈ ప్రదర్శనను సీఎం చంద్రబాబు, కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ తదితరులు ఆసక్తిగా తిలకించారు. ఆయా ప్రాజెక్టుల గురించి అడిగి తెలుసుకుని, వారిని సీఎం చంద్రబాబు అభినందించారు.

రాష్ట్రానికి రండి!

గ్రీన్ హైడ్రోజన్ ఇంధన ఉత్పత్తి సంస్థలు రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టేందుకు ముందుకు రావాలని సీఎం చంద్రబాబు ఆహ్వానించారు. గ్రీన్ హైడ్రోజన్ సమ్మిట్‌లో భాగంగా నీతి ఆయోగ్ సభ్యుడు వీకే సారస్వత్, హైడ్రోజన్ అసోసియేషన్ అధ్యక్షుడు మల్హోత్ర, సీఎస్ఐఆర్, ఎన్‌సీఎల్ డైరెక్టర్ ఆశిశ్ లెలె తదితరులతో చంద్రబాబు ప్రత్యేకంగా చర్చించారు. రాష్ట్రంలో పెట్టుబడులకు ప్రత్యేక ప్రోత్సాహాలు ఇస్తున్నామని చెప్పారు. ఈ సదస్సులో రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి విజయానంద్, ఎస్ఆర్ఎం యూనివర్సిటీ ఏపీ ప్రో-చాన్సలర్ డాక్టర్ పి. సత్యనారాయణన్, ఈడీ ప్రొఫెసర్ డి. నారాయణరావు, నెడ్‌క్యాప్ ఎండీ ఎం. కమలాకర్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

రూ.51 వేల కోట్ల ఒప్పందాలు

ఏపీలో గ్రీన్ హైడ్రోజన్, గ్రీన్ అమ్మోనియా ఉత్పత్తి చేసేందుకు రెండు సంస్థలు సీఎం సమక్షంలో ఒప్పందాలు కుదుర్చుకున్నాయి. ప్రభుత్వం తరపున అధికారులు, ఆయా సంస్థల ప్రతినిధులు ఒప్పంద పత్రాలను మార్చుకున్నారు. యూకేకు చెందిన యమ్నా సంస్థ రూ.16 వేల కోట్ల పెట్టుబడితో నెల్లూరు జిల్లా కృష్ణపట్నం వద్ద ఏడాదికి 10లక్షల టన్నుల ఉత్పత్తి సామర్థ్యంతో ప్లాంట్ ఏర్పాటు చేయనుంది. దీనిద్వారా 5,500 మందికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభిస్తాయి. రూ.35వేల కోట్ల పెట్టుబడితో కేఎస్ఏహెచ్ ఇన్‌ఫ్రా మచిలీపట్నంలో 150 టన్నుల సామర్థ్యంతో గ్రీన్ హైడ్రోజన్, 600 టన్నుల గ్రీన్ అమ్మోనియా ఉత్పత్తి సామర్థ్యంతో ప్లాంట్లను ఏర్పాటు చేయనుంది. ఈ ప్లాంటు ద్వారా 5 వేల మంది ఉద్యోగాలు దక్కనున్నాయి.

హైడ్రోజన్ భవిష్యత్తు ఇంధనం. సహజ వాయువులు, బయోమాస్ ద్వారా ఉత్పత్తి చేయొచ్చు. నీటితోనూ ఉత్పత్తి చేసే అవకాశముంది. సీఎం చంద్రబాబు ఐటీతో హైదరాబాద్‌ని ఎలాగైతే సిలికాన్ వ్యాలీలా మార్చారో.. అలాగే, ఏపీని గ్రీన్ హైడ్రోజన్ హబ్‌గా మారుస్తారన్న నమ్మకం ఉంది.
- డాక్టర్ వీకే సారస్వత్, నీతి ఆయోగ్ సభ్యుడు

నాటి ఎక్సైజ్ మంత్రి నారాయణస్వామికీ సిట్ పిలుపు

- మద్యం స్కాంలో ఎల్లుండి రావాలని నోటీసు



అమరావతి, జూలై 18(ఆంధ్రజ్యోతి): జగన్ హయాంలో ఎక్సైజ్ శాఖ నిర్వహించిన అప్పటి ఉపముఖ్యమంత్రి కె.నారాయణస్వామికి మద్యం కుంభకోణం కేసులో ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) నోటీసులు జారీ చేసింది. సోమవారం (21న) ఉదయం విజయవాడలోని సిట్ కార్యాలయంలో తమ ముందు సాక్షిగా హాజరుకావాలని అందులో పేర్కొంది. ఆయన ఎక్సైజ్ మంత్రిగా ఉన్నప్పుడే రూ.వేల కోట్ల కుంభకోణం జరిగింది. దీనిపై విచారణకు వ్యక్తిగతంగా హాజరుకావాలని ఆయనకు సిట్ నోటీసు పంపింది.

వాసుదేవరెడ్డి, సత్యప్రసాద్‌లకు ముందస్తు బెయిల్ నిరాకరణ

- పిటిషన్లను తిరస్కరించిన ఏసీబీ కోర్టు


విజయవాడ, జూలై 18 (ఆంధ్రజ్యోతి): మద్యం కుంభకోణం కేసులో ప్రధాన నిందితుడు కసిరెడ్డి రాజశేఖర్‌రెడ్డి తర్వాతి స్థానాల్లో ఉన్న కీలక నిందితులకు ఉపశమనం దక్కలేదు. వైసీపీ హయాంలో రాష్ట్ర బేవరేజస్ కార్పొరేషన్ ఎండీగా వ్యవహరించిన డి.వాసుదేవరెడ్డి(ఏ-2), ప్రత్యేకాధికారిగా ఉన్న సత్యప్రసాద్ (ఏ-3)లకు ముందస్తు బెయిల్ ఇచ్చేందుకు విజయవాడ ఏసీబీ న్యాయస్థానం నిరాకరించింది. కసిరెడ్డిని సిట్ అరెస్టు చేసినప్పటి నుంచి నిందితుల అరెస్టులు వరుసగా జరుగుతూనే ఉన్నాయి. ఈ తరుణంలో తమకూ సంకెళ్లు పడతాయని భావించిన వాసుదేవరెడ్డి, సత్యప్రసాద్ ముందస్తు బెయిల్ కోసం శుక్రవారం కోర్టును ఆశ్రయించారు. అయితే వాటిని న్యాయాధికారి పి.భాస్కరరావు తిరస్కరించారు.

శ్రీలక్ష్మి డిశ్చార్జి పిటిషన్‌లో తీర్పు రిజర్వు

హైదరాబాద్, జూలై 18(ఆంధ్రజ్యోతి): ఓబులాపురం మైనింగ్ కంపెనీ(ఓఎంసీ) కేసులో నిందితురాలిగా ఉన్న ఐఏఎస్ అధికారి శ్రీలక్ష్మి.. ఓఎంసీకి గనుల లీజు కేటాయించే విషయంలో అప్పటి మంత్రి అనుమతి లేకుండానే కేంద్ర ప్రభుత్వంతో ఉత్తర ప్రత్యుత్తరాలు నడిపారని.. ఆ తర్వాత రెండు నెలలకు మంత్రి అనుమతి తీసుకున్నారని సీబీఐ పేర్కొంది. ఓఎంసీ కేసుతో తనకు సంబంధం లేదని.. కేసు నుంచి తప్పించాలని ఆమె దాఖలు చేసిన క్రిమినల్ రివిజన్ (డిశ్చార్జి పిటిషన్)పై జస్టిస్ లక్ష్మణ్ ధర్మాసనం శుక్రవారం విచారణ కొనసాగించింది. సీబీఐ తరపు న్యాయవాది శ్రీనివాస్ కపాటియా వాదనలు కొనసాగిస్తూ.. ఓఎంసీకి అనుకూలంగా శ్రీలక్ష్మి వ్యవహరించినట్లు ఆధారాలున్నాయని పేర్కొన్నారు. శ్రీలక్ష్మి లంచం డిమాండ్ చేసినట్లు, స్వీకరించినట్లు ఆధారాలు లేవని.. మంత్రి నిర్ణయాలను మాత్రమే అమలు చేశారని శ్రీలక్ష్మి తరపు న్యాయవాది తెలిపారు. అంతకు ముందున్న కార్యదర్శి, మంత్రిపై కేసు వీగిపోయినప్పుడు.. ఆ నిర్ణయాలను అమలు చేసిన ఆమెపై కేసు ఎక్కడిదని ప్రశ్నించారు. వాదనలు విన్న ధర్మాసనం తీర్పు రిజర్వు చేస్తున్నట్లు ప్రకటించింది.

మిథున్‌రెడ్డికి సుప్రీం ఝలక్

ముందస్తు బెయిల్ పిటిషన్‌ను కొట్టివేసిన ధర్మాసనం



- హైకోర్టు తీర్పులో జోక్యానికి నిరాకరణ
- లొంగిపోవడానికి వారం గడువిచ్చేందుకూ కోర్టు విముఖత
- మద్యం కేసులో మిథున్‌రెడ్డిది కీలక పాత్ర
- ఆయన్ను అదుపులోకి తీసుకుని విచారిస్తే మరిన్ని విషయాలు వెలుగు చూస్తాయి
- రాష్ట్ర ప్రభుత్వం తరపు సీనియర్ న్యాయవాది ముకుల్ రోహత్గీ వెల్లడి

న్యూఢిల్లీ, జూలై 18(ఆంధ్రజ్యోతి): మద్యం కుంభకోణం కేసులో ముఖ్య నిందితుడు, వైసీపీ ఎంపీ మిథున్‌రెడ్డి(ఏ-4)కి సుప్రీంకోర్టులో చుక్కెదురైంది. ఆయన దాఖలు చేసిన ముందస్తు బెయిల్ పిటిషన్‌ను సర్వోన్నత న్యాయస్థానం కొట్టివేసింది. ఆయన లొంగిపోవడానికి సమయం ఇచ్చేందుకూ విముఖత చూపింది. ఈ కేసులో ముందస్తు బెయిల్ ఇచ్చేందుకు ఏపీ హైకోర్టు నిరాకరించడంతో.. న్యాయస్థానం తీర్పును ఆయన ఈ నెల 16న సుప్రీంకోర్టులో సవాల్ చేశారు. ఆ పిటిషన్‌పై శుక్రవారం జస్టిస్ జేబీ పార్దీవాలా, జస్టిస్ మహదేవన్‌తో కూడిన ద్విసభ్య ధర్మాసనం విచారణ జరిపింది. మిథున్‌రెడ్డి తరఫున సీనియర్ న్యాయవాది అభిషేక్ మను సింఘ్వీ, ఏపీ ప్రభుత్వం తరఫున సీనియర్ న్యాయవాదులు ముకుల్ రోహిత్గీ, సిద్ధార్థ్ అగర్వాల్ వాదనలు వినిపించారు. మిథున్‌రెడ్డి బాధ్యత కలిగిన వ్యక్తి అని.. లోక్‌సభ సభ్యుడని సింఘ్వీ తెలిపారు. సోమవారం నుంచి పార్లమెంటు సమావేశాలు ఉన్నాయని గుర్తుచేశారు. నిందితుడిని కస్టడీలోకి తీసుకున్నారా అని జస్టిస్ పార్దీవాలా ప్రశ్నించారు. అరెస్టు చేయలేదని, ముందస్తు బెయిల్ కోసం పిటిషన్ దాఖలు చేశామని సింఘ్వీ బదులిచ్చారు. ఈ కేసులో మిథున్‌రెడ్డిని అరెస్టు చేయడానికి ఎటువంటి బలమైన కారణాలు లేవన్నారు. మరోసారి జస్టిస్ పార్దీవాలా కలుగజేసుకుని.. ముందస్తు బెయిల్ కోసం మీ వద్ద ఇంకేమైనా బలమైన వాదనలు ఉన్నాయా అని అడిగారు. ఈ సమయంలో రోహత్గీ స్పందిస్తూ.. ఈ కేసులో మిథున్‌రెడ్డిది కీలక పాత్రని, ఆయన్ను అదుపులోకి తీసుకుని విచారిస్తే మరిన్ని విషయాలు వెలుగులోకి వస్తాయని ధర్మాసనం దృష్టికి తీసుకెళ్లారు. ఆయన వాదనలను కింది కోర్టులు కూడా పరిగణనలోకి తీసుకోలేదన్నారు. ఈ కేసులో మిథున్‌రెడ్డికి ముందున్న మరో ముగ్గురు కీలక నిందితులకు సైతం ముందస్తు బెయిల్ ఇచ్చేందుకు న్యాయస్థానాలు నిరాకరించాయని తెలిపారు. ఇరుపక్షాల వాదనల అనంతరం.. హైకోర్టు తీర్పులో జోక్యం చేసుకోవడానికి తమకెలాంటి కారణమూ కనిపించడం లేదని ధర్మాసనం స్పష్టంచేసింది. దరిమిలా పిటిషన్‌ను డిస్మిస్ చేస్తున్నట్లు ప్రకటించింది. పార్లమెంటు సమావేశాలకు ముందు అరెస్టు చేయాలని చూస్తున్నారని, అందుచేత మిథున్‌రెడ్డి లొంగిపోవడానికి వారం రోజులైనా సమయం ఇవ్వాలని సింఘ్వీ విజ్ఞప్తి చేయగా ధర్మాసనం నిరాకరించింది.



మిథున్‌రెడ్డిపై సిట్ వారెంటు వెనక్కి

విజయవాడ, జూలై 18(ఆంధ్రజ్యోతి): మద్యం కేసులో కీలక నిందితుడిగా ఉన్న వైసీపీ రాజంపేట ఎంపీ పి.మిథున్‌రెడ్డి(ఏ-4)ని అరెస్టు చేయడానికి అనుమతి ఇవ్వాలని సిట్ అధికారులు దాఖలు చేసిన వారెంటును ఏసీబీ కోర్టు తిప్పిపంపింది. కేసుకు సంబంధించిన మరికొన్ని డాక్యుమెంట్లను దానికి జత చేయాలని న్యాయాధికారి పి.భాస్కరరావు ఆదేశించారు.

నేడు మిథున్ అరెస్ట్!?

(మొదటి పేజీ తరువాయి)

తన అరెస్టు తప్పదనే అంచనాకు వచ్చిన మిథున్ రెడ్డి, శనివారం ఉదయం 'సిట్' ముందు హాజరయ్యేందుకు సిద్ధమయ్యారు. కానీ... ఈలోపే సిట్ అధికారులు ఆయనకు నోటీసు జారీ చేశారు. శనివారం విచారణకు రావాల్సిందిగా ఢిల్లీలో ఉన్న మిథున్ రెడ్డికి నోటీసులు అందజేశారు. ఉదయం 11 గంటల్లోపు ఆయన సిట్ ముందు హాజరయ్యే అవకాశముంది. విచారణ అనంతరం ఆయనను అరెస్టు చూపించి రిమాండ్‌కు తరలిస్తారని తెలుస్తోంది.

అప్రమత్తంగా 'సిట్'

జగన్ హయాంలో జరిగిన మద్యం కుంభకోణం కేసులో మిథున్ రెడ్డి ... ఏ4గా ఉన్నారు. ఇటీవల కోర్టులో ఆయన బెయిల్ పిటిషన్ డిస్మిస్ అయిన కొన్ని గంటల్లోనే 'సిట్' అప్రమత్తమైంది. ఆయన దేశం విడిచి వెళ్లిపోకుండా లుకౌట్ సర్క్యులర్ జారీ చేసింది. మిథున్‌పై తీవ్రమైన చర్యలు తీసుకోవద్దంటూ సుప్రీం కోర్టు కల్పించిన రక్షణ గడువు ముగియడం, ముందస్తు బెయిల్ పిటిషన్ హైకోర్టు కొట్టి వేయడంతో అప్రమత్తమైన సిట్ ఆయన కదలికలపై నిఘా పెట్టింది. ఈ నేపథ్యంలో ఆయన ఢిల్లీకి చేరుకుని మరోమారు సుప్రీం కోర్టును ఆశ్రయించారు. అతి పెద్ద మద్యం స్కామ్‌లో దర్యాప్తు అధికారులకు సహకరించాలంటూ సుప్రీం కోర్టు కూడా స్పష్టం చేయడంతో మిథున్‌కు అన్ని దారులు మూసుకుపోయాయి. జగన్ హయాంలో 'స్కామ్'కు అనుకూలంగా మద్యం పాలసీని మార్చడంలో మిథున్ రెడ్డిది కీలక పాత్ర అని సిట్ గుర్తించింది. పాలసీ రూపకల్పన నుంచి పైసా వసూల్ వరకూ ప్రతి చోటా మిథున్ పాత్రపై సిట్ ఆధారాలు సేకరించింది. ఈ కేసులో ఏ1 రాజ్ కసిరెడ్డి. అయితే... కుంభకోణంలో 'అంతిమ లబ్ధిదారు' తర్వాతి స్థానం మిథున్ రెడ్డిదే అని తేల్చింది. ఏ జిల్లా నుంచి ఎంత? ఏ మద్యం కంపెనీ నుంచి ఎంత? వారాంతానికి వసూలైన సొమ్మెంత? ఆ డబ్బును ఎక్కడ భద్రపరిచాం? ఎవరికి అందజేశాం? తదితర వివరాలన్నీ 'బిగ్ బాస్'కు మిథున్ చెప్పేవారని తెలుస్తోంది. డిస్టిలరీలు, సరఫరా కంపెనీల నుంచి ముడుపులు సేకరించి హవాలా నెట్‌వర్క్ నడిపిన రాజ్ కసిరెడ్డికి అడుగడుగునా సహకారం అందించిన మాస్టర్ మైండ్ మిథున్ రెడ్డే అని చెబుతున్నారు. దోపిడీకి అనుగుణంగా కీలక స్థానాల్లో అనుయాయులైన అధికారులను నియమించడంలో.. సరఫరా ఆర్డర్ల జారీ విధానాన్ని ఆటోమెటిక్ నుంచి మాన్యువల్‌గా మార్చడంలో.. ఒక్కో మద్యం కేసు నుంచి దాని ధర ఆధారంగా ఎంత వసూలు చేయాలని నిర్ణయించడంలో తుది నిర్ణయం మిథున్ రెడ్డిదేనని సిట్ దర్యాప్తులో తేలింది.

నేడో రేపో చార్జ్ షీట్

లిక్కర్ కేసులో ఇప్పటికే 11 మందిని అరెస్టు చేశారు. ఈ కేసులో ప్రిలిమినరీ చార్జిషీటును సిద్ధం చేశారు. న్యాయపరమైన అడ్డంకులు ఎదురుకాకుండా నిపుణుల అభిప్రాయాలు తీసుకున్నారు. వేల కోట్లు దోచుకునే ప్రణాళికతో మద్యం పాలసీ రూపొందించడం నుంచి కమీషన్ల వసూళ్లు, కోట్లు చేతులు మారిన వైనం, సోదాల్లో లభ్యమైన ఆధారాలు, సాక్షులు చెప్పిన విషయాలు, అరెస్టు చేసిన 11మంది నుంచి రాబట్టిన అంశాలు... తదితర ఆధారాలతో 300 పేజీల చార్జిషీట్ సిద్ధం చేసినట్లు తెలుస్తోంది. అదే సమయంలో... కీలక నిందితుడు మిథున్ రెడ్డి అరెస్టుకు మార్గం సుగమమైంది. శనివారం సాయంత్రం లేదా సోమవారం ఉదయం విజయవాడ ఏసీబీ కోర్టులో చార్జిషీటు దాఖలు చేయనున్నట్లు తెలిసింది.

టెక్నాలజీతో పన్ను ఆదాయం పెంచండి

ఎగ్గొట్టేవారిపై కఠిన చర్యలు

- పన్నుల వసూళ్లలో ఏపీ వెనుకబాటు
- అక్రమంగా సరుకు అంతర్రాష్ట్ర రవాణా
- కళ్లు మూసుకుని నిద్రపోతుంటే ఎలా?
- క్షేత్రస్థాయి నుంచి చిత్తశుద్ధితో పనిచేయాలి
- వాణిజ్య పన్నుల శాఖ అధికారుల వర్క్‌షాపులో మంత్రి పయ్యావుల



అమరావతి, జూలై 18(ఆంధ్రజ్యోతి): జీఎస్టీ చట్టంలోని లోపాలను ఆసరాగా చేసుకుని ప్రభుత్వానికి భారీ స్థాయిలో పన్నులు ఎగ్గొట్టేవారి పట్ల కఠినంగా వ్యవహరించాలని మంత్రి పయ్యావుల కేశవ్ ఆదేశించారు. శుక్రవారం తాడేపల్లిలోని రాష్ట్ర వాణిజ్య పన్నుల శాఖ ప్రధాన కార్యాలయంలో ఆ శాఖ జాయింట్ కమిషనర్లు, డిప్యూటీ కమిషనర్ల రెవెన్యూ వర్క్‌షాపులో ఆయన మాట్లాడారు. నేరస్వభావం ఉన్న వ్యాపారులు కళ్ల ముందే మోసాలకు పాల్పడుతూ ప్రభుత్వానికి పన్ను ఎగ్గొడుతున్నామంటూ సవాల్ విసురుతుంటే.. ఏమీ చేయకుండా ఉండటం మనకు అవమానకర విషయం కాదా? చేతులు కట్టుకుని చూస్తూ మన అసమర్థతను చాటుకుందామా? అని మంత్రి ప్రశ్నించారు. ప్రభుత్వానికి పన్నులు ఎగ్గొడుతూ దర్జాగా అక్రమ వ్యాపారాలు కొనసాగిస్తున్న క్రిమినల్స్‌ను నియంత్రించలేకపోతున్నామని, మనలో ఆ ఉద్దేశం లేకపోవడమే కారణమని తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. సీనియర్ అధికారుల అనుభవం, అందుబాటులో ఉన్న టెక్నాలజీని ఉపయోగించుకుని ప్రభుత్వానికి తరచూ పన్నులు ఎగ్గొడుతున్న వారిపై చర్యలు చేపట్టాలని కోరారు. రాష్ట్ర వాణిజ్య పన్నుల శాఖ అధికారులు పనితీరులో దేశానికే ఆదర్శమని, ఎవరికీ తీసిపోరనే మంచి పేరు ఉందని, దానిని నిలబెట్టుకోవాలని సూచించారు. 'వాణిజ్య పన్నుల శాఖలో వాస్తవిక సమస్యలు ఏంటనేది ఏడాది కాలంగా తెలియడం లేదు. పన్నుల ఆదాయం పెరగకపోవడానికి కారణాలేమిటనేది ఈ శాఖ అధికారులే చెప్పాలి. దక్షిణాది రాష్ట్రాలతో పోల్చుకున్నా పన్నుల వసూళ్లలో ఏపీ వెనకబడుతోంది. పన్నులు చెల్లించకుండా, తప్పుడు ఈ-వే బిల్లులు, స్ప్లిట్ బిల్లులతో ఇతర రాష్ట్రాల నుంచి సరుకును అక్రమ రవాణా చేసే వాహనాలను రాష్ట్ర సరిహద్దుల్లోని టోల్‌గేట్ల వద్దనే గుర్తించి అడ్డుకోవాలి. రాష్ట్రంలోకి వచ్చే ప్రతి ఎల్ఆర్ కూడా నమోదు కావాల్సిందే. మనం కళ్లు మూసుకుని నిద్రపోతుంటే ఎలా? ముఖ్యమంత్రే ఉదయం లేచిన దగ్గర నుంచి అర్ధరాత్రి వరకు రాష్ట్రం కోసం కష్టపడి పనిచేస్తున్నారు. ఆయనను స్ఫూర్తిగా తీసుకుని మంత్రులుగా మేమూ పని చేస్తున్నాం. మరి ప్రభుత్వ అధికారులుగా మీరెందుకు పనిచేయరు? నా మాటలు కాస్త కటువుగానే అనిపించవచ్చు. జీతాల చెల్లింపులతో పాటు అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తూ ప్రభుత్వాన్ని నడపటం అంత సులువు కాదు. ముఖ్యమంత్రి చేస్తున్న కృషి మిగిలిన శాఖలలో కనిపిస్తోంది. వాణిజ్య పన్నుల శాఖలో మాత్రం కనిపించడం లేదు. క్షేత్రస్థాయి నుంచి ఉన్నతస్థాయి అధికారుల వరకు అందరూ డెడ్‌లైన్లు పెట్టుకుని చిత్తశుద్ధితో పనిచేయాలి. పెండింగ్‌లో ఉన్న పన్ను బకాయిల వసూలుకు ప్రత్యేక యాక్షన్ ప్లాన్‌ను సిద్ధం చేసుకోవాలి. మనం కళ్లు మూసుకుని నిద్రపోతుంటే మన ఏజెన్సీలు చచ్చిపోతున్నాయి. రాష్ట్ర ప్రభుత్వం, ప్రజలు నష్టపోతున్నారు. డేటా ఆధారంగా పన్నులు ఎగ్గొట్టేవారికి మనమేంటో చూపించాలి. అధికారులకు ప్రభుత్వం అండగా ఉంటుంది' అని పయ్యావుల అన్నారు.

*Printed and Published by **Koganti Venkata Seshagiri Rao**,on behalf of Aamoda Publications Pvt.Ltd., Aamoda Press, Door no.1078, Vengalayapalem village, Guntur Rural Mandal,Guntur, Editor: **N.Rahul Kumar** Phone No: (0863)2512379,2512376 , RNI no.APTEL/2003/9781. **Managing Director : Vemuri Radha Krishna**. Founder: K.L.N.Prasad.*